గురువారం 15-6-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 84

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '






'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18+10 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 84

గురువారం 15-6-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 84

గురువారం 15-6-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆమెవి ముచ్చటైన పాటలు

1960లలో ప్రసిద్ధ గాయనిగా వెలుగొందిన శారద ఇకలేరు - 10లో



జ్యోతి సురేఖ టీమ్‌కు కాంస్యం

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో సత్తా చాటిన భారత క్రీడాకారులు - 11లో



సాక్షులతో మాట్లాడొద్దు

రహస్య పత్రాల కేసును మయామీ కోర్టు విచారించింది. సాక్షులతో మాట్లాడవద్దని డొనాల్డ్ ట్రంప్‌ను కోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸



తమిళనాడు మంత్రి సెంథిల్ అరెస్టు

'క్యాష్ ఫర్ జాబ్స్' కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అధికారులు అరెస్టు చేశారు.

వివరాలు 6లో ▸



భయానకంగా బిపర్‌జోయ్

తీరం దాటక ముందే బిపర్‌జోయ్ తుపాన్ ధాటికి గుజరాత్‌లోని సౌరాష్ట్ర-కచ్ ప్రాంతాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి.

వివరాలు 6లో ▸



మణిపూర్‌లో మళ్లీ హింస

మణిపూర్‌లోని ఖమెన్‌లోక్ ప్రాంతంలో జరిగిన ఘర్షణల్లో 9 మంది మరణించగా మరో 10 మందికి గాయాలయ్యాయి.

వివరాలు 6లో ▸

23 నుంచి 'జగనన్న సురక్ష'

'జగనన్నకు చెబుదాం'కి అనుబంధంగా నెల రోజుల పాటు నిర్వహణ

- మిగిలిపోయిన అర్హులు, సమస్యలను గుర్తించేందుకు ప్రతి ఇల్లూ జల్లెడ
- ప్రతిగడపకూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, గృహ సారథుల బృందాలు
- వివిధ సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆరా తీయనున్న బృందాలు
- సమస్యలేమీ లేకుంటే కుశల ప్రశ్నలతో ఆశీస్సులు తీసుకుని మరో ఇంటికి..
- నిర్దేశిత తేదీల్లో సచివాలయాలకు మండల, మునిసిపల్ అధికారులు
- అదే రోజు సర్టిఫికెట్లు మంజూరు చేయనున్న అధికారులు
- జగనన్న సురక్షలో అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు ఒకటిన లబ్ధి చేకూర్చేలా ఏర్పాట్లు
- స్పందన సమీక్షలో అధికార యంత్రాంగానికి సీఎం జగన్ దిశా నిర్దేశం


సమీక్షలో ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం, అర్హులెవరూ మిగిలిపోకుండా పథకాలను అందించడమే లక్ష్యంగా ఈనెల 23వతేదీ నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా, పటిష్టంగా అమలు చేసేందుకు దీన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం తొలిదశలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష గురించి వివరిస్తారు. ప్రతి ఇంటినీ

మిగతా 2వ పేజీలో ▶

ఆగస్టు 1న అర్హులకు పథకాలు

జగనన్న సురక్ష ద్వారా వివిధ పథకాలకు అర్హులుగా గుర్తించిన వారికి.. ఆగస్టు 1వతేదీన మంజూరు చేసి లబ్ధి చేకూరుస్తారు. అర్హత ఉన్నవారు ఎవరూ మిస్ కాకూడదన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశాల్లో ఒకటి. 26 జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా నియమించిన అధికారులంతా ఆయా ప్రాంతాల్లో నెలకు రెండు దఫాలు పర్యటించి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు. కలెక్టర్ల పర్యటన కూడా చాలా ముఖ్యమైన అంశం. ప్రతి జిల్లా కలెక్టర్ వారానికి రెండు గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శించాలి. నాలుగు సచివాలయాల్లో జాయింట్ కలెక్టర్ పర్యటించాలి. కార్యదర్శులు, హెచ్‌ఓడీలు నెలకు కనీసం రెండు సచివాలయాలను తప్పనిసరిగా సందర్శించాలి. ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు వారానికి నాలుగు సచివాలయాలను సందర్శించాలి.

ఉధృతంగా 'ఉపాధి'

- ఈ ఏడాది 24 కోట్ల పనిదినాలు కల్పించాలి.. ఈ నెలాఖరులోగా 60 శాతం పూర్తి కావాలి
- స్పందన సమీక్షలో సీఎం వైఎస్ జగన్
- సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, డిజిటల్ గ్రంథాలయాల పనులు వేగవంతం.. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఇళ్లు కడుతున్నాం
- ఇప్పటివరకూ సుమారు 3.9 లక్షల ఇళ్లు పూర్తి.. రూఫ్ లెవల్, ఆపై దశలో ఉన్న 5.27 లక్షల ఇళ్లు త్వరగా పూర్తవ్వాలి
- ఇప్పటికే 61 వేల టిడ్కో ఇళ్లను అందించాం
- ఆగస్టులోగా మరో 89,216 ఇళ్లు
- సీఆర్‌డీఏలో జూలై 8 నుంచి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి
- ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు కొరత రాకూడదు

2లో

ఫ్యాక్ట్ చెక్

జగన్ ప్రభుత్వంలోనే

మాదిగల అభ్యున్నతి

- మాదిగలకు మేలు జరగడంలేదనే ప్రతిపక్షాల ఆరోపణలన్నీ అవాస్తవాలే.. చంద్రబాబు దళితులకు చేసిన మేలేమీ లేదు
- అధికారంలో ఉన్నంత కాలం కులాల మధ్య చీలికలతో పబ్బం గడిపారు
- జగన్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు తోడ్పాటు
- ఈ వర్గాలకు డీబీటీ ద్వారా రూ.2.11 లక్షల కోట్లు లబ్ధి
- ఇందులో 46,76,828 మంది మాదిగలకు రూ.16,650 కోట్లు నేరుగా జమ
- మాదిగ సామాజిక వర్గానికి ఇదో సువర్ణాధ్యాయం.. ఏపీ చరిత్రలో వారికి ఇంత పెద్ద స్థాయిలో లబ్ధి చేకూర్చడం ఇదే ప్రథమం
- రాష్ట్ర ప్రభుత్వం స్పష్టీకరణ

9లో



రైతుకు 'మద్దతు'లో

పోలిక ఏది?

- చంద్రబాబు ఐదేళ్ల పాలనలో సేకరించిన ధాన్యం విలువ రూ.40,236.91 కోట్లు
- జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలోనే సేకరించిన ధాన్యం విలువ రూ.58,626.88 కోట్లు
- బాబు పాలనలో సేకరించిన ఇతర పంటల విలువ రూ.3,322 కోట్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే సేకరించిన ఇతర పంటల విలువ రూ.7,712 కోట్లు
- రైతులకు 'మద్దతు' కల్పించడంలో ఇంతకంటే పోలిక అవసరం లేదు
- దేశంలోనే తొలిసారిగా ఆరు పంటలకు గిట్టుబాటు ధర
- వాస్తవాలకు ముసుగేసి విషం కక్కడమే పనిగా పెట్టుకున్న రామోజీ

8లో

ఏపీ ఈఏపీసెట్.. అబ్బాయిలదే హవా

ఇంజనీరింగ్ విభాగంలో తొలి పది ర్యాంకులు అబ్బాయిలవే

అగ్రికల్చర్ విభాగంలోనూ టాప్ టెన్‌లో 8 ర్యాంకులు వీరివే

- ఉత్తీర్ణత శాతంలో మాత్రం అమ్మాయిలదే హవా
- ఇంజనీరింగ్ విభాగంలో చల్లా ఉమేష్ వరుణ్‌కు మొదటి ర్యాంకు
- అగ్రికల్చర్ విభాగంలో సత్యరాజ్ జశ్వంత్‌కు అగ్రస్థానం
- నీట్ ఆలిండియా టాపర్ వరుణ్ చక్రవర్తికి రెండో ర్యాంకు
- ఫలితాలను విడుదల చేసిన మంత్రి బొత్స సత్యనారాయణ
- ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీతో ర్యాంకుల ప్రకటన
- జూలై 15 నుంచి ఆగస్టు 15 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ


వరుణ్ (ఫస్ట్ ర్యాంక్-ఇంజనీరింగ్)


జశ్వంత్ (ఫస్ట్ ర్యాంక్-అగ్రి అండ్ ఫార్మసీ)

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీటెక్, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బీఫార్మసీ, బీవీఎస్సీ, ఫార్మ్‌డీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీ ఈఏపీసెట్)–2023 ఫలితాల్లో అబ్బాయిలు సత్తా చాటారు. ఇంజనీరింగ్ విభాగంలో టాప్ టెన్ ర్యాంకులు మొత్తం అబ్బాయిలే కొల్లగొట్టారు. అలాగే అగ్రికల్చర్ విభాగంలోనూ వారిదే ఆధిపత్యం. టాప్ టెన్ ర్యాంకుల్లో 8 మంది అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు నిలిచారు. ఏపీ ఈఏపీసెట్ ఫలితాలను బుధవారం విజయవాడలో

మిగతా 8వ పేజీలో ▶



ఏ ర్యాంక్‌కు ఎక్కడ మెడికల్ సీటొస్తుంది?

- ఆల్ ఇండియా ర్యాంక్ ఆధారంగా అంచనాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు
- రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 16 ప్రైవేటు, 2 మైనారిటీ, పద్మావతి మహిళా వైద్య కళాశాల
- ఈ ఏడాది కొత్తగా 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభం
- అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి
- ప్రభుత్వ కళాశాలల్లో మొత్తం సీట్లు 2,935
- ఆలిండియా కోటా 15% పోను మిగిలినవి భర్తీ
- సీట్ల పెరుగుదల విద్యార్థులకు కలిసొచ్చే అంశం

9లో

కేంద్రానిది బీసీల వ్యతిరేక వైఖరి



ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో బీసీ కుల సంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ బీసీ బిల్లు ప్రవేశపెడితే దేశంలోని 14 రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చినా.. బీజేపీ మాత్రం మద్దతు ఇవ్వలేదన్నారు. సంక్షేమం నుంచి పదవుల వరకు బీసీలకు అన్నింటిలోనూ పెద్దపీట వేసిన సీఎం జగన్‌కు మద్దతుగా నిలుద్దామని పిలుపునిచ్చారు.

- వివరాలు 2లో

ఇంతంతే



...అవన్నీ 'పిట్ట' కథలు నమ్మకండీ!!



ఏదిఏమైనా.. అసెంబ్లీలో

అడుగు పెట్టాల్సిందే

- అందుకోసం ఎన్ని వ్యూహాలైనా పన్నుతాం
- ఇస్తే ముఖ్యమంత్రి పదవినైనా తీసుకుంటా
- కత్తిపూడి సభలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

5లో

జనసేనకు సింబలైనా ఉందా!

- చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ పని చేస్తున్నారు
- ప్రజలను, నమ్ముకున్న వారిని మోసం చేస్తున్నారు
- అమిత్ షా, నడ్డా వ్యాఖ్యలు చూస్తే ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే చదివినట్టు ఉంది.. వైఎస్ జగన్ పరిపాలన దేశానికే రోల్ మోడల్ అని కేంద్రమంత్రులే చెబుతున్నారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

5లో



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అనకాపల్లి–తాడి స్టేషన్ల మధ్య బుధవారం తెల్లవారుజామున గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్, ఉదయ్ డబుల్ డెక్కర్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను అధికారులు రద్దు చేశారు. పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

5లో

క్లుప్తంగా...

ముఖ్యమంత్రిని అభినందించకుండా ఎలా ఉంటాం?

- ఈ ప్రభుత్వంలో ఉద్యోగులకు అనేక మేళ్లు జరిగాయి
- ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఉద్యోగులకు సీఎం జగన్ మంచి చేస్తుంటే అభినందించకుండా ఎలా ఉంటామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, సీఎంకు కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు తొత్తులుగా ఉన్నారని కొందరు విమర్శించడం తగదన్నారు. ఉద్యోగులకు సంబంధించి ఒకేసారి ఇన్ని మంచి కార్యక్రమాలు జరిగినప్పుడు స్వాగతించకుండా ఉద్యోగ సంఘాల నేతలు ఏం చేయాలని ప్రశ్నించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు, ఇబ్బందులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించింది కాబట్టి అభినందిస్తున్నాయని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ ఇళ్లల్లో సీఎం ఫొటో పెట్టుకుంటామని చెబుతున్నారని, ఎందుకంటే 20 ఏళ్లుగా పరిష్కారం కాని వారి సమస్యను సీఎం జగన్ పరిష్కరించారన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ఉద్యోగ సంఘాల నేతలను విమర్శించడం సరికాదని, రాజకీయ పార్టీలు చెప్పినట్టు ఉద్యోగ సంఘాలు నడుచుకోవని, ఉద్యోగులకు మేలు జరిగినప్పుడు పొగడడంలో తప్పులేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని టీడీపీ మేనిఫెస్టోలో పెట్టారని, దానిపై చంద్రబాబును అడిగితే తాము మేనిఫెస్టోలో పెట్టలేదని చెప్పారని గుర్తుచేశారు. మేనిఫెస్టోకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై గత ప్రభుత్వం ఇచ్చిన విలువ ఎలాంటిదో దీనినిబట్టి గ్రహించాలని కోరారు. కొత్త పీఆర్సీ కమిషన్ కోసం చలో అసెంబ్లీ, చలో రాజధాని కార్యక్రమాలు చేసే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు అవేమీ లేకుండానే సీఎం తనంత తానుగా 12వ పీఆర్సీ కమిషన్ నియమిస్తామని చెప్పడం అభినందించదగ్గ విషయమన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను సెప్టెంబర్ నెలాఖరు కల్లా క్లియర్ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని వివరించారు.

ఆదిపురుష్ టికెట్ ధరల పెంపునకు అనుమతి

రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : ప్రభాస్ హీరోగా నటించిన ఆదిపురుష్ సినిమా టికెట్ల రేట్లు తొలి పదిరోజులపాటు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. సినిమా రిలీజ్ అయిన తరువాత మొదటి పది రోజులు అన్ని తరగతుల టికెట్ ధరపై గరిష్టంగా రూ.50 వరకు పెంచుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా అధికార యంత్రాంగాలు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉచిత విద్యకు 18,749 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం రాష్ట్ర వ్యాప్తంగా 18,749 మంది పిల్లలు ఎంపికయ్యారని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండు విడతల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టామని, ఒకటో తరగతిలో ప్రవేశాలకు 45,372 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అర్హతలు ఉన్న 18,749 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు వివరించారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 352 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అందిన దరఖాస్తుల్లో మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్టు సమగ్ర శిక్ష ప్రాజెక్టు రాష్ట్ర సంచాలకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1,358 ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వగా, అదనంగా మరో 197 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు చెప్పారు. దీంతో 1,555 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామన్నారు. ఈ పోస్టులకు 30 వేల దరఖాస్తులు అందాయని, అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితా www.apcfss.kgbv. in వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలను శుక్రవారం వరకు ఉమ్మడి జిల్లాల డీఈవో కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. ఈ నెల 19న తుది మెరిట్ జాబితాను వెల్లడిస్తామన్నారు. 20, 21 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. జూన్ 22, 23, 24 తేదీల్లో మెరిట్ అభ్యర్థులకు జిల్లా కమిటీల ద్వారా స్కిల్ టెస్ట్ నిర్వహించి నియామక పత్రాలు అందజేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

తెలంగాణ

బీఆర్ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేలపై ఐటీ దాడులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలపై ఐటీ శాఖ మెరుపు దాడులు చేసింది. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి(భువనగిరి), మర్రి జనార్దనరెడ్డి(నాగర్‌కర్నూల్)తోపాటు మరికొందరి ఇళ్లు, కార్యాలయాలు, సంస్థల్లో తనిఖీలు చేపట్టింది. రాత్రి వరకూ ఈ తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఉద్ధృతంగా 'ఉపాధి'



- స్పందన సమీక్షలో సీఎం జగన్
- ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు కొరత రాకూడదు
- ఎక్కడైనా కల్తీలు కనిపిస్తే కలెక్టర్లు, ఎస్పీలదే బాధ్యత.. అక్రమాలపై ఉక్కుపాదమే
- జూలై 1 నుంచి ఈ–క్రాప్ బుకింగ్.. సెప్టెంబరు మొదటి వారానికి పూర్తి
- సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పించి కౌలు రైతులకు మేలు చేయాలి
- మరో 2 వేల గ్రామాల్లో రెండో దశ భూసర్వే.. సెప్టెంబర్ 30 కల్లా భూ పత్రాలు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది 24 కోట్ల పనిదినాలు కల్పించాలని, పనులపై కలెక్టర్లు పర్యవేక్షణ చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి ఇప్పటివరకూ సుమారు 3.9 లక్షల ఇళ్లు పూర్తి కాగా రూఫ్ లెవల్, ఆపై దశల్లో ఉన్న 5.27 లక్షల నివాసాలను కూడా త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. సీఆర్‌డీఏ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేసి జూలై 8 నుంచి పనులు ప్రారంభించాలని నిర్దేశించారు. ఖరీఫ్ పనులు ప్రారంభమైనందున విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొరత తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడైనా కల్తీలు కనిపిస్తే సంబంధిత కలెక్టర్లు, ఎస్పీలను బాధ్యులుగా చేస్తామని ముఖ్యమంత్రి జగన్ స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రెండో దశ సమగ్ర భూ సర్వేలో భాగంగా మరో 2 వేల గ్రామాల్లో సెప్టెంబర్ 30 నాటికి భూపత్రాలు అందించాలని, అక్టోబరు 15 నుంచి అక్కడ రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు కూడా ప్రారంభం కావాలని నిర్దేశించారు. స్పందనలో భాగంగా సీఎం జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనులు, గృహ నిర్మాణం, వ్యవసాయం, సాగునీటి విడుదల, జగనన్న భూహక్కు–భూరక్ష, విద్యా కానుక కిట్ల పంపిణీపై అధికార యంత్రాంగానికి సీఎం మార్గ నిర్దేశం చేశారు.

ప్రతి జిల్లాలో రోజూ 75 వేల పనిదినాలు

ఉపాధిహామీ పనులపై కలెక్టర్ల పర్యవేక్షణ అవసరం. ఈ ఏడాదిలో 24 కోట్ల పనిదినాలు కల్పించాలి. అందులో 60 శాతం అంటే 14.4 కోట్ల పనిదినాలు ఈ నెలాఖరులోగా పూర్తికావాలి. ప్రతి రోజూ ప్రతి జిల్లాలో కనీసం 75 వేల పనిదినాలు కల్పించాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలం. పనిచేస్తున్న ప్రాంతాల్లో షెడ్లు, తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు సమకూర్చాలి. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఎలాంటి పనులు చేపట్టవద్దు. ఈ విషయాలన్నీ తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకోవాలి. రోజుకు కనీసం రూ.272 వేతనం వచ్చేలా చూడాలి.

డిసెంబర్‌కు డిజిటల్ లైబ్రరీలు..

ఉపాధిహామీకి సంబంధించిన బిల్లులన్నీ పూర్తిగా చెల్లించాలి. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, డిజిటల్ గ్రంథాలయాలను వేగంగా పూర్తి చేయాలి. ప్రతి గ్రామానికీ ఇంటర్నెట్, డిజిటల్ లైబ్రరీలు వస్తున్నాయి. వర్క్ ఫ్రం హోం కోసం అవి చాలా ఉపయోగపడతాయి. గ్రామంలో చదువుకున్న ఏ వ్యక్తి అయినా అక్కడకు వెళ్లి కంప్యూటర్‌లో పని చేసుకోవచ్చు. మంచి బ్యాండ్‌విడ్త్ అందించడం చాలా ముఖ్యం. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్స్ అన్నీ సెప్టెంబరు కల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. డిజిటల్ లైబ్రరీలు డిసెంబర్ చివరికల్లా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

ఇళ్ల నిర్మాణాలకు రూ.1,475 కోట్లు

రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఇళ్లు కడుతున్నాం. వీటిని కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వేగం పెరగాలి. ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయిన తర్వాత సుమారు రూ.1,475 కోట్లు ఇచ్చాం. ప్రతి శనివారం హౌసింగ్‌డేగా నిర్వహించాలి. అధికారులు తప్పనిసరిగా లే అవుట్లలో పర్యటించాలి.

సీఆర్‌డీఏలో 8 నుంచి పనులు

సీఆర్‌డీఏ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేసి జూలై 8 నుంచి పనులు ప్రారంభించాలి. ఆప్షన్–3 ఎంపిక చేసుకున్న వారి ఇళ్ల నిర్మాణం వెంటనే మొదలు కావాలి. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు ఈమేరకు చర్యలు తీసుకోవాలి. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలి. ఇళ్ల నిర్మాణాల్లో వాడే సామగ్రి నాణ్యతతో ఉండాలి. క్రమం తప్పకుండా క్వాలిటీ పరీక్షలు చేయాలి.

వేగంగా టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

టిడ్కో ఇళ్లలో 300 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న 1,43,600 ఇళ్లను ఉచితంగా పేదలకు ఇస్తున్నాం. ఇప్పటికే 61 వేల ఇళ్లను అందించాం. మరో 89,216 ఇళ్లను ఆగస్టులోగా అందచేస్తాం. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలి. మిగిలిన కేటగిరీ ఇళ్లకు ప్రభుత్వం ఇన్సెంటివ్ ఇచ్చింది. ఆ కేటగిరీ లబ్ధిదారులకు బ్యాంకులతో అనుసంధానించాలి. ఇప్పటికే రూ.1,962.15 కోట్లు బ్యాంకుల ద్వారా అందించాం. మిగిలిన వారికి కూడా రుణాలు టైఅప్ చేసేలా చర్యలు తీసుకోవాలి.

విత్తనాలు, ఎరువులు, మందులకు కొరత రాకూడదు

ఖరీఫ్ పనులు ప్రారంభం అయ్యాయి. 9 జిల్లాల పరిధిలోని 19 మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో నీటి విడుదల ప్రారంభమైంది. మిగిలిన 29 మేజర్ ప్రాజెక్టుల పరిధిలో జూన్ 15 నుంచి జూలై 20 వరకు నీటి విడుదల షెడ్యూల్ ఖరారైంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొరత రాకుండా చూడాలి. నాణ్యత చాలా ముఖ్యం. నకిలీల కారణంగా రైతులు ఎక్కడా నష్టపోయిన సందర్భాలు కనిపించకూడదు. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. ఆర్బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

1 నుంచి ఈ-క్రాప్ బుకింగ్

ఖరీఫ్ 2023 సంబంధించి జూలై 1 నుంచి ఈ–క్రాప్ బుకింగ్ ప్రారంభించాలి. సెప్టెంబరు మొదటి వారంలోగా పూర్తి చేయాలి. సోషల్ ఆడిట్ చేపట్టి సెప్టెంబరు నెలాఖరులోగా తుది జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలి. సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పించి కౌలు రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలి. సీసీఆర్సీ కార్డులు కేవలం 11 నెలల పాటు మాత్రమే చెల్లుబాటు అవుతాయని, భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం కలగదనే విషయాన్ని వివరించాలి. కౌలు రైతులకు రుణాలు అందేలా జిల్లా బ్యాంకర్ల కమిటీ సమావేశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆర్బీకేల స్థాయిలో గ్రామ సభలు నిర్వహించాలి.

రైతులు అక్కడకు వెళ్లాల్సిన అవసరం రాకూడదు

17 వేల రెవెన్యూ గ్రామాలకుగాను మొదటి ఫేజ్‌లో 2 వేల గ్రామాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటు సహా జగనన్న భూహక్కు, భూరక్ష కార్యక్రమం పూర్తైంది. 7.86 లక్షల భూహక్కు పత్రాలు పంపిణీ చేశాం. 25.7 లక్షల సరిహద్దు రాళ్లు పాతాం. సచివాలయాల స్థాయిలోనే రిజిస్ట్రేషన్లు సహా అన్నిరకాల సేవలు వీరికి అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. ఆయా గ్రామ సచివాలయాల్లో కనీసం ఒక్క రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం ద్వారా ఏవైనా సమస్యలుంటే సరిదిద్దే అవకాశం ఉంటుంది. జూలై 1 నాటికి ఇది పూర్తి కావాలి. ఆ గ్రామాల నుంచి రైతులు ఎవరూ తహశీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం రాకూడదు. ప్రతి పని గ్రామ సచివాలయాల స్థాయిలోనే జరగాలి. సబ్‌డివిజన్, మ్యుటేషన్, ల్యాండ్ కన్వర్షన్ తదితరాలన్నీ గ్రామ సచివాలయాల్లోనే జరగాలి. రెండో దశ కింద మరో 2 వేల గ్రామాల్లో తుది ఆర్వోఆర్ ఆగస్టు 31 కల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. సెప్టెంబర్ 30 కల్లా రాళ్లు పాతడం పూర్తి చేసి భూ పత్రాలు అందించాలి. అక్టోబరు 15 నుంచి అక్కడ రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు ప్రారంభం కావాలి.

విద్యాకానుక కిట్ల పంపిణీని కలెక్టర్లు సమీక్షించాలి

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీపై కలెక్టర్లు సమీక్ష చేయాలి. ఎక్కడైనా సరిపడా లేకున్నా, ఇచ్చిన వస్తువులు బాగా లేకున్నా వెంటనే సమాచారం తెప్పించుకోవాలి. హెచ్ఎంల నుంచి సమాచారాన్ని సేకరించి వెంటనే చర్యలు చేపట్టాలి. నాణ్యత విషయంలో ఎక్కడా సమస్య ఉన్నా వెంటనే చర్యలు తీసుకోవాలి. నాడు– నేడు తొలిదశ పనులు పూర్తైన 15,750 పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి 30,249 తరగతి గదుల్లో జూలై 12 కల్లా ఐఎఫ్‌పీ ప్యానెళ్లు ఏర్పాటు కావాలి. వాటిని చక్కగా వినియోగించుకోవడంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి. మానిటర్లను వినియోగించుకుంటూ పిల్లలకు చక్కటి బోధన అందించాలి. ఆమేరకు టీచర్ల సామర్థ్యాన్ని పెంచాలి.

సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు



విశాఖలో..



ఒంగోలులో..

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్ : పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యా కానుక అందించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయంటూ సీఎం జగన్ చిత్రపటాలకు బుధవారం 26 జిల్లాల్లో విద్యార్థులు క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఒంగోలు ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పాల్గొన్నారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి విభాగం విశాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు భరత్ పాల్గొన్నారు.

23 నుంచి 'జగనన్న సురక్ష'

▶ మొదటి పేజీ తరువాయి

జల్లెడ పట్టి అక్కడ ఇంకా ఎవరికైనా అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందడం లేదా? ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా? వివిధ రకాల సర్టిఫికెట్లను పొందడంలో ఏమైనా ఇబ్బందులున్నాయా? అనే అంశాలను నిశితంగా పరిశీలిస్తారు. ఆ వివరాలను నమోదు చేసుకుంటారు. ఆ తరువాత వెంటనే రెండో దశ కింద నిర్దేశిత తేదీల్లో మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో సచివాలయాలను సందర్శిస్తారు. అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అదే రోజు అందచేస్తారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు 1వతేదీన లబ్ధి చేకూర్చనున్నారు. ఈమేరకు స్పందనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమం, గడప గడపకూ మన ప్రభుత్వంపై అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు.

ఇంటింటికీ వెళ్లి జల్లెడ

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారు. ఆ ఇంటికి సంబంధించి ఇన్‌కమ్, మ్యారేజీ, డెత్ సర్టిఫికెట్ల నుంచి ప్రభుత్వ పథకాలను పొందడం దాకా ఏమైనా సమస్యలున్నాయా? అనే అంశంపై జల్లెడ పడతారు. ఒక్కరు కూడా మిస్ కాకుండా అన్ని వినతులు పరిష్కారం కావాలి.



కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

సమస్యలేమీ లేకుంటే కుశల ప్రశ్నలు వేసి వారి ఆశీస్సులు తీసుకుని మరో ఇంటికి వెళతారు. ఇంటింటికి వెళ్లిన సమయంలో ఎవరైనా సర్టిఫికెట్ల సమస్య లేదా ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నా, అర్హత ఉన్నా పథకాలు అందడం లేదని గుర్తించినా వివరాలు నమోదు చేసుకుంటారు. అనంతరం నిర్దేశిత తేదీల్లో గ్రామ సచివాలయాలకు వచ్చే మండల స్థాయి బృందాలు, వార్డు సచివాలయాలకు వచ్చే మున్సిపల్ స్థాయి బృందాలు అక్కడికక్కడే సర్టిఫికెట్లను ఇచ్చేస్తాయి.

గ్రామాలకు రెండు బృందాలు

మండల స్థాయిలో ఎంపీడీవో, డిప్యూటీ తహశీల్దార్ ఒక బృందంగా, తహశీల్దార్, పంచాయతీరాజ్ ఈవో కలసి రెండో టీమ్‌గా ఏర్పాటవుతారు. ఈ రెండు బృందాలు గ్రామాలకు వెళ్తాయి. సచివాలయానికి వచ్చే తేదీ వివరాలను ముందే నిర్ణయించి అప్పటిలోగా గ్రామంలో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బంది ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తారు. నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటినీ జల్లెడ పడతారు. డాక్యుమెంటేషన్, సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాలు, అర్హతలు తదితరాలకు సంబంధించి మండలాధికారులు క్యాంపులు నిర్వహిస్తారు. సమస్యలున్న వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అన్నీ అందిస్తారు. దీనివల్ల సమస్యలు మళ్లీ ఉత్పన్నం కాకుండా పరిష్కారమయ్యే అవకాశం కలుగుతుంది.

గడప గడపకూ పనులకు నిధుల కొరత లేదు

గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రాధాన్యతగా గుర్తించిన పనుల విషయంలో కలెక్టర్లు శ్రద్ధ తీసుకోవాలి. ఆయా గ్రామాల్లో ముఖ్యమైన సమస్యల పరిష్కారం కోసం రూ.20 లక్షలు ప్రతి సచివాలయానికి ఇస్తున్నాం. ఇది చాలా ప్రాధాన్యాంశం. గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు గుర్తించిన పనులకు ఈ డబ్బులు మంజూరు చేయాలి. వెంటనే ఆ పనులు ప్రారంభమయ్యేలా చూడటం, నిధుల మంజూరు సక్రమంగా జరగాలి. నిధులకు ఎలాంటి కొరత లేదు. మంజూరు చేసిన పనులను వెంటనే మొదలు పెట్టేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదే. కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకుని పనులను ముందుకు తీసుకెళ్లాలి.

వార్డులకు మున్సిపల్ బృందాలు

అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది ఒక టీమ్‌గా ఉంటారు. జోనల్ కమిషనర్ లేదా డిప్యూటీ కమిషనర్, సిబ్బంది మరో బృందంగా ఏర్పడి వార్డుల్లో పర్యటిస్తారు. ఈ మొత్తం కార్యక్రమం జూన్ 23 నుంచి జూలై 23 వరకు నెలరోజుల పాటు జరుగుతుంది.

సేవల్లో ఉన్నత ప్రమాణాలు..

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అందే వినతుల పరిష్కారంలో క్వాలిటీ చాలా ముఖ్యం. గ్రామ సచివాలయాల దగ్గర నుంచి కలెక్టర్లు, ప్రభుత్వ విభాగాల కార్యదర్శులంతా దీనిపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి. ఈ కార్యక్రమానికి సీఎం పేరు పెట్టారంటే ప్రభుత్వానికి ఎంత ప్రాధాన్యమైనదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో పరిష్కారం కాని వినతులను కూడా సమర్థంగా, నాణ్యతతో పరిష్కరించాలి. సగటు మనిషి ముఖంలో చిరునవ్వులు చూడాలి. నిర్దేశించుకున్న సమయంలోగా నాణ్యతతో వినతులను పరిష్కరించడం ముఖ్యం. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సేవలు అందించడంలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పుతున్నాం.

99.35 శాతం వినతులు పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించి నెల రోజులు గడిచింది. ఇందుకోసం 1902 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశాం. 30 ప్రభుత్వ శాఖలు, 102 మంది హెచ్‌వోడీలతో పాటు రెండు లక్షల మందితో కూడిన ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు వినతుల పరిష్కారంపై దృష్టిపెట్టింది. సీఎంవో, సచివాలయం, విభాగాధిపతుల దగ్గర నుంచి జిల్లాలు, మండల స్థాయిల్లో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లు ఏర్పాటు చేశాం. ఇప్పటివరకూ 59,986 వినతులు అందగా నిర్దేశిత సమయంలోగా 39,585 విజ్ఞాపనలు పరిష్కరించాం. మరో 20,045 పరిష్కారం దిశగా పురోగతిలో ఉన్నాయి. 99.35 శాతం వినతులు పరిష్కారమయ్యాయి. వినతులు పరిష్కరించే తీరు బాగున్నా సంతృప్త స్థాయి పెరగాల్సి ఉంది.

తిరస్కరిస్తే ఇంటికెళ్లి వివరించాలి

ఒకవేళ గ్రీవెన్స్‌ను రిజెక్ట్ చేస్తే సంబంధిత ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లి ఎందుకు తిరస్కరణకు గురైందో వారికి వివరించాలి. సచివాలయ సిబ్బంది, వలంటీర్ వెళ్లి సంబంధిత వ్యక్తికి వివరించాలి. ఈ మేరకు ఎస్‌వోపీలో మార్పులు తేవాలి. రిజెక్ట్ చేసిన గ్రీవెన్స్‌ను కలెక్టర్లు పరిశీలించాలి. ఇంకా పరిశీలించని గ్రీవెన్సెస్ ఏమైనా ఉంటే 24 గంటల్లోగా పరిష్కరించాలి. సంబంధిత విభాగానికి 24 గంటల్లోగా పంపాలి. ఈ మేరకు ప్రతి ఉద్యోగికి దీనికి సంబంధించి అవగాహన కల్పించాలి.

కేంద్రానిది బీసీల వ్యతిరేక వైఖరి

- బీసీల కోసం ఎలాంటి పథకాలూ ప్రవేశపెట్టని కేంద్రం
- రాష్ట్ర పథకాలకు కూడా మాచింగ్ గ్రాంట్ ఇవ్వటం లేదు
- పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వని బీజేపీ ప్రభుత్వం
- సంపూర్ణ మద్దతిచ్చి సంక్షేమ ప్రభుత్వాన్ని కాపాడుకుందాం
- అన్నింట్లో బీసీలకు వాటా ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలుద్దాం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచింది
- విద్యారంగంలో అమలవుతున్న పథకాలు చూసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులే ఆశ్చర్యపోతున్నారు
- పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెడితే బీజేపీ మద్దతు ఇవ్వలేదు
- బీసీల కోసం కేంద్రం ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదు
- మండిపడ్డ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

సాక్షి, అమరావతి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో బీసీ కుల సంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల కోసం బీజేపీ ప్రభుత్వం ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టడం లేదన్నారు. పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ బీసీ బిల్లు ప్రవేశపెడితే దేశంలోని 14 రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చినా.. అధికార బీజేపీ మాత్రం మద్దతు ఇవ్వలేదన్నారు. ఇది ఎంత దారుణమో దేశంలోని బీసీలంతా ఆలోచించాలన్నారు. కేంద్రంలో బీసీల అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ కూడా కేంద్రం ఏర్పాటు చేయలేదని, బీసీలకు సబ్సిడీ పథకాలు అమలు చేయటం లేదని, చివరకు బీసీ హాస్టల్స్ అభివృద్ధి చేయాలన్న ఆలోచన కూడా కేంద్రానికి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాలు అమలుకు సహకరించటం లేదని, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు 60 శాతం గ్రాంట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అధికారం.. సంపదలో వాటా ఇస్తున్న ఘనత జగన్‌దే

చరిత్రలో ఎవరు చేయని విధంగా బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేస్తున్నారని కృష్ణయ్య కొనియాడారు. అధికారం, సంపద, ఉద్యోగాలు, విద్య, రాజ్యాధికారం, నామినేటెడ్ పోస్టులు తదితర అన్ని రంగాల్లో బీసీలకు వాటా ఇచ్చి, సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనం ఇచ్చారని కొనియాడారు. ఇలాంటి సీఎం వైఎస్ జగన్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చి కాపాడుకుందామని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ చైర్మన్లు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, మేయర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు మెంబర్లు మొత్తం లెక్కగడితే 60 శాతానికి పైగా పదవులు బీసీలకు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. గత ప్రభుత్వాలు బీసీలకు ఇన్ని పదవులు ఇచ్చాయా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ బలోపేతానికి సీఎం జగన్ పెద్దపీట వేశారని ఆర్.కృష్ణయ్య గుర్తుచేశారు. ఏపీలో విద్యారంగంలో అమలవుతున్న చూసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులే ఆశ్చర్యపోతున్నారని ఆయన అన్నారు. సచివాలయ ఉద్యోగ నియామకాలు, ఇతర ఏ ఉద్యోగాల్లో తీసుకున్నా 60–65 శాతానికి పైగా బీసీలు ఉన్నారని గుర్తుచేశారు. బీసీలు మరింతగా అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో బీసీలంతా వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. చంద్రబాబు ప్రలోభాలకు ఎక్కడా బీసీలు లొంగొద్దని సూచించారు. సోషల్ మీడియా ద్వారా రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై బీసీలు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

వంద కిలోమీటర్ల స్పీడ్‌లో సోషల్ ఇంజినీరింగ్: సజ్జల

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సోషల్ ఇంజనీరింగ్ ఏపీలో వంద కిలోమీటర్ల స్పీడ్‌లో ఉందన్నారు. బీసీ అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. బీసీలను అడుగడుగునా మోసం చేసిన చంద్రబాబు కొత్తగా ప్రకటించిన మేనిఫెస్టోను ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని గుర్తుచేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, అగ్రవర్ణాల్లోని పేదలు అభివృద్ధి చెందినప్పుడే సామాజిక న్యాయం జరిగినట్టవుతుందన్నారు. పెత్తందారులైన చంద్రబాబు, ఆయన మద్దతుదారులు ఒకవైపు ఉంటే.. పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్ ఉన్నారన్నారు. పెత్తందారులకు.. పేదలకు జరిగే పోరాటంలో వైఎస్ జగన్ విజయం సాధిస్తారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ మాట్లాడుతూ.. నవరత్నాలు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలలో పెద్ద ఎత్తున చర్చ జరగాలన్నారు. చంద్రబాబును బీసీలు ఎప్పటికీ నమ్మరన్నారు. 139 బీసీ కులాలకు న్యాయం చేస్తున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. కాగా.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటరమణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తుల హరిప్రసాద్‌ను సమావేశం నియమించింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ బీసీ సంఘం నాయకులు వేముల బేబీరాణి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాక్సైట్ ఖనిజాలను దోచుకోవాలని చూసింది చంద్రబాబు కాదా?

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతనాయక్



సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గిరిజనులకు చేస్తున్న సమగ్రాభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆయనపై టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. బుధవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం చంద్రబాబు 16 పథకాలు తీసుకొచ్చారని టీడీపీ నేతలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబు గిరిజనుల అభివృద్ధి కోసం ఏ పథకాన్ని ప్రవేశ పెట్టారో ఆ పథకం పేరు చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో జరిగే వ్యక్తిగత దాడులకు వైఎస్సార్‌సీపీకి సంబంధం లేకున్నా.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడులు చేస్తున్నారని నిరాధార ఆరోపణలు చేయడం దుర్మార్గమని చెప్పారు. గిరిజనులపై దాడులు జరిగితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులను చట్ట ప్రకారం శిక్షించి, బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి సకాలంలో న్యాయం చేస్తోందన్నారు. గిరిజనుల ప్రాంతంలో బాక్సైట్ ఖనిజాలను దోచుకోవాలని చంద్రబాబు జీవో నంబర్ 97ను జారీ చేసిన సంగతి టీడీపీ నేతలకు తెలియదా? అని ప్రశ్నించారు. ఈ జీవో రద్దుకై గిరిజనుల తరఫున ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చింతపల్లిలో బహిరంగ సభ పెట్టి పోరాటం చేసిన విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. చంద్రబాబు హయాంలో మంత్రిమండలిలో గిరిజనులకు అవకాశం ఇవ్వలేదన్నారు.

•తెలంగాణ

విడిపోయినా అన్నదమ్ముల్లా కలసి ఉన్నాం: కేటీఆర్

సిరిసిల్ల: ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసే ఉన్నామని తెలంగాణ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఇటీవల తెలంగాణలోని సిరిసిల్లలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 కోట్లు, ఎల్లారెడ్డిపేటలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మరో రూ.2 కోట్లను మంజూరు చేసింది. మంత్రి కేటీఆర్ బుధవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలసి ఈ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే పేదరికం పోతుందన్నారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా హిందూమత ప్రచారంలో భాగంగా కొత్త ఆలయాల నిర్మాణాలకు, పాత ఆలయాల పునర్నిర్మాణం/పునరుద్ధరణకు టీటీడీ నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి సాయం చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కోరగానే.. కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. భవిష్యత్‌లో మరిన్ని ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు.

చంద్రబాబు పాలనలో.. జర్నలిస్టులకు జరిగిన మేలేంటి?

ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్

- జగన్ ప్రభుత్వంపై ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు
- చంద్రబాబు హయాంలో 'సాక్షి'ని అణిచివేసే కుట్రలు కనిపించలేదా?
- బాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నా గజం ఇళ్ల స్థలం ఇవ్వలేదు
- ఏపీలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే దశలో ఉన్నాయి
- ఏపీలో పత్రికా స్వేచ్ఛ లేకపోతే ఆ పత్రికలు, చానెళ్లు సీఎం జగన్‌పై దూషణలతో చర్చలెలా చేస్తాయి?

సాక్షి, హైదరబాద్: నల్ల చట్టాలతో పత్రికా స్వేచ్ఛను అణిచివేసి అరాచక పాలన సాగించిన చంద్రబాబు ఏ విధంగా జగన్‌కన్నా మెరుగైన ముఖ్యమంత్రో ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి చెప్పాలని ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ డిమాండ్ చేశారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు జర్నలిస్టులకు చేసిన మేలేమిటని ప్రశ్నించారు. జర్నలిస్టులకు గజం జాగా ఇవ్వకపోగా యాజమాన్యాలను గుప్పిట్లో పెట్టుకొని జర్నలిస్టులపై జులుం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. అమర్ బుధవారం హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంపై విజయవాడలో శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. జర్నలిస్టులు ఇప్పటివరకు ప్రభుత్వాలతో సత్సంబంధాలతోనే హక్కులు సాధించుకున్నారని చెప్పారు. చంద్రబాబు, కేసీఆర్‌లతో సఖ్యతగా ఉన్న యూనియన్ జగన్ విషయంలో ఎందుకు వ్యతిరేకత కనబరుస్తోందని ప్రశ్నించారు. ఏపీలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే దశలో ఉన్నాయని, ఈ సమయంలో ప్రభుత్వంపై విషం కక్కేలా



మాట్లాడటం సరైన విధానం కాదని, పాత్రికేయులు ఇలాంటి మాటలను పట్టించుకోవద్దని హితవు చెప్పారు.

25 పాత చట్టాలతో చంద్రబాబు కొత్త చట్టం

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు జర్నలిస్టులను అణిచివేసేందుకు 1998లో 25 పాత చట్టాలను కలిపి ఏపీ ప్రివెన్షన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్టివిటీస్ యాక్ట్–1998 తీసుకొచ్చారని చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరం ప్రాజెక్టు, పునరావాస కల్పనలో అక్రమాలపై వార్తలు రాసిన 'సాక్షి'ని అణిచివేసేందుకు ఏపీ స్పెషల్ కోర్ట్స్ యాక్ట్–2016 తెచ్చారన్నారు. సాక్షిని స్వాధీనం చేసుకుంటామని అప్పటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారన్నారు. ఇన్ని చేసినా అప్పుడు శ్రీనివాస్‌రెడ్డి ఎందుకు గొంతు విప్పలేదని ప్రశ్నించారు. ప్రభుత్వంపై వ్యతిరేక వార్తలు రాస్తున్నాననే కారణంగా తాను ఏపీలోకి రాకుండా అప్పట్లో ఆంక్షలు విధించారని అమర్ గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే జర్నలిస్టులకు స్వర్ణయుగం వచ్చిందని, వారి సమస్యలు పరిష్కారమయ్యాయని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ కింద 1,100 మంది జర్నలిస్టులకు హైదరాబాద్‌లో ఇళ్ల స్థలాలు ఇచ్చింది వైఎస్ హయాంలోనేనని చెప్పారు. సుప్రీం కోర్టు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం భూమి అప్పగించలేదని చెప్పారు. ఈ సొసైటీలోని 50 మంది సభ్యులు చనిపోయినా, శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని నిలదీయకుండా జగన్‌ను విమర్శించడం సమంజసం కాదన్నారు. ఏపీలో పత్రికా స్వేచ్ఛ లేకపోతే రెండు దినపత్రికలు, మూడు టీవీ చానెళ్లు ముఖ్యమంత్రి అనే గౌరవం లేకుండా జగన్ మీద, ప్రభుత్వం మీద దూషణలు చేస్తూ గంటలకు గంటలు చర్చలు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

రాజకీయ దురుద్దేశంతోనే విమర్శలు

- చంద్రబాబు, ఎల్లో మీడియా విమర్శల స్క్రిప్టుతోనే అమిత్‌షా ప్రసంగం
- ప్రజలను సంక్షేమం నుంచి విముక్తి చేసేందుకేనా పవన్ యాత్ర
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: రాజకీయ దురుద్దేశంతోనే బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ఎల్లో మీడియా, చంద్రబాబు గతంలో చేసిన విమర్శలనే కేంద్ర మంత్రి అమిత్‌షా తన ప్రసంగంలో చదివి వినిపించారే తప్ప.. కొత్తగా చెప్పిందేమీ లేదన్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న ప్రభుత్వంపై రాళ్లు విసిరితే ఏదో లాభం చేకూరుతుందనుకోవడం బీజేపీ నేతల అవివేకం. విమర్శలు చేస్తున్న వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. విశాఖ ఉక్కు, సంపూర్ణ రైల్వే జోన్, పోలవరం, ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులతో పాటు విభజన చట్టంలోని అన్ని అంశాలను నెరవేర్చే దిశగా బీజేపీ ఆలోచించాలన్నారు. కచ్చితంగా కేంద్రానికి ఏపీ అవసరం ఉంటుందని.. అప్పుడు రావాల్సిన అన్నింటినీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమ నాయకుడు సీఎం జగన్‌కు పొత్తులతో పనిలేదని.. ఒంటరిగానే ప్రజల సాయంతో ఎన్నికలకు వెళ్తారన్నారు.

అందుకేనా.. పవన్ యాత్ర

పేదలకు అందిస్తున్న సంక్షేమం, విద్య, వైద్య సంస్కరణల్లో వస్తున్న సత్ఫలితాల నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేసేందుకే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర చేస్తున్నారా అని మంత్రి బొత్స నిలదీశారు. 'రైతుల సంక్షేమం ఆపేస్తారా? జిల్లాకో మెడికల్ కాలేజీతో అభివృద్ధి, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని నిలిపేస్తారా? వీటన్నింటితో ప్రజలకు నష్టం అని చెప్పగలరా' అని నిలదీశారు. సామాన్యులకు ధైర్యం తీసుకొచ్చేలా ప్రభుత్వ పనితీరు ఉండాలని, వైఎస్సార్ తర్వాత ప్రజలకు భరోసా కల్పించిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఒకపథకాన్నైనా పేటెంట్‌గా చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ కిలో బియ్యం రెండు రూపాయలకే ఇస్తే చంద్రబాబు దాని రేటును కూడా పెంచేశారన్నారు. ప్రజలు పట్టించుకోకపోవడంతోనే ఉనికి కోసం ప్రతిపక్షాలు టక్కుటమార విద్యలను ప్రదర్శిస్తున్నాయన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

- వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి
- వైఎస్సార్ డాక్టర్స్, క్రిస్టియన్, మైనారిటీ, ప్రచార, చేనేత విభాగాలతో భేటీలు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ అనుబంధ విభాగాలైన వైఎస్సార్ డాక్టర్స్, క్రిస్టియన్, మైనారిటీ, ప్రచార, చేనేత విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులతో విజయసాయిరెడ్డి వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై టీడీపీ, దాని అనుకూల మీడియా, సోషల్ మీడియాలో కృత్రిమంగా ప్రజావ్యతిరేకతను సృష్టించే కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని సాగుతున్న ప్రచారంలో ఇసుమంత కూడా వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వానికి.. ఈ ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేయాలని, ఏపీలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలు దేశానికి రోల్ మోడల్‌గా నిలిచాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. వివిధ రాష్ట్రాల అధికారులు మన రాష్ట్రానికి వచ్చి ఇక్కడి పథకాలను అధ్యయనం చేసి వెళ్తున్నారని చెప్పారు. పార్టీ కమిటీలను త్వరగా భర్తీ చేసి.. 2024 అధికారమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలకు క్షేత్రస్థాయిలోనే తగు రీతిలో కౌంటర్ ఇవ్వాలన్నారు.

అనుబంధ విభాగాలకు ముగ్గురేసి ఉపాధ్యక్షులు

పార్టీ అనుబంధ విభాగాలకు ముగ్గురు చొప్పున ఉపాధ్యక్షులను నియమిస్తామని విజయసాయిరెడ్డి చెప్పారు. పార్టీ పటిష్టతకు రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా, 8 జోన్లుగా విభజించినట్టు చెప్పారు. రాష్ట్ర పార్టీ విభాగానికి అధ్యక్షుడు ఉంటారని, అధ్యక్షుడుతో పాటుగా ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచి ఒక ఉపాధ్యక్షుడు, కోస్తాంధ్ర జిల్లాల నుంచి ఒక ఉపాధ్యక్షుడు, రాయలసీమ జిల్లాల నుండి ఒక ఉపాధ్యక్షుడు చొప్పున నియమిస్తామని చెప్పారు. ఈ ముగ్గురు పార్టీ అనుబంధ విభాగ అధ్యక్షుడి కింద పని చేస్తారన్నారు. ఈ సమావేశాల్లో ఎంపీ మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి , డాక్టర్ల విభాగం అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ విభాగ అధ్యక్షుడు మేడిది జాన్సన్, ప్రచార విభాగ కమిటీ అధ్యక్షుడు ఆర్.ధనుంజయ రెడ్డి, చేనేత విభాగ అధ్యక్షుడు గంజి చిరంజీవి పాల్గొన్నారు.

కబాలి నిర్మాత కేపీ చౌదరి అరెస్టు

- డ్రగ్స్ విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు
- 82.75 గ్రాముల కొకైన్, బెంజ్‌కారు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం



సాక్షి, హైదరాబాద్: రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన కబాలీ తెలుగు సినిమా నిర్మాత సుంకర కృష్ణప్రసాద్ చౌదరి (కేపీ చౌదరి)ని మాదక ద్రవ్యాల విక్రయం కేసులో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. గోవా నుంచి హైదరాబాద్‌కు కొకైన్‌ను తీసుకొచ్చి మంగళవారం కిస్మత్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద విక్రయిస్తున్న క్రమంలో.. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు మాదాపూర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ), రాజేంద్రనగర్ పోలీసులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చౌదరి నుంచి రూ.2.05 లక్షల నగదుతో పాటు 82.75 గ్రాముల కొకైన్, బెంజ్ కారు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

సెలబ్రిటీలతో డ్రగ్స్ పార్టీలు..

సినీ పరిశ్రమలో పెద్దలతో ఏర్పడిన సత్సంబంధాలు ఆసరాగా చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కేపీ చౌదరి నిర్ణయించుకున్నాడు. 2021లో గోవాలో ఓహెచ్‌ఎం పేరుతో క్లబ్‌ను ప్రారంభించాడు. తర్వాత గోవాలో డ్రగ్స్ దందాలో కింగ్‌పిన్ అయిన నైజీరియాకు చెందిన ఎడ్విన్ న్యూన్, పెటిట్ ఎబుజెర్ అలియాస్ గాబ్రియెల్ అనే వారితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి గోవాకు సెలబ్రిటీలను, ప్రముఖులను తీసుకెళ్లి డ్రగ్స్ పార్టీలు నిర్వహించడం మొదలు పెట్టాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గోవా నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. గోవాకు వెళ్లి డ్రగ్స్ కొనుగోలు చేసి నగరంలోని సెలబ్రిటీలకు సరఫరా చేయడం మొదలు పెట్టాడు. ఇదే క్రమంలో మాదక ద్రవ్యాల కేసులో పరారీలో ఉన్న, ప్రస్తుతం గోవాలో ఉంటున్న గాబ్రియెల్ నుంచి 100 ప్యాకెట్ల కొకైన్‌ను కొనుగోలు చేశాడు. ఇందులో 10 ప్యాకెట్లు కేపీ చౌదరి స్వయంగా వినియోగించాడు. మిగిలిన వాటిని విక్రయించేందుకు కిస్మత్‌పూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోకి రాగా పోలీసులు పట్టుకున్నారు.

• బాల్య వివాహాలు నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. నిబంధనలను కఠినతరం చేస్తూ.. అధికారులకు విస్తృత అధికారాలను కల్పిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బాల్య వివాహాల నిరోధానికి కొద్దిమంది అధికారులకు మాత్రమే న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు అధికారాలుండేవి. దీనిని సవరిస్తూ రాష్ట్రస్థాయి నుంచి గ్రామ, వార్డు సచివాలయ స్థాయి వరకు ఉన్న అధికారులకు విస్తృత అధికారాలు కల్పించింది.



కుర్చుని గమనించడం సులభం, కష్టతరమైనది ఏమిటంటే, లేచి చర్య తీసుకోవడం.
– హొనోరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 15 జూన్ 2023

ఆలోచన రేపుతున్న ఆరోపణలు

నూరుపూలు వికసించనీ... వేయి భావాలు సంఘర్షించనీ అంటారు. కానీ, మనమిప్పుడు ఏ చిన్న వ్యతిరేక వ్యాఖ్యనైనా సహించలేని స్థితికి వచ్చేశామా? డిజిటల్, సోషల్ మీడియా విప్లవంతో జనం సమాచారం పంచుకోవడం నుంచి స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తీకరణ దాకా – సమస్తం మారిపోయిన వేళ ప్రభుత్వాల నియంత్రణ ఎంత? ప్రతి ఒక్కరికీ అందుబాటుతో మీడియా ప్రజాస్వామికీకరణతో పాటు విచ్చలవిడితనమూ పెరిగే ప్రమాదం ఉన్నందున ఈ భారీ టెక్ సంస్థల బాధ్యత ఎంత? కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ట్విట్టర్ మాజీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడైన జాక్ డోర్సీ సోమవారం చేసిన సంచలన ఆరోపణలు ఇలాంటి ఎన్నో ప్రశ్నల్ని మరోసారి లేవనెత్తాయి.

అమెరికన్ యూట్యూబ్ షో 'బ్రేకింగ్ పాయింట్స్'కు డోర్సీ ఇచ్చిన ఇంటర్వ్యూ భారత ప్రభుత్వానికీ, పాపులర్ సోషల్ మెసేజింగ్ వేదికకూ మధ్య కొనసాగుతున్న పోరులో కొత్త సంగతులను సోమవారం రాత్రి బయటపెట్టింది. రైతుల ఉద్యమ సమయంలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న పలు ట్విట్టర్ ఖాతాలను స్తంభింపజేయాల్సిందిగా భారత ప్రభుత్వం నుంచి పలు అభ్యర్థనలు వచ్చాయనేది ఆయన కథనం. అంతకన్నా ఆందోళనకరమైనవి ఏమిటంటే – ప్రభుత్వ డిమాండ్లకు తలొగ్గకపోతే, భారత్‌లో ట్విట్టర్‌ను మూసివేయిస్తామనీ, దేశంలోని సంస్థ ఆఫీసులపైన, ఉద్యోగుల ఇళ్ళపైన దాడులు చేయిస్తామనీ గద్దె మీది పెద్దలు బెదిరించారట. డోర్సీ చేసిన ఈ ఆరోపణలు తీవ్రమైనవి. సహజంగానే ప్రభుత్వం ఆ ఆరోపణల్ని పూర్తిగా తోసిపుచ్చింది.

అంతమాత్రాన కేంద్రంలో గడచిన తొమ్మిదేళ్ళ పైచిలుకు బీజేపీ హయాం సంప్రదాయ మీడియాకైనా, సోషల్ మీడియాకైనా సవ్యంగా ఉందనుకోలేం. పత్రికలు, టీవీ ఛానళ్ళ నుంచి వెబ్‌సైట్లు, సోషల్ మీడియా దాకా అన్నిటినీ నయానో, భయానో తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి పాలకులు ప్రయత్నిస్తున్న తీరు కొత్తేమీ కాదు. కొన్ని జాతీయ టీవీ ఛానళ్ళను బీజేపీ పెద్దలు, వారి మిత్రులు, ఆశ్రితులు హస్తగతం చేసుకోవడమూ బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో ట్విట్టర్ మాజీ పెద్ద చేసిన ఆరోపణలు అసత్యమో, సత్యమో కానీ... అసహజమని మాత్రం అనిపించట్లేదు. తొమ్మిదేళ్ళ చరిత్ర చూస్తే నమ్మశక్యంగానే ఉన్నాయి. అదే సమయంలో ట్విట్టర్ సారథ్యం వదిలేసిన ఇంతకాలానికి డోర్సీ ఇప్పుడు ఈ అంశాలను ఎందుకు లేవనెత్తుతున్నారన్నదీ ఆలోచించాల్సినదే!


ట్విట్టర్ పులు కడిగిన ముత్యం అనుకోలేం. పలు సందర్భాల్లో ఏకపక్షంగా వ్యవహరించిన చరిత్ర దానిది. పారదర్శకత లేకుండా ఈ తోక లేని పిట్ట తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలు కూడా సవాలక్ష. స్వయంగా డోర్సీ సైతం వివాదాలకు అతీతులేమీ కాదు. 2018లో భారత్‌లో పర్యటించినప్పుడు ఆయన వివాదాస్పద పోస్టర్‌ను చేత ధరించిన ఘటన ఇప్పటికీ విశ్లేషకులకు గుర్తే. అలాగే, ఆయన హయాంలో ట్విట్టర్ తన అల్గారిథమ్ ద్వారా నచ్చినవారిని పెంచుతూ, నచ్చనివారిని తుంచుతూ నడిచిందన్న ఆరోపణలూ ఉన్నాయి. ట్విట్టర్ కొత్త యజమాని ఎలాన్ మస్క్ సైతం అలాంటి కొన్ని అంతర్గత పత్రాలను బయటపెట్టారు. కొన్ని వార్తా కథనాలను నిరోధిస్తూ, కొన్ని ఖాతాలను స్తంభింపజేశాక ఇలాంటి వేదికలకు ఇక తటస్థత ఎక్కడున్నట్టు? పారదర్శకత, జవాబుదారీతనం లేనప్పుడు ట్విట్టరే కాదు... ఏ సోషల్ మీడియా వేదికకైనా పవిత్రత, గౌరవం ఏం ఉంటాయి? పాలకులను అవి వేలెత్తి చూపితే, మూడు వేళ్ళు వాటినే వెక్కిరిస్తాయి.

అలాగని ఆ లోపాలే సందుగా... పాలక పక్షాలు, ప్రభుత్వాలు సోషల్ మీడియా సహా సమస్త భావప్రసార వేదికల పైనా స్వారీ చేస్తుంటే సమర్థించలేం. సోమవారం ఒకపక్కన 'కోవిన్' పోర్టల్‌లోని పౌరుల సమాచారం అంగట్లో లభిస్తున్నట్టు బయటపడ్డ కొద్ది గంటల్లోనే, డోర్సీ సంచలన ఆరోపణలూ రావడం యాదృచ్ఛికమే కావచ్చు. కానీ, వార్తలనైనా, వ్యాఖ్యలనైనా... నోటితో ఖండించడమే తప్ప సర్కార్ తన సమర్థత, నిర్దోషిత్వాలను నిరూపించుకొనేందుకు ప్రయత్నించడం లేదు. నిజానికి, 2021 ఫిబ్రవరిలో సైతం దాదాపు 250 ఖాతాలనూ, ట్వీట్లనూ తొలగించమంటూ పాలకుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు ట్విట్టర్ ప్రతిఘటించింది. బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు చేసిన వివాదాస్పద ట్వీట్‌కు 'మ్యానిప్యులేటెడ్ మీడియా' అని ట్యాగ్ తగిలించేసరికి, 2021 మే నెలలో తన కార్యాలయాలపై ఢిల్లీ పోలీసు దాడులను ఎదుర్కోవాల్సి వచ్చింది. చివరకు ఇలా రహస్యంగా, అడ్డగోలుగా సాగుతున్న ఈ సెన్సార్‌షిప్ డిమాండ్లపై కర్ణాటక హైకోర్ట్‌లో రిట్ పిటిషన్ వేసింది. అప్పుడైనా, ఇప్పుడైనా ప్రభుత్వం ఆరోపణల్ని తోసిపుచ్చడానికే పరిమితమైంది.

ధ్రువీకృత జర్నలిస్టులు, వార్తా సంస్థల ఖాతాలు పోస్టులను సైతం స్తంభింపజేయమంటూ మన దేశం నుంచి ట్విట్టర్‌కు వస్తున్న డిమాండ్లే ఎక్కువట. 2021 ద్వితీయార్ధంలో మొత్తం 326 లీగల్ డిమాండ్లొస్తే, అందులో 114 మన దేశానివే. మొత్తం మీద పాలకులకు ప్రజా ఉద్యమాలు, ప్రతికూల వ్యాఖ్యలంటే దడ పుడుతున్నట్టుంది. రైతు ఉద్యమమైనా, రెజ్లర్ల నిరసనైనా సర్కార్ శైలి ఒకటే– ముందు ఉదాసీనత, తర్వాత అణచివేత. ప్రజాక్షేత్రంలో వ్యవహారం బెడిసి కొడుతోందనిపిస్తే – ఆఖరికి అత్యవసర కంటి తుడుపు కార్యాచరణ. ఏ రకంగా చూసినా ఇది సరి కాదు. ట్విట్టర్ సహా అన్నీ జవాబుదారీతనంతో, స్థానిక చట్టాలకు కట్టుబడాలి. అదెంత ముఖ్యమో, బెదిరింపు ధోరణులు ప్రజాస్వామ్య విలువలకే మచ్చ అని పాలకులు గ్రహించడం అంత కీలకం. ఆ రెండూ జరగనంత కాలం ఇవాళ డోర్సీ... రేపు మరొకరు... పేరు మారవచ్చేమో కానీ, ఆరోపణల తీరు, సారం మారవు.

ప్రపంచ ఆరోగ్యమే లక్ష్యంగా...

సందర్భం



డాక్టర్ మన్‌సుఖ్ మండావియా

ప్రజారోగ్య రంగంలో డిజిటల్ సాధనాల వినియోగాన్ని భారతదేశం ప్రోత్సహిస్తోంది. కోవిడ్–19 సమయంలో అభివృద్ధి చేసి అమలు చేసిన కో–విన్, ఈ–సంజీవని వంటివి లక్ష్యాల సాధన కోసం ఎంతగానో ఉపయోగపడ్డాయి. అయితే ఒకరితో సంబంధం లేకుండా మరొకరు పనిచేసినప్పుడు ప్రపంచంలో ఒక ప్రాంతంలో సంవత్సరాల తరబడి వినియోగంలో ఉన్న వ్యవస్థ మరో ప్రాంతంలో మళ్లీ మొదటి నుంచి వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలో జరుగుతున్నది ఇదే. డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా అమలు జరగడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రామాణిక వ్యవస్థ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. జీ–20 అధ్యక్ష హోదాలో ఏకాభిప్రాయం సాధించడానికి భారతదేశం పని చేస్తోంది.

ఇంటర్నెట్ లేని ప్రపంచాన్ని ఒకసారి ఊహించుకోండి. ఇంటర్నెట్ సౌకర్యం లేక ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా విడివిడిగా పనిచేస్తున్న కంప్యూటర్ నెట్‌వర్క్‌ల పనితీరు ఎలా ఉంటుంది? ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా కంప్యూటర్ నెట్‌వర్క్ పనిచేసినప్పుడు ప్రపంచంలో ఒక ప్రాంతంలో సంవత్సరాల తరబడి వినియోగంలో ఉన్న వ్యవస్థ మరో ప్రాంతంలో నూతన వ్యవస్థగా వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ప్రామాణిక ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) అమలులో లేకపోతే పరిస్థితి అసంబద్ధంగా ఉండేది. ఇది ప్రస్తుతం డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలో నెలకొని ఉన్న పరిస్థితిని గుర్తు చేస్తోంది. వివిధ సాంకేతిక అంశాల ఆధారంగా, వివిధ ప్రాంతాల్లో వివిధ విధాలుగా డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ సాగుతోంది. సరైన విధంగా అమలు జరిగి ఆశించిన ఫలితాలు ఇవ్వడానికి ఆ వ్యవస్థ మార్గనిర్దేశకుల కోసం ఎదురు చూస్తోంది. డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా అమలు జరగడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రామాణిక వ్యవస్థ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయడానికి అంతర్జాతీయ నాయకత్వం అవసరం ఉంటుంది.

డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ పరిమాణం చిన్నదిగా కనిపించవచ్చు. అయితే, ఈ రంగం అనేక రంగాల్లో అవకాశాలను అందిస్తుంది. స్మార్ట్ వేరియబుల్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ కేర్, రిమోట్ మానిటరింగ్, కృత్రిమ మేధస్సు, డేటా అనలిటిక్స్, బ్లాక్–చైన్, రిమోట్ డేటా లాంటి రంగాల్లో అపారమైన అవకాశాలు వస్తాయి. డిజిటల్ పరికరాల సామర్థ్యం, అవసరం కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రపంచ దేశాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధికి అంతర్జాతీయ స్థాయిలో జరగాల్సిన చర్యల ప్రాధాన్యాన్ని గుర్తించాల్సి ఉంటుంది.

డిజిటల్ సాధనాల వినియోగం

ఇటీవలి కాలంలో ప్రజారోగ్య రంగంలో డిజిటల్ సాధనాల వినియోగాన్ని భారతదేశం ప్రోత్సహిస్తోంది. కోవిడ్–19 సమయంలో అభివృద్ధి చేసి అమలు చేసిన కో–విన్, ఈ–సంజీవని వంటివి లక్ష్యాల సాధన కోసం ఉపయోగపడ్డాయి. టీకా కార్యక్రమం, ఆరోగ్య సంరక్షణ చర్యల అమలులో సమూల మార్పులు వచ్చాయి. డిజిటల్ సాధనాల ద్వారా మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే అంశంలో ప్రభుత్వం విజయం సాధించింది. భారతదేశంలో అమలు జరిగిన అతిపెద్ద టీకా కార్యక్రమానికి కో–విన్ వెన్నెముకగా నిలిచింది. కో–విన్ ద్వారా వ్యాక్సిన్ రవాణా కార్యక్రమం అమలు జరిగిన తీరును ప్రభుత్వం పర్యవేక్షించింది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ టీకా కోసం నమోదు చేసుకోవడం, డిజిటల్ సర్టిఫికెట్లు జారీ చేయడం లాంటి ముఖ్యమైన కార్యక్రమాలు కో–విన్ సహకారంతో జరిగాయి.



ఇక్కడ మరో డిజిటల్ సాధనం ఈ– సంజీవని గురించి ప్రస్తావించాలి. ఈ–సంజీవని ద్వారా ప్రజలు ఆన్‌లైన్ ద్వారా ఆరోగ్య సంప్రదింపులను పొందుతున్నారు. తమ ఇళ్ల నుంచే నిపుణులను సంప్రదించి సలహాలు పొందే అవకాశాన్ని ఈ–సంజీవని అందుబాటులోకి తెచ్చింది. 10 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ–సంజీవని ద్వారా ప్రయోజనం పొందారు. గరిష్ఠ స్థాయిలో ఈ–సంజీవని ద్వారా రోజుకు 5 లక్షల సంప్రదింపులు జరిగాయి.

డిజిటల్ విధానంలో నిర్వహించిన కోవిడ్ వార్ రూమ్ వల్ల ఎప్పటికప్పుడు ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవడానికి అవకాశం కలిగింది. దీని ద్వారా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో వ్యాధి తీవ్రత తెలుసుకుని అవసరమైన సామగ్రి సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి అవకాశం కలిగింది. ఆరోగ్య సేతు, ఆర్టీ–పీసీఆర్ యాప్, ఇతర డిజిటల్ సాధనాలను విధాన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగించిన ప్రభుత్వం కోవిడ్–19 మహమ్మారి రూపంలో వచ్చిన భారీ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొని విజయం సాధించగలిగింది.

ప్రజారోగ్య రంగంలో డిజిటల్ సాధనాలను పూర్తి సామర్థ్యం మేరకు ఉపయోగించుకోవడానికి పటిష్ఠమైన వ్యవస్థ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే జాతీయ డిజిటల్ ఆరోగ్య పర్యావరణ వ్యవస్థ– ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎమ్) పని చేయడం ప్రారంభించింది. దీని ద్వారా ప్రజలు వారి వైద్య రికార్డులు నిల్వ చేయడానికి, అవసరమైన సమయంలో చూసి అవసరమైన ఆరోగ్య సంరక్షణ పొందడానికి నిపుణులకు పంపడానికి అవకాశం కలుగుతుంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వంలో భారతదేశం డిజిటల్ ఆరోగ్య వ్యవస్థకు సంబంధించి సాధించిన విజయాలు, ప్రణాళికలను ప్రపంచ దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉంది.

ముఖ్యంగా తక్కువ, మధ్య–ఆదాయ దేశాలు భారతదేశం అనుసరించిన విధానాలు అనుసరించి తమ దేశ ప్రజలకు డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి వీలవుతుంది. దీనివల్ల సార్వత్రిక ఆరోగ్య కల సాకారం అవుతుంది.

ఎదుర్కొంటున్న సవాళ్లు

కాపీరైట్, ఇతర నిర్వహణ యాజమాన్య వ్యవస్థల వల్ల డిజిటల్ పరిష్కార వేదికలు అందరికీ అందుబాటులోకి రావడం లేదు. కొన్ని డిజిటల్ సాధనాలు లేదా ఓపెన్ సోర్స్ పరిష్కార మార్గాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటి వినియోగం పరిమితంగానే ఉంది. దీనికి ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ లేకపోవడం అని చెప్పుకోవచ్చు.

ప్రపంచ స్థాయిలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, ఈ ప్రయత్నాలు విడివిడిగా ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా దేశాల మధ్య సహకారం లేకుండా సాగుతున్నాయి. దీనికోసం ప్రపంచ దేశాలు ఒక వేదిక పైకి వచ్చి సంఘటిత ప్రయత్నాలు సాగించాలి. దీనికి జీ–20 ఒక సమగ్ర, పటిష్ఠ వేదికగా పనిచేస్తుంది. ఈ ప్రయత్నాలు భవిష్యత్తు అవసరాలకు అవసరమైన డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధికి దారి తీస్తాయి.

జీ–20 అధ్యక్ష హోదాలో...

ప్రపంచ ప్రజల సంక్షేమం కోసం పటిష్ఠమైన డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయగల సామర్థ్యం భారతదేశానికి ఉంది. దీనికి అవసరమైన ప్రణాళిక కూడా భారతదేశం వద్ద సిద్ధంగా ఉంది.

ముందుగా విడివిడిగా జరుగుతున్న ప్రయత్నాలను సంఘటితం చేయాల్సి ఉంటుంది. అందరికీ ఆమోదయోగ్యంగా, అందరికీ ప్రయోజనం కలిగించేలా ఈ చర్యలు అమలు జరగాలి. దశాబ్దాల క్రితం ఇంటర్నెట్ అభివృద్ధి కోసం జరిగిన ప్రయత్నం, కృషి మరోసారి డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధి కోసం జరగాల్సి ఉంటుంది. ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సమాచార మార్పిడిపై దేశాల మధ్య నమ్మకం పెరిగేలా చూసి, అవసరమైన నిధులు సమకూర్చడానికి ప్రపంచ స్థాయిలో ప్రయత్నాలు జరగాలి.

జీ–20 అధ్యక్ష హోదాలో కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం సాధించడానికి భారతదేశం పని చేస్తోంది. ఆచరణ సాధ్యమైన వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలు ముఖ్యంగా దక్షిణ దేశాలు ప్రయోజనం పొందేలా చూసేందుకు భారతదేశం కృషి చేస్తోంది. స్వప్రయోజనాలను పక్కన పెట్టి సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం ప్రపంచ దేశాలు నడుం బిగించాలి. 'వసుధైక కుటుంబం' స్ఫూర్తితో ప్రపంచ ఆరోగ్యం కోసం కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమయింది.

వ్యాసకర్త కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు – ఎరువుల శాఖ మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

లెజెండ్ వెళ్లిపోయారు!



నా జీవిత కాలంలో బహుశా అత్యంత గొప్ప అమెరికన్ రచయిత కార్మాక్ మెక్‌కార్తీ తన 89వ ఏట వెళ్లిపోయారు. ఆయన సంపూర్ణ జీవితం అనుభవించారు. అయినా దుఃఖించకుండా ఉండలేక పోతున్నాను. ('నో కంట్రీ ఫర్ ఓల్డ్ మెన్', 'ద రోడ్' లాంటి నవలలు రాశారు మెక్‌కార్తీ.)

– స్టీఫెన్ కింగ్, రచయిత

అక్కర్లేని గొప్పతనం



మేము గడ్డి తినాల్సి వచ్చినా సరే అణు బాంబు తయారు చేస్తాం అన్నది పాకిస్తాన్. అన్నట్టే చేయగలిగింది. నిజంగానే ఇప్పుడు గడ్డి మీదే బతుకుతోంది. కానీ ఆ గడ్డి కూడా అయిపోతే?

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

అంతా మానసికం!



ఏ సెలవు నుంచో రాగానే అప్పటి దాకా ఫ్రిజ్‌లో ఉన్న సీసాల్లోని నీటిని పారబోసి, వాటర్ ఫిల్టర్ లోంచి 'ఫ్రెష్ వాటర్' నింపిపెడుతుంటారు కొందరు. అవి ఫ్రెష్షా? అవి ఎప్పటి నుంచో అక్కడే ఉన్న నీళ్లు కదా? పోనీ, మున్సిపాలిటీ నీళ్లు కూడా ఎప్పటివో కదా!

– సౌమిత్ర పఠారే, సైకియాట్రిస్ట్

ఇంకానా?



ఆరు ఆఫ్రికా దేశాలు తమ అధికార భాషగా పోర్చుగీస్ మాట్లాడుతాయి. 29 ఫ్రెంచ్ మాట్లాడుతాయి. 24 ఇంగ్లీష్ మాట్లాడుతాయి. ఇంకొక మనిషి భాష మాట్లాడటం, వారి దేవుళ్లను పూజించడం, వాళ్ల పేరు మన పిల్లలకు పెట్టుకోవడం అనేది స్వేచ్ఛా కాదు, స్వాతంత్ర్యమూ కాదు. ఆఫ్రికా అనేది వలసవాద వారసత్వం!

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్టు

పీచు తినాలి



మధుమేహం ఉన్నవాళ్లు తమ భోజనంలోకి అత్యధిక పీచు ఉన్న పదార్థాలను చేర్చుకోవడం అనేది ఎంతో లాభదాయకం. ఈ ఆహార పదార్థాలు తక్కువ కేలరీలు, చక్కెర కలిగి ఉంటాయి. మధుమేహ నియంత్రణకు చక్కగా ఉపకరిస్తాయి.

– వి.మోహన్, మధుమేహ స్పెషలిస్ట్

ఇన్‌బాక్స్

ప్రకృతిని కాపాడుదాం

మానవుడు అభివృద్ధి పేరుతో ప్రకృతిని విచక్షణా రహితంగా పేరాశతో కొల్లగొడుతున్నాడు. దీంతో కాలుష్యం పెరిగి భూతాపానికి కారణమవుతోంది. మనిషి మొదట్లో కేవలం అవసరాల కోసమే ప్రకృతిపై ఆధారపడేవాడు. క్రమంగా లాభాపేక్షతో సహజవనరులను దోచేస్తున్నాడు. రాను రానూ వినియోగదారీ సంస్కృతి పెరిగిపోతున్నది. దీంతో అవసరం ఉన్నా లేకున్నా వస్తువులను వినియోగించడం పెరిగిపోయింది. ఈ వస్తువులను ఉత్పత్తి చేయడానికి ప్రకృతిని యథేచ్ఛగా విధ్వంసం చేస్తున్నాం. అలాగే వస్తూత్పత్తి సమయంలో పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థాలు, విషవాయువుల వల్లా పర్యావరణం తీవ్రంగా నష్ట పోతోంది. పారిశ్రామిక వ్యర్థాలు సహజనీటి వనరుల్లో కలవడం వల్ల, భూగర్భ జలాలతోపాటు నదులు, సముద్రాలు వంటి జలవనరులు కలుషితమవుతున్నాయి. పరిశ్రమలు, మోటారు వాహనాల నుంచి ఉద్గారాల వల్ల పీల్చే గాలి కలుషిత మవుతోంది. పెరిగిపోతున్న జనాభా అవసరాలను తీర్చడానికి చెట్లను నరికివేసి భూములను చదును చేయడం వల్ల పచ్చదనం తగ్గిపోయి వర్షాలు ముఖం చాటేస్తున్నాయి. భూతాపం పెరుగుతోంది. మొత్తం మీద మానవుడు విచక్షణా రహితమైన ప్రకృతి వనరుల వినియోగం వల్ల భూమి, దాని మీద నివసించే జీవకోటి పెను ప్రమాదంలో పడుతున్నాయి. ఇప్పటికైనా చైతన్యం తెచ్చుకోకుంటే ఇది విశ్వానికే పెనుముప్పు.

– పింగళి భాగ్యలక్ష్మి, గుంటూరు

దళిత బాంధవుడు శ్రీశ్రీ

సందర్భం



డొక్కా మాణిక్య వరప్రసాద్

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ముద్ర ప్రత్యేకమైంది. మునుపెన్నడూ కవులు స్వీకరించని వస్తువుని రచనకు ముడి సరుకుగా ఎంచుకొని కవిత్వం రాశారు. కార్మిక, కర్షక, అన్నార్తుల ఆవేదనలకు అక్షర రూపమిచ్చారు. ఉన్న ఊరిని కన్నవారిని వదులుకొని పట్టణంలో బ్రతుకు దెరువుని వెదుక్కునే అభాగ్యులు, శ్రీశ్రీ కవిత్వంలో కనిపిస్తారు. అందరూ ప్రేమ గీతాలు రాసే కాలంలో శ్రీశ్రీ శ్రమ సౌందర్యాన్ని కవిత్వీకరించారు. అదే కాలంలో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం దాని పర్యవసానంగా మానవ జీవితాల్లో వచ్చిన వలసలు, అనిశ్చితి, శ్రమపరాయీకరణ ఇత్యాది అనేకానేక పార్శ్వాలు శ్రీశ్రీ కవిత్వంలో ప్రతిఫలించాయి. చెలం అన్నట్టు కన్నీళ్ళు, రక్తమూ కలిపి తయారుచేసిన సరికొత్త టానిక్ శ్రీశ్రీ కవిత్వం. 'మహా ప్రస్థానం' నుంచి 'మరో ప్రస్థానం' దాకా శ్రీశ్రీ కవిత్వం కష్టజీవికి రెండు వైపులా నిలిచిన అండా, దండా.

'మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం' అని పలికిన శ్రీశ్రీ కవిత్వం సామాజిక శ్రేయస్సే లక్ష్యంగా సాగింది. శ్రీశ్రీ నిష్క్రమించిన నాలుగు దశాబ్దాల తర్వాత ఆయన సాహిత్య ప్రాసంగికతను చర్చించుకోవాల్సిన సామాజిక, రాజకీయ సందర్భం ఇది. ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజిక విధ్వంసం, బడుగు బలహీనుల జీవితాల విధ్వంసం, పెరుగుతున్న పట్టణీకరణ, పల్లెల నుంచి పట్టణాలకు వలసకట్టిన పేదల జీవితాల విచ్ఛిత్తి, పరాయీకరణ వంటి పరిస్థితులు ఇవ్వాళ ఉన్నాయి.

1930ల ఆర్థిక మాంద్యం, గాంధీ నాయకత్వాన తీవ్రమైన తీరులో నడుస్తున్న స్వాతంత్ర్య ఉద్యమం, ఆయన సైద్ధాంతిక చర్చ శ్రీశ్రీని సైతం ఆకర్షింపజేశాయి. ఈ సందర్భం నుండే శ్రీశ్రీ గాంధీని తన కవిత్వం ద్వారా బహుముఖంగా చర్చించారు. 'మహా సంకల్పం' గీతికలో 'ఇదిగో నా స్వతంత్ర్య స్వప్నం, జనసందోహం కరిగి ఒకే వ్యక్తిగా రూపు ధరిస్తే, ఇదేం చిత్రమని చూశాను, ఒక పెద్ద విగ్రహానికి ప్రాణ మొచ్చినట్టుగా, ఒకే ఒక్క మానవ మూర్తి నాకళ్ళ ముందు కనిపించాడు, ఎంచేతో అతని ముఖం మీద ఎప్పుడూ ఉండే పసిపాప నవ్వులేదు. అతణ్ణి జాగ్రత్తగా చూడండి స్వతంత్ర భారత పౌరుడు, అతని బాధ్యత వహిస్తామని అందరూ హామీ ఇవ్వండి ఇది నా స్వాతంత్ర్య దిన మహా సంకల్పం' అంటూ గాంధీ సైద్ధాంతిక తాత్వికతను ముందుకు తీసుకుపోవాలని ప్రజలను కోరారు. మహాత్ముడి మరణం తరువాత శ్రీశ్రీ రాసిన 'సంభవామి యుగే యుగే'లో 'ఓ మహాత్మా! ఓ మహర్షీ! ఏది చీకటి, ఏది వెలుతురు, ఏది జీవితం, ఏది మృత్యువు, ఏది పుణ్యం, ఏది పాపం, ఏది నరకం, ఏది నాకం, ఓ మహాత్మా నిన్న స్వప్నం నేటి సత్యం ఒకే కాంతి, ఒకే శాంతి, ఓ మహర్షీ, ఓ మహాత్మా' అన్నారు.



ఇటీవల శ్రీశ్రీ సాహిత్యం పట్ల సాహితీవేత్తలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా దళిత సాహితీవేత్తలు శ్రీశ్రీ స్పృశించని అంశాలపై చర్చిస్తున్నారు. నాటి కాలమాన పరిస్థితుల కనుగుణంగా స్పందించిన కవిని ఫలానా అంశంపై రాయలేదని, చర్చించ లేదని దూరంగా ఉంచడం అర్థరహితం. ఒక వ్యక్తిని మరొక వ్యక్తి, ఒక జాతిని మరొక జాతి పీడించే సాంఘిక ధర్మం ఇకపై సాగదనీ, ఆర్తులందరూ ఐక్యంగా పీడనను ఎదిరిస్తారనీ శ్రీశ్రీ సగర్వంగా చెప్పారు. సామాజిక దోపిడీ మూలంగా బక్కచిక్కి చచ్చి తరతరాలుగా రోదిస్తున్న పేదల జీవితాలు ఎదుగుబొదుగు లేని గోడలనీ, వారి నివాసాలు పాడు పడిన వాడలనీ ప్రస్ఫుటంగా పలికారు శ్రీశ్రీ.

'ఇటు చూస్తే అప్పుల వాళ్ళూ, అటు చూస్తే బిడ్డల ఆకలి' అంటూ గ్రామిక ప్రజల జీవితాల్లోని అగచాట్లను, అవసరాలను, అప్పుల బాధలను చూపుతూ వారి జీవితం సంక్షోభాన్ని కళ్ళముందర ఆవిష్కరింపజేశారు మహాకవి.

సామాజికంగా అట్టడుగు వర్గాల (మార్జినలైజ్డ్ సెక్షన్స్) సమస్త జీవన వేదనలకు గొంతుక ఇచ్చిన వారు శ్రీశ్రీ. అటువంటి శ్రీశ్రీని మనం ముందు పెట్టుకొని అసమాన సమాజంపై ఉద్యమిస్తే మరింత బలపడవచ్చు. సామాజికంగా వివక్షతను అణచివేతను ఎదుర్కొంటున్న కులాలకై అంబేడ్కర్ పోరాటం చేసినట్టు, సాహిత్యంలో అన్ని కుల వర్గాల ఆవేదనలకు అక్షర రూపాన్నిచ్చారు శ్రీశ్రీ. ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగునపడి కనిపించని కథల్ని బహిర్గతం చెయ్యమన్నారు. చారిత్రక విభాత సంధ్యల్లో దరిద్రులను కాల్చుకుతిన్న రాబందుల రహస్యాలను వెలికితీశారు. ఇటువంటి సామాజిక అణచివేతకూ, దోపిడీకి గురయిన వర్గాలన్నీ శ్రీశ్రీని తమవాడిగా ప్రకటించుకోవాలి.

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీని, జాషువాని రెండు కళ్ళుగా స్వీకరించాల్సిన సందర్భం. వీరిరువురు హంగ్రీ థర్టీస్‌లో సమాజ హితాన్ని కాంక్షిస్తూ కవిత్వం రాశారు. శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి' గీతిక రాసి 'ఆ అవ్వే మరణిస్తే నేరం ఎవరిది' అంటూ ప్రశ్నించారు. జాషువా 'అనాథ' కావ్యంలో ఆరుగురు పిల్లలతో తల్లి పడ్డ ఆవేదనను పలికించారు. ఇద్దరూ సమాజ హితం కోసం తమ కాలమాన పరిస్థితుల్లో సంభవించిన అనేకానేక సందర్భాల్లోంచి కవిత్వం రాశారు. అలాగే రాజకీయ రంగం మీద అంబేడ్కర్, గాంధీలను దిక్సూచిగా మనం స్వీకరించాల్సి ఉంటుంది. ఇది నేటి చారిత్రక అవసరం. జాషువా పద్యం 'ఎంత కోయిలపాట వృథ అయ్యెనో కదా పుట్టరాని చోట పుట్టుకతన' అన్నప్పుడు, శ్రీశ్రీ 'కవితా ఓ కవితా!' విన్నప్పుడు మనకో సామాజిక కార్యాచరణను ఉద్బోధిస్తున్నట్టుగా ఉంటుంది. సామాజిక సంస్కరణ కోణం లేకుండా భారతదేశ అభివృద్ధి అనే కాంక్షను చేరలేము. ఈ లక్ష్యానికి ఓ సాంస్కృతిక కార్యాచరణను ప్రకటించిన వాళ్లు వీరిరువురు.

నేటి సంక్షోభ కాలాన్ని అధిగమించాలంటే కొన్ని సర్దుబాట్లు అవసరంగా పౌరసమాజం గుర్తించాలి. జ్వరపీడనతో కంపించిపోతున్న ప్రజా జీవితానికి శ్రీశ్రీ, జాషువాలు... గాంధీ, అంబేడ్కర్‌లను కలిపి సరికొత్త స్వదేశీ టానిక్ తయారు చేసి సమాజానికి అందించాలి.

వ్యాసకర్త మాజీ మంత్రి, విధానపరిషత్ సభ్యులు
(నేడు శ్రీశ్రీ 40వ వర్ధంతి – ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లుకు ఎక్స్‌రే– శ్రీశ్రీ అవార్డు ప్రదానం)

బహుజన హితం

త్రిపిటకాల్లో రెండవదీ, అత్యంత ప్రాధాన్యత గలదీ సుత్త పిటకం. బహుజనుల హితం కొరకు, బహుజనుల సుఖం కొరకు బుద్ధ భగవానుడు ప్రవచించిన అన్ని సందేశాలను సమగ్ర రూపంలో ఈ పిటకంలో సంకలన పరిచారు. బుద్ధుని ముఖ్య శిష్యులైన సారిపుత్ర, మొగ్గల్యాయన, ఆనందుల సందేశాలను కూడా కొన్నింటిని ఇందులో చేర్చారు. బుద్ధుని మహాపరినిర్వాణం తర్వాత మూడు నెలలకు రాజగృహంలో బుద్ధుని ముఖ్య శిష్యులైన మహాకాశ్యపుడు, ఆనందుడు, ఉపాలి వంటి వారితో ఒక సభ ఏర్పాటయింది. ఆ సభలోనే మొట్టమొదటిసారిగా బుద్ధుని ఉపదేశాలను సంగ్రహ పరిచారు. సుత్తపిటకంలోని బుద్ధుని అన్ని సందేశాలు ఆనందుడు విని చెప్పినట్లుగా ఉంటాయి. అన్ని సందేశాలు 'ఏవం మే సుతం' –'నేను ఈ విధంగా వినటం జరిగింది' – అని మొదలవుతాయి. ప్రవచనాలన్నీ సందర్భానికి తగినట్లుగా, వినే జనుల స్థాయిని దృష్టిలో పెట్టుకుని చెప్పినట్లుగా ఉంటాయి. బుద్ధుడు తన ప్రవచనాలను కేవలం భిక్షువులనే కాకుండా, సామాన్య ప్రజానీకాన్నీ, రాజులను, వివిధ మత శాఖల వారినీ ఉద్దేశించి చేశాడు. పువ్వుల్ని ఒక దారం ఎలా మాలగా కలిపి ఉంచుతుందో, బుద్ధ వచనాల్ని సుత్తపిటకం అలా సంకలన రూపంలో కలిపి ఉంచింది.



సుత్తపిటకాన్ని అధ్యయనం చేయటం వల్ల బుద్ధుడు ప్రవచించిన ధార్మిక బోధలు, ఆయన కాలం నాటి తాత్వికులు, వారి తాత్విక సిద్ధాంతాలు తెలుస్తాయి. జ్ఞాన సముపార్జనకు బుద్ధుడు ఏవిధంగా శ్రమించిందీ, ఎవరెవరిని కలిసిందీ, చివరి రోజులు ఏవిధంగా గడిపిందీ తెలుస్తుంది. ధ్యానానికి సంబంధించి బుద్ధుడు ప్రవచించిన 'ఆనా పాన సతి' సుత్తం, 'మహాసతి పఠాన' సుత్తం ఇందులోనే ఉన్నాయి. ఇవేకాక 'ధర్మచక్ర ప్రవర్తన' సుత్తం, 'మహాపరినిర్వాణ' సుత్తం కూడా సుత్తపిటకంలోనే ఉన్నాయి.

సుత్తపిటకంలో బుద్ధుడు ప్రతిపాదించిన ధర్మాన్ని గురించి సంక్షిప్తంగా చెప్పమంటే ఇలా చెప్పవచ్చు. ప్రపంచంలో, జీవితంలో దుఃఖం ఉంది. ఆ దుఃఖానికి కారణం ఉంది. దుఃఖం నుండి విముక్తి పొందే వీలు ఉంది. దుఃఖం నిరోధానికి మార్గం ఉంది. ఇవే నాలుగు ఆర్య సత్యాలు. విముక్తి మార్గాన్ని అంష్టాంగ మార్గం అంటారు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: బ.ద్వాదశి ఉ.9.10 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: భరణి ప.3.11 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.3.17 నుండి 4.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.51 నుండి 10.43 వరకు తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, అమృతఘడియలు: ఉ.10.23 నుండి 11.54 వరకు, రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.29, సూర్యాస్తమయం: 6.31.

క్లుప్తంగా...

ఏపీఎడ్‌సెట్‌కి 82.17 శాతం హాజరు

ఏయూక్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ 2023 ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 నగరాల్లోని 77 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. పరీక్షకు 13,672 మంది దరఖాస్తు చేయగా 11,235 మంది హాజరయ్యారు. పరీక్షకు 82.17 శాతం హాజరు నమోదైంది. పరీక్ష పాస్‌వర్డ్‌ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ విడుదల చేశారు. ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్రప్రసాద్, ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- అనకాపల్లి–తాడి స్టేషన్ల మధ్య బుధవారం తెల్లవారుజామున ఘటన
- పలు రైళ్ల రద్దు, మరిన్ని ఆలస్యంగా రాకపోకలు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): దక్షిణ మధ్య రైల్వే పరిధి అనకాపల్లి– తాడి స్టేషన్ల మధ్య బుధవారం తెల్లవారుజామున గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాల్సిన పలు రైళ్లు రద్దు చేశారు. మరికొన్ని ఆలస్యంగా బయల్దేరాయి. విశాఖపట్నంలో బయల్దేరాల్సిన విశాఖపట్నం –లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, లింగంపల్లిలో గురువారం బయల్దే రాల్సిన లింగంపల్లి– విశాఖపట్నం (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. విశాఖపట్నం–విజయవాడ–విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా, విశాఖపట్నం–గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు–విశాఖపట్నం (17239) ఎక్స్‌ప్రెస్ కూడా రద్దు అయ్యింది.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు

విశాఖలో ఉదయం బయల్దేరాల్సిన విశాఖపట్నం–సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటలు ఆలస్యంగా బయల్దేరింది. సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు బయ ల్దేరాల్సిన సికింద్రాబాద్- విశాఖపట్నం-(20834) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి ఏడు గంటలకు బయ ల్దేరింది. విశాఖలో రాత్రి 9.05 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–కోర్బా (18518) ఎక్స్ ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 11 గంటలకు విశాఖపట్నం నుంచి బయల్దేరింది. చెన్నై సెంట్రల్‌లో బుధవారం రాత్రి 7.20 గంటలకు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్–హౌరా (12840) మెయిల్ సుమారు 6 గంటలు ఆలస్యంగా గురువారం తెల్లవారుజామున 1.30 గంటలకు బయల్దేరింది. చెన్నై సెంట్రల్‌లో బుధవారం రాత్రి 7.50 గంటలకు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్–షాలిమార్ (22826) ఎక్స్‌ప్రెస్ సుమారు 4 గంటలు ఆలస్యంగా మధ్యరాత్రి 12 గంటలకు బయ ల్దేరింది. విశాఖపట్నంలో గురువారం తెల్లవారు 5.45 గంటలకు బయల్దే రాల్సిన విశాఖపట్నం–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా ఉదయం 9.30 గంటలకు బయల్దేరనుంది.

సూర్యనారాయణపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు

- భారీ మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి సూర్యనారాయణ గండికొట్టారు
- రూ. లక్షలకు నోటీసులు జారీ చేసి.. వేలల్లోనే పన్ను వసూలు చేశారు
- సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా పీసీ యాక్ట్ కింద కేసు పెట్టాం
- సూర్యనారాయణ, ఇతర నిందితులు రెండేళ్లలో 900 సార్లు మాట్లాడుకున్నారు
- ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేయండి
- విజయవాడ కోర్టుకు నివేదించిన అదనపు పీపీ దుష్యంత్‌రెడ్డి
- తీర్పు వాయిదా వేసిన 12వ ఏడీజే కోర్టు



సాక్షి, అమరావతి : వాణిజ్య పన్నుల శాఖ ఆదాయానికి భారీగా గండికొట్టి ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో నష్టం కలిగించారన్న ఆరోపణలపై క్రిమినల్ కేసు ఎదుర్కొంటున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) కింద కూడా కేసు నమోదైంది. ఈ విషయాన్ని హైకోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి బుధవారం విజయవాడ 12వ అదనపు జిల్లా జడ్జి (ఏడీజే) కోర్టుకు తెలిపారు. సూర్యనారాయణ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై బుధవారం ఏడీజే కోర్టు ఇరుపక్షాల వాదనలు విన్నది. అనంతరం తీర్పును వాయిదా వేసింది. పోలీసుల తరఫున దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సూర్యనారాయణపై పీసీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినందున, అతని ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారించే పరిధి ఈ కోర్టు (ఏడీజే)కు లేదని, స్పెషల్ కోర్టుకు మాత్రమే ఉందని వివరించారు. వాదనలు విన్న తరువాత ఈ పిటిషన్‌ను విచారించే పరిధి ఈ కోర్టుకుందో లేదో కూడా తేలుస్తానని న్యాయాధికారి చెప్పారు. అవినీతి కేసుల్లో నిందితులపై పీసీ యాక్ట్ కింద కేసు నమోదు చేయకపోవడాన్ని తప్పుపడుతూ ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చిందని, దాని ఆధారంగా సూర్యనారాయణపై పీసీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని దుష్యంత్‌రెడ్డి వివరించారు. ఇందుకు పూర్తి ఆధారాలు పోలీసులు సేకరించారని తెలిపారు. పన్ను వసూలులో సూర్యనారాయణ వ్యాపారులతో కుమ్మక్కయ్యారని, రూ.7 లక్షలు చెల్లించాలని నోటీసులిచ్చి, రూ.90 వేలు మాత్రమే వసూలు చేసి వారిని వదిలేశారన్నారు. కొందరు వ్యక్తులకు డబ్బు ఇస్తే నోటీసులో పేర్కొన్న మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదంటూ ఆయన వ్యాపారులకు చెప్పారని, ఈ విషయాన్ని వ్యాపారులు అంగీకరించారని వివరించారు. ఇప్పటికే అరెస్టయిన నలుగురితో సంబంధం లేదని సూర్యనారాయణ చెబుతున్నారని, వాస్తవానికి వారితో సూర్యనారాయణ ఈ రెండేళ్లలో 900 సార్లు మాట్లాడారని తెలిపారు. ఆ కాల్‌డేటాను ఆయన కోర్టుకు సమర్పించారు. ఖజానా ఆదాయానికి గండికొట్టడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. పిటిషనర్‌ది తీవ్రమైన నేరమని, ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని, అతని పిటిషన్‌ను కొట్టేయాలని అభ్యర్థించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఆయనకు చట్ట ప్రకారం ఎలాంటి రక్షణ లేదని, ఆ పదవిని అడ్డంపెట్టుకుని చట్టం నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. శాఖాపరమైన విచారణ ఉద్యోగుల వ్యక్తిగత పాత్రకే పరిమితం అవుతుందన్నారు. అంతకు ముందు సూర్యనారాయణ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, మిగిలిన నిందితులకు, సూర్యనారాయణకు సంబంధం లేదన్నారు. వారు వాణిజ్య పన్నుల శాఖ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తుండగా, సూర్యనారాయణ మరో విభాగంలో పనిచేస్తున్నారని తెలిపారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కేసు నమోదు చేశారని తెలిపారు.

పీసీ యాక్ట్ కింద కేసు పెట్టాల్సిందే : సుప్రీం కోర్టు

బాలాజీ వర్సెస్ కార్తీక్ దేశారి కేసులో సుప్రీంకోర్టు గత నెలలో కీలక తీర్పు వెలువరించింది. తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీపై నమోదు చేసిన చార్జిషీట్‌లలో పీసీ యాక్ట్ కింద కేసు నమోదు చేయకపోవడంపై విస్మయం వ్యక్తం చేసింది. అవినీతి కేసుల్లో పీసీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాల్సిందేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

జనసేనకు సింబలైనా ఉందా!

- చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ పని చేస్తున్నారు
- ప్రజలను, నమ్ముకున్న వారిని మోసం చేస్తున్నారు
- అమిత్ షా, నడ్డా వ్యాఖ్యలు చూస్తే ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే చదివినట్టు ఉంది
- వైఎస్ జగన్ పరిపాలన దేశానికే రోల్ మోడల్ అని కేంద్రమంత్రులే చెబుతున్నారు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: జనసేన పార్టీకి సంస్థాగతమైన నిర్మాణమే కాదు.. పార్టీ సింబల్ కూడా లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. విజయవాడలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పవన్ వారాహితో ప్రచారం సినిమా షూటింగ్‌లా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యమని పవన్ అంటున్నారని, చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ పనిచేస్తున్నారని చిన్నపిల్లలకైనా అర్థమవుతోందని పేర్కొన్నారు. సినిమాల్లో షూటింగ్ తరహాలోనే పవన్ మాట్లాడుతున్నారని, కచ్చితమైన ఆలోచనతో ఆయన మాట్లాడటం లేదని సజ్జల విమర్శించారు.పవన్ మాట్లాడే మాటల్ని చూస్తే పగటి కలలు, సినిమా డైలాగుల్లా ఉన్నాయన్నారు. జనసేనకు గుర్తు కూడా లేదని, గాజు గ్లాసు గుర్తును ఎవరూ తీసుకోకపోతే ఇస్తారేమోనని ఆయన వ్యాఖ్యానించారు. చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యమని పవన్ అంటున్నారని, తద్వారా రాష్ట్ర ప్రజలను, తనను నమ్ముకున్న వారిని మోసం చేస్తున్నారని అన్నారు.

ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌లా ఉంది

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై సజ్జల రామకృష్ణారెడ్డి స్పందిస్తూ.. ఎవరో స్క్రిప్టు రాసిస్తే దానిని వారు చదివినట్టుగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి పనిలో పారదర్శకత, సోషల్ ఆడిట్ ఉందని తెలిపారు. ఏపీలో సాగుతున్న పరిపాలన దేశానికే రోల్‌మోడల్‌గా ఉందని కేంద్రం నుంచి వచ్చిన మంత్రులే అంటున్నారని సజ్జల గుర్తు చేశారు. రాష్ట్రంలో అవినీతి జరిగిందంటున్న ఆ నాయకులు అది ఎలా జరిగిందో చెప్పాలన్నారు. నిజానికి సీఎం జగన్ పరిపాలనలో నిధులన్నీ డీబీటీ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులకు అందుతున్నాయని వివరించారు. దేశంలో ఏపీ భాగం కాదన్నట్టుగా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, రాష్ట్రం నుంచి పన్నులు కేంద్రానికి వెళ్లి అక్కడి నుంచి తిరిగి ఇక్కడకు వస్తాయని, కానీ కేంద్రం ఇస్తున్న నిధులు వారి జేబుల్లోంచి ఇస్తున్నట్టు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పెత్తందారులు, కొన్ని అగ్రకులాల పక్షమని.. వైఎస్ జగన్ పేదలు, బడుగు బలహీన వర్గాల పక్షమనే విషయాన్ని అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీని వ్యతిరేకించడం ద్వారా చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. 50 వేల మందికిపైగా ఇళ్ల పట్టాలు ఇస్తుంటే చంద్రబాబు, అతని అనుకూల మీడియా తీవ్రంగా వ్యతిరేకించాయని, పేదలు వచ్చి అమరావతిని కలుషితం చేస్తారని, అది వారికి మాత్రమే సొంతమని గట్టిగా, అంత అహంకారంగా అనగలిగారని సజ్జల గుర్తు చేశారు. తద్వారా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల మనిషి, అట్టడుగు వర్గాల ప్రతినిధి అనే నిజాన్ని ఒప్పుకుని ముద్రవేసి, సర్టిఫికెట్ ఇచ్చారన్నారు.

'బంగారు కొండ'లకు పోషకాహారం!

- వినూత్న ఆలోచనకు నాంది పలికిన 'తూర్పు' కలెక్టర్ మాధవీలత
- తగినంత బరువు లేని చిన్నారులకు ఆరు నెలల పాటు పోషణ
- ఇందుకోసం చిన్నారుల దత్తత
- కలెక్టరేట్‌లో బంగారు కొండ వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణ



పోషకాహార కిట్లు అందిస్తున్న హోం మంత్రి వనిత, ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి, తలారి, కలెక్టర్ మాధవీలత

సాక్షి, రాజమహేంద్రవరం : చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించి, సంపూర్ణ పోషణ అందించేందుకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా 'బంగారుకొండ' పేరుతో నూతన విధానానికి బుధవారం నాంది పలికారు. వయసుకు తగ్గ బరువు, ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లల్ని బాల మిత్రల ద్వారా గుర్తించి సాధారణ స్థితికి తెచ్చే వరకూ 6 నెలల పాటు నెలకు రూ.300 విలువ చేసే 8 రకాల పోషక పదార్థాలను దాతల సాయంతో అందివ్వాలన్నదే కార్యక్రమ ఉద్దేశం. కలెక్టరేట్ వేదికగా వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ యాప్‌ను హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావ్, కలెక్టర్ కె.మాధవీలతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పిల్లల్లో పౌష్టికాహార సమస్యను దూరం చేయాలని సీఎం జగన్.. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ లాంటి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి కనీసం ఇద్దరు ముగ్గురు పిల్లలను దత్తత తీసుకుని వారి ఎదుగుదల, పౌష్టికాహార సమస్యను అధిగమించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం దాతలు నెలకు రూ.500 చొప్పున ఆరు నెలలకు రూ.3,000 వేలు చెల్లించి బాలమిత్రగా నమోదు కావాలని సూచించారు.

పలువురు చిన్నారుల బాధ్యత తీసుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పౌష్టికాహార సమస్యతో బాధపడుతున్న పిల్లల్ని ఆరు నెలల పాటు పోషణ నిమిత్తం దత్తత తీసుకునేందుకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహం చూపారు. హోం మంత్రి వనిత ఓ చిన్నారిని, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఇద్దరిని, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావ్‌లు ఇద్దరు చొప్పున, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, కమిషనర్ దినేష్‌కుమార్‌లు చెరో చిన్నారిని దత్తత తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 85,700 మంది పిల్లలుంటే.. వారిలో తక్కువ బరువు ఉన్న పిల్లలు 368 మంది, వయస్సుకు తగ్గ ఎత్తు లేని వారు 506 మంది, బరువుకు తగ్గ ఎత్తు లేని వారు 409 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఆ మేరకు 1,283 మంది పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు 1,283 మంది బాల మిత్రలుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పేర్లు నమోదు చేసుకున్నారు.

ఆరుద్ర కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకున్నాం

- కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ : కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెంకు చెందిన రాజులపూడి ఆరుద్ర కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిందని కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన కుమార్తె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నందున చికిత్స కోసం ఆస్తిని అమ్ముకునేందుకు సహకరించాలని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ఆరుద్ర స్పందన కార్యక్రమం ద్వారా వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశారని పేర్కొన్నారు. ఆమె విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ పరంగా సహాయం అందించినట్లు వెల్లడించారు. గతేడాది నవంబర్‌లోనే ఆరుద్రకు సీఎం మారిటైంబోర్డులో నెలకు రూ.22 వేల వేతనంతో కాంట్రాక్టు కింద డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా నియామక పత్రం అందించామని తెలిపారు. ఆరుద్ర విజ్ఞప్తి మేరకు జిల్లా రెవెన్యూశాఖ సహాయంతో అన్నవరంలోని 109.25 చదరపు గజాల విస్తీర్ణంలోని ఆమె ఇంటిని గతేడాది నవంబర్ 22న రూ. 31 లక్షలకు విక్రయించి, ఆ మొత్తాన్ని ఆమె ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. ఆరుద్ర ఫిర్యాదుపై విచారణ అనంతరం ఎస్పీ సమర్పించిన నివేదిక మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. హైకోర్టులో పోలీసులు వెకేషన్ పిటిషన్ దాఖలు చేశారని, ఇద్దరు కానిస్టేబుళ్లపైనా శాఖాపరమైన చర్యలకు జిల్లా ఎస్పీ ప్రతిపాదించారని పేర్కొన్నారు. అన్నవరం ఎస్ఐని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మానసికంగా బాధపడుతున్న ఆరుద్రకు, అస్వస్థతతో ఉన్న ఆమె కుమార్తెకు చికిత్స అందించి మానవతా దృక్పథంతో ఆదుకుంటున్నామని పేర్కొన్నారు.

ఏదిఏమైనా.. అసెంబ్లీలో అడుగు పెట్టాల్సిందే

- అందుకోసం ఎన్ని వ్యూహాలైనా పన్నుతాం
- ఇస్తే ముఖ్యమంత్రి పదవినైనా తీసుకుంటాం
- కత్తిపూడి సభలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'ఏదిఏమైనా ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టాల్సిందే. అందుకోసం ఎన్ని వ్యూహాలైనా పన్నుతాం' అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. బుధవారం కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యనారాయణస్వామిని దర్శించుకున్న ఆయన వారాహి వాహనంపై యాత్ర ప్రారంభించారు. అనంతరం శంఖవరం మండలం కత్తిపూడికి ర్యాలీగా కత్తిపూడి చేరుకున్నారు. కత్తిపూడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టడమే తమ లక్ష్యమని, ఇందుకు ఎన్ని వ్యూహాలైనా పన్నుతామని.. ఎవరు ఆపుతారో చూస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు అందిస్తున్న సంక్షేమం పథకాలను తీసెయ్యమని ఎవరూ చెప్పడం లేదన్నారు. సంక్షేమాన్ని కొనసాగించాల్సిందేనని.. అదే సందర్భంలో సంపద కూడా సృష్టించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి, ఈ ముఖ్యమంత్రికి ఉందన్నారు.

ఇస్తే సీఎం పదవినైనా తీసుకుంటాం

వచ్చే ఎన్నికల్లో ఇతర పార్టీలతో కలిసి వెళ్దామా.. విడివిడిగా పోటీ చేస్తామా అనేది ఇంకా నిర్ణయించుకోలేదని పవన్ స్పష్టం చేశారు. అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామంటూనే.. ఇస్తే ముఖ్యమంత్రి పదవినైనా తీసుకుంటామని చెప్పడం గమనార్హం. గత ఎన్నికల్లో కాపులకు బీసీ రిజర్వేషన్లు ఇచ్చేది లేదని కరాఖండిగా.. ధైర్యంగా జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం తనకు చాలా సంతోషం అనిపించిందన్నారు. కానీ.. 60 శాతం మంది కాపులు ఆ పార్టీకి ఓట్లు వేయబట్టే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. అలాగని ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక కాపులకు ఏం చేసిందని ప్రశ్నించారు. 200 మంది అమరావతి రైతులు ప్రాణాలు కోల్పోయినా ఈ ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. అప్పుడూ.. ఇప్పుడూ.. ఎప్పుడూ అమరావతి రాజధాని అనేది జనసేన పాలసీ అన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధమని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే మద్యంపై రూ.25 వేల కోట్ల ఆదాయం పొందుతున్నారన్నారు. ఇసుకను మూడు కంపెనీలకు కట్టబెట్టి ఇసుకపై ఆధారపడ్డ వేలమంది భవన నిర్మాణ కార్మికులు, బలహీన వర్గాలకు అన్యాయం చేశారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్ నుంచి అన్ని పదవుల్ని ఒకే సామాజిక వర్గానికి కట్టబెట్టి మిగిలిన వర్గాలను విస్మరించారన్నారు. ఆయన వెంట జనసేన పీఏసీ సభ్యుడు నాదెండ్ల మనోహర్, నాయకులు ఉన్నారు.

పవన్ సభలో అపశృతి

కాగా, కత్తిపూడిలో జరిగిన పవన్ కల్యాణ్ సభలో అపశృతి చోటుచేసుకుంది. వేదికవద్ద ఏర్పాటు చేసిన లైటింగ్ స్టాండ్‌కు ఉన్న విద్యుత్ తీగలు తగిలి గొల్లప్రోలు మండలం చిత్రాడకు చెందిన చైతన్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

క్లుప్తంగా...

నో నైటీ, నో లుంగీ



నోయిడా: గ్రేటర్ నోయిడాలో ఒక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) ప్రవేశపెట్టిన రూల్స్ అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేస్తున్నాయి. మహిళలు నైటీలు , మగవారు లుంగీలు కట్టుకుంటే చూడలేకపోతున్నామని అసోసియేషన్ ప్రతినిధులు మొత్తుకుంటున్నారు. కామన్ ఏరియాలు, పార్కింగ్‌ల దగ్గరకి నైటీలు, లుంగీలో రావొద్దంటూ కొత్త నిబంధనలు విధించారు. ఈ మేరకు హిమ్‌సాగర్ అనే అపార్ట్‌మెంట్ అసోసియేషన్ జారీ చేసిన సర్క్యులర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నైటీలు, లుంగీలు అనేవి ఇంటిపట్టున ఉన్నప్పుడు ధరించేవి తప్ప బయటకు వచ్చినప్పుడు కాదని ఆ సర్క్యులర్ పేర్కొంది సొసైటీలో తిరగాలనుకున్నప్పుడు వస్త్రధారణ సరిగా ఉంటేనే ఎవరైనా గౌరవిస్తారని పేర్కొంది. దీనిపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆ అసోసియేషన్ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఉంటే, మరి కొందరు నచ్చిన బట్టలు ధరించే స్వేచ్ఛ లేదా అని ప్రశ్నిస్తున్నారు.

మరణించాడనుకుంటే, మోమోలు తింటూ కనిపించాడు

భాగల్పూర్: బిహార్‌లో భాగల్పూర్‌కు చెందిన నిశాంత్ కుమార్ అనే వ్యక్తి గత ఆరు నెలలుగా కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులందరూ ఆయన మరణించాడనే భావించారు. అయితే హఠాత్తుగా ఒక రోజు నోయిడాలో మోమోలు తింటూ ఆయన బావమరిదికే దొరకడం విశేషం. భాగల్పూర్‌లోని నౌగాచికి చెందిన నిశాంత్ కుమార్ ఒక పెళ్లి కోసం తన అత్త మామల ఇంటికి ఈ ఏడాది జనవరిలో వెళ్లాడు. ఆ తర్వాత కనిపించకుండా వెళ్లిపోయాడు. దీంతో సుశాంత్ తండ్రి తన కుమారుడిని అతని అత్తింటి సభ్యులే హత్య చేశాడని ఆరోపించారు. రెండు కుటుంబాల మధ్య రచ్చ వీధికెక్కింది. సుశాంత్ బావమరిది ఒక రోజు నోయిడా వెళితే అక్కడ మోమోలు అమ్మే దుకాణం దగ్గర ఒక బిచ్చగాడు కనిపించాడు. అతను ఆకలేస్తోందని మోమోలు అడిగితే దుకాణం దారుడు అతనిని పొమ్మని కసురుకుంటున్నాడు. దీంతో జాలిపడ్డ రవిశంకరే డబ్బులు ఇచ్చి అతనికి మోమోలు ఇమ్మని చెప్పాడు. ఆ తర్వాత అతని పేరేంటని అడగ్గా నిశాంత్ కుమార్ అని తమది బిహార్ అని చెప్పడంతో నిర్ఘాంత పోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిశాంత్ నోయిడాకి ఎలా చేరాడో, ఎందుకు రోడ్లు పట్టుకొని తిరుగుతున్నాడో పోలీసులు విచారణలో తేలాల్సి ఉంది.

సంపన్నుల వలసబాట

భద్రమైన జీవితాన్ని వెతుక్కుంటూ ఎంతోమంది భారతీయ సంపన్నులు విదేశాలకు పయనమవుతున్నారు. అక్కడే స్థిరపడుతున్నారు. మెరుగైన శాంతిభద్రతలు, కాలుష్యానికి తావులేని చక్కటి వాతావరణం, సంపదపై తక్కువ పన్నులు వారిని ఆకర్శిస్తున్నాయి. ఈ ఏడాది భారత్ నుంచి 6,500 మంది అత్యంత సంపన్నులు విదేశాలకు వెళ్లిపోయే అవకాశం ఉందని ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు, సంపన్నుల కదలికల తీరును విశ్లేషించే హెన్లీ ప్రైవేట్ వెల్త్ మైగ్రేషన్ రిపోర్ట్–2023 తాజాగా వెల్లడించింది. 2022లో భారత్ నుంచి 7,500 మంది ధనవంతులు విదేశాలకు వెళ్లి స్థిరపడినట్లు అంచనా.



ఈ ఏడాది 6,500 మందివిదేశాలకు వెళ్లిపోయే అవకాశం

గత ఏడాది 7,500 మంది పయనం

ఆస్ట్రేలియా, యూఏఈ, సింగపూర్, అమెరికా, స్విట్జర్లాండ్ వైపు మొగ్గు

- మిలియన్ డాలర్లు(రూ.8.2 కోట్లు), అంతకంటే ఎక్కువ పెట్టుబడి పెట్టగల సంపద ఉన్నవారిని అల్ట్రా రిచ్(హెచ్ఎన్‌డబ్ల్యూఐ)గా పరిగణిస్తారు.
- శాశ్వతంగా స్థిరపడడానికి సంపన్నులను విశేషంగా ఆకర్షిస్తున్న దేశాల్లో ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), సింగపూర్, అమెరికా, స్విట్జర్లాండ్ మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- ఇక 2023లో చైనా, ఇండియా, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), రష్యా, బ్రెజిల్ నుంచి ఎక్కువ మంది ధనవంతులు విదేశాలకు వెళ్తారని అంచనా వేస్తున్నట్లు న్యూ వరల్డ్ వెల్త్ పరిశోధక సంస్థ చీఫ్ ఆండ్రూ ఆమోయిల్స్ చెప్పారు.
- భారత్ నుంచి మిలియనీర్లు వెళ్లిపోతున్నా పెద్దగా నష్టం లేదని, దేశంలో అంతకంటే ఎక్కువ మంది మిలియనీర్లు తయారవుతారని ఆమోయిల్స్ తెలిపారు.
- ఈ ఏడాది చైనా నుంచి 13,500 మంది ధనికులు వలస వెళ్తారని అంచనా.
- 2022 ఆఖరు నాటికి టాప్–10 ధనిక దేశాల జాబితాలో భారత్ 10వ స్థానంలో నిలిచింది. అమెరికా, జపాన్, చైనా, జర్మనీ, యూకే, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్ దేశాలు మొదటి 9 స్థానాల్లో ఉన్నాయి.
- భారత్‌లో మొత్తం జనాభా 142 కోట్లు కాగా, వీరిలో 3,44,600 మంది అల్ట్రా రిచ్(మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆస్తి), 1,078 మంది సెంటి–మిలియనీర్లు(100 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆస్తి), 123 మంది బిలియనీర్లు(బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆస్తి) ఉన్నారు.
- చైనా జనాభా 141 కోట్లు కాగా, వీరిలో 7,80,000 మంది అల్ట్రా రిచ్, 285 మంది బిలియనీర్లు ఉన్నారు. అమెరికా జనాభా 34 కోట్లు కాగా, వీరిలో 52,70,000 మంది అల్ట్రా రిచ్, 770 మంది బిలియనీర్లు ఉన్నారు.

2023లో ఏ దేశానికి ఎంతమంది వస్తారు?

దేశం	వలస వచ్చే సంపన్నులు
ఆస్ట్రేలియా	5,200
యూఏఈ	4,500
సింగపూర్	3,200
అమెరికా	2,100
స్విట్జర్లాండ్	1,800
కెనడా	1,600

వలసలు ఆ దేశాలకే ఎందుకు?

- విదేశాలకు వలస వెళ్లడానికి సంపన్నులు ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. రాజకీయ స్థిరత్వం, తక్కువ పన్నుల విధానం, వ్యక్తిగత స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.
- ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు అనువైన దేశం కోసం అన్వేషిస్తున్నారు.
- పిల్లలకు నాణ్యమైన చదువులు, వైద్య సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలు అందాలని కోరుకుంటున్నారు.
- తమ సంపదకు, ఆస్తులకు రక్షణ కల్పించే దేశాన్ని ఎంచుకుంటున్నారు.
- చట్టబద్ధ పాలన ఉండడంతోపాటు ఆర్థిక స్వేచ్ఛకు హామీ ఇచ్చే దేశాలకు వలస వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- ప్రైవేట్ సంపద వెళ్లిపోవడం దేశాలకు నష్టదాయకమేనని నిపుణులు చెబుతున్నారు.
- భారత్‌లో పన్ను నిబంధనలు కఠినంగా ఉండడంతో ధనవంతులు తమ డబ్బును విదేశాల్లో పెట్టుబడి పెట్టేందుకు మొగ్గు చూపుతున్నారని అంటున్నారు.

ఈ ఏడాది ఏ దేశం నుంచి ఎంతమంది?

దేశం	వలస వెళ్లే ధనవంతులు
చైనా	13,500
భారత్	6,500
యూకే	3,200
రష్యా	3,000
బ్రెజిల్	1,200
హాంకాంగ్	1,000

– సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు

- ఈ ఏడాదే జరిగినా ఆశ్చర్యం లేదు
- బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్



పాట్నా: లోక్‌సభకు ముందస్తుగానే ఎన్నికలు జరుగుతాయని, ఈ ఏడాదే జరిగినా ఆశ్చర్యం లేదని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024 జనవరి కంటే ముందే ఈ పనులు పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులను ఆదేశించానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో ఎవరికీ తెలియదని, కచ్చితంగా వచ్చే ఏడాదే జరగాలన్న నియమం ఏమీ లేదని, ముందుగానే జరిగే అవకాశాలున్నాయని, ఈ ఏడాదే జరగొచ్చని, అలా జరగడం సాధ్యమేనని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత మంచిదని అధికారులకు నితీశ్ సూచించారు. పనులన్నీ సాధ్యమైనంత త్వరగా పూర్తయితే తాను సంతోషిస్తానని పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మించారని, ఇప్పుడు దాన్ని 60 శాతానికి తగ్గించారని ఆక్షేపించారు. 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపుతున్నారని చెప్పారు. 'ప్రధానమంత్రి సడక్ యోజన' అని పేరుపెట్టిన పథకానికి కేంద్రం 60 శాతం నిధులే ఇస్తోందన్నారు. ఈ నెల 23న పాట్నాలో జరగబోయే ప్రతిపక్షాల కీలక సమావేశంలో ముందస్తు ఎన్నికలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముందస్తు ఎన్నికలు వస్తాయన్న నితీశ్ కుమార్ వ్యాఖ్యలను బిహార్ బీజేపీ అధికార ప్రతినిధి నిఖిల్ ఆనంద్ కొట్టిపారేశారు. నితీశ్ ప్రధానమంత్రి కావాలని కలలు కంటున్నారని, ఊహాగానాల్లో జీవిస్తున్నారని ఎద్దేవా చేశారు.

గ్రీస్‌లో వలసదారుల పడవ మునక

79 మంది జలసమాధి



రక్షించిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఏథెన్స్: బతుకుదెరువు కోసం వలసపోతున్న డజన్లకొద్దీ శరణార్థుల ప్రాణాలు సముద్రంలో కలిసిపోయాయి. దక్షిణగ్రీస్ సముద్రజలాల్లో వలసదారులతో వెళ్తున్న పడవ బోల్తాపడటంతో కనీసం 79 మంది జలసమాధి అయ్యారు. డజన్లకొద్దీ జనం జాడ గల్లంతయ్యింది. పెలోపోన్నీస్ ప్రాంతం నుంచి తీరానికి 75 కిలోమీటర్లదూరంలో సముద్రంలో మంగళవారం రాత్రివేళ జరిగిన ఈ దుర్ఘటనలో ఇప్పటికే 104 మంది కాపాడామని అధికారులు తెలిపారు. విషయం తెల్సుకున్న అధికారులు పెద్ద ఎత్తున గాలింపు కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. కాపాడిన వారిలో ఆరోగ్యం విషమంగా ఉన్న వారిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. 78 మంది మరణించారని అధికారులు చెబుతున్నా ఇంకా ఎంతమంది మరణించి ఉంటారనేది తెలియట్లేదు. ఆరు తీర గస్తీ నౌకలు, ఒక నావికాదళ యుద్ధనౌక, ఒక సైనిక రవాణా విమానం, వాయుసేన హెలికాప్టర్, ఇంకా కొన్ని ప్రైవేట్ పడవలు, డ్రోన్ల సాయంతో గాలింపు చర్యలను భారీ ఎత్తున కొనసాగిస్తున్నారు. తూర్పు లిబియా దేశంలోని తోబ్రక్ ప్రాంతం నుంచి ఈ శరణార్థుల పడవ బయల్దేరి ఇటలీకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. తమ దేశానికి ఇలా ఒక వలసదారుల పడవ వస్తోందని ముందే గ్రీక్ అధికారులకు ఇటలీ అధికారులు సమాచారం ఇచ్చారు. వలసదారులను కలామటా నౌకాశ్రయానికి తరలించి అక్కడ ఐక్యరాజ్యసమితి శరణార్థి ఏజెన్సీ ఏర్పాటుచేసిన శిబిరాల్లో ప్రథమ చికిత్స అందించారు.

లిబియా అదుపులో వేలాది మంది శరణార్థులు

అక్రమంగా ఇలా ప్రయాణం సాగిస్తున్న వారిపై గతంలోనే లిబియా సర్కార్ తన అప్రమత్తతను కనబరిచింది. ఈజిప్ట్, పాకిస్తాన్, సిరియా, సూడాన్ తదితర దేశాలకు వేలాది మంది శరణార్థులు సముద్ర జలాల్లో అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకుంది. ఈజిప్ట్‌కు చెందిన వారిని వెంటనే భూమార్గంలో తిరిగి వారి దేశానికి పంపేసింది. లిబియా దక్షిణ ప్రాంతంలో చూస్తే రాజధాని ట్రిపోలీసహా పలు ప్రాంతాల్లోని శరణార్థి హబ్‌లలో సోదాలు చేసి దాదాపు 1,800 మందిని అదుపులోకి తీసుకుందని ఐక్యరాజ్యసమితి శరణార్థి ఏజెన్సీ తెలిపింది. మధ్యధరా సముద్ర జలాల్లో స్థానిక తీర గస్తీ పెట్రోలియం దళాల కంటపడకుండా ఉండేందుకు చాలా మంది స్మగ్లర్లు పెద్ద సైజు పడవలను సమకూర్చుకుని అంతర్జాతీయ జలాల వెంట అక్రమంగా శరణార్థులను తరలిస్తున్నారు. ఆదివారం ఇదే మధ్యధరా సముద్ర జలాల్లో తమను కాపాడండంటూ అమెరికా తయారీ పడవలో వెళ్తున్న 90 మంది శరణార్థులు అత్యవసర సందేశం ఇచ్చారు.

తమిళ మంత్రి అరెస్టు

పీఎంఎల్‌ఏ చట్టం కింద బాలాజీని అదుపులోకి తీసుకున్న ఈడీ

'క్యాష్ ఫర్ జాబ్స్' కేసులో దర్యాప్తు

సాక్షి, చెన్నై: 'క్యాష్ ఫర్ జాబ్స్' కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తమిళనాడు విద్యుత్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ(47)ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు బుధవారం అరెస్టు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద ఆయనను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ మంత్రివర్గంలో ఈ చట్టం కింద అరెస్టయిన తొలి మంత్రి సెంథిల్ కావడం విశేషం. సుదీర్ఘంగా ప్రశ్నించిన అనంతరం అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అనంతరం హైడ్రామా చోటుచేసుకుంది. తనకు అనారోగ్యంగా ఉందని చెప్పడంతో సెంథిల్‌ను సిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో చేర్పించారు. ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో సెంథిల్ బాలాజీ బిగ్గరగా రోదిస్తున్న దృశ్యాలు టీవీల్లో ప్రసారమయ్యాయి. గుండెకు సంబంధించిన కరోనరీ యాంజియోగ్రామ్ పరీక్ష వైద్యులు నిర్వహించారు. గుండె నాళంలో మూడు చోట్ల బ్లాక్‌లు ఉన్నట్టు గుర్తించారు. అత్యవసరంగా బైపాస్ సర్జరీకి సిఫారసు చేశారు.

బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్న కేంద్రం: స్టాలిన్

మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సెంథిల్ బాలాజీ నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. చెన్నై, కరూర్, ఈరోడ్‌లో ఈ సోదాలు జరిగాయి. తదుపరి విచారణ కోసం ఆయనను అరెస్టు చేసినట్లు సమాచారం. అరెస్టుపై తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన కేబినెట్ సహచరుడిని పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.



సెంథిల్ బాలాజీని పరామర్శిస్తున్న సీఎం స్టాలిన్

ఈ నెల 28 దాకా జ్యుడీషియల్ కస్టడీ

బాలాజీని ఈ నెల 28 దాకా జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ సెషన్స్ కోర్టు జడ్జి ఆదేశాలు జారీ చేసింది. తన భర్తను ఎందుకు అరెస్టు చేశారో, ఏ కేసులో అరెస్టు చేశారో చెప్పాలని ఈడీని ప్రశ్నిస్తూ సెంథిల్ బాలాజీ సతీమణి మేఘల హైకోర్టులో అత్యవసర పిటిషన్ వేశారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఇంఫాల్: జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో శాంతి స్థాపన కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. మంగళవారం అర్ధరాత్రి ఖమెన్‌లోక్ ప్రాంతంలో మరోసారి హింస రాజుకుంది. ఈ ఘటనలో తొమ్మిది మంది మరణించగా మరో 10 మందికి గాయాలయ్యాయి. ఖమెన్‌లోక్ ప్రాంతంలోకి కుకి గ్రామాన్ని చుట్టుముట్టిన సాయుధులైన దుండగులు, గ్రామస్తుల మధ్య కాల్పులతో ఆ ప్రాంతమంతా రక్తమోడింది. ఒక మహిళ సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో పది మందికి గాయాలైతే ముగ్గురి జాడ తెలియడం లేదు. నెల రోజుల క్రితం ఎస్టీ హోదా కోరుతూ మెయిటీ తెగకు చెందిన వారు ర్యాలీ తీయడంతో జాతుల మధ్య మొదలైన హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని 16 జిల్లాలకు గాను ఇంకా 11 జిల్లాల్లో ఇంకా కర్ఫ్యూ కొనసాగుతోంది.

ఇంగ్లండ్‌లో కత్తితో దుండగుడు వీరంగం

భారతీయ సంతతికి విద్యార్థినహా ముగ్గురు దుర్మరణం

లండన్: సెంట్రల్ ఇంగ్లండ్‌లోని నాటింగ్‌హామ్ వీధుల్లో దారుణం చోటు చేసుకుంది. ఒక దుండగుడు మంగళవారం తెల్లవారుజామున కత్తి చేత పట్టుకొని కనిపించిన వారందరినీ పొడుస్తూ బీభత్సం సృష్టించాడు. ఈ ఘటనలో భారతీయ సంతతికి చెందిన టీనేజర్ సహా ముగ్గురు మరణించారు. గ్రేస్ ఒ మలే కుమార్ (19) అనే భారతీయ విద్యార్థికి క్రికెట్, హాకీ క్రీడలంటే ప్రాణం. కుమార్‌తో పాటు క్రికెట్ ఆడే అతని స్నేహితుడు బార్నబి వెబ్బర్ కత్తి పోట్లకు గురై ప్రాణాలు విడిచాడు. మరో 60 ఏళ్ల వ్యక్తిపై దాడి చేయడంతో అతనూ మృతి చెందాడు. ఆ వ్యక్తి దగ్గర నుంచి వ్యాన్‌ను దొంగలించిన దుండగుడు మరో ముగ్గురుపై నుంచి వాహనాన్ని తోలుకుంటూ వెళ్లాడు. దుండగుడిని పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. హౌస్ ఆఫ్ కామన్స్ సమావేశంలో బుధవారం ప్రధాని సునాక్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

ఢిల్లీలో తీవ్ర ఉక్కబోత!



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతోంది. చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీ సెల్సియస్ కుపైగా నమోదవుతుండటంతో జనం ఉక్కపోతతో ఉడికిపోతున్నారు. పొరుగున ఉన్న పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో తీవ్రమైన వడగాలుల కారణంగా ఢిల్లీలో వేడి భయంకరంగా ఎక్కువైంది. బుధవారం ఢిల్లీలో 42 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదుకాగా, అవి ఈ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ విభాగం చెబుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రత కారణంగా ఢిల్లీలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. జూన్ ఒకటో తేదీన 4,390 మెగా వాట్లుగా నమోదైన విద్యుత్ డిమాండ్ బుధవారానికి 7,190 మెగావాట్లకు ఎగసింది.

ఒడెసాపై ఆగని రష్యా క్రూయిజ్ దాడులు

కీవ్: రణనినాదంతో రంకెలేస్తూ ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దూకిన రష్యా సైన్యం ఒడెసా నగరంపై క్రూయిజ్ క్షిపణి దాడులతో దండెత్తింది. డజన్ల కొద్దీ భవనాలను ధ్వంసం చేసింది. వీటిలో పలు క్షిపణులను ఉక్రెయిన్ దళాలు విజయవంతంగా అడ్డుకుని నేలకూల్చాయి. కానీ రష్యా దాడిలో ఒడెసాలో గిడ్డంగి కూలడంతో అందులో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కొన్ని ఇళ్లు, దుకాణాలు, కేఫ్‌లు ధ్వంసమయ్యాయి. 13 మందికి గాయాలయ్యాయి. కుప్పకూలిన గిడ్డంగి శిథిలాల కింద ఎవరైనా బతికిఉంటారనే ఆశతో అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్రమటోర్క్స్, కోస్టియాన్‌టినీవ్కా సిటీలపైనా రష్యా దాడులు చేసింది. క్రమటోర్క్స్‌లో ఇద్దరు పౌరులు చనిపోగా 29 ఇళ్లు కూలిపోయాయని అధ్యక్ష కార్యాలయం తెలిపింది. కోస్టియాన్‌టినీవ్కాలో ఒకరు చనిపోయారు. 57 ఇళ్లు నేలమట్టమయ్యాయి. దాదాపు 16 నెలలుగా కొనసాగుతున్న యుద్ధంలో రష్యా మళ్లీ వైమానిక దాడులను పెంచిందని ఉక్రెయిన్ సైన్యం అధికార ప్రతినిధి బుధవారం చెప్పారు.

'ఉమ్మడి'పై న్యాయ కమిషన్ సంప్రదింపులు

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)పై 22వ న్యాయ కమిషన్ బుధవారం భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభించింది. ప్రజలతోపాటు గుర్తింపు పొందిన మత సంస్థల అభిప్రాయాలను సేకరిస్తోంది. 21వ న్యాయ కమిషన్ గతంలో సంప్రదింపులు జరిపింది. ఈ కమిషన్ కాలపరిమితి 2018 ఆగస్టులో ముగిసింది. ఉమ్మడి పౌర స్మృతి అనేది అత్యంత సున్నితమైన అంశం కావడంతో తాజాగా మరోసారి అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్న నిర్ణయానికి 22వ న్యాయ కమిషన్ వచ్చింది.

భయానకంగా బిపర్‌జోయ్

- తుపాను ప్రభావంతో 74 వేల మందిని తరలింపు
- గుజరాత్‌లో సౌరాష్ట్ర–కచ్ ప్రాంతంలో భారీ వర్షాలు
- గురువారం జఖౌ పోర్ట్ సమీపంలో తీరం దాటనున్న తుపాను



గునావూ గ్రామంలో బీఎస్ఎఫ్ సిబ్బంది సాయం

మండ్వీ/అహ్మదాబాద్: బిపర్‌జోయ్ తుపాను అత్యంత తీవ్ర స్థాయిలో విరుచుకుపడనుంది. తీరం దాటక ముందే తుపాను ధాటికి గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర–కచ్ ప్రాంతాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఇప్పటికే తీరప్రాంతలు, తుపాను ప్రభావిత జిల్లాల్లో 74వేల మందికిపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కచ్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్‌లో కుంబవృష్టి ఖాయమని భారత వాతావరణ శాఖ తెలిపింది. దేవభూమి ద్వారక, జామ్‌నగర్, జునాగఢ్, పోరుబందర్, రాజ్‌కోట్ జిల్లాల్లో బుధవారం ఉదయంకల్లా 24 గంటల్లో 50 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం పడింది. ఒకటి రెండు చోట్ల ఏకంగా 121 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అరేబియా సముద్రంలో తుపాను కేంద్రబిందువు కాస్తంత దిశ మార్చుకుని ఈశాన్య వైపుగా కదులుతూ కచ్, సౌరాష్ట్రల మధ్య జఖౌ పోర్ట్ సమీపంలో గురువారం సాయంత్రం తీరం దాటి బీభత్సం సృష్టించనుందని వెల్లడించింది. పోరుబందర్, రాజ్‌కోట్, మోర్బీ, జునాగఢ్‌సహా ఇతర సౌరాష్ట్ర, ఉత్తర గుజరాత్ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆ శాఖ అహ్మదాబాద్ డైరెక్టర్ మనోరమ మొహంతీ అంచనావేశారు. తీరం దాటేటపుడు గంటకు 150 కి.మీ.ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. తుపాను విలయం ఊహించని రీతిలో ఉంటే దానికి తగ్గ సహాయక కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని త్రివిధ దళాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆదేశించారు.

వందల కొద్దీ సహాయక బృందాలు

'ప్రస్తుతం తుపాను కేంద్రబిందువు కచ్ తీరానికి 290 కి.మీ.ల దూరంలో ఉంది. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు 18, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు 12, రోడ్డు, భవనాల శాఖకు చెందిన 115 బృందాలు, విద్యుత్ శాఖకు చెందిన దాదాపు 400 బృందాలను రంగంలోకి దింపాం ' అని స్టేట్ రిలీఫ్ కమిషనర్ అలోక్ కుమార్ పాండే చెప్పారు. మరోవైపు సిబ్బంది సన్నద్ధతపై గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సమీక్షా సమావేశం నిర్వహించి తాజా పరిస్థితిని తెల్సుకున్నారు. తీరానికి దూరంగా ఉన్న పాఠశాలలు, కార్యాలయాలను సహాయక శిబిరాలుగా మార్చారు. ఆహారం, తాగునీరు, వైద్యసదుపాయాలు కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిలో తగినంత మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు పంపారు. భుజ్ చేరుకొని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సైతం తుపాను వేళ వైద్యసేవలపై సమీక్ష జరిపారు. అరేబియా సముద్రంలో ఆరో తేదీన చిన్నదిగా మొదలైన తుపాను నెమ్మదిగా ఉత్తర దిశగా కదులుతూ శక్తిని పెంచుకుంటూ 11వ తేదీనాటికి భీకరంగా మారింది. ప్రచండ శక్తితో గుజరాత్, పాకిస్తాన్ తీరాల వైపు దూసుకొస్తోంది. జఖౌ పోర్టు సమీపంలో తీరాన్ని దాటి జనావాసాలపై తన పెనుప్రతాపం చూపనుంది.

సాక్షులతో మాట్లాడొద్దు

- ట్రంప్‌కు కోర్టు షరతులు
- తనకే పాపం తెలీదని కోర్టుకు ట్రంప్ విన్నపం



మయామీలో ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో ప్రభుత్వ రహస్య పత్రాలను తన నివాసంలో దాచిన కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మంగళవారం ఉదయం మయామీ కోర్టులో దాదాపుగా 45 నిముషాల సేపు విచారణ కొనసాగింది. ఈ కేసులో తన తప్పేమీ లేదని ట్రంప్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. న్యాయ విచారణ ప్రారంభం కావడానికి 15 నిముషాల ముందే కోర్టుకు హాజరయ్యారు. ట్రంప్‌కు తోడుగా ఆయన వెంట కుమారుడు ఎరిక్ ట్రంప్ కూడా న్యాయస్థానానికి వచ్చారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం శ్రమిస్తున్న ట్రంప్‌కు ఈ కేసు పెద్ద ఎదురు దెబ్బగా మారింది. కోర్టులో కేసు విచారణ సాగినంత సేపు ట్రంప్ మౌనంగా తలవంచుకొని చూస్తూ కూర్చున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు రాసింది. దేశ భద్రతకు సంబంధించిన రహస్య పత్రాలను ట్రంప్ తనతో పాటు ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌కు తీసుకువెళ్లి ఉంచారని, దేశానికి చెందిన అణు రహస్యాలు ప్రైవేటు వ్యక్తులతో పంచుకున్నారంటూ ఆయనపై అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. గూఢచర్యం చట్టం కింద 31 నిబంధనల్ని అతిక్రమించారంటూ ట్రంప్‌పై 37 అభియోగాలు నమోదయ్యాయి. దేశానికి చెందిన ఒక మాజీ అధ్యక్షుడు క్రిమినల్ కేసులో ఈ స్థాయిలో అభియోగాలు ఎదుర్కోవడం ఇదే తొలిసారి. కోర్టులో విచారణ సమయంలో ట్రంప్ అమాయకుడని, ఆయనకే పాపం తెలీదని ఆయన తరఫు లాయర్ టాడ్ బ్లాంచ్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు కేసుని విచారించిన న్యాయమూర్తి జోనథాన్ గూడ్‌మ్యాన్ ట్రంప్ ఈ కేసుకు సంబంధించిన సాక్షులు, ఇతరులెవరితోనూ నేరుగా మాట్లాడవద్దని షరతు విధించారు.

అధ్యక్ష పదవిలో అవినీతి పరుడు: ట్రంప్

కోర్టులో విచారణ ముగిసిన అనంతరం ట్రంప్ నిధుల సమీకరణ కోసం న్యూజెర్సీలోని గోల్ఫ్ కోర్టుకు మంగళవారం రాత్రి వెళ్లారు. ఆయనకు అక్కడ ఘనంగా స్వాగతం లభించింది. జూన్ 14 బుధవారం ట్రంప్ పుట్టిన రోజు కావడంతో ఆయనకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. హ్యాపీ బర్త్ డే అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ట్రంప్ తన అభిమానులతో మాట్లాడుతూ తనపై మోపిన ఈ కేసు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ఆరోపించారు. అధ్యక్ష పీఠంపై ఒక అవినీతి పరుడు కూర్చొని , తన రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని తీవ్రమైన ఆరోపణలు చేశారు.

మా-ఏపీ లోగో ఆవిష్కరణ

తెనాలి: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ (మా-ఏపీ) లోగోను సంస్థ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్ రాజా ఆవిష్కరించారు. ఇకపై సినీపరిశ్రమలోని 24 శాఖలను పటిష్టం చేసేందుకు కార్యక్రమాలను చేపడతామని ప్రకటించారు. మా-ఏపీ ఆవిర్భవించి ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం సాయంత్రం గుంటూరు జిల్లా తెనాలి రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో వార్షికోత్సవం జరుపుకున్నారు. అధ్యక్షత వహించిన దిలీప్‌రాజా మాట్లాడుతూ మా-ఏపీలో నటీనటులతోపాటు 24 విభాగాలకు చెందిన సాంకేతిక నిపుణులు సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు.

నియోజకవర్గ ప్రతిభావంతులకు నేడు సత్కారం

పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 678 మంది

ఇంటర్‌లో మొదటి స్థానాల్లో నిలిచిన 662 మంది

'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారాల ప్రదానం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుని 2022-23లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట ప్రభుత్వం సత్కరించనుంది. నియోజకవర్గస్థాయిలో విద్యార్థులను గురువారం సత్కరించేందుకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోను ఏర్పాట్లు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఈ వేడుక జరుగుతుంది. జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, ఏపీ మోడల్, బీసీ రెసిడెన్షియల్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, కేజీబీవీ మేనేజ్‌మెంట్లలో విద్యాసంస్థలున్నాయి. ఒక్కో మేనేజ్‌మెంట్ పరిధిలోని సంస్థల్లో పదోతరగతిలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులను సన్మానిస్తారు. ఇలా నియోజకవర్గస్థాయిలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థులు 678 మంది ఉన్నారు. ఇంటర్మీడియట్‌లో కూడా వివిధ మేనేజ్‌మెంట్ జూనియర్ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల వారీగా అత్యధిక మార్కులు సాధించి మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థులు 662 మంది ఉన్నారు. విద్యారంగంలో పలు సంస్కరణలను అమలు చేస్తున్న ప్రభుత్వం.. విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ వేడుక నిర్వహిస్తోంది. విద్యార్థులకు నగదు పురస్కారం, మెడల్, మెరిట్ సర్టిఫికెట్, పాఠశాలకు మెమెంటో ఇవ్వడంతోపాటు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించనున్నారు. నియోజకవర్గస్థాయిలో పదో తరగతి విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తారు. ఇంటర్మీడియట్‌లో గ్రూప్ టాపర్‌కు రూ.15 వేలు చొప్పున ఇస్తారు.



20న రాష్ట్రస్థాయిలో..

రాష్ట్రస్థాయిలో జగనన్న ఆణిముత్యాలను ఈనెల 20న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్కరించనున్నారు. రాష్ట్రస్థాయిలో పదో తరగతిలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన 42 మందిని, ఇంటర్‌లో మొదటి స్థానంలో నిలిచిన 28 మందిని ఆయన సన్మానించనున్నారు. పదో తరగతిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.లక్ష, రెండోస్థానంలోని వారికి రూ.75 వేలు, మూడోస్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు, ఇంటర్ టాపర్స్‌కు రూ.లక్ష చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నారు.

17న జిల్లాస్థాయిలో..

జిల్లాస్థాయిలో టాపర్స్‌గా నిలిచిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను ఈ నెల 17న ఆయా జిల్లా కేంద్రాల్లో సన్మానించనున్నారు. జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, ఏపీ మోడల్, బీసీ రెసిడెన్షియల్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, కేజీబీవీ మేనేజ్‌మెంట్లలోని సంస్థల్లో ఒక్కో మేనేజ్‌మెంట్‌లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థులను సన్మానిస్తారు. ఇంటర్మీడియట్‌లో కూడా వివిధ మేనేజ్‌మెంట్ జూనియర్ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల వారీగా అత్యధిక మార్కులు సాధించి జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులను సత్కరిస్తారు. జిల్లాస్థాయిలో పదో తరగతి విద్యార్థులు 606 మందిని, ఇంటర్ టాపర్స్ 392 మందిని సత్కరించనున్నారు. పదో తరగతిలో జిల్లా టాపర్‌కు రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.15 వేలు నగదు బహుమతి అందిస్తారు. ఇంటర్‌లో ఒక్కొక్కరికి రూ.50 వేలు నగదు బహుమతి ఇస్తారు.

●ఎన్నికలు సమీపిస్తుండడంతో బహుజనుల ఓట్ల కోసం బాబు అండ్ కో యాత్రల పేరుతో చేస్తున్న డ్రామాలను ప్రజలు నమ్మరని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 990వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు.

హైదరాబాద్ రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద జీసీసీ అవుట్‌లెట్

ప్రారంభించిన జీసీసీ చైర్‌పర్సన్ స్వాతి రాణి

సాక్షి, అమరావతి: అరకు కాఫీ అంతర్జాతీయ ఖ్యాతిని గడించిందని ఏపీ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్‌పర్సన్ స్వాతి రాణి పేర్కొన్నారు. హైదరాబాద్ రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అరకు వ్యాలీ కాఫీ షాప్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరకు వ్యాలీ కాఫీని ప్రమోట్ చేసేందుకు మెట్రో సిటీలలో అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేయాలని సంకల్పించామని, ఇందులో భాగంగా హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో సాఫ్ట్‌వేర్ హబ్‌గా ఉన్న రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసామని తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్, సినీ దర్శకుడు శ్రీనివాసరెడ్డి, కమెడియన్ రాంప్రసాద్, బుల్లితెర నటులు సెల్వరాజ్, జెమినీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అరకు వ్యాలీ కాఫీ షాప్‌ను ప్రారంభిస్తున్న స్వాతిరాణి

చిన్న శిక్షతో సరిపెడతారా?

- సమాజానికి ఏం సందేశం పంపిస్తున్నారు?
- చిన్న శిక్షను ఎలా సమర్థించుకుంటారో చెప్పండి
- ఇస్మాయిల్ కేసులో పోలీస్ ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి : ఓ వ్యక్తి నిర్బంధం విషయంలో వాస్తవాలను తేల్చేందుకు నియమితులైన అడ్వొకేట్ కమిషనర్‌ను, అతనికి సాయంగా వెళ్లిన కోర్టు సిబ్బంది, ఇతరులపై చేయి చేసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అనంతపురం జిల్లా, హిందూపురం వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్‌పై నామమాత్రపు చర్యలు తీసుకున్నారంటూ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పోలీసులు సమాజానికి సంరక్షకులని, అలాంటి పోలీసు తప్పు చేసినప్పుడు చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని స్పష్టం చేసింది. రెండు ఇంక్రిమెంట్లలో కోత విధించడం చాలా చిన్న శిక్ష అని, ఇలాంటి శిక్ష విధించడం ద్వారా సమాజానికి ఏం సందేశం పంపిస్తున్నారని ప్రశ్నించింది. కింది కోర్టు ఉత్తర్వులను అపహాస్యం చేసిన పోలీసు అధికారికి చిన్న శిక్ష విధించడాన్ని ఎలా సమర్థించుకుంటారో తెలియచేయాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంటూ తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఇదిలా ఉంటే ఇదే వ్యవహారంలో హైకోర్టు సుమోటోగా నమోదు చేసిన కోర్టు ధిక్కార కేసులో కౌంటర్ దాఖలు చేయాలని సీఐని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అడ్వొకేట్ కమిషనర్, కోర్టు సిబ్బందిని ఇస్మాయిల్ కొట్టారంటూ అనంతపురం జిల్లా జడ్జి ఇచ్చిన నివేదికను హైకోర్టు సుమోటో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)గా మలిచిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. గత విచారణ సమయంలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల మేరకు సీఐ ఇస్మాయిల్ స్వయంగా కోర్టు ముందు హాజరయ్యారు. తదుపరి విచారణకు సైతం హాజరు కావాలని ఇస్మాయిల్‌ను ధర్మాసనం ఆదేశించింది.

కెనడాలో వైభవంగా మలయప్ప స్వామి కల్యాణం

సాక్షి, అమరావతి:తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కెనడాలోని టొరంటో, మాంట్రియల్, ఒట్టావా నగరాల్లో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. టీటీడీ కెనడాతో పాటు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని 14 నగరాల్లో శ్రీనివాస కల్యాణం జరుపుతోంది. ఇందులో భాగంగా టీటీడీ నుంచి వెళ్లిన అర్చకులు, వేద పండితులు వైఖానస ఆగమం ప్రకారం కల్యాణ క్రతువును జరిపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎన్ఆర్‌టీఎస్ టీటీడీతో పాటు ప్రవాస భారతీయులను సమన్వయం చేసింది. తెలుగువారే కాకుండా ఇతర భారతీయ రాష్ట్రాలకు చెందిన 10 వేల మందికిపైగా ఎన్ఆర్ఐ భక్తులు కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తిరుమల నుంచి తీసుకెళ్లిన లడ్డూ ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రుల వ్యవహారాల ఏపీ ప్రభుత్వ సలహాదారు, ఏపీ ఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ ఎస్.మేడపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 17 నుంచి జూలై 23 వరకు యూఎస్ఏలో 11 నగరాల్లో శ్రీవారి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవంలో కెనడాలోని ఇండియా హై కమిషన్.. హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ, స్థానిక ఎంపీలు చంద్ర ఆర్యా, అనా రాబర్ట్స్ పాల్గొన్నారు. తెలుగు అలయన్స్ ఆఫ్ కెనడా ఆధ్వర్యంలో చారి సమంతపూడి, కరుణాకర్‌రెడ్డి పాపల, శ్రీనాథ్ కుందూరి, కల్పన మోటూరి, వైశంపాయన్ దతార్, అరుణ్, ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కోఆర్డినేటర్లు జగన్‌మోహన్, వేణుగోపాల్ కల్యాణ ఏర్పాట్లు చేశారు. ఎస్వీబీసీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి స్వామివారి కల్యాణాన్ని వెబ్‌లైవ్ కవరేజీ అందించారు.



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

తెలంగాణ

డీసీహెచ్‌ఎల్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి అరెస్టు.. బెయిల్

- ప్రమోటర్, ఆడిటర్‌లను కూడా అరెస్టు చేసిన ఈడీ
- రిమాండ్‌కు నిరాకరించిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (డీసీహెచ్ఎల్) చైర్మన్ టి.వెంకట్రామిరెడ్డి, ప్రమోటర్, డైరెక్టర్ పీకే అయ్యర్, ఆడిటర్ మణి ఊమెన్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం అరెస్టు చేసింది. బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని కారణంగా మనీల్యాండరింగ్ చట్టం-2022 కింద వారిని అరెస్టు చేసినట్లు ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ అభియోగాలతో డీసీహెచ్ఎల్ ప్రమోటర్, డైరెక్టర్లపై బెంగళూరు సీబీఐ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పోలీసులు వివిధ ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసిన నేపథ్యంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో అరెస్టు చేసిన వెంకట్రామిరెడ్డి, పీకే అయ్యర్‌లకు ఈడీ అధికారులు బుధవారం గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అయితే వారి రిమాండ్‌కు న్యాయమూర్తి నిరాకరించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న కేసులో ఉన్న పళంగా అరెస్టు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. 41ఏ నోటీసులు కూడా ఇవ్వకుండా అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. రిమాండ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ, లక్ష రూపాయల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు.

ఎంఈవో-2 పోస్టుల భర్తీపై డీపీఆర్టీయూ హర్షం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మండల విద్యాశాఖాధికారి-2 పోస్టుల భర్తీపై డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో పనిచేసే అర్హత కలిగిన ఒక ఉపాధ్యాయుడుకి ఎటువంటి న్యాయపరమైన వివాదాలు లేకుండా మండల విద్యాశాఖ అధికారిగా గెజిటెడ్ క్యాడర్ ప్రమోషన్ ఇప్పించాలన్న ఉపాధ్యాయ సంఘాల 30 ఏళ్ల పోరాటం కలగానే మిగిలిపోయిన నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి కృషి ఫలితంగా 679 గెజిటెడ్ క్యాడర్ ఎంఈవో పోస్టులను భర్తీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో సత్తా చాటిన భాష్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్–2023 ఫలితాల్లో భాష్యం విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో టాప్–10లో నిలిచారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళీ నగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో బుధవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో రామకృష్ణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో సిహెచ్.ఉమేష్ వరుణ్ రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా ఏ.వెంకట శివరామ్ 6వ ర్యాంకు, వై.మణీందర్‌రెడ్డి 7వ ర్యాంకు, టి.సింధురత్నం 14వ ర్యాంకు, కె.లక్ష్మీసూర్య 33వ ర్యాంకుతో పాటు 100లోపు 13 ర్యాంకులు సాధించి భాష్యం ది బెస్ట్ అని నిరూపించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

నారాయణ మెడికల్ అకాడమీ ప్రభంజనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో నారాయణ మెడికల్ అకాడమీ ప్రభంజనం సృష్టించినట్లు సంస్థ అకడమిక్ ఇన్‌చార్జి తార్నాక చంద్రశేఖర్, డీజీఎం శ్రీనివాసులురెడ్డి, కోర్ డీన్ వీరగంధం శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం గుంటూరు చంద్రమౌళీనగర్లోని కళాశాలలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో వారు మాట్లాడారు. అగ్రికల్చర్, ఫార్మసీలో జి.అలేఖ్యదేవి 28వ ర్యాంకు, వై.వెంకట సాయిశ్రీ 95వ ర్యాంకులతో పాటు కె.జ్యోతి 137వ ర్యాంకు సాధించారని తెలిపారు.

'తిరుమల'విజయకేతనం

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ ఈఏపీ సెట్(ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ) ఫలితాల్లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో బి.ఎస్.ఆర్.జశ్వంత్ ప్రథమ ర్యాంకు, వై.గణేష్‌తేజ 29వ ర్యాంకు, కె.జి.ఎం.శంకర్‌అజయ్ 33వ ర్యాంకు, ఎం.అమృత 36వ ర్యాంకు, కె.సుహాంత్ 38వ ర్యాంకు, వి.కె.ఎస్.రామకృష్ణ 51వ ర్యాంకు కైవసం చేసుకున్నారన్నారు. 1,000 లోపు 67 మంది, 2,000 లోపు 107 మంది, 5,000 లోపు 204 మంది, 10,000 లోపు 334 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో జి.ఎస్.దత్త 36వ ర్యాంకు, కె.వివేక్ వర్ధన్ 57వ ర్యాంకు సాధించారని వివరించారు.

'ఆదిత్య' ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో కాకినాడ ఆదిత్య విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి బుధవారం తెలిపారు. వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ఎ.లిఖిత 41వ ర్యాంకు, టి.ఎస్.సాయితేజస్విని 49వ ర్యాంకు సాధించారని చెప్పారు. వీరితో పాటు 126, 159, 166, 181 ర్యాంకులు వచ్చాయన్నారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో ఆర్.అశోక్ చంద్ర 101వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. 100 లోపు ఇద్దరు, 500 లోపు 21 మంది, వెయ్యి లోపు 51 మంది ర్యాంకులు సాధించారన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్‌లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీలో టాప్–10 ర్యాంకులను సాధించామని తెలిపారు. గుంటూరు జోన్‌లో అగ్రికల్చర్‌లో మద్ది నాగశ్రీ ఆదిత్య 55వ ర్యాంకు, దుగ్గిరాల వీపీఆర్ సాయి మోహిత్ 64వ ర్యాంకు, నూతక్కి సాత్విక 86వ ర్యాంకు, కొంగర అభినవ్ 94వ ర్యాంకు, వేములపల్లి షణ్ముఖ శివసాయి ప్రియ 129వ ర్యాంకు, దొడ్డా సౌదామిని 136వ ర్యాంకు, కుప్పిరెడ్డి ధృతిశ్రీ 162వ ర్యాంకు, పి.యశ్వంత్ 164వ ర్యాంకు, ఎస్.సాయి జాహ్నవి 170వ ర్యాంకుతో పాటు 500 లోపు 47 ర్యాంకులు, వెయ్యి లోపు 93 ర్యాంకులు, రెండు వేలలోపు 191 ర్యాంకులు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్ కిషోర్, చంద్రశేఖర్ అభినందించారు.

కార్డియాలజిస్టనవుతా..

మాది తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కాతేరు. మా నాన్న సాయిరామకృష్ణ రైతు, అమ్మ రజిని గృహిణి. నాకు ఇంటర్ బైపీసీలో 985 మార్కులు వచ్చాయి. తెలంగాణ ఎంసెట్‌లో అగ్రి అండ్ ఫార్మసీ విభాగంలో ఫస్ట్ ర్యాంకు సాధించాను. నీట్‌లో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 65వ ర్యాంకు వచ్చింది. మంచి కాలేజీలో ఎంబీబీఎస్ చదివి కార్డియాలజీలో స్పెషలైజేషన్ చేస్తా.

– సత్యరాజ్ జశ్వంత్, ఫస్ట్ ర్యాంకర్, అగ్రి అండ్ ఫార్మసీ విభాగం

అమ్మానాన్న ప్రోత్సాహంతోనే అగ్రస్థానం

మాది ఎన్టీఆర్ జిల్లా నందిగామ. నాన్న చల్లా విశ్వేశ్వరరావు బిజినెస్ రంగంలో ఉన్నారు. నాకు ఇంటర్‌లో 983 మార్కులు వచ్చాయి. తెలంగాణ ఎంసెట్‌లో మూడో ర్యాంకు వచ్చింది. జేఈఈ మెయిన్ ఓపెన్ కేటగిరీలో 263వ ర్యాంక్ సాధించాను. క్లాసులో ఫస్ట్ రావాలని కష్టపడి చదివాను. అమ్మానాన్న ప్రోత్సాహంతోనే ఫస్ట్ ర్యాంకు సాధించగలిగాను.

– చల్లా ఉమేష్ వరుణ్, స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఇంజనీరింగ్ విభాగం

రైతుకు 'మద్దతు'లో పోలిక ఏది?

ధరలు పడిపోతే స్థిరీకరించడానికి రూ.3,000 కోట్లతో నిధి

సీఎం యాప్ ద్వారా గ్రామ స్థాయిలో పంట ఉత్పత్తుల ధరల పర్యవేక్షణ

ధరలు తగ్గిన ప్రతిసారీ మార్కెట్‌లో జోక్యంతో పంట ఉత్పత్తుల కొనుగోలు

కానీ మద్దతు ధరలను పెంచటం లేదంటూ 'ఈనాడు' తప్పుడు రాతలు

వాస్తవాలకు ముసుగేసి ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్న రామోజీ

సాక్షి, అమరావతి

అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోంది. ఇందుకు గ్రామాల్లోనే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, క్షేత్రం వద్దే ధాన్యం కొనుగోళ్లు ఇలా అన్ని విధాలా భరోసా కల్పిస్తోంది. దళారులు, వ్యాపారుల జోక్యం లేకుండా రైతుల పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు లభించేలా చేస్తోంది. ధరలు తగ్గిన ప్రతిసారీ రైతులు నష్టపోకుండా మార్కెట్‌లో జోక్యం చేసుకుంటూ మంచి ధరకే రైతులు తమ ఉత్పత్తులు విక్రయించుకునేలా చర్యలు చేపడుతోంది. స్వయంగా ప్రభుత్వమే కొనుగోలుకు ముందుకు వస్తుండటంతో వ్యాపారులు సైతం పోటీకి వస్తున్నారు. దీంతో రైతుల ఉత్పత్తులకు మంచి ధర లభిస్తోంది. ధరలు పడిపోతే స్థిరీకరించడానికి రూ.3 వేల కోట్లతో నిధిని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తన ఐదేళ్ల పాలనలో చంద్రబాబు ఇవేమీ చేయలేదు. అయినా అప్పుడు కళ్లు లేని కబోదిలా వ్యవహరించిన ఈనాడు రామోజీరావు ఇప్పుడు రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తున్నప్పటికీ తనదైన శైలిలో విషం చిమ్మటమే పనిగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే 'రైతులకు ఇదేనా మద్దతు' అంటూ ఒక విష కథనాన్ని వండివార్చారు. దీనిపై నిజానిజాలివే..

బాసటగా నిలవాలనే..

రైతులు తమ పంట ఉత్పత్తులను దారుణ పరిస్థితుల్లో తక్కువకు అమ్ముకోరాదన్న ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని పంటలకు గిట్టుబాటు ధరలను ప్రకటించింది. సహజంగా పంటలకయ్యే పెట్టుబడి–రాబడి ఆధారంగా వ్యవసాయ ఖర్చులు–ధరల కమిషన్ సిఫార్సు మేరకు కేంద్రం మద్దతు ధరలు ప్రకటిస్తుంది. అయితే కనీస మద్దతు ధరలను ప్రకటించని పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో ధరలు పతనమైనప్పుడు గతంలో ఆదుకున్న దాఖలాలుండేవి కావు. అలాంటి పంటలు వేసే రైతులకూ గిట్టుబాటు ధర దక్కాలన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే రాష్ట్రంలో ఎక్కువగా సాగయ్యే ఆరు ప్రధాన పంటలకు గతంలో ఎన్నడూ లేని విధంగా గిట్టుబాటు ధరలు ప్రకటించింది. అంతకన్నా ఎక్కువ ధర పలికితే రైతులు దర్జాగా మార్కెట్లోనే విక్రయించుకుంటారు.. ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కానీ అనుకోని విపత్కర పరిస్థితులు తలెత్తి మార్కెట్లో ధరలు పడిపోతే వారిని ఆదుకోవడానికి ఈ ధరలు బెంచ్‌మార్క్‌గా ఉపయోగపడతాయనేది ప్రభుత్వ ఆలోచన. కాబట్టి బయట ఎవరూ ప్రభుత్వం నిర్దేశించిన ధరకంటే తక్కువకు రైతు నుంచి కొనే సాహసం చేయరు. అయితే ఇలాంటి మంచి ఉద్దేశంతో పెట్టిన ధరపైన కూడా వక్రభాష్యం చెప్పడం 'ఈనాడు'కే చెల్లింది.

ఆరోపణ: కొన్ని పంటలకే మద్దతు ధరలు

వాస్తవం: కేంద్రం మద్దతు ధరలు ప్రకటించని మిరప, పసుపు, ఉల్లి, చిరుధాన్యాలు, అరటి, బత్తాయి పంటలకు దేశంలోనే తొలిసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించింది. కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించారని విమర్శిస్తున్న రామోజీ.. చంద్రబాబు తన హయాంలో ఒక్క పంటకు కూడా మద్దతు ధర ప్రకటించకపోయినా ఎందుకు ప్రశ్నించలేదు? దీనిపై తన పత్రిక ఈనాడులో ఏనాడూ చిన్న వార్త రాసిన పాపాన పోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చీ రాగానే రాష్ట్రంలో విస్తారంగా సాగయ్యే మిరప, పసుపు, అరటి, బత్తాయి, ఉల్లితో పాటు చిరు ధాన్యాలకు సైతం గిట్టుబాటు ధరలను ప్రకటించడమే కాదు.. మార్కెట్‌లో ధర దక్కని ప్రతిసారీ అండగా నిలుస్తోంది.

ఆరోపణ: మొక్కుబడి కొనుగోలు

వాస్తవం: ధరల స్థిరీకరణ కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసింది. నిర్దేశిత పంటలకు ఒకవేళ ధర పడిపోతే.. మార్కెట్‌లో జోక్యం చేసుకుని ఈ నిధి సాయంతో వాటిని కనీస గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుంది. సీఎం యాప్ ద్వారా రోజూ గ్రామ స్థాయిలో మార్కెట్ ధరలను పర్యవేక్షిస్తూ.. ధరలు పడిపోయిన వెంటనే రంగంలోకి దిగుతోంది. ఇలా పొగాకుతో సహా ప్రధాన వ్యవసాయ, వాణిజ్య పంటల ధరలు పతనమైన ప్రతీసారి మార్కెట్‌లో జోక్యం చేసుకుని మద్దతు ధర దక్కేలా చేస్తోంది. ప్రస్తుత సీజన్‌లో మార్కెట్‌లో మద్దతు ధర దక్కని శనగలు, మొక్కజొన్న, పసుపును మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొంటోంది. 28,112 మంది రైతుల నుంచి రూ.336.83 కోట్ల విలువైన 63,135 టన్నుల శనగలు, 9,027 మంది రైతుల నుంచి రూ.148.88 కోట్ల విలువైన 72,315.85 టన్నుల మొక్కజొన్న, 312 మంది రైతుల నుంచి 413 టన్నుల పసుపు కొనుగోలు చేసింది. ఇలా ఇప్పటి వరకు రూ.7,712 కోట్ల విలువైన 21.55 లక్షల టన్నుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.139.90 కోట్ల విలువైన పొగాకుతో పాటు రూ.1,789 కోట్ల విలువైన పత్తిని సైతం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. మరోవైపు టీడీపీ ఐదేళ్ల పాలనలో కొనుగోలు చేసింది.. అన్నీ కలిపి కేవలం రూ.3,322 కోట్ల విలువైన 9 లక్షల టన్నుల ఉత్పత్తులు మాత్రమే. అంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత టీడీపీ ప్రభుత్వం కంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉత్పత్తులు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని అర్థమవుతోంది. కనీసం ధాన్యం రైతులకైనా చంద్రబాబు మేలు చేశాడా అంటే.. అదీ లేదు. ఐదేళ్లలో ధాన్యం కొనుగోలు కోసం చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించిన మొత్తం రూ.40,236.91 కోట్లయితే... ఈ నాలుగేళ్లలోనే జగన్ ప్రభుత్వం వెచ్చించిన మొత్తం ఏకంగా రూ.58,626.88 కోట్లు. దీన్ని మొక్కుబడి కొనుగోలు, నామమాత్రపు కొనుగోలు అంటారా.. రామోజీ?

ఆరోపణ: చిరుధాన్యాలపై చిత్తశుద్ధి ఏదీ?

వాస్తవం: చిరుధాన్యాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతులకు పెద్ద ఎత్తున రాయితీలను అందిస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా క్వింటాకు రూ.2,500 చొప్పున ప్రకటించింది. వాస్తవానికి ఈ పంటల సాగు రాష్ట్రంలో చాలా తక్కువ. అయినా వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కనీస మద్దతు ధరలతో సంబంధం లేకుండా బహుళ జాతి సంస్థలే పోటీపడి క్వింటా రూ.4 వేలకుపైగా చెల్లించి పొలాల నుంచే కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది 3.80 లక్షల ఎకరాల్లో సాగుచేయాలన్న లక్ష్యంతో ఆర్బీకేల స్థాయిలో ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది.

ఆరోపణ: ఈ ధరలకు అమ్ముకుంటే రైతులు గల్లంతే..

వాస్తవం: మిర్చి పంటకు ప్రభుత్వం క్వింటా రూ.7 వేలు కనీస మద్దతు ధర ప్రకటించింది. వాస్తవానికి రాష్ట్రంలో మిరప సాధారణ విస్తీర్ణం 5 లక్షల ఎకరాలు కాగా, 2021–22లో 5.62 లక్షల ఎకరాలు, 2022–23లో 5.77 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది 6 లక్షల ఎకరాలు దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఓ వైపు తామర ప్రభావం పూర్తిగా సమసిపోనప్పటికీ మిరప సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా గుంటూరు యార్డులో క్వింటా రూ.30 వేలు, వరంగల్ యార్డులో రూ.50 వేలకు పైగా ధర పలకడమే ఇందుకు కారణం. వాస్తవం ఇలా ఉంటే రైతులేదో క్వింటా రూ.7 వేలకే అమ్ముకుని నష్టపోతున్నట్టుగా విషప్రచారం చేస్తుండడం 'ఈనాడు'కే చెల్లింది. ప్రభుత్వ చర్యల ఫలితంగా ప్రస్తుతం ఎమ్మెస్పీ ధరల కంటే మిన్నగా మిరప, పత్తి, వేరుశనగ, మినుము, పంటలకు మార్కెట్‌లో ధర పలుకుతోంది. ధరలు పడిపోయినప్పుడు గత నాలుగేళ్లుగా ప్రభుత్వం ఈ రకమైన భరోసా ఇవ్వడంతో మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయి. విశేషమేంటంటే ధరల స్థిరీకరణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు కానీ, మార్కెట్ జోక్యంతో చేసిన కొనుగోళ్లు కానీ ఎన్నడూ రామోజీకి కనిపించలేదు. పెట్టుబడి పెరిగిందని వాదిస్తున్న రామోజీ అదే సమయంలో రైతుకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున ఇస్తోన్న పెట్టుబడి సాయాన్ని మాత్రం ప్రస్తావించడం లేదు. నాలుగేళ్ల క్రితం రాష్ట్రమే కొన్ని పంటలకు ధరలు నిర్ణయించినప్పుడు దేశంలో ఏ రాష్ట్రం చేయని పనిచేశారంటూ 'ఈనాడు' ప్రశంసించనూ లేదు. రైతుల్ని ఆదుకోవటానికి ఉదారంగా వ్యవహరించారంటూ ఒక్క అక్షరమూ రాయలేదు. ఇప్పుడు మాత్రం ఆ ధరలను కేంద్రం మాదిరిగా పెంచడం లేదంటూ వాపోతుండడం విస్మయానికి గురిచేస్తోంది.

ప్రభుత్వానిదే 'జీఎల్టీ' భారం

రైతుల ప్రయోజనార్థం ఆర్బీకేలను కొనుగోలు కేంద్రాలుగా గుర్తించడమే కాదు.. రైతు పొలం నుంచే నేరుగా పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. అందుకయ్యే జీఎల్టీ (గన్నీ బ్యాగ్‌లు, కూలీలు, రవాణా) ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తోంది. ధాన్యం కొనుగోలు విషయంలో టన్నుకు రూ.2,523 చొప్పున (గోనె సంచులకు రూ.1,750, కూలీలకు రూ.220, రవాణా చార్జీలు రూ.468లతో పాటు ఒకసారి వాడిన గోనె సంచులకు రూ.85) చెల్లిస్తుండగా, ఇతర పంట ఉత్పత్తుల సేకరణ సందర్భంలో క్వింటాకు రూ.418 చొప్పున భరిస్తోంది. ఇటీవలే మార్కెట్‌లో ధర పడిపోవడంతో మొక్కజొన్న క్వింటా కనీస మద్దతు ధర రూ.1,962 చొప్పున కొనుగోలు చేసింది. కానీ రైతులకు క్వింటాకు రూ.2,370 చొప్పున చెల్లించింది. పైగా గన్నీ బ్యాగ్స్, లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా చార్జీల కోసం ఈ అదనపు మొత్తాన్ని రైతుల ఖాతాలో జమ చేసింది. చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో రైతులను ఇలా ఆదుకున్న సందర్భమే లేదు. అయినా రామోజీకి ఒక్క అక్షరం రాస్తే ఒట్టు.



రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలు ప్రకటించిన ఉత్పత్తులివే..

పంట	ధర (క్వింటా..రూ.ల్లో)
మిరప	7,000
పసుపు	6,850
ఉల్లి	770
చిరుధాన్యాలు	2,500
అరటి	800
బత్తాయి	1,400

టీడీపీ ఐదేళ్ల పాలనలో కొనుగోలు చేసిన ఇతర పంట ఉత్పత్తుల వివరాలు..

పంట	పరిమాణం (టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)
సజ్జలు	157.35	0.27
శనగలు	1,07,901.84	460
నల్లబెల్లం	2,061.44	3.85
మినుములు	1,05,145.95	571.07
పెసలు	18,522.08	118.47
జొన్నలు	34,904.50	53.40
కొర్రలు	1,215.75	2.19
ఉల్లి	4,930.79	6.38
మొక్కజొన్న	3,18,861.95	427.10
రాగులు	12	0.03
కందులు	2,58,845	1,374.16
పసుపు	48,540	305.22
మొత్తం	9,01,099	3,322

నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ఇతర పంట ఉత్పత్తుల వివరాలు

పంట	పరిమాణం (టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)
సజ్జలు	26,497	69.70
అరటి	12,050	8
శనగలు (ఎన్‌ఓఫ్)	1,304.1	8.25
శనగలు	4,00,944	1,868.97
పత్తి	3,21,582	1,789
పెసలు	3,011.9	22.80
వేరుశనగ	22,653	125.85
జొన్నలు	2,40,069.4	647.84
కొర్రలు	22.55	0.066
మొక్కజొన్న	9,85,569	2,183
ఉల్లి	9,025	64.04
రాగులు	223.05	0.84
కందులు	61,376.83	371.35
బత్తాయి	4,109	5
పొగాకు	12,933	139.19
టమాటా	1,425	1.28
పసుపు	52,707	406.66
మొత్తం	21,55,504	7,712

	సంవత్సరం	రైతులు (లక్షల్లో)	ధాన్యం (లక్షల టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)
ధాన్యం కొనుగోలు వివరాలు.. టీడీపీ ఐదేళ్ల పాలనలో..	2014-15	1.18	40.62	5,583.03
	2015-16	2.72	64.72	9,238.41
	2016-17	5.27	55.57	8,261.40
	2017-18	4.96	59.73	9,352.26
	2018-19	3.81	44.46	7,801.81
	మొత్తం	17.94	265.10	40,236.91
2019 మే తర్వాత ధాన్యం కొనుగోళ్లు ఇలా..	(రబీ సీజన్‌లో)	1.89	27.53	4,838.03
	2019-20	6.76	82.57	15,037.12
	2020-21	8.04	84.56	15,841.41
	2021-22	8.11	66.54	12,943.50
	2022-23	7.90	48.81	9,966.82
	మొత్తం	32.70	310.01	58,626.88

ఏపీ ఈఏపీసెట్.. అబ్బాయిలదే హవా



ఫలితాలను విడుదల చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బొత్స


ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఉమేష్ వరుణ్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

▶ మొదటి పేజీ తరువాయి

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో మొత్తం 3,38,739 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3,15,297 మంది పరీక్షకు హాజరు కాగా 2,52,717 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,38,180 మంది దరఖాస్తు చేసుకోగా 2,24,724 మంది పరీక్ష రాశారు. వీరిలో 1,71,514 (76.32 శాతం) మంది అర్హత సాధించారు. ఇక అగ్రికల్చర్ విభాగంలో 1,00,559 మంది దరఖాస్తు చేయగా 90,573 మంది పరీక్ష రాశారు. వీరిలో 81,203 (89.65 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది మాదిరిగానే ఇంజనీరింగ్ వైపు అత్యధికంగా అబ్బాయిలు, అగ్రికల్చర్ వైపు అమ్మాయిలు మొగ్గు చూపారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన చల్లా ఉమేష్ వరుణ్ 158.03 మార్కులతో (తెలంగాణ ఎంసెట్‌లో 3వ ర్యాంకు), అగ్రికల్చర్ విభాగంలో తూర్పుగోదావరి జిల్లా కాతేరుకు చెందిన బూరుగుపల్లి సత్యరాజ్ జశ్వంత్ 153.88 మార్కులతో (తెలంగాణ ఎంసెట్ టాపర్) ప్రథమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. కాగా, ఈ ఏడాది ఈఏపీసెట్‌ను జేఎన్‌టీయూ అనంతపూర్ నిర్వహించింది.

తొలి పది ర్యాంకులు బాలురకే..

ఇంజనీరింగ్ విభాగంలో తొలి పది ర్యాంకులు, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో టాప్ టెన్‌లో ఎనిమిది ర్యాంకులను అబ్బాయిలు కైవసం చేసుకున్నారు. అయితే రెండు విభాగాల్లో కలిపి బాలుర కంటే బాలికలు 3.99 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు చేశారు. తెలంగాణ విద్యార్థులకు ఇంజనీరింగ్ విభాగంలో 2, 10 ర్యాంకులు, అగ్రికల్చర్ విభాగంలో 3, 6 ర్యాంకులు వచ్చాయి. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం చేస్తున్న ఖర్చు నైపుణ్య మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడిగా పరిగణిస్తోందని చెప్పారు. జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు, నూతన విద్యా విధానం, ఉన్నత విద్యలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రతి విద్యార్థి ప్రపంచ స్థాయికి ఎదిగేలా సీఎం వైఎస్ జగన్ విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. ఫలితంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల చేరిక, ఉత్తీర్ణత శాతం పెరుగుతోందని తెలిపారు. త్వరలోనే దేశ విద్యా వ్యవస్థలో ఏపీని మొదటి స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతులు రాగానే జూలై 15న కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించి ఆగస్టు 15లోగా పూర్తి చేస్తామన్నారు.

వీరికి మార్కులు అప్‌లోడ్ చేశాక ర్యాంకులు

రాష్ట్రంలో రెగ్యులర్ ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణులై ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారందరికీ ఇంటర్ మార్కులకు 25% వెయిటేజీ ఇచ్చి ర్యాంకులు ప్రకటించారు. అయితే సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఏపీవోఎస్ఎస్, తదితర సిలబస్‌తో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు, ఇటీవల సప్లిమెంటరీలో ఇంటర్ పాసైన ఏపీ విద్యార్థుల మార్కుల డేటా రాకపోవడంతో కొంతమందికి ర్యాంకులను కేటాయించాల్సి ఉందని ఈఏపీసెట్ చైర్మన్ జి.రంగ జనార్దన తెలిపారు. అభ్యర్థుల నుంచి డిక్లరేషన్‌తోపాటు మార్కులను అప్‌లోడ్ చేశాక వీరికి వెయిటేజీ కలిపి ర్యాంకులు ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ రామ్మోహనరావు, కార్యదర్శి నజీర్ అహ్మద్, సెట్స్ స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌రెడ్డి, ఈఏపీ సెట్ కన్వీనర్ శోభాబిందు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో టాప్ 10 ర్యాంకులు..

పేరు	ర్యాంకు	మార్కులు	ప్రాంతం
చల్లా ఉమేష్ వరుణ్	1	158.03	నందిగామ, ఎన్టీఆర్ జిల్లా
జిక్కిన అభినవ్ చౌదరి	2	157.26	బేగంపేట, హైదరాబాద్
నందిపాటి సాయిదుర్గారెడ్డి	3	155.29	పిడుగురాళ్ల, పల్నాడు జిల్లా
చింతపర్తి బాబూ సుజన్‌రెడ్డి	4	155.68	తిరుపతి
దుగ్గినేని వెంకట యుగేష్	5	154.65	రాజంపేట, అన్నమయ్య జిల్లా
అడ్డగడ వెంకట శివరామ్	6	153.97	చిలకలూరిపేట, పల్నాడు జిల్లా
యక్కంటి ఫణి వెంకట మణీందర్ రెడ్డి	7	154.62	గుంటూరు
మేడాపురం లక్ష్మీనర్సింహ మాధవ్ భరద్వాజ్	8	153.14	అనంతపురం
పిన్ను శశాంక్ రెడ్డి	9	152.88	తిరుపతి
ఎం.శ్రీకాంత్	10	152.84	బేగంపేట, హైదరాబాద్

అగ్రికల్చర్, ఫార్మా, బీఎస్సీ నర్సింగ్ విభాగంలో టాప్ 10 ర్యాంకులు

పేరు	ర్యాంకు	మార్కులు	ప్రాంతం
బూరుగుపల్లి సత్యరాజ్ జశ్వంత్	1	153.88	కాతేరు, తూర్పుగోదారి జిల్లా
బోర వరుణ్ చక్రవర్తి	2	151.06	తోటాడ గ్రామం, శ్రీకాకుళం జిల్లా
కొన్ని రాజ్ కుమార్	3	151.52	మౌలాలి, సికింద్రాబాద్
వలేటి సాయి అభినవ్	4	149.95	చిత్తూరు
దుర్గెంపూడి కార్తికేయరెడ్డి	5	150.08	తెనాలి, గుంటూరు జిల్లా
రాజేశ్వరి కూచూరు	6	149.80	హిమాయత్‌నగర్, హైదరాబాద్
తడ్డి సాయి వెంకట యశ్వంత్ నాయుడు	7	148.90	మోదలవలస, శ్రీకాకుళం జిల్లా
గుడిపూడి కీర్తి	8	147.70	అద్దంకి, ప్రకాశం జిల్లా
పొట్నూరు ఆశిష్	9	148.21	శ్రీకాకుళం
దేరంగుల అభిజిత్ సాయి	10	147.15	రాయచోటి, అన్నమయ్య జిల్లా

విభేదాలు వీడి పని చేయండి

- నాయకులపై కోపం పార్టీపై చూపించొద్దు
- కుప్పం నాయకులతో సమీక్షలో చంద్రబాబు


ప్రసంగిస్తున్న చంద్రబాబు

కుప్పం రూరల్/శాంతిపురం: నాయకులు కార్యకర్తలు విభేదాలు వీడి.. కష్టపడి పనిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు కోరారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం రాత్రి చిత్తూరు జిల్లా కుప్పం చేరుకున్న చంద్రబాబు కుప్పం మండల, మునిపాలిటీ పరిధిలోని నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 'కుప్పం నాయకుల్లో విభేదాలు ఉన్నాయి. కిందిస్థాయి నాయకులు నాపై, ఇతర నియోజకవర్గ నాయకులపై కోపం పెట్టుకుని పనిచేయొద్దు. అది పార్టీకి ఏమాత్రం మంచిది కాదు. వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవాలంటే సమన్వయంతో పనిచేయాల్సిందే. ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తెస్తే పరిష్కరిస్తా. అంతేగానీ ఎవరికి వారు విడిపోవద్దు. కిందిస్థాయి నాయకులకు సమస్యలు ఉంటే పైస్థాయి నాయకులు కలిసికట్టుగా వారికి అండగా నిలవాలి' అన్నారు. కుప్పంలో రౌడీయిజం, అవినీతి పెరిగిపోయిందని.. తాను అధికారంలోకి వస్తే వాటిని యథాస్థితికి తెస్తానని అన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నమ్మకం పోయిందని, మహిళలు, వ్యాపారులు రోడ్లపై తిరగలేక పోతున్నారన్నారు. ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ధరలు పెరిగిపోయాయని, మరీ ముఖ్యంగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సాధారణ తిండికి కరువయ్యారని చెప్పారు.

ఇల్లు కట్టుకుందామంటే సీఎం అనుమతి ఇవ్వడం లేదు

కాగా, కుప్పం వెళ్లడానికి ముందు చంద్రబాబు రాళ్లబూదుగూరులో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తాను ఇల్లు కట్టుకోవాలంటే సీఎం వైఎస్ జగన్ అనుమతి ఇవ్వడం లేదన్నారు. కుప్పంలో గ్రానైట్ అక్రమాలను తాను అడ్డుకుంటే మళ్లీ మొదలు పెట్టారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇక్కడ దోచుకుని, విదేశాల్లో దాచుకుంటున్నారని ఆరోపించారు. తాను రామకుప్పం వరకూ హంద్రీ–నీవా కాలువ తెస్తే ఐదేళ్లలో దానిని కుప్పం వరకూ చేర్చలేకపోయారన్నారు. నిర్ణీత షెడ్యూల్‌కు దాదాపు 4 గంటలు ఆలస్యంగా కర్ణాటక సరిహద్దుకు చేరుకున్న చంద్రబాబు రాళ్లబూదుగూరు మీదుగా పార్టీ శ్రేణులతో ర్యాలీగా కుప్పానికి వెళ్లారు.

నీట్ పీజీ రాష్ట్ర మెరిట్ జాబితా విడుదల

- వైద్య విద్య పీజీలో లక్ష్మిపూజితకు ఫస్ట్ ర్యాంక్
- ఎండీఎస్‌లో బి.స్వప్నకు ప్రథమ ర్యాంకు

సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ, ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్-2023లో అర్హత సాధించిన అభ్యర్థులతో రాష్ట్ర మెరిట్ జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. ఆల్ ఇండియా 22వ ర్యాంక్ సాధించిన పి. లక్ష్మి పూజిత రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకర్‌గా నిలిచారు. తర్వాతి స్థానాల్లో వరుసగా కృష్ణ మనదీప్ యాదవ్ (ఆలిండియా ర్యాంక్ 151), ఎ.జి. వర్ధన్‌రెడ్డి (158), చంద్రం పుష్ప (166), పి. సాయి సత్య అపర్ణ (169) ఉన్నారు. ఎండీఎస్ విభాగంలో జాతీయ స్థాయిలో 43వ ర్యాంకు సాధించిన బి. స్వప్న రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకర్‌గా నిలిచారు. చాపతి జస్మిత (67), డి. మౌనిక (91), జి. శ్రీజ (178), లక్ష్మి చార్మిల (215) టాప్-5 ర్యాంకర్‌లుగా ఉన్నారు. ఈ ఏడాది నీట్ పీజీలో ఎండీఎస్‌లో 672 మంది, వైద్య పీజీ విభాగంలో 8,667 మంది అర్హత సాధించారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (ఎన్‌బీఈ) నుంచి అందిన సమాచారం మేరకు నీట్ పీజీ, ఎండీఎస్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను రూపొందించినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికరెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ జారీ అనంతరం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది మెరిట్ జాబితా ప్రకటిస్తామని తెలిపారు.

సత్తాచాటిన ఎస్సీ గురుకుల విద్యార్థులు

- పరీక్షకు హాజరైన 181 మందిలో 171 మంది అర్హత సాధించారు
- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: ఎస్సీ గురుకులాల నుంచి నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో గత ఏడాది కంటే అధికంగా ఈ ఏడాది 28 మంది ఎంబీబీఎస్, 16 మంది డెంటల్ సీట్లను సాధించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎస్సీ గురుకులాల నుంచి నీట్‌కు హాజరైన 181 మందిలో 171 మంది అర్హత సాధించారని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థులకు నీట్, జేఈఈ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కేంద్రాలు చిన్నటేకూరు (కర్నూలు), ఈడుపుగల్లు (కృష్ణా), అడవితక్కెళ్లపాడు (గుంటూరు)లో ఉన్నాయని తెలిపారు. చిన్నటేకూరుకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షలో ఎక్కువ ప్రతిభను కనబరిచారని తెలిపారు. చిన్నటేకూరు కేంద్రం నుంచి నీట్‌కు హాజరైన మొత్తం 43 మంది, ఈడుపుగల్లు నుంచి హాజరైన 113 మందిలో 106 మంది అర్హతను సాధించారని వివరించారు. చిన్నటేకూరుకు చెందిన విద్యార్థులు బెజవాడ మహేశ్వరరావు 97.76, మందా వివేక్ 95.88, బెలూం నరేష్ 95.16 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ప్రస్తుతం నీట్‌లో విద్యార్థులు సాధించిన పర్సంటైల్, మార్కుల ప్రాతిపదికన చూస్తే ఈ ఏడాది ఎస్సీ గురుకుల విద్యార్థులకు మొత్తం 44 వైద్య విద్య సీట్లు (28 ఎంబీబీఎస్, 16 బీడీఎస్) రానున్నాయని తెలిపారు. నీట్ పరీక్షల్లో విద్యార్థులు ఎక్కువ సీట్లను సాధించడానికి కృషిచేసిన గురుకుల కార్యదర్శి ఆర్.పావనమూర్తి, ఏఎంఓ సంజీవరావు, ఇతర ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

నీట్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్ యూజీ-2023 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్‌లో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో టాపర్‌గా నిలిచిన వి.వరుణ్ చక్రవర్తితో పాటు 9వ ర్యాంకర్ ఎస్.వరుణ్ శ్రీచైతన్య విద్యార్థులేనని చెప్పారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఏఏజీఎం దుర్గాప్రసాద్, డీన్ కిషోర్, చంద్రశేఖర్ అభినందించారు.

నారాయణ మెడికల్ అకాడమీ జయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్ యూజీ-2023 ఫలితాల్లో నారాయణ మెడికల్ అకాడమీ ప్రభంజనం సృష్టించినట్లు సంస్థ అకడమిక్ ఇన్‌చార్జి తార్నాక చంద్రశేఖర్, డీజీఎం శ్రీనివాసులురెడ్డి, కోర్ డీన్ వీరగంధం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం గుంటూరు చంద్రమౌళీనగర్లోని కళాశాలలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో వారు మాట్లాడారు. విద్యార్థినులు వై.వెంకటసాయిశ్రీ 51వ ర్యాంకు, జి.అలేఖ్యదేవి 55వ ర్యాంకులతో పాటు వెంకటసాయి 316వ ర్యాంకు, మహాలక్ష్మీ బాయి 495వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. అలాగే 10 వేల లోపు 20 ర్యాంకులు వచ్చాయని పేర్కొన్నారు.

ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నీట్ యూజీ-2023 ఫలితాల్లో కాకినాడ ఆదిత్య విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ విద్యా సంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆలిండియా స్థాయిలో టి.ఎస్.సాయితేజస్విని 210వ ర్యాంక్, జానకీ శ్రీవైష్ణవి 365వ ర్యాంకు, ఎస్.వెంకటేష్ 646వ ర్యాంకు, టి.షణ్ముఖ్ సాత్విక్ 677వ ర్యాంకు, ఎ.లిఖిత 710వ ర్యాంకు సాధించారని చెప్పారు. విద్యార్థులను చైర్మన్ ఎస్.శేషారెడ్డి, హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, అభినందించారు.

భాష్యం మెడక్స్ విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్ యూజీ-2023 ఫలితాల్లో భాష్యం మెడక్స్ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో విజయకేతనం ఎగురవేసినట్లు భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో బుధవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. పోతిన రూపేష్‌కుమార్ 38వ ర్యాంకు, గాదె వీరారెడ్డి 46వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. 126 మంది విద్యార్థులు ఫ్రీ మెడికల్ సీట్లను సాధించే స్థాయిలో ర్యాంకులు పొందడం అభినందనీయమన్నారు.

'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: నీట్ యూజీ-2023 ఫలితాల్లో తిరుమల ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరిల్లో జాతీయస్థాయిలో టి.జె.కృపాకుమార్ 18వ ర్యాంకు, ఎం.శృతి 25వ ర్యాంకు, బి.జశ్వంత్ 65వ ర్యాంకు సాధించారన్నారు. 250 మందిపైన విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించగలరని చెప్పారు.

గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: నీట్ యూజీ-2023 ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ పూర్వ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యారామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వై.లక్ష్మీప్రవర్ధన్‌రెడ్డి 25వ ర్యాంకు, జి.లక్ష్మీరష్మిత 52వ ర్యాంకు పొందారని పేర్కొన్నారు.

శశి వేలివెన్ను సత్తా

ఉండ్రాజవరం: నీట్-2023లో శశి వేలివెన్నుకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటారని తూర్పు గోదావరి జిల్లా శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. వివిధ కేటగిరిల్లో ఆలిండియా స్థాయిలో వై.కీర్తి 15వ ర్యాంకు, ఎం.నితిన్ వర్మ 18వ ర్యాంకు, కె.లక్ష్మీప్రణతి 102వ ర్యాంకు, పి.పూజిత మధువాణి 103వ ర్యాంకు, జి.భాగ్యశ్రీ 204వ ర్యాంకు, ఎం.సంతోష్ 513వ ర్యాంకు సాధించారని వివరించారు.

శ్రీ గోసలైట్స్ విద్యార్థుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నీట్ యూజీ-2023 ఫలితాల్లో శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారని శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ నరేంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎంజీరోడ్డులోని హోటల్ మిడ్‌సిటీలో బుధవారం విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా స్థాయిలో తమ విద్యార్థి లక్ష్మీప్రవర్ధన్‌రెడ్డి 25వ ర్యాంకు, వేగేశ్న రోహిత్ వర్మ 61వ ర్యాంకు సాధించారని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, ఓపెన్ కేటగిరి ఏపీలో ఫస్ట్ ర్యాంకు, తెలుగు రాష్ట్రాల స్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అలాగే వెయ్యి లోపు ర్యాంకులు 22 మంది పొందారని చెప్పారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే మాదిగల అభ్యున్నతి

మాదిగలకు మేలు జరగడం లేదనే ప్రతిపక్షాల ఆరోపణలన్నీ అవాస్తవాలే

సాక్షి, అమరావతి: మాదిక సామాజిక వర్గానికి ఎలాంటి మేలు జరగడం లేదని, వారికి ద్రోహం చేశారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మాదిగల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటునిస్తోందని తెలిపింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దాదాపు రూ. 2.11 లక్షల కోట్లను వివిధ డీబీటీ పథకాల ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిందని పేర్కొంది. ఈ పథకాల ద్వారా ఎస్సీలైన మాలలు, మాదిగలు, రెల్లి కులస్తులు గణనీయంగా లబ్ధి పొందారన్నది వాస్తవమని స్పష్టంచేసింది. వారి అభ్యున్నతి వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే సాధ్యమైందని తెలిపింది.

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జరిగిన మేలు పిసరంత కూడా లేదు. పైగా, ఆయన అధికారంలో ఉన్నంత కాలం ఎస్సీల్లో కులాల మధ్య చీలికలతో పబ్బం గడుపుకొన్నారు. ముఖ్యంగా ఎస్సీల మధ్య చంద్రబాబు రాజేసిన కుంపట్లు ఆ వర్గాలను అతలాకుతలం చేశాయి. నిత్యం దళితులను కించపరిచే వ్యాఖ్యలతో చంద్రబాబు, టీడీపీ నేతలు వారిని ఆత్మన్యూనతలోకి నెట్టే ప్రయత్నం చేశారు. గత ఎన్నికలకు ముందు ఓట్ల కోసం డప్పు కళాకారులు, చర్మకారులకు మొక్కుబడిగా చేసిన లబ్ధి కూడా వారికి సరిగా చేరలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోంది. మొక్కుబడిగా కాకుండా అత్యంత పారదర్శకంగా ఎక్కడా అవినీతి, పక్షపాతం, వివక్షకు తావు లేకుండా, పార్టీల భేదాలు చూడకుండా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంతృప్త స్థాయిలో ఈ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానిదే. ఎవరికి జరగాల్సిన మేలును వారికి చేస్తోంది. వలంటీర్ల ద్వారా లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడే పింఛన్లు అందజేస్తోంది. ఇలా ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారుల్లో మాదిగ సామాజికవర్గానికి చెందిన లక్షలాది మంది పేదలు ఉన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డీబీటీ పథకాల ద్వారా 46,76,828 మంది మాదిగలకు నేరుగా ప్రయోజనం చేకూరిందని ప్రభుత్వం తెలిపింది. మొత్తంగా రూ. 16,650 కోట్లు నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసినట్లు పేర్కొంది. ఏపీ చరిత్రలో మాదిగ సామాజిక వర్గానికి ఇంత పెద్ద స్థాయిలో లబ్ధి చేకూర్చడం సువర్ణ అధ్యాయమే. వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, గృహ నిర్మాణంలో డీబీటీ, వైఎస్సార్, ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న తోడు, జగనన్న వసతి దీవెన, జగనన్న కళ్యాణమస్తు, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, పంట రుణాలు, వాహన మిత్ర, ఆరోగ్య ఆసరా, ఆరోగ్య శ్రీ చేయూత, పెన్షన్ కానుక, తదితర పథకాల ద్వారా మాదిగలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రయోజనం కలుగుతోంది. ఇవికాక నాన్ డీబీటీ పథకాల ద్వారా మాదిగలు మరింత మేలు పొందుతున్నారని ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వమే కాదు.. ఏ ప్రభుత్వంతో పోల్చినా వైఎస్ జగన్ నేతృత్వంలోనే అధిక మేలు జరిగిందన్నది ముమ్మాటికీ నిర్వివాదాంశం.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాల ద్వారా మాదిగలకు చేకూరిన ప్రయోజనాలు..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	నగదు ప్రయోజనం (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	7,18,081	1,582.69
జగనన్న అమ్మ ఒడి	4,29,861	1,948.31
జగనన్న చేదోడు	12,368	32.40
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	1,54,797	233.71
గృహ నిర్మాణం (డీబీటీ)	1,93,573	831.10
వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ (రైతులు)	81,261	66.74
జగనన్న తోడు	1,48,703	237.42
జగనన్న వసతి దీవెన	2,22,444	366.78
జగనన్న విద్యా దీవెన	2,24,640	808.16
వైఎస్సార్ కళ్యాణమస్తు	2,044	20.76
వైఎస్సార్ లా నేస్తం	302	2.57
వైఎస్సార్ మత్స్యకార భరోసా	797	1.34
వైఎస్సార్ నేతన్న నేస్తం	388	3.82
పాస్టర్లు	7,581	3.79
వైఎస్సార్ రైతు భరోసా	2,60,266	1,607.00
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	2,52,623	52.48
సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ)	7,22,432	273.58
వైఎస్సార్ వాహన మిత్ర	27,284	104.26
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	1,33,043	79.24
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	2,15,430	650.50
వైఎస్సార్ బీమా	11,179	205.99
వైఎస్సార్ చేయూత	2,88,896	1,540.10
వైఎస్సార్ పెన్షన్ కానుక	5,68,835	5,997.04
మొత్తం	46,76,828	16,650

దళితుల సంక్షేమం, సాధికారతపై చర్చకు సిద్ధమా?

- టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేతలకు మంత్రి సురేష్ సవాల్
- ఓట్ల కోసం దళితుల్ని చీల్చి చిచ్చు పెట్టిన వ్యక్తి చంద్రబాబు
- దళితులను చంద్రబాబు అసహ్యించుకుంటే.. వైఎస్ జగన్ అందలం ఎక్కించారు
- అన్ని పథకాల్లోనూ దళితులకు పెద్ద పీట
- పచ్చతోడేళ్ల గుంపులో దళితులెవ్వరూ భాగస్వామ్యం కావొద్దు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమానికి, రాజకీయ సాధికారతకు నాలుగేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం ఏం చేస్తున్నదో.., అంతకుముందు చంద్రబాబు సర్కార్ ఏం చేసిందో చర్చకు సిద్ధమా అని టీడీపీ నేతలకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సవాల్ విసిరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వేదిక, సమయం మీరే చెప్పండి. మీ ఆరోపణలకు సమాధానం చెప్పడానికి వైఎస్సార్‌సీపీలో ఉన్న ప్రతి ఒక్క మాదిగ ప్రతినిధి సిద్ధంగా ఉన్నారు' అని తేల్చిచెప్పారు. దళితులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన వారంతా క్షమాపణలు చెప్పి చర్చకు రావాలని సూచించారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ దళితులను అవహేళన చేసిన చంద్రబాబుకు డప్పు కొట్టడానికి సిగ్గులేదా అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. దళిత మహిళను బూటుకాలితో తొక్కిన అచ్చెన్నాయుడిని చెప్పుతో కొట్టి మాట్లాడాలని హితవు పలికారు. దళితులను చంద్రబాబు అడగడుగునా అవమానిస్తే.. సీఎం వైఎస్ జగన్ అక్కున చేర్చుకుంటున్నారని గుర్తు చేశారు. మంత్రి సురేష్ చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే..



దళిత ద్రోహులు చంద్రబాబు, టీడీపీ నేతలే

అసలు దళిత ద్రోహులు చంద్రబాబు, టీడీపీ నేతలే. ఇప్పటికిప్పుడు కులాల సమావేశాలను చంద్రబాబు నిర్వహించడానికి ప్రధాన కారణం ఎన్నికలే. వాడుకొని వదిలేయడం, కులాల మధ్య చిచ్చు పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. దళిత ద్రోహులంతా నేడు సీఎం వైఎస్ జగన్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు.

వైఎస్ జగన్ వచ్చాకే డప్పు కళాకారులు, చర్మకారులకు న్యాయం

2019 జనవరి.. అంటే.. ఎన్నికలకు మూడు నెలల ముందు చంద్రబాబు నెలకు రూ.1500 చొప్పున డప్పు కళాకారులకు పింఛన్ ఇచ్చారు. అది కూడా 6,600 మందికి మాత్రమే మూడు నెలలే ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పింఛన్‌ను సీఎం జగన్ రూ.3000కు పెంచారు. 2019-20లో 31 వేల మంది ,2020-21లో 43 వేల మందికి, 2021-22లో 49 వేల మంది, 2022-23లో 56 వేల మందికి పింఛన్ అందిస్తున్నాం. టీడీపీ హయాంలో మూడు నెలల్లో కేవలం రూ.30 కోట్లు ఇస్తే.. మేం ఏటా దాదాపు రూ.150 కోట్లు డప్పు కళాకారులకు పింఛన్‌గా ఇస్తున్నాం. చర్మకారులకు పింఛన్‌ను చంద్రబాబు 2018 నవంబర్‌లో ప్రవేశపెట్టారు. రూ. 1000 చొప్పున 6 వేల మందికి ఇవ్వాలని జీవో నెంబర్ 191 ఇచ్చారు. ఇది కూడా ఎన్నికలకు మూడు నెలలు ముందు అమలు చేసి మూన్నాళ్ల ముచ్చట చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చర్మకారుల పింఛన్ రూ. 2 వేలు చేశాం. 2019-20లో 21 వేల మందికి, 2020-21లో 31,280 మందికి, 2021-22లో 35 వేల మందికి, 2022-23లో 40 వేల మందికి, 2023-24లో 41 వేల మందికి ఇస్తున్నాం. ప్రస్తుతం చర్మకారులు రూ. 2,750 పింఛన్ పొందుతున్నారు. రాబోయే రోజుల్లో ఇది కూడా రూ.3 వేలు అవుతుంది. ఇప్పటి వరకు డప్పు కళాకారులకు రూ.600 కోట్లు, చర్మకారులకు రూ. 350 కోట్లు పింఛన్ కోసం ఇచ్చాం. అంటే.. టీడీపీ ఇచ్చిన దానికి మేం పదిరెట్లు ఎక్కువ ఇచ్చాం.

దళితులకు రాజకీయ సాధికారత వైఎస్ జగన్‌తోనే

సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక మాదిగ సామాజిక వర్గానికి పెద్ద పీట వేసి, రాజకీయంగా సాధికారిత కల్పిస్తున్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ముగ్గుర్ని ఎస్సీ కమిషన్ మెంబర్లుగా నియమించారు. నాలుగు మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్‌లుగా మాదిగలకు అవకాశమిచ్చారు. గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ పదవి క్రిస్టినాకు ఇచ్చారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌లుగా మరో ఇద్దరు మాదిగలకు ఇచ్చారు. మరో ఇద్దరు జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌లు, డిప్యూటీ మేయర్లు ఇద్దరు, 46 మంది జెడ్పీటీసీలు, 55 మంది ఎంపీపీలు, 13 మంది మున్సిపల్ వైస్ చైర్మన్లు కూడా మాదిగ సామాజిక వర్గం వారే. హెచ్‌ఆర్‌సీ సభ్యునిగా అత్యున్నత స్థాయి పదవిలో గొట్టిపోతుల శ్రీనివాసరావును నియమించారు. మంత్రివర్గంలో నాతో పాటు తానేటి వనితను ఎంపిక చేశారు. ఇద్దరు ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, బొమ్మి ఇజ్రాయేల్‌లను నియామకం చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో మొట్టమొదటిసారిగా మాదిగ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం ఇచ్చిన ఘనత జగన్‌గారిదే. అవకాశం ఉన్న ప్రతి చోటా దళితులకు ఇవ్వాలనే తపన వైఎస్ జగన్‌ది.

దామాషాకు మించి.. దళితులకు వాటా

28 పైచిలుకు సంక్షేమ పథకాల ద్వారా రూ. 2 లక్షల కోట్లకు పైగా నేరుగా పేదల ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్ జమ చేశారు. వీటిలో దళితుల వాటా పెద్దది. ఎస్సీల్లోని 37 ఉప కులాలు అన్నీ కలిసి మెలిసి అన్నదమ్ముల్లా ఉండాలని అనుకుంటుంటే చంద్రబాబుకి నచ్చడంలేదు. ఆయన మాటలను మాదిగలెవరూ నమ్మరు. ఈ పచ్చ తోడేళ్ల గుంపులో దళితులెవ్వరూ భాగస్వామ్యం కావద్దని మంత్రి సురేష్ చెప్పారు.

ఏ ర్యాంక్‌కు ఎక్కడ మెడికల్ సీటొస్తుంది?

ఆల్ ఇండియా ర్యాంక్ ఆధారంగా అంచనాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ-2023 ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఏడాది రాష్ట్రంలో 68,578 మంది విద్యార్థులు నీట్ రాయగా 42,836 మంది అర్హత సాధించారు. జాతీయ స్థాయిలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా రాష్ట్ర స్థాయిలో ఏ ర్యాంక్ వస్తుంది? గత ఏడాది ఏ ర్యాంకుకు ఏ కాలేజీలో సీటు వచ్చిందో పోల్చుకొని, ఈసారి ఏ కాలేజీలో సీటు వచ్చే అవకాశాలున్నాయో అంచనా వేసుకొంటున్నారు. కాలేజీల ప్రాధాన్యత క్రమం ఏ విధంగా ఉండాలో కసరత్తు చేసుకుంటున్నారు.



ప్రస్తుతం రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 16 ప్రైవేటు, రెండు మైనారిటీ, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఉన్నాయి. వీటిలో 5,360 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 2,185 సీట్లు 11 ప్రభుత్వ వైద్య కళాశాలలకు సంబంధించినవి. ఈ విద్యా సంవత్సరం నుంచి విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలల్లో కొత్తగా నిర్మించిన 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభంకానున్నాయి. వీటిలో ఒక్కో కాలేజీలో 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. ఇది విద్యార్థులకు వరమే. వీటితో కలుపుకొంటే ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు 2,935కు పెరుగుతాయి. వీటిలో 15 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలినవి రాష్ట్ర కోటాలో భర్తీ చేస్తారు. మరోవైపు గత ఏడాది నుంచి బీ కేటగిరిలో 85 శాతం సీట్లలో మన విద్యార్థులకే ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది.

ఆంధ్ర వైద్య కళాశాలలో ఇలా

సాధారణంగా రాష్ట్రంలో వైద్య విద్య అభ్యసించే విద్యార్థుల మొదటి చాయిస్ ఆంధ్ర వైద్య కళాశాలే. ఈ కాలేజీలో సీటు రావడమే అదృష్టంగా భావిస్తారు. ఈ కాలేజీలో గత ఏడాది (2022-23) ఎస్టీ విభాగంలో 456 స్కోర్‌తో 120176 ర్యాంక్ సాధించిన విద్యార్థికి చివరి సీటు వచ్చింది. ఎస్సీ విభాగంలో 76695 ర్యాంక్, బీసీ-ఎలో 25137, బీసీ-బిలో 31874, బీసీ-సిలో 26291, బీసీ-డిలో 17632, బీసీ-ఈలో 68801, ఓసీ కేటగిరీలో 15652, ఈడబ్ల్యూఎస్‌లో 19907 ర్యాంక్ వారికి చివరి సీట్‌లు వచ్చాయి. దాని తర్వాతి స్థానాల్లో గుంటూరు, కర్నూలు, కాకినాడ తదితర ప్రభుత్వ కళాశాలలు ఉంటాయి. గుంటూరు వైద్య కళాశాలలో ఓసీ విభాగంలో 22531, ఈడబ్ల్యూఎస్‌లో 26162, బీసీ-ఎలో 46529, బీసీ-బిలో 36192, బీసీ-సిలో 42535, బీసీ-డిలో 32830, బీసీ-ఈలో 65595, ఎస్సీలో 94801, ఎస్టీ విభాగంలో 132580 ర్యాంక్ వరకూ సీట్లు వచ్చాయి. కర్నూలు వైద్య కళాశాలలో ఓసీ కేటగిరీలో 20419, బీసీ-ఎలో 46268, బీసీ-బిలో 34676, బీసీ-సిలో 32239, బీసీ-డిలో 45304, బీసీ-ఈలో 36371, ఈడబ్ల్యూఎస్‌లో 26954, ఎస్సీలో 91270, ఎస్టీ విభాగంలో 115105 ర్యాంక్ వరకు విద్యార్థులు సీట్లు సాధించారు. కాకినాడ రంగరాయలో ఓసీ విభాగంలో 25622, బీసీ-ఎలో 48837, బీసీ-బిలో 47893, బీసీ-సిలో 44104, బీసీ-డిలో 31589, బీసీ-ఈలో 89637, ఈడబ్ల్యూఎస్‌లో 31333, ఎస్సీలో 97913, ఎస్టీ కేటగిరీలో 143288 ర్యాంక్‌ల వరకూ సీట్లు లభించాయి.

2022-23లో రాష్ట్రంలో ఏ కేటగిరీ వారికి ఏ ర్యాంక్ వరకు ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయంటే..

	ఏయూ పరిధిలో		ఎస్వీయూ పరిధిలో	
కేటగిరి	నీట్ ర్యాంక్	స్కోర్	నీట్ ర్యాంక్	స్కోర్
బీసీ-ఎ	99435	480	1,13,245	464
బీసీ-బి	1,04,909	474	1,07,975	470
బీసీ-సి	97,128	483	1,25,948	450
బీసీ-డి	71,379	517	1,07,014	471
బీసీ-ఈ	71,379	438	1,12,333	465
ఈడబ్ల్యూఎస్	37,401	569	58,085	536
మైనారిటీ	1,84,719	395	1,30,603	445
ఓసీ	56,717	538	63,212	528
ఎస్సీ	1,50,863	425	1,49,467	426
ఎస్టీ	1,97,158	384	1,98,868	383

2022-23లో ప్రభుత్వ డెంటల్ కళాశాలల్లో ఏ ర్యాంక్ వరకూ సీట్లు వచ్చాయంటే

కళాశాల	బీసీ	ఓసీ	ఎస్సీ	ఎస్టీ
ప్రభుత్వ డెంటల్ కళాశాల, విజయవాడ	3,50,232	1,00,307	4,20,522	2,10,454
రిమ్స్ డెంటల్ కళాశాల, కడప	1,71,111	1,58,424	1,97,113	2,47,726

దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధి

- ఎస్సీల అభివృద్ధి జరగలేదనడం టీడీపీ నేతల అవివేకం
- చంద్రబాబుకు దమ్ముంటే బహిరంగచర్చకు రావాలి
- మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: దేశంలో మరెక్కడా లేనివిధంగా ఏపీలో ఎస్సీల సంక్షేమం అద్భుతంగా జరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీలకు మేలు జరగడం లేదంటూ టీడీపీ నేతలు విమర్శించడం వారి అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబుకి దమ్ముంటే రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధిపై బహిరంగచర్చకు రావాలని సవాలు చేశారు. రాష్ట్రంలో మాదిగలకు అన్యాయం జరుగుతోందంటూ టీడీపీ నేతలు చేసిన విమర్శలను మంత్రి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఖండించారు. దేశంలో గతంలో పరిపాలించిన ఎస్సీ, బీసీ ముఖ్యమంత్రులు ఎవరూ చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారని తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా అన్ని రాష్ట్రాలు కలిపి ఎస్సీలకు చేస్తున్న సాయం కంటే ఒక్క ఏపీ సాయమే అత్యధికమని కేంద్ర ప్రభుత్వమే చెప్పిందని గుర్తుచేశారు. 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కలిసి ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా 34.86 లక్షల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించాయని, వాటిలో ఒక్క ఏపీలోనే 33.57 లక్షల కుటుంబాలున్నాయని తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా 2014-19 మధ్య చంద్రబాబు పాలనలో చేసిన ఖర్చు రూ.33,625 కోట్లు కాగా, మూడున్నరేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.49,710.17 కోట్లని తెలిపారు. ఐదేళ్లలో చంద్రబాబు ఎస్సీల సంక్షేమానికి రూ.33,629 కోట్లు ఖర్చుచేస్తే, జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల పాలనలో ఎస్సీల కోసం రూ.58,353 కోట్లు ఖర్చుచేశారని వివరించారు. టీడీపీ నేతలు దళితపల్లెకు వెళ్లి పేదగుడిసె తలుపు తట్టి జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా వారు చెబుతున్న మాటలను ప్రస్తావిస్తే చెప్పుతో కొడతారని ఆయన హెచ్చరించారు.

ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్




ఎస్సీలను అన్ని విధాలుగా అభివృద్ధిపథంలో వేగంగా అడుగులు వేయిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కి ఎస్సీలు ఎప్పటికీ రుణపడి ఉంటారని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కైలే అనిల్‌కుమార్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రంగాల్లో ఎస్సీలు ఎదగాలని భావించిన ముఖ్యమంత్రి జగన్.. పేదల తలరాతలు మార్చే చదువులను ఎస్సీల దరికి చేర్చడానికి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇంగ్లిష్ మీడియం మొదలు ట్యాబ్‌ల పంపిణీ వరకు, గవర్నమెంట్ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ మొదలు పిల్లలకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వరకు ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో లబ్ధిపొందుతున్న ప్రతి విద్యార్థిని ఉన్నతస్థానానికి చేర్చడానికి ఉపయోగపడేవేనని పేర్కొన్నారు. పేద విద్యార్థుల్లో ఎక్కువమంది ఎస్సీ విద్యార్థులుంటారని, వారి తలరాత మార్చే పనులు ముఖ్యమంత్రి జగన్ చేస్తుంటే.. చంద్రబాబు కడుపుమంటతో వాటిని చెడగొట్టేపనిలో ఉన్నారని తెలిపారు. తమ నోటికాడ కూడు లాగేసే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబుకు బుద్ధిచెప్పడానికి ఎస్సీలు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు.

– వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కైలే అనిల్‌కుమార్

టీడీపీ ఓ అంటరానిపార్టీ

- చంద్రబాబు హయాంలో దళితులకు అడుగడుగునా అవమానాలే
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అక్కున చేర్చుకున్నది సీఎం వైఎస్ జగనే
- లోకేశ్, పవన్ ఎమ్మెల్యేలుగా గెలవగలరా?
- ఎంపీ నందిగం సురేష్



సాక్షి, అమరావతి: ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అంటూ చంద్రబాబు, దళితులు శుభ్రంగా ఉండరు, చదువు అబ్బదు అంటూ ఆయన అనుచరగణం అంటరానితనాన్ని పెంచి పోషించారని.. అందుకే టీడీపీ ప్రజలకు అంటరాని పార్టీగా మారిపోయిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. దళితుల చెమట వాసనే గిట్టని చంద్రబాబుకు మా ఓట్లెందుకని ప్రశ్నించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితజాతిని అవమానించిన రాజకీయ నేతల్లో చంద్రబాబు ముందుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు భిన్నమని, ఆయన ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలను అన్నదమ్ములుగా అక్కున చేర్చుకుంటున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ వాడే చెప్పులు, తాగే నీళ్ల గురించి ఏమాత్రం అవగాహన లేకుండా ఎలా మాట్లాడారని టీడీపీ ఎస్సీ నేతలను ఆయన నిలదీశారు. గ్రామ సర్పంచిగా కూడా గెలవలేని లోకేశ్, పవన్ కళ్యాణ్‌కు ఒంటి చేత్తో 151 మంది ఎమ్మెల్యేల్ని గెలిపించుకున్న సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి లేదని చెప్పారు. దమ్ముంటే వారిద్దరూ ఎమ్మెల్యేలుగా గెలవాలని సవాల్ చేశారు. హాఫ్ మైండ్‌గాడు లోకేశ్ అంటూ విరుచుకుపడ్డారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారు కాబట్టే సీఎం జగన్ వైనాట్ 175 అంటున్నారన్నారు. ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నారు కాబట్టే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదిస్తున్నారని చెప్పారు.

నివాళి/శారద

'కళ్లల్లో కళ్లు పెట్టి చూడు'...
'మధురాతి మధురం మన ప్రేమ మధురం'...
'కంటి చూపు చెప్తోంది కొంటె నవ్వు చెప్తోంది'...
ఈ పాటలు పాడిన ముచ్చటైన గాయని శారద.
'బత్కమ్మ బత్కమ్మ బత్కమ్మ బత్కమ్మ ఎక్కడ పోతవురా'...
ఈ పాట పాడిందీ శారదే.
శంకర్-జై కిషన్‌లలో మన హైదరాబాదీ అయిన
శంకర్ శారద పాటలకు ఎన్నో అవకాశాలు కల్పించాడు.
'తిత్‌లి ఉడీ ఉడ్‌జో చలీ'... పెద్ద హిట్.
తన 86 ఏళ్ల వయసులో ఆమె
బుధవారం కన్ను మూసింది.
ఒక కాలంలో కొన్ని ముద్దుముద్దు ముచ్చటైన పాటలు
పాడిన శారదకు నివాళి.



ఆమెవి ముచ్చటైన పాటలు

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన సంగీత దర్శకుడు శంకర్ (జైకిషన్)కు తెలుగు జానపదాలంటే ఇష్టం. 'రామయ్యా వస్తావయ్యా ఏమయ్యా వస్తావయ్యా' పాట చేసి దేశమంతా తెలుగు సొగసు వినిపించాడు. ఆ తర్వాత అతనే బతుకమ్మ అనే మాటను కూడా హిట్ సాంగ్‌లా మలిచాడు. రాజేంద్ర కుమార్, వహీదా రహెమాన్ నటించిన 'షత్రంజ్'లో మెహమూద్, హెలెన్ మీద చిత్రించిన పాట– బత్కమ్మ బత్కమ్మ బత్కమ్మ ఎక్కడ పోతవురా... ఎక్కడ పోతవురా... దీనిని పాడింది రఫీ, శారద. ఈ సినిమా తర్వాత ఎన్నో స్టేజ్ షోలలో మెహమూద్, శారదాలు కలిసి ఆ పాట పాడారు. మన తెలంగాణ మాటను శారద అలా తెలుగు తెలియని ఎందరో శ్రోతలకు వినిపించింది.


1966.

రాజేంద్ర కుమార్ 'సూరజ్' విడుదలైంది. ఇందులోనే మొదటిసారిగా శారద సినీ రంగప్రవేశం చేసింది. ఈ సినిమాలో వైజయంతీ మాల మీద తీసిన 'తిత్‌లీ ఉడీ ఉత్‌తి చలీ'... పాట పెద్ద హిట్. అదే సినిమాలో రఫీ పాడిన 'బహారో ఫూల్ బర్‌సావో' కూడా పెద్ద హిట్. రెండు పాటలూ ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ సింగర్‌కు నామినేట్ అయ్యాయి. ఆశ్చర్యం ఏమంటే రెండు పాటలకూ సమానమైన ఓట్లు వచ్చాయి. అప్పట్లో 'బెస్ట్ సింగర్' ట్రోఫీ మాత్రమే ఉండేది. గాయనికి వేరుగా, గాయకులకు వేరుగా ఉండేది కాదు. దాంతో నిర్వాహకులు రఫీకి బెస్ట్ సింగర్ ఇచ్చి శారదకు స్పెషల్ అవార్డు ఇచ్చారు. అంతే కాదు ఆ వచ్చే సంవత్సరం నుంచి ఫిమేల్ సింగర్‌కు ఒక అవార్డు, మేల్ సింగర్‌కు ఒక అవార్డు ప్రవేశపెట్టారు. అలా ఒక పెద్ద మార్పునకు శారద కారణమైంది.

శారద రాజన్ అయ్యంగార్ తమిళనాడులోని కుంభకోణంలో అయ్యంగార్‌ల కుటుంబంలో 1937లో పుట్టింది. తండ్రి ప్రభుత్వ ఉన్నతోద్యోగి. తాత సంస్కృత పండితుడు. బాల్యం నుంచి శారద పాడుతుంటే తల్లి ప్రోత్సహించింది. తండ్రికి ఉద్యోగరీత్యా టెహరాన్‌కు ట్రాన్స్‌ఫర్ అయితే శారద అక్కడి భారతీయ బృందాల్లో గాయనిగా గుర్తింపు పొందింది. 'జిస్ దేశ్ మే గంగా బెహతీ హై' ప్రమోషన్ కోసం టెహరాన్ వెళ్లిన రాజ్‌కపూర్ అక్కడి పార్టీలో శారద పాట విని 'బొంబాయి వచ్చేయి. మంచి సింగర్ అవుతావు' అని పిలిచి శంకర్–జైకిషన్‌లకు పరిచయం చేశాడు. వీరిలో శంకర్ కాలక్రమంలో శారదకు సన్నిహితం అయ్యాడు. శారద తన ఎక్కువ పాటలను శంకర్ కోసమే పాడింది. 1966 నుంచి 69 వరకు శారద ముంబైలో లతా, ఆశాలకు గట్టి పోటీ ఇచ్చింది. శంకర్ ప్రోత్సాహం వల్లే శారదకు పాటలు దక్కుతున్నాయి అని భావించిన లత 'ప్రేమ గుడ్డిదని విన్నాను. ఇప్పుడు చెవిటిది కూడా అని తెలుసుకున్నాను' అని జోక్ చేసింది. అంటే శారద గొంతు అట్టే బాగోలేదని ఆమె అభిప్రాయం. కాని శంకర్ మరణించే వరకూ శారద అతని కోసం పాడుతూనే ఉంది. తెలుగులో శంకర్ 'జీవిత చక్రం' సినిమాకు సంగీతం అందిస్తే అందులో ఎన్.టి.ఆర్, వాణిశ్రీల మీద డ్యూయెట్‌లకు ఘంటసాలతో కలిసి గొంతునిచ్చింది శారద.



శంకర్ జైకిషన్‌లతో శారద



మహమ్మద్ రఫీతో శారద

శారదకు తక్కువ కాలంలో మంచి పాటలే దొరికాయి. 'దునియాంకి సైర్ కర్‌లో' (అరౌండ్ ద వరల్డ్), 'చలే జానా జారా టెహరో' (అరౌండ్ ద వరల్డ్), 'జానె చమన్ షోల బదన్ పెహలూమే ఆజావో' (గుమ్‌నామ్)... అయితే ఆ తర్వాత హటాత్తుగా అందరూ ఆమెను ఇండస్ట్రీ దూరం పెట్టింది. ఇందుకు లతా ఒత్తిడి కారణం అంటారు. 'మేరా నామ్ జోకర్', 'కల్ ఆజ్ ఔర్ కల్' సినిమాల్లో పాటలు రికార్డు చేసిన రాజ్ కపూర్ ఆ తర్వాత వాటిని కేన్సిల్ చేయడంతో శారద బాగా హర్ట్ అయ్యింది. ఆ తర్వాత ఆమె మన దేశంలో తొలి పాప్ ఆల్బమ్ 'సిజ్లర్' (1971) విడుదల చేసింది. ఆ తర్వాత కొన్ని లోబడ్జెట్ సినిమాలకు సంగీత దర్శకత్వం వహించింది. ఎక్కువగా స్టేజ్ షోలతోనే శారద వార్తల్లో నిలిచింది. దక్షిణాది నుంచి హిందీకి వెళ్లి ఫిమేల్ సింగర్‌గా రాణించాలనుకుని విఫలమైన వారిలో వాణి జయరామ్‌లాగానే, శారద మరొకరు.

శారద కన్నుమూత

'గోల్డెన్ ఎరా ఆఫ్ ఇండియన్ సినిమా'గా చెప్పుకునే 1960లలో మహిళా గాయనిగా గుర్తింపు పొందిన శారద (86) బుధవారం ముంబైలో కన్ను మూశారు. ఆమె కేన్సర్‌తో పోరాడుతూ మరణించారని కుమార్తె సుధా మద్రైరా, కుమారుడు షమ్మీ రాజన్ సోషల్ మీడియా ద్వారా తెలియ చేశారు. మంచి గొంతుతోపాటు అందచందాలు ఉన్న శారదను తన పక్కన హీరోయిన్‌గా నటించమని షమ్మీ కపూర్ అడిగినా పాటల మీద ఉన్న ఆసక్తితో ఆమె నటించలేదు. వైష్ణవ నేపథ్యం ఉన్న కుటుంబానికి ఇష్టం లేకపోయినా వారితో పోట్లాడి ముంబైలో గాయనిగా స్థిరపడిందామె. 'కాంచ్ కి దీవార్' (1986) ఆమె చివరి సినిమా.

స్టీల్ బ్యాంక్

కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి అని కోరుకునే సాధారణ గృహిణి తులికా సునేజా. 'చుట్టూ ఉన్న వాతావరణం స్వచ్ఛంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది, అప్పుడే భవిష్యత్ తరాల మనుగడకు ఢోకా ఉండదన్న తాపత్రయం తనది. 'వాయు, ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుంది. వీలైనంత వరకు కాలుష్యాన్ని తగ్గిద్దాం' అని చెప్పేవారే కానీ ఆచరించేవారు అరుదు. అందుకే కాలుష్య స్థాయుల్లో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించడం లేదని భావించిన తులికా... పర్యావరణాన్ని కాపాడడానికి నడుం బిగించి 'క్రోకరీ బ్యాంక్' నడుపుతోంది. ఈ బ్యాంక్ ద్వారా డిస్పోజబుల్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి కృషిచేస్తోంది.



ఫరీదాబాద్‌కు చెందిన తులికా సునేజా ఓ రోజు పిల్లలతో బయటకు వెళ్లి ఇంటికి తిరిగొస్తున్నప్పుడు... రోడ్డుమీద కొంతమంది ఉచితంగా అన్నదానం చేస్తుండడం చూసింది. నిరుపేదల ఆకలి తీరుస్తున్నారు అని సంతోష పడేలోపు.. చుట్టుపక్కల చెల్లాచెదురుగా పడి ఉన్న ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులు, స్పూన్లు కనిపించాయి. తులికాతో ఉన్న తన పిల్లలు ''అమ్మా ఇలా ప్లాస్టిక్ పడేయడం పర్యావరణానికి మంచిది కాదు, దీనిని నియంత్రించడానికి పరిష్కారమే లేదా?'' అని తల్లిని ప్రశ్నించారు. అప్పుడు ఆ ప్రశ్నకు తులికా దగ్గర సమాధానం లేదు. కానీ డిస్పోజబుల్ ప్లాస్టిక్‌ను నియంత్రించే మార్గాలు ఏవైనా ఉన్నాయా అని రోజుల తరబడి ఆలోచించసాగింది. కొన్నిరోజుల తర్వాత తన మదిలో మెదిలిన ఐడియానే 'క్రోకరీ బ్యాంక్'.

ఎవరికీ నమ్మకం కుదరలేదు..

తనకు వచ్చిన క్రోకరీ బ్యాంక్ ఐడియాను తన స్నేహితులతో చెప్పింది తులిక. ''బ్యాంక్ ఆలోచన బావుంది కానీ ఎవరు పాటిస్తారు. బ్యాంక్ ఏర్పాటు చేయడానికి చాలా స్థలం, డబ్బులు కావాలి'' అన్న వారే తప్ప సాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తన బ్యాంక్ ఆలోచన కార్యరూపం దాల్చడానికి తన భర్త సాయం తీసుకుంది. ఆయన వెన్నుతట్టి ప్రోత్సహించడంతో.. తాను దాచుకున్న డబ్బులతో స్టీల్‌వి.. యాభై టిఫిన్ ప్లేట్లు, యాభై స్పూన్లు, యాభై భోజనం చేసే ప్లేట్లు, యాభై గ్లాసులు కొనింది. ఇవన్నీ పదమూడు వేల రూపాయల్లోనే వచ్చేశాయి. ఈ స్టీల్ సామాన్లతో 2018లో తనింట్లోనే 'క్రోకరీ బ్యాంక్'ను ఏర్పాటు చేసింది.

ఈ బ్యాంక్ గురించి తెలిసిన కొంత మంది తమ ఇళ్లల్లో జరిగే చిన్న చిన్న ఫంక్షన్లకు ఈ సామాన్లు తీసుకెళ్లేవారు. ఈ విషయం ఆనోటా ఈ నోటా సోషల్ మీడియాకు చేరడంతో చాలా మంది ఫంక్షన్లకు ఈ ఇక్కడి నుంచే సామాన్లను తీసుకెళ్లడం మొదలు పెట్టారు. కొంతమంది పర్యావరణవేత్తలు సైతం తులికాకు మద్దతు ఇవ్వడంతో క్రోకరీ బ్యాంక్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. చిన్నాపెద్దా పుట్టినరోజు వేడుకలు, కిట్టీపార్టీలు, కొన్ని ఆర్గనైజేషన్‌లలో జరిగే చిన్నపాటి ఈవెంట్‌లకు సైతం ప్లాస్టిక్ వాడకుండా ఈ బ్యాంక్ నుంచే సామాన్లు తీసుకెళ్తున్నారు. తులికాను చూసి ఫరీదాబాద్‌లో పదికి పైగా స్టీల్ క్రోకరీ బ్యాంక్‌లు ఏర్పాటయ్యాయి.



> నేను చాలా చిన్నమొత్తంతో క్రోకరీ బ్యాంక్‌ను ఏర్పాటు చేశాను. ఎవరైనా ఇలాంటి బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం పెద్ద కష్టం కాదు. నాలా మరి కొంతమంది పూనుకుంటే ప్లాస్టిక్ కాలుష్యం తగ్గుముఖం పడుతుంది. దీని ద్వారా 2018నుంచి ఇప్పటిదాకా ఐదులక్షల డిస్పోజబుల్ ప్లాస్టిక్‌ను నియంత్రించగలిగాను. భవిష్యత్‌లో మరింత పెద్ద సంస్థను ఏర్పాటు చేసి భారీస్థాయిలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రిస్తాను.
>
> – తులికా

• కళ

బొమ్మలు చెప్పే పాఠాలు

మన జానపద కథల్లో బొమ్మలు ఎన్నో కథలు చెబుతాయి. బెంగళూరుకు చెందిన డెబ్బై రెండు సంవత్సరాల లతా శఠగోపన్ తయారు చేస్తున్న బొమ్మలు కథలు చెప్పడంతో పాటు పాఠాలు కూడా చెబుతాయి. పర్యావరణ సంక్షోభం నుంచి రాకెట్ సైన్స్ వరకు తాను తయారు చేసిన బొమ్మల ద్వారా ఎన్నో విలువైన విషయాలు చెబుతుంది స్టోరీ టెల్లర్, ఫ్రీలాన్స్ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ లతా శఠగోపన్...

లతమ్మను చూడగానే పిల్లలు పరుగెత్తుకు వస్తారు. ఆమె చుట్టూ కూర్చుంటారు.





పిల్లల పుస్తకాల నుంచి ఒక టాపిక్‌ను తీసుకొని దానికి సంబంధించిన బొమ్మలు అక్కడికక్కడే తయారు చేస్తుంది. ఆ బొమ్మలతో వారికి సులభంగా అర్థమయ్యేలా పాఠం చెబుతుంది. ఆ పాఠాన్ని బొమ్మలాటలా మలుస్తుంది. అందులో పిల్లలను కూడా భాగస్వాములను చేస్తుంది.

జంతు సంక్షేమానికి సంబంధించి పాఠం చెప్పాల్సి వస్తే కాగితాలతో రకరకాల బొమ్మలు తయారుచేస్తూ వాటి గురించి ఆకట్టుకునేలా, సరదాగా చెబుతుంది. పాటలు కూడా ఉంటాయి. 'హెల్త్ సైన్స్' సబ్జెక్ట్ కోసం క్లాత్ పప్పెట్స్ తయారుచేస్తుంది. స్క్రిప్ట్ రాసుకోవడంలో భాగంగా వైద్యుల సలహాలు కూడా తీసుకుంటుంది.



పాఠాలు చెప్పడానికి బొమ్మలు తయారుచేస్తున్న లతా శఠగోపన్

కామెర్ల నుంచి కలరా వరకు ఎన్నో అంశాల గురించి పిల్లలకు లోతుగా అర్థమయ్యేలా చెబుతుంది.

స్పేస్ సైన్స్‌లో భాగంగా 'రాకెట్ లాంచ్' కోసం లతమ్మ ప్రదర్శించే బొమ్మలాట అంటే పిల్లలకు ఎంతో ఇష్టం.

'బొమ్మలాట'తో పాఠాలు చెప్పడంతో పాటు పిల్లలను 'విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నొలాజికల్ మ్యూజియం'కు తీసుకువెళ్లి మరింత అవగాహన చేయిస్తుంది.

'ఇలాంటి ప్రయోగాల వల్ల పిల్లలు సులభంగా పాఠాలు నేర్చుకోవడానికి వీలవుతుంది. గ్రామీణప్రాంతాలలోని పిల్లలకు వేస్ట్ మేనేజ్‌మెంట్ గురించి బొమ్మలను ఉపయోగిస్తూ సరదాగా చెప్పాను. ఉపన్యాస ధోరణిలో చెబితే ఎలా ఉండేదో తెలియదుగానీ బొమ్మల ద్వారా చెప్పడం వారికి సరదాగా అనిపించింది. నెల రోజులు తరువాత వెళితే నేను చెప్పిన ప్రతి మాటను నాకే చెప్పి ఆశ్చర్యపరిచారు' అంటుంది లతమ్మ.



• లతా శఠగోపన్

టీచర్‌గా పనిచేస్తున్న రోజుల్లో బొమ్మల తయారీ ప్రారంభించింది.

'ఈ బొమ్మలతోనే పాఠాలు చెబితే ఎలా ఉంటుంది' అనే ఆలోచన ఆమెను మరింత ముందుకు తీసుకువెళ్లింది.

మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న బొమ్మల ప్రయాణంలో లతా శఠగోపన్ ఎన్నో అనుభవాలను మూటగట్టుకుంది. దేశ విదేశాల్లో గుర్తింపు పొందింది. విద్యార్థులే కాదు ఉపాధ్యాయుల కోసం కూడా బొమ్మల తయారీలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది.

బొమ్మల్లో ఎన్నో రకాలు ఉన్నాయి.

'గ్లోవ్ పప్పెట్స్' లతమ్మ ప్రత్యేకత. దీనివల్ల బొమ్మలు ఆడించే వారికి సౌకర్యవంతంగా ఉంటుంది.

'అప్పుడు అలా తయారు చేశాను' అంటూ అదే ఫార్ములాను అనుసరించడం కాకుండా ఎప్పటికప్పుడూ బొమ్మల తయారీలో, చెప్పే విధానంలో కొత్తదనం కోసం ప్రయత్నిస్తుంది. ఎంతో పరిశోధన చేస్తుంది.

సోషల్ మీడియా ద్వారా తన కళ మరింత విస్తృతంగా పిల్లలకు చేరువయ్యేలా చేస్తోంది.

> బొమ్మలు నా జీవితానికి ఒక అర్థాన్ని ఇచ్చాయి. నా ఇష్టాన్ని ఇతరులతో పంచుకునేలా చేశాయి. పిల్లలకు బొమ్మలు చూపెట్టగానే సరిపోదు. మనం చెప్పే మాటలు బొమ్మలు చెబుతున్నట్లుగా ఉండాలి. రకరకాల భావోద్వేగాలు వినిపించాలి. దీనికి కొంత సాధన అవసరం. రికార్డింగ్ వాయిస్ ఉపయోగిస్తే యాంత్రికంగా ఉంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే మ్యూజిక్ విషయంలో మాత్రం లైవ్ ఆర్కెస్ట్రాను ఉపయోగిస్తే బాగుంటుంది. బొమ్మలు అంటే బొమ్మలు మాత్రమే కాదు. కొన్నిసార్లు అవి మనుమలు చేయలేని పనులు కూడా చేస్తాయి.
>
> – లతా శఠగోపన్

సైబర్ టాక్

రేటింగ్ మోసం

సినిమాలు రిలీజ్ అవుతూనే సమీక్షలు, రేటింగ్స్ సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా వస్తుంటాయి. ఆ రేటింగ్స్‌ను బట్టి జనం సినిమాలకు వెళుతుంటారు. అయితే, సమీక్షలు లేదా రేటింగ్‌లు తారుమారు చేసే మోసపూరిత పద్ధతి మొదలైంది ఇప్పుడు.

సినిమాలను ప్రచారం చేయడం, ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయడం, భిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చడం ఏమీ నేరం కాదు. కానీ, మోసపూరిత కార్యకలాపాల ద్వారా కృత్రిమంగా రేటింగ్‌లు పెంచడం లేదా తగ్గించడం వల్ల వీక్షకులను తప్పుదారి పట్టించవచ్చు. వార్నర్ బ్రదర్స్, మార్వెల్ స్టూడియోస్ మొదలైన ప్రముఖ సంస్థల వలె స్కామర్లు నటించడానికి కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటారు. ఉదాహరణకు
http://www.alamorate.com,
https://www.alamotop.com ,
https://alamo-top.com,
https://www.alamozone.com ..
వంటి వెబ్‌సైట్‌లలో రేటింగ్ స్కామర్ల గురించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో తమ అకౌంట్లను క్లోజ్ చేస్తారు. తిరిగి గంటలోపు కొత్త వాటిని సృష్టిస్తారు. మోసగాళ్లు సులువుగా డబ్బు సంపాదించడానికి ఇదో మార్గంగా ఎంచుకుంటున్నారు.



కొన్ని సాధారణ పద్ధతులు

- వ్యక్తులు లేదా గ్రూప్స్ అభిప్రాయంతో సంబంధం లేకుండా సానుకూల లేదా ప్రతికూల సమీక్షలు రాయడానికి నగదు చెల్లిస్తుంటాయి. ఇది కృత్రిమంగా విస్తృతమైన ప్రజల మద్దతు లేదా విమర్శలను సృష్టించగలదు.
- సినిమా వెబ్‌సైట్‌లు లేదా ప్లాట్‌ఫారమ్‌లలో రేటింగ్‌లు, రివ్యూలను మార్చేందుకు మోసగాళ్లు వివిధ పద్ధతులను ఉపయోగిస్తారు. వారు సానుకూల లేదా ప్రతికూల సమీక్షలను సమర్పించడానికి నకిలీ ఖాతాలను ఉపయోగించుకుంటారు. మొత్తం రేటింగ్‌ను కృత్రిమంగా పెంచడం లేదా తగ్గించడం చేస్తారు.
- మోసగాళ్లు ఇతర వ్యక్తులు లేదా సమూహాలతో సానుకూల సమీక్షలను మార్పిడి చేసుకునే పరస్పర ఏర్పాట్లలో పాల్గొంటారు. ఇది అనుమానం రాకుండా సానుకూల రేటింగ్‌ను కొనసాగించడంలో సహాయపడుతుంది.
- అసలైనదిగా కనిపించే సమీక్షలను పోస్ట్ చేయడానికి నకిలీ వినియోగదారు ఖాతాలు సృష్టిస్తారు. దీనివల్ల వీక్షకులలో విస్తృత ఏకాభిప్రాయం, భ్రమను సృష్టించడమే ఉద్దేశ్యం.
- ఒక ఉద్దేశంతో తరచుగా నడపబడే అనేక ప్రతికూల సమీక్షలతో సినిమా రేటింగ్ పేజీని నింపడానికి ప్రయత్నం చేస్తారు.

సంపాదనే ధ్యేయం

- **1వ దశ:** బాధితులకు వాట్సప్, సోషల్ మీడియా మెసెంజర్‌లలో మెసేజ్ వస్తుంది 'మీరు హాయిగా మీ ఇంట్లో కూర్చొని సంపాదించవచ్చు. మీరు చేయాల్సిందల్లా సినిమాలకు రేటింగ్‌లు ఇవ్వడమే. ఇందుకు గాను రూ. 2,500 నుంచి 5,000 మధ్య రోజువారీ సంపాదన' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది.
- **2వ దశ:** బాధితులను టెలిగ్రామ్ సమూహంలో చేరాలని, నకిలీ వెబ్‌సైట్‌లోకి సైన్ ఇన్ అవమని సలహా ఇస్తారు. డబ్బు సంపాదించడానికి రివ్యూలు రాయడం ప్రారంభించండి' అని కోరుతారు.
- **3వ దశ :** రేటింగ్ ఇచ్చే ముందు కమిషన్ లేదా బోనస్ పొందడానికి సినిమాను చూడమని చెబుతారు. ఒక సినిమా రేటింగ్ కోసం రూ. 2,500 నుండి రూ. 5,000 వరకు కమీషన్ ఉంటుంది, నగదు మీ బ్యాంక్ ఖాతాలలో జమ చేయబడుతుంది. హిందీ, ఇంగ్లీష్, భారతీయ సినిమాలకు కమీషన్ మారుతూ ఉంటుంది' అని చెబుతారు.
- **4వ దశ:** ఎలాంటి డబ్బు చెల్లింపు లేకుండా బోనస్ ఇచ్చి, బాధితులను బాగా ఆకట్టుకుంటారు. టెలిగ్రామ్ గ్రూప్‌లో చాలా మంది సభ్యులు ఉంటారు కాబట్టి, డబ్బు పెట్టుబడి పెట్టి 2 నుండి 5 సార్లు చెల్లింపుల ద్వారా భారీ మొత్తంలో సంపాదించినట్లు మెసేజ్‌లు పోస్ట్ చేస్తూనే ఉంటారు.
- **దశ 5:** బాధితులు 2,5000 నుండి లక్ష రూపాయల వరకు చెల్లించడం ప్రారంభిస్తారు. సినిమాలు చూడటం, సమీక్షలు రాయడం మొదలుపెడతారు. వారి కమీషన్ వాలెట్‌లో కనిపిస్తుంది కానీ, దానిని తీసుకోలేరు.
- **6వ దశ:** బాధితులు వాలెట్‌లో కనిపించే డబ్బుకు సమాన మొత్తంలో పెట్టుబడి పెట్టాలని, ఇతర సమీక్షలను చూడటం, రాయడం ఎలా చేయచ్చో సలహా ఇస్తారు. దీని కోసం బాధితుడు వాలెట్‌లో డబ్బును పెట్టుబడిగా పెడతాడు.
- **దశ 7 :** బాధితులు తమ వాలెట్ల నుండి నగదు మొత్తాలను తీసుకోవచ్చని భావించి పెట్టుబడులు పెడుతూనే ఉంటారు. కొంత మొత్తాన్ని పన్నుగా చెల్లిస్తే, బాధితుల ఖాతాలో డబ్బు జమ అవుతుందని స్కామర్లు వాగ్దానాలు కూడా చేస్తారు.
- **8వ దశ:** కొన్ని చెల్లింపు పనుల తర్వాత, బాధితులు అది మోసమని గ్రహించి సహాయం కోసం సైబర్ పోలీసులను సంప్రదిస్తారు. ఎందుకంటే డబ్బు వాలెట్‌లో మాత్రమే కనిపిస్తుంది కానీ వారు దానిని విత్‌డ్రా చేయలేరు.

కొన్ని భద్రతా చిట్కాలు

త్వరగా డబ్బు సంపాదించాలనే జనం ఆశను స్కామర్లు దోపిడీ చేస్తారు. ఈ మోసాల బారిన పడకుండా ఉండటానికి, కొన్ని ముఖ్యమైన అంశాలు..

- వాట్సప్, టెలిగ్రామ్ లేదా సోషల్ మీడియా మెసెంజర్‌ల వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సులభంగా డబ్బు లేదా అధిక సంపాదనలను వాగ్దానం చేసే మెసేజ్‌లు లేదా ఆఫర్‌లకు ఎప్పుడూ సభ్యత్వాన్ని పొందవద్దు.
- ఏదైనా వెబ్‌సైట్ లేదా ప్లాట్‌ఫారమ్‌లో సైన్ అప్ చేయడానికి ముందు, అది విశ్వసనీయమైనదని నిర్ధారించుకోవాలి. అధికారిక వెబ్‌సైట్‌ల కోసం తనిఖీ చేయాలి. వారి ఆధారాలను, సంప్రదింపు సమాచారాన్ని నిజమో కాదో నిర్ధారించుకోవాలి.
- వివిధ రకాలుగా డబ్బు సంపాదించడం గురించి మాట్లాడే ఏ అవకాశానికైనా ముందస్తు రుసుము చెల్లించవద్దు.
- బ్యాంకు ఖాతా వివరాలు, క్రెడిట్ కార్డ్ నంబర్లు లేదా గుర్తింపు పత్రాలు వంటి సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులకు లేదా సురక్షితం కాని వెబ్‌సైట్‌లకు ఎప్పుడూ అందించవద్దు.
- సినిమా సమీక్షలు లేదా రేటింగ్‌లను పరిగణనలోకి తీసుకున్నప్పుడు వాటి మూలాలపై దృష్టి పెట్టండి. తెలియని లేదా అనుమానాస్పద ప్లాట్‌ఫారమ్‌లో యూజర్ రూపొందించిన సమీక్షలపై మాత్రమే ఆధారపడవద్దు.
- మీరు సినిమా సమీక్ష/రేటింగ్ మోసాన్ని అనుమానించినట్లయితే, హెల్ప్‌లైన్ 1930కి కాల్ చేయండి, ప్రత్యామ్నాయంగా httpr://cybercrime. gov.in/లో రిపోర్ట్ చేయండి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



నజ్ముల్ సెంచరీ: బంగ్లాదేశ్ 362/5

అఫ్గానిస్తాన్ జట్టుతో బుధవారం మొదలైన ఏకైక టెస్టులో తొలి రోజు బంగ్లాదేశ్ భారీ స్కోరు సాధించింది. మిర్పూర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 79 ఓవర్లలో 5 వికెట్లకు 362 పరుగులు చేసింది. నజ్ముల్ హొస్సేన్ షాంతో (175 బంతుల్లో 146; 23 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కాడు. మహమూదుల్ హసన్ జాయ్ (76; 9 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. ముష్ఫికర్ రహీమ్ (41 బ్యాటింగ్; 3 ఫోర్లు), మిరాజ్ (43 బ్యాటింగ్; 7 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.

క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ



రోత్సె ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో రెండో సీడ్ సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. నాటింగ్‌హామ్ లో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ జోడీ 6-7 (6/8), 6-1, 10-5తో ల్యూక్ సావిల్లె (ఆస్ట్రేలియా)-యు సియు సు (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. ఇదే టోర్నీలో ఆడుతున్న అనిరుధ్ చంద్రశేఖర్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది.

39 ఏళ్ల తర్వాత...

- టాప్-3లో ఒకే దేశానికి చెందిన ముగ్గురు క్రికెటర్లు
- ఆసీస్ క్రికెటర్లు లబుషేన్, స్మిత్, హెడ్ ఘనత
- ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్



హెడ్ లబుషేన్ స్మిత్

దుబాయ్: భారత జట్టుతో జరిగిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో సెంచరీలతో రాణించి ఆస్ట్రేలియా విజయంలో కీలకపాత్ర పోషించిన స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ పురోగతి సాధించారు. బుధవారం విడుదల చేసిన టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో స్మిత్ (885 రేటింగ్ పాయింట్లు) ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌కు చేరుకోగా... ట్రావిస్ హెడ్ (884 రేటింగ్ పాయింట్లు) మూడు స్థానాల పురోగతి సాధించి ఆరు నుంచి మూడో స్థానానికి చేరుకున్నాడు. టాప్ ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియాకే చెందిన లబుషేన్ (903 రేటింగ్ పాయింట్లు) తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ఫలితంగా 39 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత... ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఒకే దేశానికి చెందిన ముగ్గురు క్రికెటర్లు వరుసగా తొలి, రెండు, మూడు స్థానాలను ఆక్రమించారు. చివరిసారి 1984లో వెస్టిండీస్ క్రికెటర్లు గార్డన్ గ్రీనిడ్జ్, క్లయివ్ లాయిడ్, లారీ గోమ్స్ వరుసగా తొలి మూడు ర్యాంకుల్లో నిలిచారు. గత డిసెంబర్‌లో కారు ప్రమాదానికి గురై కోలుకుంటున్న భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ పదో ర్యాంక్‌లో, కోహ్లి 12వ ర్యాంక్‌లో, రోహిత్ శర్మ 13వ ర్యాంక్‌ల్లోనే కొనసాగుతున్నారు. ఆస్ట్రేలియాతో డబ్ల్యూటీసీ ఫైనల్లో అర్ధ సెంచరీలు చేసిన అజింక్య రహానే 37వ ర్యాంక్‌కు చేరుకోగా... శార్దుల్ ఠాకూర్ ఆరు స్థానాలు మెరుగుపర్చుకొని 94వ స్థానంలో నిలిచాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆడే అవకాశం రాకపోయినా భారత మేటి స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా రెండు స్థానాలు పడిపోయి ఎనిమిదో స్థానానికి చేరుకోగా, రవీంద్ర జడేజా తొమ్మిదో ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు.



శ్రీకాంత్ ముందుకు...

- ప్రపంచ 13వ ర్యాంకర్‌పై విజయం
- లక్ష్య సేన్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో బుధవారం పురుషుల సింగిల్స్ విభాగంలో బరిలోకి దిగిన ముగ్గురు భారత క్రీడాకారులు ముందంజ వేశారు. కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్ తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న క్రీడాకారులను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు. ప్రియాన్షు రజావత్‌కు ప్రపంచ మూడో ర్యాంకర్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) నుంచి వాకోవర్ లభించడంతో అతను కోర్టులో అడుగు పెట్టకుండానే ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. ప్రపంచ 13వ ర్యాంకర్ గ్వాంజ్ జు లూ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 22వ ర్యాంకర్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ శ్రీకాంత్ 21-13, 21-19తో గెలుపొందాడు. 46 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో శ్రీకాంత్ 4-0తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ తొలి గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్‌కు ప్రతిఘటన ఎదురైంది. అయితే స్కోరు 19-19 వద్ద శ్రీకాంత్ వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు గ్వాంజ్ జు లూపై వరుసగా ఐదో విజయాన్ని సాధించాడు. ప్రపంచ 11వ ర్యాంకర్, ఆసియా చాంపియన్ లీ జి జియా (మలేసియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-17, 21-13తో గెలిచాడు. 33 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌లో స్కోరు 17-17 వద్ద వరుసగా నాలుగు పాయింట్లు గెలిచాడు. రెండో గేమ్‌లో స్కోరు 5-3 వద్ద లక్ష్య సేన్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఏడు పాయింట్లు నెగ్గి 12-3తో ఆధిక్యంలోకి వెళ్లి వెనుదిరిగి చూడలేదు. మరోవైపు మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణి ఆకర్షి కశ్యప్‌నకు నిరాశ ఎదురైంది. ప్రపంచ 43వ ర్యాంకర్ ఆకర్షి తొలి రౌండ్‌లో 10-21, 4-21తో ప్రపంచ రెండో ర్యాంకర్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో లక్ష్య సేన్‌తో శ్రీకాంత్; ఎన్‌గీ కా లాంగ్ అంగస్ (వియత్నాం)తో ప్రణయ్; ఆంథోనీ సినిసుక జిన్‌టింగ్ (ఇండోనేసియా)తో ప్రియాన్షు రజావత్; తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో పీవీ సింధు తలపడతారు.

జ్యోతి సురేఖ బృందానికి కాంస్యం

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీ



పర్ణీత్ కౌర్, జ్యోతి సురేఖ, అదితి స్వామి

మెడెలిన్ (కొలంబియా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నమెంట్‌లో మహిళల, పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత జట్లు కాంస్య పతకాలు సాధించాయి. బుధవారం జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు 'షూట్ ఆఫ్'లో మెక్సికో జట్టును ఓడించింది. నిర్ణీత నాలుగు రౌండ్ల తర్వాత రెండు జట్లు 232-232 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించడానికి 'షూట్ ఆఫ్' నిర్వహించారు. 'షూట్ ఆఫ్'లోనూ రెండు జట్లు 29-29తో సమంగా నిలిచాయి. అయితే భారత జట్టు కొట్టిన మూడు షాట్‌లలో ఒకటి 'బుల్స్ ఐ' షాట్ ఉండటంతో కాంస్య పతకం ఖరారైంది. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత జట్టు 2119 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. నాకౌట్ దశలో తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత్ క్వార్టర్ ఫైనల్లో 230-223తో ఎల్ సాల్వడార్ జట్టును ఓడించింది. అమెరికాతో జరిగిన సెమీఫైనల్లో స్కోరు 232-232తో స్కోరు సమమయ్యాక 'షూట్ ఆఫ్'లో భారత జట్టు 28-29తో ఓడిపోయింది. క్వాలిఫయింగ్ వ్యక్తిగత రౌండ్‌లో 16 ఏళ్ల అదితి 711 పాయింట్లు స్కోరు చేసి టాపర్‌గా నిలిచింది. ఈ క్రమంలో అండర్-18 విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది.

మరో కాంస్యం...

మరోవైపు అభిషేక్ వర్మ, ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టుకు కూడా కాంస్య పతకం లభించింది. కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ 236-228తో కొలంబియా జట్టుపై గెలిచింది. అంతకుముందు భారత్ తొలి రౌండ్‌లో 237-228తో చిలీపై, క్వార్టర్ ఫైనల్లో 237-223తో స్లొవేనియాపై గెలిచింది. అయితే మెక్సికోతో జరిగిన సెమీఫైనల్లో 237-237తో స్కోర్లు సమమయ్యాక... 'షూట్ ఆఫ్'లో భారత్ 27-29తో ఓడిపోయింది.

సౌత్ జోన్ కెప్టెన్‌గా విహారి



చెన్నై: దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్ జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. భారత టెస్టు జట్టు వికెట్ కీపర్, ఆంధ్ర జట్టుకే చెందిన కోన శ్రీకర్ భరత్, పేసర్ కేవీ శశికాంత్, బ్యాటర్ రికీ భుయ్ కూడా సౌత్ జోన్ జట్టులో ఉన్నారు. హైదరాబాద్ నుంచి యువస్టార్ ఠాకూర్ తిలక్ వర్మ మాత్రమే ఈ జట్టులో స్థానం దక్కింది. మయాంక్ అగర్వాల్ (కర్ణాటక) వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సాయి సుదర్శన్, సాయి కిశోర్, వాషింగ్టన్ సుందర్, ప్రదోశ్ రంజన్ పాల్ (తమిళనాడు), సమర్థ్, వైశాఖ్, విద్వత్ కావేరప్ప (కర్ణాటక), సచిన్ బేబీ (కేరళ), దర్శన్ మిసాల్ (గోవా) జట్టులోని ఇతర సభ్యులు. ఆరు జోన్ జట్ల మధ్య ఈనెల 28 నుంచి జూలై 16 వరకు బెంగళూరులో దులీప్ ట్రోఫీ టోర్నీ జరగనుంది.

సెమీస్‌లో భారత్



చెన్నై: ప్రపంచకప్ స్క్వాష్ టీమ్ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన పూల్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-0తో దక్షిణాఫ్రికా జట్టును ఓడించింది. తొలి మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 7-4, 7-2, 3-7, 7-2తో హేలీ వార్డ్‌పై... రెండో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 7-6, 7-4, 7-1తో డెవల్డ్ నీకెర్క్‌పై గెలిచారు. మూడో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 7-4, 7-3, 3-7, 7-1తో లిజెల్ ముల్లర్‌ను ఓడించడంతో భారత విజయం ఖరారైంది. చివరిదైన నాలుగో మ్యాచ్‌లో అభయ్ సింగ్ 7-4, 3-7, 7-6, 7-5తో జీన్ పియరీ బ్రిట్స్‌పై నెగ్గడంతో భారత్ విజయం పరిపూర్ణమైంది. నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు పూల్ 'బి' టాపర్‌గా నిలుస్తుంది.

వింబుల్డన్ ప్రైజ్‌మనీ పెంపు

సింగిల్స్ విజేతల ఖాతాలో రూ. 24 కోట్ల 43 లక్షలు

లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ చాంపియన్‌షిప్-2023 ప్రైజ్‌మనీ వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. జూలై 3 నుంచి 16 వరకు జరిగే ఈ టోర్నీలో ఈసారి పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 24 కోట్ల 43 లక్షలు) చొప్పున లభిస్తాయి. గత ఏడాది సింగిల్స్ విజేతలకు 20 లక్షల పౌండ్లు చొప్పున అందజేశారు. ఈసారి 3 లక్షల 50 వేల పౌండ్లు ఎక్కువగా ఇవ్వనున్నారు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ఓడిన క్రీడాకారులకు 55 వేల పౌండ్లు (రూ. 57 లక్షల 18 వేలు) దక్కుతాయి. క్వాలిఫయింగ్‌లో తొలి రౌండ్‌లో ఓడితే 12 వేల 750 పౌండ్లు (రూ. 13 లక్షల 25 వేలు), రెండో రౌండ్‌లో ఓడితే 21 వేల 750 పౌండ్లు (రూ. 22 లక్షల 61 వేలు), మూడో రౌండ్‌లో ఓడితే 36 వేల పౌండ్లు (రూ. 37 లక్షల 42 వేలు) లభిస్తాయి. పురుషుల సింగిల్స్‌లో జొకోవిచ్ (సెర్బియా), మహిళల సింగిల్స్‌లో రిబాకినా (కజకిస్తాన్) డిఫెండింగ్ చాంపియన్స్‌గా బరిలోకి దిగనున్నారు.

ఇంట్లో ఇంగ్లండ్‌తో... బయట ఆస్ట్రేలియాతో!

కొత్త డబ్ల్యూటీసీలో భారత సిరీస్‌లు



న్యూఢిల్లీ: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో వరుసగా రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు కోసం 2023-25 డబ్ల్యూటీసీ సిద్ధంగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిబంధనల ప్రకారం రెండేళ్ల వ్యవధిలో భారత్ 6 టెస్టు సిరీస్‌లు ఆడనుంది. ఇందులో 3 స్వదేశంలో, 3 విదేశాల్లో ఉంటాయి. వచ్చే నెలలో జరిగే వెస్టిండీస్ పర్యటనతో భారత్ ఈ పోరును మొదలు పెడుతుంది. ఆ తర్వాత ఈ ఏడాది చివర్లో టీమిండియా దక్షిణాఫ్రికాలో పర్యటిస్తుంది. అనంతరం సొంతగడ్డపై వరుసగా 3 సిరీస్‌లు ఆడుతుంది. ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీస్‌లో, బంగ్లాదేశ్‌తో, ఆ తర్వాత న్యూజిలాండ్‌తో 3 టెస్టుల సిరీస్‌లో తలపడుతుంది. చివరగా ఐదు టెస్టుల బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ఆడేందుకు ఆస్ట్రేలియాకు వెళుతుంది. ఈ సిరీస్‌లలో ప్రదర్శన ఆధారంగా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత్ అర్హత సాధిస్తుందా లేదా అనేది ఆసక్తికరం.

రెండేళ్లు, నాలుగేళ్లు ముందుగా...

2025 జూన్‌లో భారత జట్టు ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ తలపడుతుంది. దీనికి సంబంధించిన వేదికలను ఈసీబీ అప్పుడే ప్రకటించడం విశేషం. లార్డ్స్, ఓవల్, ఎడ్జ్‌బాస్టన్, హెడింగ్లీ, ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానాల్లో ఇరు జట్లు ఐదు టెస్టులు ఆడతాయి. 2029లో కూడా భారత జట్టు ఇంగ్లండ్ పర్యటిస్తుంది.

సినిమా

కాంబినేషన్ కుదిరింది



- మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి

హీరో విజయ్ దేవరకొండ - డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో వచ్చిన 'గీత గోవిందం' (2018) సినిమా సెన్సేషనల్ హిట్ అయిన విషయం తెలిసిందే. ఈ కాంబినేషన్‌లో రెండో సినిమా బుధవారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. 'దిల్' రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం జరిగింది. ఆ వార్త నిజమే. విజయ్-మృణాల్ కాంబో కుదిరింది. ఈ చిత్రం తొలి సీన్‌కి ఫైనాన్షియర్ సత్తి రంగయ్య కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, గోవర్ధన్ రావు దేవరకొండ గౌరవ దర్శకత్వం వహించారు. ''రెగ్యులర్ షూటింగ్ త్వరలో మొదలవుతుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీ సుందర్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసు వర్మ.

లుక్స్ అదుర్స్



- 'గుంటూరు కారం'లో శ్రీలీల



- 'ఆదికేశవ'లో...

'పెళ్లిసందడి' (2021) సినిమాతో తెలుగు పరిశ్రమకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు కన్నడ బ్యూటీ శ్రీలీల. ప్రస్తుతం తెలుగులో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న ఆమె బర్త్ డే జూన్ 14. ఈ సందర్భంగా శ్రీలీలకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ, ఆమె నటిస్తున్న పలు చిత్రాల్లోని లుక్స్‌ని విడుదల చేశారు మేకర్స్. ట్రెడిషనల్‌గా, మోడ్రన్‌గా అదిరే లుక్స్‌తో శ్రీలీల స్పెషల్ ట్రీట్ ఇచ్చారు. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'గుంటూరు కారం'లో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు శ్రీలీల. ఈ సినిమా నుంచి లంగా ఓణీలో కాలికి నెయిల్ పాలిష్ వేసుకుంటున్న ఆమె లుక్‌ని రిలీజ్ చేశారు. అలాగే బోయపాటి దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో రామ్‌కి జోడీగా నటిస్తున్నారీ బ్యూటీ. ఈ మూవీ నుంచి మోడ్రన్ డ్రెస్‌లో ఉన్న శ్రీలీల లుక్ రిలీజైంది. అదే విధంగా వైష్ణవ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'ఆదికేశవ'లో కథానాయికగా నటిస్తున్నారు శ్రీలీల. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నుంచి ఓ గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్‌లో పసుపు రంగు చీరలో మెరిశారు శ్రీలీల. ఇంకా నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలోని లుక్ రిలీజైంది.





ఎనిమిదేళ్ల తర్వాత అవతార్ 5

- వాయిదా పడ్డ 'అవతార్' సీక్వెల్స్... మార్వెల్ చిత్రాలు

ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లిన హాలీవుడ్ 'అవతార్', సూపర్ హీరోని చూపించిన మార్వెల్ చిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. అందుకే ఇటు 'అవతార్' సీక్వెల్స్ అటు 'మార్వెల్' ఫ్రాంచైజీల కోసం ఫ్యాన్స్ ఎదురు చూస్తుంటారు. ఈ రెండు భారీ ప్రాజెక్ట్స్‌ని హాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ రాజీపడకుండా నిర్మిస్తుంటుంది. దర్శకుడు జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' తొలి భాగం 2009లో రాగా, రెండో భాగం రావడానికి పదమూడేళ్లు పట్టింది. గత ఏడాది 'అవతార్ 2' విడుదలైంది. మూడు, నాలుగు, ఐదో భాగం కూడా ఉంటాయని చిత్ర యూనిట్ ప్రకటించి, విడుదల తేదీలను కూడా ప్రకటించింది. అయితే తేదీలు వాయిదా పడ్డాయి. ఇక 'మార్వెల్' ఫ్రాంచైజీలను ఒకే దర్శకుడు కాకుండా వేరు వేరు డైరెక్టర్లు తెరకెక్కించే విషయం తెలిసిందే. ఈ చిత్రాల విడుదల తేదీలు కూడా వాయిదా పడ్డాయి.

2031లో ఫైనల్ అవతార్


తొలుత 'అవతార్' మూడో భాగాన్ని 2024లో, నాలుగో భాగాన్ని 2025లో, ఐదో భాగాన్ని 2028లో విడుదలకు మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే వాయిదా వేశారు. ఈ విషయాన్ని వాల్ట్ డిస్నీ సంస్థ బుధవారం ప్రకటించింది. మూడో భాగాన్ని 2025 డిసెంబర్ 19న, నాలుగో భాగాన్ని 2029 డిసెంబర్ 21న, ఐదో భాగాన్ని.. అంటే ఫైనల్ 'అవతార్'ని 2031 డిసెంబర్ 19న విడుదల చేయనున్నట్లు తెలియజేసింది. ''ఒక్కో 'అవతార్' సినిమా ఒక్కో అద్భుతం. ఆ అద్భుతాన్ని ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టు ఇవ్వడానికి ఫిలిం మేకర్స్‌గా మేం తగినంత కృషి చేస్తున్నాం. నాణ్యత విషయంలో రాజీపడేది లేదు. 2025లో థియేటర్స్‌లో పండోరా ప్రపంచాన్ని చూపించడానికి యూనిట్ హార్డ్‌వర్క్ చేస్తోంది'' అని చిత్ర నిర్మాతల్లో ఒకరైన జాన్ లాండవ్ అన్నారు.

ఏడాదికి రెండు మార్వెల్ చిత్రాలు

వాల్ట్ డిస్నీ ఓ నిర్మాణ సంస్థగా వ్యవహరిస్తున్న మార్వెల్ చిత్రాలు చాలా ఫేమస్. ఇప్పటికి దాదాపు 30 చిత్రాలు రాగా, మార్వెల్ ఫ్రాంచైజీలో మరో 10 చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. కాగా... ఇప్పటికే విడుదల తేదీ ప్రకటించిన చిత్రాల కొత్త విడుదల తేదీలను నిర్మాణ సంస్థ ప్రకటించింది. మార్వెల్ ఫ్రాంచైజీలో వచ్చే ఏడాది మే 3న 'డెడ్ పూల్ 3' విడుదల కానుండగా అదే తేదీన విడుదలకు షెడ్యూల్ అయిన 'కెప్టెన్ అమెరికా: బ్రేవ్ న్యూ వరల్డ్' జూలై 24కి వాయిదా పడింది. కాగా, 'థండర్ బోల్ట్స్'ని జూలై 24న విడుదల చేయాలనుకున్నారు కానీ, డిసెంబర్ 20కి వాయిదా వేశారు. వచ్చే ఏడాది ఆరు నెలల గ్యాప్‌లో ఈ రెండు చిత్రాలు వస్తాయి. ఇక 2025లో కూడా రెండు మార్వెల్ చిత్రాలు రానున్నాయి. 'బ్లేడ్'ని 2025 ఫిబ్రవరి 14న, అదే ఏడాది మే 2న 'ఫెంటాస్టిక్ ఫోర్'ని, 'ఎవెంజర్స్: ది కాంగ్ డైనాస్టీ'ని 2026 మే 1న, 'ఎవెంజర్స్: సీక్రెట్ వార్స్'ని 2027 మే 7న విడుదల చేయనున్నారు.



లియోకి వాయిస్



- కమల్‌హాసన్

ఇళయ దళపతి విజయ్ అభిమానులకు లోక నాయకుడు కమల్‌హాసన్ ఓ స్వీట్ షాక్ ఇవ్వనున్నారని కోలీవుడ్ ఫిల్మ్ సర్కిల్ అంటోంది. వార్తల్లో ఉన్న ప్రకారం విజయ్ నటిస్తున్న 'లియో' చిత్రం టీజర్‌కి కమల్ వాయిస్ ఓవర్ ఇచ్చారట. ఈ నెల 22న విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఓ మంచి యాక్షన్ టీజర్‌ని రెడీ చేస్తున్నారట చిత్రదర్శకుడు లోకేష్ కనగరాజ్. విజయ్ పాత్ర పరిచయంతో ఈ టీజర్ సాగుతుందని, ఈ పరిచయం కమల్ మాటల్లో వినబడుతుందని భోగట్టా. కమల్ డబ్బింగ్ చెప్పేశారని, ఆ వాయిస్‌తో టీజర్ రెడీ చేసే పని మీద చిత్ర యూనిట్ ఉందని టాక్. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్ విలన్ పాత్ర చేస్తున్నారు. అక్టోబర్ 19న ఈ చిత్రం విడుదల కానుంది.

మనసు మాట వినదే...



- నాగార్జున, రోహిత్, అపర్ణ

రోహిత్ బెహల్, అపర్ణ జనార్ధనన్ జంటగా డీవై చౌదరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లవ్ యూ రామ్'. డైరెక్టర్ కె. దశరథ్ ఈ చిత్రానికి కథ అందించడంతో పాటు ఓ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డీవై చౌదరి, కె. దశరథ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కె. వేద స్వరపరచిన ఈ చిత్రంలోని 'మనసు మాట వినదే..' అంటూ సాగే పాటని హీరో నాగార్జున విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు. వరికుప్పల యాదగిరి రాసిన ఈ పాటను దివ్య మాలిక పాడారు. ''హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన 'మనసు మాట..'ని చక్కని మెలోడీగా కంపోజ్ చేశారు వేద'' అని యూనిట్ పేర్కొంది.

పదునైన కళ్లు



- దిశా పటాని

హీరో ప్రభాస్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా ఫిల్మ్ 'ప్రాజెక్ట్ కె'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌కి జోడీగా దీపికా పదుకోన్ నటిస్తున్నారు. వైజయంతీ మూవీస్‌పై అశ్వినీ దత్ నిర్మిస్తున్న ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, దిశా పటాని కీలక పాత్రలు చేస్తున్నారు. కాగా మంగళవారం (జూన్ 13) దిశా పటాని పుట్టినరోజు. ఈ సందర్భంగా పదునైన కళ్లతో ఆమె ప్రీ లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ''ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్‌గా 'ప్రాజెక్ట్ కె' రూపొందుతోంది. వైజయంతీ మూవీస్ ఈ గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. 2024న సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమాని విడుదల చేస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

మహిళల నేపథ్యంలో...



- విశ్వ కార్తికేయ, ఆయుషీ పటేల్

విశ్వ కార్తికేయ, ఆయుషీ పటేల్ జంటగా దర్శకుడు రమాకాంత్ రెడ్డి ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. కె. చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వర రెడ్డి, కాటం రమేష్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత కేఎస్ రామారావు క్లాప్ కొట్టారు. డైరెక్టర్ నీలకంఠ గౌరవ దర్శకత్వం వహించగా, నటుడు సుమన్ స్క్రిప్ట్‌ని అందించారు. ''స్త్రీలకు తల్లవ్వడం అనేది అదృష్టం. ఆ లక్‌ని సరిగ్గా వినియోగించుకోకపోతే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది కథ'' అన్నారు. ''జూలైలో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు చంద్ర ఓబుల్ రెడ్డి, రమేష్. ఈ చిత్రానికి కెమెరా: చరణ్ మాధవనేని, సంగీతం: అజయ్ అరసాడ.


నవ్వుల ఇంద్రజాలం

'శాసనసభ' ఫేమ్ ఇంద్రసేన హీరోగా 'ఇంద్రజాలం' సినిమా షురూ అయింది. జై క్రిష్ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. పూర్ణాస్ మీడియా సమర్పణలో నిఖిల్ కె. బాల స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి న్యాయమూర్తి ఆర్. మాధవరావు కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా ఇంద్రసేన మాట్లాడుతూ– ''శాసనసభ' నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ సినిమా చూసిన నిఖిల్‌గారు 'ఇంద్రజాలం'కి చాన్స్ ఇచ్చారు'' అన్నారు. ''క్రైమ్ థ్రిల్లర్‌తో కూడిన ప్రేమకథ ఇది. వినోదంతో పాటు ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా స్క్రీన్‌ప్లే ఉంటుంది'' అన్నారు దర్శక-నిర్మాత నిఖిల్ కె. బాల. చిత్ర సహ నిర్మాత పూర్ణ శైలజ, సంగీత దర్శకుడు ఎం.ఎం. కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: అమర్ కుమార్.



- జై క్రిష్, ఇంద్రసేన

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 84

గురువారం 15-6-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 84

గురువారం 15-6-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




సశస్త్ర సీమాబల్‌లో కొలువులు

1,656 పోస్టులకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ వివరాలపై కథనం - 7లో



నష్టాల్లోంచి లాభాల్లోకి..

85 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. నిఫ్టీ 40 పాయింట్లు అప్ - 7లో



'వేట' మొదలైంది..

2 నెలల విరామం తర్వాత మత్స్యకారులు మళ్లీ చేపల వేటకు సిద్ధమవుతున్నారు. దీంతో వారి గ్రామాల్లో సందడి నెలకొంది.

వివరాలు 2లో ▸



అనాథలకు అమ్మతోడు

దత్తత నిబంధనలను కేంద్రం సులభతరంగా మార్చింది. ఈ నేపథ్యంలో దత్తత ఆవశ్యకత, దరఖాస్తు చేయు విధానంపై కథనం.

వివరాలు 6లో ▸



వాళ్లంతే.. చెప్పలేసుకోరు

ఎండ ఉన్నా చెప్పులు వేసుకోరు.. ఆకలి వేసినా బయట తిండి తినరు.. మేమింతే అంటున్న తిరుపతి జిల్లా వేమన ఇండ్లపై కథనం.

వివరాలు 8లో ▸

డీఆర్‌డీవో సైంటిస్ట్.. భారీ వేతనం

డీఆర్‌డీవో సైంటిస్ట్–బి పోస్టుల వివరాలు, ఎంపిక విధానం, భవిష్యత్ కెరీర్‌పై ప్రత్యేక కథనం

వివరాలు 7లో ▸

న్యూస్‌రీల్

ఉద్యోగులకు స్పెషల్ పే పెంపు



వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పెషల్ పే పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 11వ వేతన సవరణ సిఫార్సుల మేరకు స్పెషల్ పేను గరిష్టంగా 33 శాతం వరకు పెంచింది. ఈ సవరించిన ప్రత్యేక వేతనాలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

వివరాలు 2లో ▸

ఫోన్లలో పాస్‌వర్డ్‌లు జాగ్రత్త!



బ్యాంకు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డు వంటి ముఖ్యమైన పాస్‌వర్డ్‌లను 17 శాతం మంది ప్రజలు తమ మొబైల్‌లోనే భద్రపర్చుకుంటున్నారని లోకల్ సర్కిల్ సంస్థ సర్వేలో వెల్లడైంది. ఇది సురక్షితం కాని.. పాస్‌వర్డ్‌ల విషయంలో నిర్లక్ష్యం వీడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వివరాలు 8లో ▸

ఫిషరీస్ యూనివర్సిటీ కార్యకలాపాలు ప్రారంభం



పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫిషరీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. 2023–24 విద్యా సంవత్సరంలో కోర్సుల నిర్వహణ కోసం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక తరగతి గదులను మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు బుధవారం ప్రారంభించారు.

వివరాలు 6లో ▸

నాలుగో పోర్టుతో మహర్దశ

కేసెజ్ పోర్టుతో పారిశ్రామిక నగరంగా కాకినాడ

- రూపురేఖలు మారనున్న ఉప్పాడ, తొండంగి
- స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు
- రూ.2,213 కోట్లతో 1,944 ఎకరాల్లో నిర్మాణం
- శరవేగంగా జరుగుతున్న పనులు.. మరో 18 నెలల్లో అందుబాటులోకి
- అన్నవరం – కేసెజ్ మధ్య రూ.300 కోట్లతో ప్రత్యేక రైల్వేలైన్ నిర్మాణం
- అన్నవరం – కాకినాడ మధ్య రూ.1,480 కోట్లతో 4 లేన్ల రహదారి
- ఇప్పటికే యాంకరేజ్, డీప్‌వాటర్, రవ్వ క్యాప్టివ్ పోర్టులతో పలు పరిశ్రమల ఏర్పాటు



చురుగ్గా సాగుతున్న కేసెజ్ పోర్టు పనులు

కేసెజ్ నుంచి చంద్రశేఖర్ మైలవరపు

ఇప్పటికే మూడు పోర్టులతో అలరారుతున్న కాకినాడ మరో పోర్టు రాకతో పారిశ్రామిక నగరంగా వేగంగా అభివృద్ధి చెందనుంది. డీప్‌వాటర్ పోర్టు, యాంకరేజ్ పోర్టు, రవ్వ క్యాప్టివ్ పోర్టులను కలిగి ఉన్న కాకినాడ సిగలో మరో పోర్టు జత చేరనుంది. కాకినాడ సెజ్‌లో సుమారు రూ.2213 కోట్లతో అరబిందో ఇన్‌ఫ్రా కంపెనీ పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో పోర్టును అభివృద్ధి చేస్తోంది. కేసెజ్ పోర్టుతో భారీ పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా పారిశ్రామిక నగరంగా వేగంగా విస్తరించి స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

1,944 ఎకరాల్లో కేసెజ్ పోర్టు

కాకినాడ డీప్‌వాటర్ పోర్టుతో ఇప్పటికే కోరమాండల్, నాగార్జున ఫెర్టిలైజర్స్, ప్యారీస్ షుగర్స్, నూనె శుద్ధి యూనిట్లు లాంటి పలు పరిశ్రమలు ఏర్పాటు కాగా కొత్త పోర్టు, కాకినాడ సెజ్ ద్వారా భారీ పరిశ్రమలు రానున్నాయి. యాంకరేజ్ పోర్టు బియ్యం, సిమెంట్, మొక్కజొన్న లాంటి ఎగుమతులకే పరిమితం కాగా రవ్వ పోర్టును ఓఎన్‌జీసీ సొంత అవసరాల కోసం నిర్మించారు. కాకినాడ డీప్‌వాటర్ పోర్టు మాత్రమే ఆధునిక బెర్తులతో

మిగతా 2వ పేజీలో ▶

సొంతూరిలోనే పని దొరికింది



పోర్టు పనులు ప్రారంభం కాకముందు ఇతర చోట్లకు వెళ్లి హేచరీస్‌లో పనులు చేశా. పోర్టు నిర్మాణ పనులు మొదలయ్యాక నాకు సొంతూరిలోనే ఉపాధి లభించింది. పోర్టు కోసం మా కుటుంబం మూడు ఎకరాల భూమి ఇచ్చింది. మాకు పూర్తి పరిహారం లభించింది. పోర్టు కార్యకలాపాలు మొదలైన తర్వాత ఇక్కడే ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

– సత్తిబాబు, ఆవులమంద గ్రామం

సైన్సు, ఆర్ట్స్‌కే ప్రాధాన్యం

టెన్త్ తరువాత 14% మందే కామర్స్ సబ్జెక్టుకు మొగ్గు

- తక్కిన వారంతా సైన్సు, ఆర్ట్స్ విభాగాల్లోనే చేరిక
- దేశవ్యాప్తంగా ఇదే ట్రెండ్
- గత పదేళ్ల ఇంటర్ విద్యా గణాంకాలతో కేంద్రం నివేదిక
- ఇంటర్లో 2012లో ఆర్ట్స్ విద్యార్థులు 30 లక్షలు.. ఇప్పుడు 40 లక్షలు
- సైన్సులో 30 లక్షల నుంచి 42 లక్షలకు చేరికలు
- కామర్స్‌లో 2012లో 13.7 లక్షలు.. ఇప్పుడు 14.4 లక్షలు
- ఏపీలో 76 శాతం విద్యార్థులు సైన్స్ వైపే మొగ్గు
- తెలంగాణ, తమిళనాడులో 60 శాతం పైగా సైన్స్‌లో చేరిక



సైన్సు, ఆర్ట్స్‌లో స్థిరమైన చేరికలు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా టెన్త్ తరువాత హయ్యర్ సెకండరీ (ఇంటర్మీడియెట్) తరగతుల్లో చేరే విద్యార్థుల్లో ఎక్కువ మంది సైన్సు, ఆర్ట్స్ స్ట్రీమ్స్ (విభాగాలు)కే ప్రాధాన్యమిస్తున్నారు. గత 10 ఏళ్లలో (2012 నుండి 2022 వరకు) హయ్యర్ సెకండరీ తరగతుల్లోకి వచ్చే విద్యార్థుల్లో అత్యధిక శాతం సైన్సు, ఆర్ట్స్ గ్రూపుల్లోకి వస్తుండగా.. 14 శాతం మంది మాత్రమే కామర్స్ స్ట్రీమ్ ఎంచుకుంటున్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గత పదేళ్లలో హయ్యర్ సెకండరీ తరగతుల అధ్యయన నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. 10వ తరగతి తర్వాత ఆర్ట్స్, సైన్స్ స్ట్రీమ్‌లలో చేరే విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగింది. దేశవ్యాప్తంగా సైన్స్, ఆర్ట్స్ ఎంచుకున్న విద్యార్థులు 2012లో 31 శాతం ఉండగా (రెండింటికీ కలిపి), 2022 నాటికి సైన్సులో 42 శాతానికి, ఆర్ట్స్‌లో 40 శాతానికి పెరిగినట్లు వెల్లడించింది. ఇంటర్లో 2012లో 30.9 లక్షల మంది విద్యార్థులు ఆర్ట్స్ స్ట్రీమ్‌ను తీసుకున్నారు. 2022లో ఈ సంఖ్య 40 లక్షలకు చేరుకుంది. సైన్స్ స్ట్రీమ్‌లో 2012లో 30.7 లక్షల మంది విద్యార్థులు ఉండగా, 2022లో వీరి సంఖ్య 42 లక్షలకు పెరిగింది. అదే కామర్స్ స్ట్రీమ్‌లో 2012లో 13.7 లక్షల మంది విద్యార్థులు ఉండగా 2022కి వారి సంఖ్య నామమాత్రంగానే పెరిగింది. ఇప్పుడు కామర్స్ విద్యార్థులు 14.4 లక్షల మంది ఉన్నారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నందున ఆ స్ట్రీమ్‌లో చేరికలు

మిగతా 2వ పేజీలో ▶

సాగుకు వేళాయె!

- ఖరీఫ్–2023 సాగు లక్ష్యం 89.37 లక్షల ఎకరాలు
- గత ఖరీఫ్‌లో 79.53 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 6.14 లక్షల క్వింటాళ్ల విత్తనాలు.. జోరుగా పంపిణీ
- 17.44 లక్షల టన్నుల ఎరువులు సిద్ధం.. రైతులకు రూ.1.13 లక్షల కోట్ల రుణాలు



సాక్షి, అమరావతి: మృగశిర కార్తె మొదలవడంతో రైతులు తొలకరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. పెట్టుబడికి ఢోకా లేకుండా వైఎస్సార్ రైతు భరోసా తొలివిడత సాయాన్ని రైతులకు ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేసింది. ఓ వైపు నైరుతి రుతు పవనాలు కమ్ముకొస్తుండగా.. గోదావరి, కృష్ణా డెల్టాల పరిధిలో కాలువలకు ఇప్పటికే నీరు విడుదల చేశారు. మిగిలిన ప్రాంతాలకు దశల వారీగా విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రబీ కోతలు పూర్తయిన ప్రాంతాల్లో వేసవి దుక్కుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్–2023లో సాగు లక్ష్యం 89.37 లక్షల ఎకరాలుగా నిర్దేశించారు. ప్రధానంగా 39.70 లక్షల ఎకరాల్లో వరి, 17.25 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 15.45 లక్షల ఎకరాల్లో పత్తి, 6.30 లక్షల ఎకరాల్లో కందులు, 1.62 లక్షల ఎకరాల్లో చెరకు, 3.12 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

జోరుగా విత్తన పంపిణీ

ఖరీఫ్–2023 కోసం 6.14 లక్షల క్వింటాళ్ల

మిగతా 2వ పేజీలో ▶


రెండో ఎంఈవో పోస్టు భర్తీకి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: విద్యాశాఖను మరింత పటిష్టం చేయడంలో భాగంగా పాఠశాలల పర్యవేక్షణ కోసం మండల విద్యాధికారి–2 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎంఈవోలు, గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులతో ఈ పోస్టులను భర్తీ చేయనుంది. ఈమేరకు బుధవారం విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 670 మండలాలు ఉన్నాయి. వీటన్నిటికీ కొత్తగా రెండో ఎంఈవో రానున్నారు. ప్రస్తుతం ఉన్న ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల ఆసక్తి, సీనియారిటీ ఆధారంగా ఎంఈవో–2 పోస్టుల్లో నియమించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, మండల విద్యాశాఖ అధికారి–2 పోస్టులను భర్తీ చేయడానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, జాక్టో చైర్మన్ కేశవరపు జాలిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

పోలవరం ముంపు జాబితాలోకి

మరో 14 గ్రామాలు

- ఈ ఏడాది మార్చిలో 17 గ్రామాలను ముంపు జాబితాలో చేర్చిన ప్రభుత్వం
- తాజా నిర్ణయంతో 98కి చేరిన ముంపు గ్రామాల సంఖ్య



చింతూరు: పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల జాబితాలో ఏఎస్‌ఆర్ జిల్లాలోని మరో 14 గ్రామాలు చేరాయి. ఈ ఏడాది మార్చిలో పోలవరం ముంపు మండలాలైన ఏఎస్‌ఆర్ జిల్లాలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురంలో 17 గ్రామాలను చేర్చగా.. తాజాగా ఈ మూడు మండలాల్లో మరో 14 గ్రామాలను చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2022లో వచ్చిన గోదావరి వరదల ముంపును ప్రామాణికంగా తీసుకుని ముంపు గ్రామాల జాబితాలో అదనపు గ్రామాలను చేర్చారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పోలవరం ఆర్ అండ్ ఆర్, రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించారు.

98కి చేరిన ముంపు గ్రామాల సంఖ్య

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 (తొలిదశ) కాంటూరు పరిధిలో 67 గ్రామాలు ముంపు బారిన పడతాయని లెక్కతేల్చారు. ఇప్పటికే ఆయా గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్రక్రియ పూర్తిచేశారు. కాగా గతేడాది సంభవించిన వరదలకు పోలవరం ముంపుతో సంబంధం లేకుండా చింతూరు, కూనవరం, వీఆర్ పురం మండలాల్లో పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో తమ గ్రామాలను తొలిదశలో కలిపి

మిగతా 2వ పేజీలో ▶

గతానికి మించి

భానుడి భగభగలు

- గతంలో కొన్ని ప్రాంతాల్లో.. కొన్ని గంటలు మాత్రమే అధిక ఉష్ణోగ్రతలు
- ఈ ఏడాది దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ.. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు తీవ్రత
- ఎండలు పెరిగినా తగ్గిన వడదెబ్బ మరణాలు
- 2017లో 236 మంది మృతులు
- ఈ ఏడాది ముగ్గురు
- ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసిన విపత్తు నిర్వహణ సంస్థ



సాక్షి, అమరావతి: గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రాష్ట్రంలో ఎండలు తమ విశ్వరూపాన్ని చూపిస్తున్నాయి. ఏదో ఒక్క చోట కాకుండా దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉన్నా తక్కువ ప్రాంతాల్లోనే అవి ఉండేవి. అలాగే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే తీవ్రత ఉండేది. అయితే ఈ ఏడాది మెజారిటీ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతే కాకుండా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటలకు సైతం 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీన్నిబట్టి ఈ ఏడాది ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనా 44 డిగ్రీలున్నట్టు ఉంటోందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. అలాగే 45 డిగ్రీలు నమోదైతే 49 డిగ్రీలున్నట్టు అనిపిస్తోందని అంటున్నారు. గాలిలో తేమ శాతం అసలు లేకపోవడమే దీనికి కారణం. అందులోనూ అన్ని జిల్లాల్లోనూ సగటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో గతంలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలకు, ఈ ఏడాది నమోదైన ఉష్ణోగ్రతలకి పోలికే లేదని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏరకంగా చూసినా ఈ సంవత్సరం నమోదైన ఉష్ణోగ్రతలు రికార్డులను బ్రేక్ చేసినట్లేనని అంచనా వేస్తున్నారు.

నైరుతి వచ్చినా.. 44 డిగ్రీలకుపైనే ఎండలు

నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమవడం, వాటి మందగమనం వల్ల రాష్ట్రంలో ఇంకా 44 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఒకప్పుడు మండే ఎండలంటే 35–36 డిగ్రీలు ఉండేవి. అది కూడా మేలో మాత్రమే నమోదయ్యేవి. కానీ ఇప్పుడు 40 డిగ్రీల ఎండ సాధారణంగా మారిపోయింది. భూతాపం (గ్లోబల్ వార్మింగ్) పెరగడమే దీనికి ప్రధాన కారణం. ఈ ఏడాది భానుడి భగభగలు ఫిబ్రవరి నుంచే ప్రారంభమయ్యాయి. ఆ నెల చివరి వారంలోనే కర్నూలు జిల్లా కౌతాళంలో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2022లో ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరులో అత్యధికంగా 45.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదవగా.. ఈ ఏడాది తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 46.8 డిగ్రీలు, ప్రకాశం జిల్లా గుండ్లపల్లిలో 46.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. నెలల వారీగా చూసినప్పుడు మార్చిలో నంద్యాల జిల్లా నందికొట్కూరు, వైఎస్సార్ జిల్లా కడప మండలంలో 41.8, ఏప్రిల్‌లో పల్నాడు జిల్లా బెల్లంకొండలో 45.9, మేలో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 46.8, జూన్‌లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో 45.6 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఎండలు పెరిగినా తగ్గిన వడదెబ్బ మృతులు

ఎండలు పెరిగినా ఈ ఏడాది వడదెబ్బ మృతుల సంఖ్య చాలా తగ్గింది. 2016లో వడదెబ్బకు 723 మృతి చెందారు. 2017లో 236, 2018లో 8, 2019లో 28 మంది మరణించారు. 2020, 21, 22ల్లో వడగాడ్పుల మరణాలు అసలు సంభవించలేదు. ఈ ఏడాది తీవ్ర ఎండలు, వడగాడ్పులున్నా ప్రాణనష్టం ముగ్గురికి పరిమితమైంది.

ప్రాణనష్టాన్ని తగ్గించాం..

వాతావరణ శాఖ అంచనాల మేరకు విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి చర్యలు తీసుకుని ప్రాణనష్టాన్ని తగ్గించగలిగాం. ఎండ తీవ్రత, అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు వీచే జిల్లాల యంత్రాంగానికి 48 గంటల ముందే సూచనలు అందించాం. క్షేత్రస్థాయిలో ప్రజలకు జాగ్రత్తలు, హెచ్చరిక సందేశాలు పంపి నిరంతరం అప్రమత్తం చేశాం. రియల్‌టైమ్‌లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తూ.. 40 డిగ్రీలు దాటే మండలాల తహసీల్దార్లకు ముందుగానే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాం. సంబంధిత మండలంలో అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించాం.

– బీఆర్ అంబేడ్కర్, ఎండీ, విపత్తుల నిర్వహణ సంస్థ



పాపికొండల అభయారణ్యంలో కెమెరాకు చిక్కిన బంగారు బల్లి

పోలవరం అడవిలో

బంగారు బల్లి

- సూర్యరశ్మి తగలని ప్రదేశాల్లో నివసించే జీవి
- ఒకేసారి 40 నుంచి 150 గుడ్లు పెట్టే ప్రాణి

బుట్టాయగూడెం: అరుదైన జాతికి చెందని బంగారు బల్లి అంతరించిపోతున్న జీవుల్లో ముఖ్యమైనది. ఇప్పుడివి పోలవరం అడవిగా పిలిచే పాపికొండలు అభయారణ్యంలోని కొండ గుహల్లో సందడి చేస్తున్నాయి. బంగారు బల్లి శాస్త్రీయ నామం కాలొడాక్టిలోడస్ అరీస్. సాధారణంగా ఇవి రాత్రి పూట మాత్రమే సంచరిస్తాయి. బంగారు వర్ణం పోలిన ముదురు పసుపు..

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

డీఎస్సీ-1998 ఉపాధ్యాయుల పునర్నియామకం

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికపై నియమితులైన డీఎస్సీ-1998 టీచర్ల సేవలను ప్రభుత్వం పునరుద్ధరించింది. 2023-24 విద్యా సంవత్సరంలో వీరు సేవలు అందించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు వీరు విధుల్లో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: రక్తదానాన్ని ప్రోత్సహించడం అత్యంత ప్రాధాన్యత అంశంగా రాష్ట్ర ప్రభుత్వం పరిగణిస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. తలసేమియా బాధితులకు తగినన్ని యూనిట్ల రక్తం సరఫరాకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. రాష్ట్రంలోని 21 బ్లడ్ బ్యాంకుల ద్వారా ఏటా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరిస్తుండడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదానం ఆవశ్యకతను అందరూ మరోసారి మననం చేసుకోవాలని ఆయన పేర్కొన్నట్లు రాజ్‌భవన్ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

6,829 యూనిట్ల రక్తం సేకరణ

- ఏపీ శ్యాక్స్ పీడీ నివాస్



సాక్షి, అమరావతి: 'వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే'ను పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ శ్యాక్స్ (ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) ఆధ్వర్యంలో బ్లడ్ క్యాంపులు నిర్వహించినట్లు పీడీ జె.నివాస్ తెలిపారు. ఈ క్యాంపులకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 201 క్యాంపులు నిర్వహించగా 6,829 యూనిట్ల రక్తాన్ని సేకరించామని చెప్పారు. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 887 యూనిట్లు సేకరించినట్లు వెల్లడించారు. అదే విధంగా ప్రజల్లో రక్తదానంపై అవగాహన పెంచడం కోసం ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్‌లు, ఎస్పీలు, వైద్య, వివిధ శాఖల అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సన్మానించినట్లు చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతూనే ఉన్నాం

- సోము వీర్రాజు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ మొదట నుంచీ పోరాడుతూనే ఉందని, ఆ పార్టీతో తామెప్పుడూ కలిసిలేమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తామేమీ ఇప్పుడు కొత్తగా మాట్లాడడం లేదని అలాగే ముఖ్యమంత్రి జగన్‌ను భాజపా ఎప్పుడూ సమర్థించలేదని చెప్పారు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంపై యువ మోర్చా ఉద్యమం చేపడితే కేంద్రమంత్రి అనురాగ్‌ఠాగూర్ వచ్చి వైకాపా మద్యం మాఫియాపై తీవ్ర విమర్శలు చేశారని గుర్తుచేశారు.

విరామం ముగిసింది.. వేట మొదలైంది!



ముగిసిన నిషేధ కాలం.. లంగరెత్తిన మత్స్యకారులు

- మత్స్యకార గ్రామాల్లో పండుగ వాతావరణం
- వరుసగా ఐదో ఏడాదీ 'నిషేధ' సమయంలోనే భృతి చెల్లింపు
- డీజిల్ సబ్సిడీ పెంపుతో 29,964 కు చేరిన బోట్ల సంఖ్య

సాక్షి, అమరావతి: గంగపుత్రుల వేటకు వేళైంది. రెండు నెలల విరామం తర్వాత సముద్రంలో చేపల వేటకు వెళుతున్నారు. దీంతో మత్స్యకార గ్రామాల్లో పండుగ వాతావరణం, హార్బర్ల వద్ద సందడి నెలకొంది. బోట్లకు రంగులు వేసి అలంకరించారు. వలలకు మరమ్మతులు చేసుకున్నారు. కనీసం పది రోజులకు సరిపడా డీజిల్ ఆయిల్ నింపుకోవడంతో పాటు.. మత్స్య సంపదను నిల్వచేసుకునేందుకు వీలుగా ఐస్‌ను సిద్ధం చేసుకుని రెట్టించిన ఉత్సాహంతో గంగపుత్రులు వేటకు బయల్దేరారు.

మత్స్య దిగుమతులు పైపైకి..

బోట్ల సంఖ్య పెరగడంతో వలకు చిక్కే సముద్ర మత్స్య ఉత్పత్తులూ ఏటా పెరుగుతున్నాయి. 2019-20లో 4.40 లక్షల టన్నుల చేపలు, 1.24 లక్షల టన్నుల రొయ్యలు మత్స్యకార వలలకు చిక్కాయి. 2020-21లో 4.60 లక్షల టన్నుల చేపలు, 1.34 లక్షల టన్నుల రొయ్యలు, 2021-22లో 4.60 లక్షల టన్నుల చేపలు, 1.35 లక్షల టన్నుల రొయ్యలు, 2022-23లో సముద్ర చేపలు 4.68 లక్షల టన్నులు, సముద్ర రొయ్యలు 1.35 లక్షల టన్నులు, 2023-24లో సముద్ర చేపలు 4.75 లక్షల టన్నులు, రొయ్యలు 1.36 లక్షల టన్నులు మత్స్యకారులకు చిక్కాయి. ఫలితంగా సముద్ర చేపల ఉత్పత్తిలో ఏపీ మూడో స్థానంలో నిలిచింది.

భద్రంగా భృతి.. ఎప్పటికప్పుడు సబ్సిడీ

చేపల పునరుత్పత్తి కోసం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు వేట నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేసింది. తడ మొదలుకుని ఇచ్ఛాపురం వరకు 974 కి.మీ. మేర విస్తరించిన సముద్ర తీరంలో 555 మత్స్యకార గ్రామాల్లో 8.50 లక్షల మంది మత్స్యకార కుటుంబాలున్నాయి. వారిలో 1.60 లక్షల కుటుంబాలు వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. నిషేధ సమయంలో గతంలో రూ.2 వేలు, బియ్యం, ఇతర నిత్యావసరాలు ఇచ్చేవారు. ఆ తర్వాత నిత్యావసరాలు నిలిపేసి రూ.4 వేల చొప్పున భృతి ఇచ్చేవారు. అదీ వేట నిషేధం ముగిసిన ఆర్నెల్లకో ఏడాదికో అరకొరగా.. తమకు అనుకూలంగా ఉన్న వారికే ఇచ్చేవారు. ఇలా టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రూ.104.62 కోట్ల వేట నిషేధ భృతి అందించింది. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నిషేధ భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచడమే కాకుండా.. ఆ మొత్తాన్ని నిషేధ కాలం ముగిసేలోపే అందిస్తోంది. గత నెల 16న 1.23 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.123.52 కోట్ల మేర వైఎస్సార్ మత్స్యకార భృతిని అందజేశారు. ఇలా నాలుగేళ్లలో రూ.538 కోట్లు అందించారు. అలాగే గతంలో డీజిల్‌పై లీటర్‌కు రూ.6.03 సబ్సిడీ ఇచ్చేవారు. టీడీపీ హయాంలో తొలి మూడేళ్లు ఏటా కేవలం 460 బోట్లకు, ఆ తర్వాత రెండేళ్లు 1,100 బోట్లకు సబ్సిడీ ఇచ్చారు. ఐదేళ్లలో రూ.60.12 కోట్ల లబ్ధిచేకూర్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ సబ్సిడీ మొత్తాన్ని రూ.9కి పెంచడమే కాకుండా.. తొలిసారి తెప్పలు, నావలకూ వర్తింపజేసింది. ఆయిల్ పోయించుకునేటప్పుడే సబ్సిడీ మినహాయించుకుని చెల్లించేలా మత్స్యకారులకు స్మార్ట్ కార్డులిచ్చారు. ఇలా నాలుగేళ్లలో రూ.100 కోట్లకు పైగా సబ్సిడీని ప్రభుత్వం భరించింది. సబ్సిడీ పెంపుతో వేటకు వెళ్లే బోట్ల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2019-20లో 14,229 బోట్లు వేటకు వెళ్లగా, ప్రస్తుతం 29,964 బోట్లు వేటకు వెళుతున్నాయి.

ఉద్యోగులకు స్పెషల్ పే పెంపు

- జూలై 1 నుంచి అమల్లోకి
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 11వ వేతన సవరణ సిఫార్సులకు అనుగుణంగా పెంపు
- హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు

సాక్షి, అమరావతి: వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పెషల్ పే పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. 11వ వేతన సవరణ సిఫార్సుల మేరకు స్పెషల్ పేను గరిష్టంగా 33 శాతం వరకు పెంచింది. 11వ వేతన సవరణ సిఫార్సులకు అనుగుణంగా స్పెషల్ పే ఏ మేరకు పెంచాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి దానికి అనుగుణంగా వివిధ కేటగిరీలకు స్పెషల్ పే పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సవరించిన ప్రత్యేక వేతనాలు జూలై 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల్లో కొంతమందికి ప్రస్తుతం రూ.675 ఉన్న స్పెషల్‌పే రూ.900కి పెరిగితే, మరికొందరికి రూ.260 ఉన్న స్పెషల్ పే రూ.350కి పెరిగింది. డిపార్ట్‌మెంటు, హోదాల వారీగా ఎవరికి ఎంత స్పెషల్ పే పెరిగిందన్న విషయాన్ని ఆ ఉత్తర్వుల్లో వివరించారు. ప్రభుత్వం ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ చర్చల్లో ఇచ్చిన హామీమేరకు వివిధ కేటగిరీల ఉద్యోగులకు స్పెషల్ పే పెంచడంపై ఉద్యోగసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఉద్యోగుల స్పెషల్ పేకి సంబంధించి 11వ వేతన సిఫార్సులను యథాతథంగా అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దీనివల్ల ఒకటి రెండు కేటగిరీల ఉద్యోగులకు తప్ప మిగతా కేటగిరీల వారందరికీ స్పెషల్ పే 30 నుంచి 33 శాతం పెరుగుతుందని పేర్కొన్నారు.

పోలవరం ముంపు జాబితాలోకి మరో 14 గ్రామాలు

▶ మొదటి పేజీ తరువాయి

నష్టపరిహారం ఇవ్వాలని ముంపుప్రాంతాల ప్రజలు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. వరద ముంపును దృష్టిలో పెట్టుకుని ప్రాధాన్యత క్రమంలో కొన్ని గ్రామాలను ముంపు జాబితాలో చేర్చాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. దీంతోపాటు గతేడాది వరద ముంపును స్వయంగా పరిశీలించిన జిల్లా అధికారులు వరద ప్రాంతాల పర్యటనకు చింతూరు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పరిస్థితిని వివరించారు. దీనిపై అధ్యయనం చేసిన అధికారులు ఎట్టకేలకు గతంలో 41.15 కాంటూరు పరిధిలో ముంపునకు గురవుతున్న 67 గ్రామాలకు అదనంగా ఈ ఏడాది మార్చిలో మరో 17 గ్రామాలను ముంపు జాబితాలో చేర్చారు. తాజాగా వాటికి తోడు మరో 14 గ్రామాలను కూడా చేర్చారు. దీంతో ప్రాధాన్యత గ్రామాల సంఖ్య 31కు చేరగా.. తొలి దశలోని 67 గ్రామాలతో కలుపుకుని ముంపు గ్రామాల సంఖ్య 98కి చేరింది. కొత్తగా చేర్చిన వాటిలో వీఆర్ పురం మండలంలో కన్నాయిగూడెం, కొప్పలి, శబరిరాయిగూడెం, సోములగూడెం, రామవరం, చొప్పల్లి, చింతూరు మండలంలో మల్లెతోట, ఉలుమూరు, ఏజీ కోడేరు, చూటూరు, మార్కండేయులపేట, కూనవరం మండలంలో లేళ్లవాయి, కూళ్లపాడు, వాల్ఫ్రడ్‌పేట గ్రామాలున్నాయి.

నూరుశాతం జనన, మరణాలు నమోదు కావాలి

- పంచాయతీలు, మున్సిపాలిటీలకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నూరుశాతం జనన, మరణాల నమోదు (రిజిస్ట్రేషన్) జరిగేలా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. ఆధార్ అనుసంధానిత జనన, మరణ ధ్రువీకరణ అంశంపై ఆయన బుధవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశుసంక్షేమ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేసి రానున్న రోజుల్లో ఆధార్ అనుసంధానిత జనన, మరణ ధ్రువీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి త్వరలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నూరుశాతం జనన, మరణాల నమోదుకు సంబంధించి పంచాయతీలు, మున్సిపాలిటీలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేయాలని సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. వచ్చే సమావేశంలో పలు అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించి కార్యాచరణ అమలుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు గోపాలకృష్ణ ద్వివేది, బి.రాజశేఖర్, ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, సీడీఎంఏ కోటేశ్వరరావు తదితరులు ప్రత్యక్షంగా, యుఐడీఏఐ అధికారులు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

సాగుకు వేళాయె!

▶ మొదటి పేజీ తరువాయి

సబ్సిడీ విత్తనాలతో పాటు గతేడాది మాదిరిగానే ఈసారి కూడా వాణిజ్య పంటలైన పత్తి, మిరప, మొక్కజొన్నతో పాటు కూరగాయల విత్తనాల (నాన్ సబ్సిడీ)ను కూడా ఆర్బీకేల ద్వారా రైతులకు సరఫరా చేయనున్నారు. ఇప్పటివరకు 2.24 లక్షల క్వింటాళ్ల విత్తనం కోసం 3.52 లక్షల మంది రైతులు ఆర్బీకేల్లో వివరాలను నమోదు చేసుకున్నారు. 13వేల మందికి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయగా.. 18,835 మందికి వేరుశనగ విత్తనం పంపిణీ చేశారు. మిగిలిన విత్తనాలను ఆర్బీకేల్లో నిల్వ చేశారు. అలాగే 7,687 క్వింటాళ్ల పత్తి విత్తనం (35.75 లక్షల ప్యాకెట్లు) అవసరం కాగా, దాంట్లో 1,921 క్వింటాళ్ల విత్తనం (8.94 లక్షల ప్యాకెట్లు) ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 5,900 క్వింటాళ్ల మొక్కజొన్న, 356 క్వింటాళ్ల జొన్న, 62 క్వింటాళ్ల సన్‌ఫ్లవర్, 290 టన్నుల సజ్జ విత్తనాలను కూడా ఆర్బీకేల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టగా, ఇప్పటికే 20,077 శాంపిల్స్ సేకరించారు. 13 వేల శాంపిల్స్‌ను విశ్లేషించగలిగారు.

ఆర్బీకేల ద్వారానే 10 లక్షల టన్నుల ఎరువులు

ప్రస్తుత సీజన్‌కు 17.43 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా.. ఇప్పటికే 9.04 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచింది. మరోవైపు 4 లక్షల లీటర్ల నానో యూరియాతో పాటు 6.25 లక్షల లీటర్ల నానో డీఏపీ బాటిల్స్‌ను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడేళ్లలో ఆర్బీకేల ద్వారా 8.75 లక్షల టన్నుల ఎరువులను సరఫరా చేయగా.. ప్రస్తుత సీజన్‌లోనే 10 లక్షల టన్నులు సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ కోసం 1,600 టన్నుల పురుగుల మందులు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.1.13 లక్షల కోట్ల రుణాలు

2023-24 సీజన్‌లో రైతులకు రూ.1.92 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రూ.1.13 లక్షల కోట్లు ఇవ్వనున్నారు. దాంట్లో పంట రుణాలు రూ.80 వేల కోట్లు, టర్మ్ రుణాలు రూ.33 వేల కోట్లు ఇవ్వాలని లక్ష్యం కాగా.. ఇప్పటికే రూ.11.946 కోట్ల రుణాలు ఇచ్చారు. కౌలు రైతులకు రూ.4 వేల కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు.

రైతుకు అండగా నిలుస్తాం

విత్తు నుంచి కోత వరకు రైతులకు అండగా నిలిచేలా ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. విత్తన పంపిణీ జోరుగా సాగుతోంది. ఎరువులతోపాటు నానో యూరియా, నానో డీఏపీని కూడా ఈసారి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. గ్యాప్ సర్టిఫికేషన్ కోసం ఎంపిక చేసిన క్లస్టర్స్ పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వెయ్యి పొలంబడులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– చేవూరి హరికిరణ్,
స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

రాష్ట్రంలో తొలి మహిళా సహకార డెయిరీ ప్రారంభం

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో ఏర్పాటు
- 'అమ్మ డెయిరీ'ని ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



డెయిరీని ప్రారంభిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీచరణ్ తదితరులు

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్‌లో తొలి 'మహిళా సహకార డెయిరీ' అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఏర్పాటైంది. స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత నిధులు రూ.20 కోట్లు ఖర్చు చేసి నియోజకవర్గంలోని 10 వేల మంది మహిళా పాడి రైతుల కోసం ఈ డెయిరీ ఏర్పాటు చేశారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన నిర్మించిన ఈ డెయిరీకి 'అమ్మ డెయిరీ'గా నామకరణం చేశారు. ఈ డెయిరీని బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. దీనివల్ల ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. ప్రారంభంలో రోజూ లక్ష లీటర్ల పాలను సేకరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ డెయిరీకి పాలు పోసే రైతులందరూ యజమానులేనని స్పష్టం చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్సు, ఆర్ట్స్‌కే ప్రాధాన్యం

▶ మొదటి పేజీ తరువాయి

పెరగడం సహజం. అయితే కామర్స్ కన్నా ఆర్ట్స్‌లో చేరికలు ఎక్కువగా ఉన్నాయి. వాణిజ్య రంగంలో ఉద్యోగావకాశాలు అంతగా లేకపోవడమే ఇందుకు కారణం అయ్యుంటుంది' అని ఆ నివేదిక విశ్లేషించింది.

ఏపీ, తెలంగాణ, తమిళనాడుల్లో సైన్స్‌కే ఆదరణ

ఈ అధ్యయనం ప్రకారం గత 10 సంవత్సరాలలో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులో ఎక్కువ మంది విద్యార్థులు సైన్స్ వైపు మొగ్గు చూపారు. ఏటా ఆంధ్రప్రదేశ్‌లో 76 శాతం, తెలంగాణలో 65 శాతం, తమిళనాడులో 62 శాతం విద్యార్థులు సైన్స్ స్ట్రీమ్‌లో చేరుతున్నారు. ఇక గుజరాత్ (82 శాతం), పంజాబ్ (73 శాతం), రాజస్థాన్ (71 శాతం)లలో విద్యార్థులు ఆర్ట్స్ స్ట్రీమ్‌కు ప్రాధాన్యతనిచ్చారు. అయితే, కర్ణాటకలో మాత్రం 37 శాతం మంది కామర్స్ స్ట్రీమ్‌ను ఎంచుకున్నారు.

ఉత్తీర్ణత శాతాలూ భారీగా పెరుగుదల

ఇలా ఉండగా గత దశాబ్దంలో 10, 12వ తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది. 10వ తరగతిలో 60 శాతానికి పైగా మార్కులు సాధించిన వారి శాతం 2012లో 33 లక్షల నుంచి 2022లో 98 లక్షలకు చేరుకోవడం విశేషం. 12వ తరగతిలో 60 శాతానికి పైగా స్కోర్ చేసిన విద్యార్థులు 2012లో 35.9 లక్షల మంది ఉండగా 2022 నాటికి వారి సంఖ్య 77 లక్షలకు చేరుకుంది. ఇంటర్లో ఉత్తీర్ణత శాతం గతంలో 60 నుంచి 65 శాతం లోపే ఉండగా అదిప్పుడు 90 శాతానికి పైగా చేరిందని నివేదిక విశ్లేషించింది. 10, 12 తరగతుల్లో బాలురకన్నా బాలికలు ఎక్కువగా రాణిస్తున్నారు. బాలురకన్నా బాలికల ఉత్తీర్ణత 8 శాతం ఎక్కువగా ఉంది.

11 రాష్ట్రాల్లో డ్రాపవుట్ సమస్య

టెన్త్ తరువాత ఇంటర్మీడియెట్ తరగతుల్లో చేరకుండా డ్రాపవుట్ అవుతున్న వారి సంఖ్య 11 రాష్ట్రాల్లో అత్యధికంగా ఉన్నట్లు కేంద్ర నివేదిక వెల్లడించింది. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటక, అసోం, పశ్చిమ బెంగాల్, హర్యానా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో డ్రాపవుట్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది.

పోలవరం అడవిలో బంగారు బల్లి

▶ మొదటి పేజీ తరువాయి


లేత పసుపు రంగులో 150 మిల్లీమీటర్ల నుంచి 180 మిల్లీమీటర్ల పొడవు ఉంటాయి. సూర్యరశ్మి పడని, వేడి తగలని ప్రదేశాల్లో మాత్రమే సంచరిస్తాయి. రాతి గుహలు, వాటి సందు మధ్య ఉండే తేమ ప్రాంతాలంటే బంగారు బల్లులకు మహా ఇష్టం.

40 నుంచి 150 వరకు గుడ్లు పెడతాయి

ఇవి ఒకేసారి సుమారు 40 నుంచి 150 వరకు గుడ్లు పెడతాయి. ఇవి గుడ్లను విచిత్రంగా కిందకి వేలాడే విధంగా పెడతాయి. ఈ గుడ్లను పాములు, క్రిమికీటకాలు తినేస్తుండటంతో ఇవి అంతరించిపోయే జాతుల్లోకి చేరుతున్నాయని అంటున్నారు. పాపికొండలు అభయారణ్య గోదావరి పరీవాహక రాతి ప్రాంతాల్లో సుమారు 250 వరకు బంగారు బల్లులు ఉన్నట్టు అటవీ శాఖ అధికారులు అంచనా వేశారు. బంగారు బల్లుల్లోనూ రెండు జాతులుగా ఉన్నట్టు అటవీ అధికారులు చెబుతున్నారు. వాటిలో ఒకటి కాలొడాక్టి లోడస్ అరీస్. ఇవి సాధారణ బల్లుల కంటే పెద్దగా అరుస్తూ వింత శబ్దం చేస్తాయని చెబుతున్నారు.




పాపికొండలు అభయారణ్యంలో బంగారు బల్లుల సంచారం ఉంది



పాపికొండలు అభయారణ్యంలో బంగారు బల్లుల జాడ ఉంది. రెండేళ్ల క్రితం నేను, విశాఖపట్నానికి చెందిన శాస్త్రవేత్త కలిసి పోలవరం మండలం సిరివాక గ్రామంలోని గోదావరి సమీపంలో గల రాతి ప్రదేశాల్లో అధిక సంఖ్యలో బంగారు బల్లులు పెట్టిన గుడ్లు గుర్తించాం. 250కి పైగా బంగారు బల్లులు ఉండవచ్చని అంచనా వేస్తున్నాం.

– దావీదురాజు నాయుడు,
ఇన్‌చార్జి ఫారెస్ట్ అధికారి, పోలవరం

ఫొటోలు తీశా



పాపికొండలు అభయారణ్యంలో అరుదైన పక్షులను, జంతువులను ఫొటోలు తీశాను. బంగారు బల్లి కూడా నా కెమెరాకు చిక్కింది. అభయారణ్యం రాతి ప్రాంతాల్లో ఈ బల్లుల సంచారం ఉంది. శాస్త్రవేత్తలు కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు.

– కె.బాలాజీ,
ఫొటోగ్రాఫర్, రాజమండ్రి

చెట్ల కూల్చివేతను తీవ్రంగా పరిగణిస్తాం..

- ఏయూలో చెట్ల కూల్చివేతపై పూర్తి వివరాలివ్వండి : హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ(ఏయూ) పరిధిలో చెట్ల కూల్చివేతలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్ల కూల్చివేతలను తీవ్రంగా పరిగణిస్తామంది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలు సమర్పించాలని ఏయూ తరపు న్యాయవాది వి.సాయి కుమార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెట్లను కూల్చివేస్తున్నారని, ఇందుకు సంబంధించి అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, ఇది వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధమంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే విచారణ జరిపిన ధర్మాసనం, తదుపరి చెట్ల కూల్చివేతలు చేపట్టవద్దని వర్సిటీ అధికారులను ఆదేశించింది. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యంపై ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి వాదనలు వినిపిస్తూ సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి కుంటలను పూడ్చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘించారన్నారు. ఏయూ తరఫు న్యాయవాది సాయికుమార్ స్పందిస్తూ చిన్న చిన్న పొదలను తొలగించామే తప్ప చెట్లను కూల్చివేయలేదన్నారు. చెట్ల కూల్చివేత విషయంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలంటూ విచారణను 28కి వాయిదా వేసింది.

నాలుగో పోర్టుతో మహర్దశ

▶ మొదటి పేజీ తరువాయి

అన్నిరకాల ఎగుమతులు, దిగుమతులకు వీలుగా ఉంది. అయితే భౌగోళికంగా ఈ పోర్టు విస్తరణకు వీలు కాకపోవడంతో సుమారు 30 కి.మీ దూరంలో మరో పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. తొండంగి మండలం పెరుమాళ్లపురం వద్ద సుమారు 1,944 ఎకరాల్లో కాకినాడ సెజ్ గేట్‌వే పోర్టు (కేసెజ్ పోర్టు) ఏర్పాటవుతోంది. నాలుగు నెలల క్రితం మొదలైన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. సౌత్ బ్రేక్ వాటర్ మొత్తం 3,000 మీటర్లలో నిర్మిస్తుండగా ఇప్పటికే 1,000 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. నార్త్ బ్రేక్ వాటర్ పనులు కూడా ఇటీవలే మొదలయ్యాయి. అంతర్గత రహదారుల నిర్మాణం, డ్రెడ్జింగ్, భవనాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తొలిదశలో మూడు బెర్తుల ద్వారా ఏటా 16 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. పీపీపీ విధానంలో ఏర్పాటవుతున్న ఈ పోర్టులో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమైన నాటి నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయంలో 2.70 శాతం వాటా ఏపీ మారిటైమ్ బోర్డుకు సమకూరనుంది. 31-40 ఏళ్ల వరకు 5.40 శాతం, 41-50 ఏళ్ల వరకు 10.80 శాతం వాటా దక్కుతుంది.

రూ.1,800 కోట్లతో రహదారులు, రైల్వే లైన్

కాకినాడ, కేసెజ్ పోర్టును అన్నవరం వద్ద జాతీయ రహదారికి అనుసంధానిస్తూ సుమారు 40 కి.మీ పొడవైన నాలుగు లైన్ల రహదారిని అభివృద్ధి చేయనున్నారు. సాగర్‌మాల ప్రాజెక్టు కింద ఈ రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదముద్ర వేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. అన్నవరం రైల్వే స్టేషన్‌ను కేసెజ్ పోర్టుకు అనుసంధానిస్తూ 25 కి.మీ రైల్వే లైన్‌ను రూ.300 కోట్లతో చేపట్టనున్నారు. 20 కల్వర్టులు, రెండు బ్రిడ్జిలను నిర్మించనున్నారు. అన్నవరం రైల్వే స్టేషన్‌ను రూ.40 కోట్లతో ఆధునీకరించనున్నారు. కాకినాడ సెజ్‌లో పెట్రో కెమికల్స్, స్టీల్, సీఫుడ్స్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ పోర్టు ద్వారా ప్రత్యక్షంగా 3,000 మందికి పరోక్షంగా 10,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. పోర్టు లావాదేవీలు, పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్ర జీడీపీ పెరగనుంది. తద్వారా రాష్ట్ర ఆదాయం, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుందని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు.

కాకినాడ సెజ్ పోర్టు ఇలా

విస్తీర్ణం	1,944 ఎకరాలు
ప్రాజెక్టు వ్యయం	రూ.2,123.43 కోట్లు
పోర్టు వార్షిక సామర్థ్యం	16 మిలియన్ టన్నులు
బెర్తులు	3 (కోల్ 1, మల్టీ పర్పస్ 2)
సౌత్ బ్రేక్ వాటర్	3,000 మీటర్లు
నార్త్ బ్రేక్ వాటర్	850 మీటర్లు
నౌక గరిష్ట సామర్థ్యం	1,20,000 డీడబ్ల్యూటీ

నష్టపరిహారం చెల్లించారు

పోర్టు ఏర్పాటుతో మా గ్రామం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నాం. పోర్టు పనులు మొదలయ్యాక చేపలు పట్టేందుకు అవకాశం లేకపోవడంతో కేసెజ్ నుంచి నష్టపరిహారం అందింది. మా గ్రామంలో తెల్లరేషన్ కార్డున్న ప్రతి మత్స్యకారుడికి రూ.1.50 లక్షల నష్టపరిహారంతో పాటు బోటు తరలించేందుకు రవాణా ఖర్చులు కూడా చెల్లించారు. సుమారు 1,350 మందికి నష్ట పరిహారం ఇచ్చారు.

– పి.వెంకటేశ్వర్లు,
చింతకాయలపేట.

24 నెలల్లో అందుబాటులోకి

తొలి దశ పోర్టును 24 నెలల్లో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇప్పటికే సౌత్ బ్రేక్ వాటర్ పనులు 1000 మీటర్లు పూర్తికాగా నార్త్ బ్రేక్ వాటర్ పనులు ప్రారంభించాం. మూడు బెర్తులతో ఏటా 16 మిలియన్ టన్నుల సామర్థ్యంతో దీన్ని నిర్మిస్తున్నాం. పెట్రో కెమికల్స్ కార్యకలాపాల కోసం ఎల్ఎన్‌జీ టెర్మినల్ నిర్మించనున్నాం. వర్షాకాలం తరువాత పోర్టును అనుసంధానించే రహదారి పనులను ప్రారంభిస్తాం. పోర్టు సిద్ధమయ్యేనాటికి అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. కేసెజ్‌లో ఫార్మా, పెట్రో కెమికల్స్, స్టీల్, ఆక్వా ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో ఈ పోర్టుకు భారీ డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నాం.

– గరుడ సీతారామయ్య,
వైస్ ప్రెసిడెంట్, కేసెజ్ లిమిటెడ్.

పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం

సుదీర్ఘ తీరప్రాంతాన్ని వినియోగించుకుంటూ సముద్ర వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకోవడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించారు. సుమారు రూ.18,897 కోట్లతో నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను ఏకకాలంలో నిర్మిస్తున్నారు. పోర్టులను ఆనుకుని పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయడంతోపాటు ఫిషింగ్ హార్బర్ల వద్దే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్,
సీఈవో, ఏపీ మారిటైమ్ బోర్డు.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 15 । జూన్ । 2023




సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఈనెల 16న ముఖ్యమంత్రి గుడివాడ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కృష్ణా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ అపరాజితా సింగ్ బుధవారం పరిశీలించారు. -4లో▸



వేటకు వేళాయె

కోడూరు: గంగపుత్రులు తిరిగి సముద్రంలో వేటకు వెళ్లేందుకు సమాయత్తమయ్యారు. బుధవారం అర్ధరాత్రితో 61 రోజుల వేట నిషేధ సమయం ముగుస్తోంది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

17న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

నూజివీడు: పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాల ప్రాంగణంలో ఈనెల 17న ఉమ్మడి కృష్ణా జిల్లా జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికను నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు జి.సుంకర సుభాష్ చంద్రబోస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్న ఈ ఎంపిక కార్యక్రమంలో 2005 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని, మీసేవా కేంద్రం ద్వారా తీసుకున్న జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు నకలు, పదో తరగతి మార్కుల మెమో తీసుకొని రావాలన్నారు. ప్రతి క్లబ్, అసోసియేషన్ నుంచి 10 మంది క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఎంపిక చేసిన బాలబాలికల జట్లు ఈనెల 29 నుంచి జూలై 2 నుంచి నిర్వహించే ఏపీ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

షార్ట్ ఫిల్మ్ పోటీలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షార్ట్ ఫిల్మ్ పోటీలను నిర్వహిస్తున్నామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం పోటీలకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ 2017 నుంచి ప్రతి సంవత్సరం షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం పోటీలలో కులవివక్ష, లైంగిక వేధింపులు, మద్యపానం, ధూమపానం, భిన్నత్వంలో ఏకత్వం వంటి అంశాలపై సెప్టెంబర్ 10వ తేదీలోగా షార్ట్ ఫిల్మ్ పంపాలని కోరారు. వాటిలో ఉత్తమమైన ఐదు షార్ట్ ఫిల్మ్‌లకు ఒక్కో ఫిల్మ్‌కు రూ.5వేలు చొప్పున ఇస్తామని, అలాగే ఐదు ఫిల్మ్‌లకు స్పెషల్ జ్యూరీ అవార్డులు అందిస్తామన్నారు. ఇతర వివరాలకు 9391163508లో సంప్రదించాలని కోరారు. తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి గీతాబాయి బుధవారం తనిఖీ చేశారు. ఆంధ్ర హాస్పిటల్‌తో పాటు వెంకట్రామ హాస్పిటల్ తదితర ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ల్యాబ్‌లను పరిశీలించారు. సమీకృత వ్యాధుల నిఘా కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రుల్లో నమోదు చేసే ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతినెల జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేస్తామని ఆమె వివరించారు. తనిఖీల్లో డీఎం అండ్‌హెచ్‌వోతో పాటు ఎన్సిడి ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ కుంభా రత్నగిరి, జిల్లా ఎపిడిమాలజిస్ట్ మహేష్, హెల్త్ ఎడ్యుకేటర్ బి. రాజేంద్రకుమార్, జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ వేల్పూరి తారకరామారావు తదితరులు ఉన్నారు.

రక్తదానంపై మరింత చైతన్యం అవసరం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రక్తదానంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించేలా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సూచించారు. రక్తదానంపై సమాజంలో చైతన్యం రావాలన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్ల్ ల్యాండ్ స్టీనర్ అనే ఒక మానవతావాది రక్తంలో ఉండే గ్రూపులను వర్గీకరించి ఉండకపోతే ప్రపంచంలో ఇప్పటికీ రక్త మార్పిడి కారణంగా మరణాలు సంభవిస్తూనే ఉండేవన్నారు. అటువంటి మానవతా మూర్తి జయంతిని ప్రపంచ వ్యాప్తంగా రక్త దాతల దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుకు సహకరించిన వివిధ కళాశాలల్లోని ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులకు, రక్తదాతలకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను ఢిల్లీరావు అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జి. సమరం పాల్గొన్నారు.

జీవనాడి

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ భవనం



నాలుగేళ్లలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- నరికొత్తగా దర్శనమిస్తున్న సర్కారు ఆస్పత్రులు
- గణనీయంగా పెరిగిన ఓపీ
- అందుబాటులోకి అధునాతన సాంకేతిక పరికరాలు
- నాడు–నేడుతో జాతీయ స్థాయి గుర్తింపు
- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో పేదల చెంతకే వైద్యం

ఓపీ ఇలా.. విజయవాడ జీజీహెచ్‌లో..
2019లో రోజుకు: 1,200
2023లో రోజుకు: 3,300



నా పేరు కె. కొండలరావు. మాది ఉయ్యూరు. ఆరు నెలల కిందట ఛాతిలో నొప్పి రావడంతో తొలుత గ్యాస్ నొప్పిగా భావించి ఉయ్యూరులో ఓ ఆస్పత్రికి వెళ్లాను. అక్కడ ఈసీజీ చేసి గుండెలో సమస్య ఉందన్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో బాగా చూస్తున్నారని చెప్పడంతో ఇక్కడకు వచ్చా. వచ్చిన వెంటనే అడ్మిట్ చేసి యాంజియోగ్రామ్ చేశారు. రక్తనాళాల్లో రెండు బ్లాక్స్ ఉన్నాయని చెప్పి, మరుసటి రోజు స్టెంట్స్ వేశారు. అప్పటి నుంచి మందులు వాడుతున్నా. ఒకప్పటి ప్రభుత్వ ఆస్పత్రికి.. ఇప్పటి సౌకర్యాలు, సేవలకు పోలిక లేదు.

నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో వైద్యరంగం కొత్త రూపు సంతరించుకుంది. గత పాలకుల నిర్లక్ష్యంతో చతికిల పడిన ప్రభుత్వ వైద్యం సంస్కరణల సమ్మేళనంతో నూతన శక్తిని కూడదీసుకుంది. ప్రజారోగ్యమే పరమావధిగా సకల సౌకర్యాలతో సేవలందిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాస్పత్రుల వరకు అత్యాధునిక పరికరాలు, సంపూర్ణ సౌకర్యాలు, సకల సేవలతో కళకళలాడుతోంది. పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడంతో నాణ్యమైన వైద్యం అందుతోంది. నాలుగేళ్లలో ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య రెండు రెట్లు పెరగడమే అందుకు నిదర్శనంగా కనిపిస్తోంది.

– లబ్బీపేట(విజయవాడతూర్పు)

పేదలకు సూపర్ సేవలు..

విజయవాడ జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా చంద్రబాబు నాలుగేళ్లు జాప్యం చేస్తే.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వారం రోజుల్లోనే నిధులు మంజూరు చేశారు. రూ.30 కోట్లతో నిర్మాణం పూర్తి కావడంతో పాటు ఎంఆర్‌ఐ స్కాన్, క్యాథ్‌ల్యాబ్, అడ్వాన్స్‌డ్ సీటీ స్కాన్ వంటి పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కార్డియాలజీ, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ వంటి విభాగాల్లో సేవలు అందుబాటులోకి రానున్నాయి.

బందరులో వైద్య కళాశాల..

మచిలీపట్నంలో రూ. 550 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నుంచి 150 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లు జరగనున్నాయి. ఇక్కడి జిల్లా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా మార్చి పెద్ద ఎత్తున సౌకర్యాలు కల్పించడమే కాకుండా, వైద్యులను నియమించారు.

నాడు–నేడుతో ఆధునికీకరణ..

ఉమ్మడి జిల్లాలోని 80కిపైగా పీహెచ్‌సీలు, 8 సీహెచ్‌సీలను నాడు–నేడుతో ఆధునికీకరించారు. మందులు పూర్తి స్థాయిలో ఉండేలా చూడటంతో పాటు, ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండేలా నియామకాలు చేశారు. పీహెచ్‌సీల్లో నాణ్యమైన వైద్య సేవలకు గాను ఉమ్మడి కృష్ణాలో 32 పీహెచ్‌సీలకు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సర్టిఫికేషన్ లభించింది.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు..

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. అందులో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారిని మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్‌ను నియమించారు.



విజయవాడలోని ఏపీఐఐసీ కాలనీ వద్ద నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం భవనం

దేశానికే ఆదర్శం ఫ్యామిలీ ఫిజీషియన్..



వత్సవాయిలో రోగి ఇంటికే వెళ్లి పరీక్షిస్తున్న వైద్యులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. నెలలో రెండు రోజులు గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, మంచంలో ఉన్న రోగుల ఇంటికే వెళ్లి పరీక్షలు చేయడం, ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన రోగుల ఫాలోఅప్ వంటి సేవలు అద్భుతంగా అందుతున్నాయి.

యూపీహెచ్‌సీలకు ఆధునిక హంగులు..

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 63 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. ఒక్కో భవనానికీ రూ. కోటి వెచ్చించి 19 యూపీహెచ్‌సీలకు నూతన భవనాలను నిర్మించారు. అంతేకాకుండా అన్ని యూపీహెచ్‌సీల్లో ఆధునిక వ్యాధి నిర్ధారణ పరికరాలను అందుబాటులోకి తేవడంతో పాటు, సిబ్బందిని నియమించారు. వాటిలో 63 రకాల పరీక్షలు, 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

చేపట్టిన ప్రధాన అభివృద్ధి పనులు	
బందరులో వైద్య కళాశాల	: రూ.550 కోట్లు
విజయవాడ ఎస్ఎస్ బ్లాక్	: రూ.30 కోట్లు
సిద్ధార్థ వైద్య కళాశాలలో నాడు–నేడు పనులు	: రూ.170 కోట్లు
పీహెచ్‌సీల ఆధునికీకరణ	: రూ. 120 కోట్లు
యూపీహెచ్‌సీ నూతన భవనాలు	: రూ. 25 కోట్లు

ఉమ్మడి కృష్ణాలో నియామకాలు	
స్పెషలిస్టు వైద్యులు	: 78
సివిల్ అసిస్టెంట్ సర్జన్స్	: 92
ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్)	: 750
స్టాఫ్ నర్సులు	: 550
పారామెడికల్ సిబ్బంది	: 625
ఇతర సిబ్బంది	: 800

త్వరలో గుండె సర్జరీలు..



సూపర్‌స్పెషాలిటీ విభాగాలతో పాటు, అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. రోగుల సంఖ్య కూగా బాగా పెరిగింది. ప్రతిరోగికి నాణ్యమైన వైద్యం చేస్తూ, ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం పెరిగేలా కృషి చేస్తున్నాం. కార్డియోథొరాసిక్ సర్జరీలు నిర్వహించేందుకు ఆధునిక థియేటర్‌లు ఉన్నాయి. త్వరలోనే సర్జరీలు ప్రారంభిస్తాం.

– డాక్టర్ డి. వెంకటేష్, సూపరింటెండెంట్, విజయవాడ జీజీహెచ్

వైద్య రంగానికి ప్రాధాన్యం..



ప్రస్తుత ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలు పెరిగాయి. విజయవాడలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ అందుబాటులోకి రావడంతో పేద, మధ్య తరగతి రోగులు నాణ్యమైన సేవలు పొందగలుగుతున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాన్సెప్ట్ బాగుంది. గ్రామాలకే వైద్యులు వెళ్లడం మంచి పరిణామం.

– డాక్టర్ ఎంఏ రెహమాన్, ప్రెసిడెంట్, ఐఎంఏ, విజయవాడ శాఖ

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

- ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక
- ప్రొటోకాల్ విషయంలోనూ అలసత్వంపై ఆగ్రహం
- ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలని ఆదేశం
- వాడీవేడిగా జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అధికారులందరూ హాజరుకాకుంటే సంబంధిత మంత్రులకు, ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో బుధవారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు.

హాజరుకావాల్సిందే..

తొలుత గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు సంబంధించిన జిల్లా అధికారులు హాజరుకావాల్సి ఉంది. అయితే ఈ సమావేశాలకు కింది స్థాయి అధికారులను పంపటంతో చైర్ పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశానికి జిల్లా అధికారులు కచ్చితంగా హాజరుకావాల్సి ఉండగా కిందిస్థాయి సిబ్బందిని పంపి ఏదొక కారణంతో హాజరుకావటం లేదన్నారు. ఇకపై సమావేశాలకు జిల్లా అధికారులు హాజరుకాకుంటే తాను సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలి..

విద్య, వైద్య స్థాయీ సంఘ సమావేశంలో ప్రొటోకాల్ వ్యవహారంపై చర్చ జరిగింది. విద్యాశాఖ, వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధిత ప్రజాప్రతినిధులకు సమాచారం అందించటం లేదని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని హాజరైన కార్యక్రమానికి తనకు కూడా సమాచారం లేదని చైర్‌పర్సన్ సంబంధిత అధికారులను నిలదీశారు. అలాగే గూడూరు మండలం మల్లవోలులో జరిగిన కార్యక్రమంలో కూడా తనకు సమాచారం లేదని చైర్‌పర్సన్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

లక్ష్యాలను అధిగమించండి..

- రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సకాలంలో ప్రజలకు అందజేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘ సమావేశంలో కొత్తగా పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వాలు అందజేస్తున్న రాయితీలను అవగాహన కల్పించాలని చైర్‌పర్సన్ సూచించారు. ముద్ర రుణాలకు సంబంధించి చేనేత కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు.
- వైస్‌చైర్మన్ గరికపాటి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశంలో రైతులందరూ ఈ–క్రాప్ బుకింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు యంత్ర పరికరాలతో సాగు పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యులు దుట్టా సీతారామలక్ష్మి అధ్యక్షతన స్త్రీ, శిశు సంక్షేమం, వైస్ చైర్మన్ గుదిమళ్ల కృష్ణంరాజు అధ్యక్షతన సాంఘిక సంక్షేమం, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన పనులు, ఆర్థికం, ప్రణాళిక స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

జిల్లా పరిషత్ సీఈవో వి. జ్యోతిబసు, జెడ్పీటీసీ సభ్యులు వేముల సురేష్‌బాబు, తుమ్మల మురళీకృష్ణ, కో–ఆప్షన్ సభ్యుడు మొహమ్మద్‌గౌస్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎన్. పద్మావతి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి, డీఈవో తాహెరాసుల్తానా పాల్గొన్నారు.

'ఉపాధి'లో కృష్ణాకు రెండో స్థానం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనిదినాల కల్పనలో రాష్ట్రంలో కృష్ణాజిల్లా రెండోస్థానం సాధించిందని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం, గృహ నిర్మాణం, రీ–సర్వే, ఖరీఫ్ ప్రణాళిక అమలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు జిల్లా ప్రగతిని సీఎం జగన్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పనిదినాల కల్పనలో 2023–24 సంవత్సరానికి సంబంధించి 70 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా కేవలం రెండున్నర నెలల్లో 42.28 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచామన్నారు. పనిదినాలు కల్పించటమే కాకుండా రోజువారీ సరాసరి వేతనం రూ. 250.91 అందించామన్నారు.

ట్రెండ్ 'సెట్' చేశారు

ఎన్టీఆర్ జిల్లా	
ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారు..	
పేరు	ర్యాంక్
చల్లా ఉమేష్‌వరుణ్ (నందిగామ)	1
మలినేని దత్తరిషియంత్ (విజయవాడ)	15
నెమ్మని చైతన్య (విజయవాడ)	79
ద్రోణవల్లి సాయిదుర్గారిషి (విజయవాడ)	90
కమతం అక్షయ్ రెడ్డి (విజయవాడ)	140
మరేపల్లి ప్రణవ్ (విజయవాడ)	168
డేకా భర్షిత (విజయవాడ)	218
సంకా రిత్విక్ (విజయవాడ)	250
భట్రాజు నాగసాయిపవన్‌కుమార్ (విజయవాడ)	271
పామర్తి హర్షసాయి శ్రీనివాసు (విజయవాడ)	279
అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ, బీఎస్సీ(నర్సింగ్) కోర్సుల్లో ఉత్తమ ర్యాంకర్లు..	
నాగుబండి ఈశ్వర్‌వెంకట్ (రెడ్డిగూడెం)	34
కేశిరెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (విజయవాడ)	78
తిరుమలరాజు భావన (విజయవాడ)	91
జశ్వంత్ పాగోలు (పోరంకి)	98
శ్రీహిత యలమంచిలి (విజయవాడ)	132
సైకం రితిక (పోరంకి)	153
అన్నెం కనకరామకృష్ణ (పూర్ణానందపేట)	187
గొరసాని చరితారెడ్డి (అనుమోలంక)	225
సాత్విక కొసరాజు (విజయవాడ)	226
కొత్తపాటి వెంకటమోక్షిత్‌రెడ్డి (విజయవాడ)	242

దక్కిన ఫలితం.. విజయకేతనం

- ఏపీఈఏపీ సెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ
- ఇంజినీరింగ్‌లో స్టేట్ టాప్ ర్యాంకుతో పాటు 300లోపు 20 ర్యాంకులు కైవసం
- నర్సింగ్‌లోనూ 300లోపు 20 ర్యాంకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్–2023 ఫలితాల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు చెందిన విద్యార్థులు ర్యాంక్‌ల పంటను పండించారు. బుధవారం విడుదలైన ఫలితాలలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన విద్యార్థి ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు.

ర్యాంకుల జాతర..

మే 15 నుంచి 23వ తేదీ వరకూ రాష్ట్రంలో ఏపీ ఈఏపీ సెట్‌ను అనంతపురం జేఎన్‌టీయూ, ఏపీ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి అత్యధికంగా విద్యార్థులు ఈ సెట్‌కు హాజరయ్యారు. నందిగామకు చెందిన చల్లా ఉమేష్ వరుణ్ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించారు. అదేవిధంగా ఇదే విభాగంలో విజయవాడకు చెందిన మలినేని దత్తరిషియంత్ 15వ ర్యాంక్‌ను సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఉమ్మడి జిల్లాలో మొదటి నుంచి ర్యాంక్ నుంచి 279 వరకూ సుమారు 20 ర్యాంక్‌లను సాధించారు. అదేవిధంగా అగ్రికల్చర్ అండ్ బీఎస్సీ (నర్సింగ్) విభాగానికి సంబంధించి రెడ్డిగూడెంకు చెందిన నాగుబండి ఈశ్వర్ వెంకట్ 34వ ర్యాంక్‌ను సాధించి ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే ఈ విభాగానికి సంబంధించి 34 నుంచి 283 మధ్య సుమారు 20 ర్యాంక్‌లను ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు తమ ఖాతాలో వేసుకున్నారు.



ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు సత్కారం

నందిగామ టౌన్: నందిగామకు చెందిన విద్యార్థి ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించటం హర్షణీయమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. విద్యార్థి చల్లా ఉమేష్ వరుణ్‌ను తన నివాసంలో బుధవారం ఆయన అభినందించి ఘనంగా సత్కరించారు.

బాలికను వేధించిన వారిపై పోక్సో కేసు నమోదు

పెనమలూరు: బాలికను వేధించి ఆపై దౌర్జన్యం చేసిన వారిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు శివాలయం వద్ద పి.లావణ్య కుటుంబ సభ్యులతో ఉంటోంది. ఆమెకు 9వ తరగతి చదువుతున్న కుమార్తె(15) ఉంది. అయితే బాలికను అదే ప్రాంతానికి చెందిన హర్షవర్ధన్ అనే యువకుడు ప్రేమపేరుతో వేధించసాగాడు. ఈ విషయం తెలుకున్న లావణ్య రెండు రోజుల క్రితం హర్షవర్ధన్‌ను మందలించింది. దీంతో హర్షవర్ధన్ అతని బంధువులు అనిల్, షణ్ముఖ, నాగలక్ష్మి, వంశీ, మరికొందరు అసభ్యంగా ప్రవర్తించి లావణ్య, ఆమె కుమార్తెపై దౌర్జన్యం చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఇద్దరు బిడ్డలతో తల్లి అదృశ్యం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఇద్దరు బిడ్డలతో సహా తల్లి అదృశ్యం అయిన ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని వాంబే కాలనీకి చెందిన గాలి భానుప్రకాష్, జ్యోతి(29) దంపతులు. వారికి 14 ఏళ్ల క్రితం వివాహం కాగా తేజశ్విని(12), మణికుమార్(10) సంతానం. ఏడాది క్రితం వారి కుటుంబంలో గొడవలు జరగటంతో గాలి జ్యోతి తన ఇద్దరు పిల్లలను తీసుకుని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఉండే తల్లి మిండాల పద్మ వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 12న సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్‌లో పిల్లల టీసీలు తీసుకుని వస్తానని తల్లికి చెప్పి పిల్లలను తీసుకుని వెళ్లింది. మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావటంతో స్కూల్‌కు వెళ్లి విచారించగా ఇద్దరు పిల్లలకు టీసీలు తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. దీంతో చుట్టుపక్కల, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో తల్లి పద్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నిర్మాణ రంగ సమస్యల పరిష్కారానికి కృషి

బీఏఐ రాష్ట్ర వైస్ చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిర్మాణ రంగంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. అసోసియేషన్ అమరావతి సెంటర్ జనరల్ బాడీ సమావేశం బుధవారం ఓ హోటల్‌లో జరిగింది. సమావేశంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు, ఇతర బీఏఐ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ రంగ సమస్యలపై చర్చించారు. చాంబర్ విధి విధానాల గురించి భాస్కరరావు వివరించారు. బీఏఐ అమరావతి చాప్టర్ చైర్మన్ టి.పానకాలరావు, కార్యదర్శి బీఎస్‌కే పట్నాయక్, సెంటినీ పైప్స్ వైస్ చైర్మన్ అజిత్ దండేకర్, జీఎం సాజన్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు

కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

గుడివాడటౌన్/గుడివాడరూరల్: గుడివాడ రూరల్ మండలం మల్లాయిపాలెం లే-అవుట్‌లో నిర్మించిన టిడ్కో గృహాలను ప్రజలకు అంకితం చేసేందుకు ఈనెల 16న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుడివాడ పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ పి.జాషువా, ఇతర అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ముందస్తు భద్రతా సమన్వయం (ఏఎస్ఎల్) నిర్వహించారు. తొలుత లే-అవుట్‌లోని టిడ్కో గృహాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ఎల్-1, ఎల్-2 వరుసలో పగోడాలు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. బారికేడ్లు పక్కాగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రికి స్వాగతం, వీడ్కోలు పలికే అధికారులు, ప్రముఖులు, ఇతర ప్రముఖుల జాబితా పక్కాగా ఉండాలన్నారు. వారిని మాత్రమే వరుస క్రమంలో అనుమతించాలన్నారు. అనంతరం టిడ్కో గృహాలలోని సి-29 బ్లాకులో జి1-జి8 డబుల్ బెడ్‌రూమ్ గృహాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి మాట్లాడే లబ్ధిదారుల జాబితా పరిమిత సంఖ్య మేరకే అనుమతించాలన్నారు. లే-అవుట్‌లో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ పర్యవేక్షించే అధికారులు ఏ విధమైన ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. అనంతరం బహిరంగ సభావేదికకు వచ్చి వేదికను, గ్యాలరీని పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు గ్యాలరీ వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. స్పందన అర్జీలు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే ప్రజల ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే చికిత్స చేసేందుకు సభ సమీపంలో ముఖ్యమైన ప్రదేశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పసిపిల్లలు, వృద్ధులు అనారోగ్యంతో బాధపడేవారు బహిరంగ సభకు రాకుండా ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలన్నారు. గ్యాలరీ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న అధికారులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలర్‌లు నిరంతరం పనిచేసేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితా సింగ్, ఏఎస్పీ శ్రీహరిబాబు, టిడ్కో పీఓ చిన్నోడు, గుడివాడ, బందరు ఆర్డీఓలు పి.పద్మావతి, కిషోర్, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు, ఆర్అండ్‌బీ జిల్లా అధికారి శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, డీటీసీ సీతాపతిరావు, ఐఎస్‌డబ్ల్యూ డీఎస్పీలు రంగబాబు, శ్రీనివాస్, గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, డెప్యూటీ కలెక్టర్ చైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు



ముఖ్యమంత్రి చూసే ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రాజాబాబు

పటిష్ట బందోబస్తు

కోనేరు సెంటర్(మచిలీపట్నం): గుడివాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు సంబంధించి బందోబస్తు పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు కృష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించినా, నిర్లక్ష్యం ప్రదర్శించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మూడంచెల భద్రత ఏర్పాట్లను అధికారులు దగ్గరుండి చూసుకోవాలన్నారు. హెలిపాడ్, సభా ప్రాంగణంల వద్ద బందోబస్తు మరింత పటిష్టంగా ఉండాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బందోబస్తుకు సంబంధించి సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమానికి విచ్చేసే వీఐపీలు, వీవీఐపీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

నేటి నుంచి ఆణిముత్యాలకు సత్కారం

- సర్కార్ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- ఇంటర్‌మీడియెట్ విద్యార్థులకు సైతం సత్కారం
- 15న నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమం
- 17న సిద్ధార్థ మెడికల్ కాలేజ్‌లో జిల్లాస్థాయి సత్కారాలు
- 20న రాష్ట్ర స్థాయి టాపర్లకు సత్కారాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పది, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో విద్యార్థులను ప్రభుత్వం సత్కరించనుంది. పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాకుండా వారిని నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆయా యాజమాన్యాల వారీగా బహుమతులను అందించి సత్కరించాలని నిర్ణయించింది.

నేటి నుంచి టాపర్లకు సత్కారాలు

ఈ నెల 15న నియోజకవర్గ స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. ఆయా నియోజకవర్గాలలోని అవకాశం ఉన్న పెద్ద పాఠశాలలు లేదా ప్రత్యేక ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన వేదికలపై ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 26 మంది టెన్త్ విద్యార్థులను, 14 మంది ఇంటర్ విద్యార్థులను సత్కరించనున్నారు. ఈ నెల 17న జిల్లా స్థాయిలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ప్రతిభ చూపిన 27 మంది పదో తరగతి, 15 మంది, ఇంటర్ విద్యార్థులను సత్కరించనున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం విజయవాడ సిద్దార్థ హెల్త్ యూనివర్సిటీ ఆడిటోరియం ప్రాంగణంలో నిర్వహిస్తారు. ఈనెల 20వ తేదీన రాష్ట్ర స్థాయిలో టాపర్లను సత్కరించనున్నారు.

నగదు పురస్కారాలు

విద్యార్థులకు నగదుతో పాటుగా పతకం, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందించనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులను, ఆయా విద్యా సంస్థల ఉపాధ్యాయులను సైతం సత్కరిస్తారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సహించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ చక్కని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందిస్తారు. యాజమాన్యాల వారీగా టాపర్లకు సైతం ఇదే తరహాలో నగదు బహుమతులను అందించనున్నారు. నియోజకవర్గాల వారీగా అత్యధిక మార్కులు సాధించిన తొలి మూడు ర్యాంకర్లకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను ఇవ్వనున్నారు.

యనమలకుదురులో ముగ్గురు విద్యార్థులు అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో ముగ్గురు విద్యార్థులు కనిపించకపోవటంతో పోలీసులు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు షిరిడి సాయినగర్‌లోని సాయిబాలాజీ టవర్స్‌లో నక్కా సాగర్ బాబు కుటుంబం నివాసం ఉంటోంది. సాగర్ బాబు కుమారుడు (16) విజయవాడలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అయితే 13వ తేదీన ప్రకటించిన ఇంటర్ మొదటి సంవత్సరం బెటర్‌మెంట్‌లో అతనికి మార్కులు తక్కువగా వచ్చాయి. అదే అపార్టుమెంట్‌లో పక్క ప్లాట్‌లో ఉంటున్న ఇమ్రాన్‌ఖాన్ కుమారుడు (17) ఇంటర్ మొదటి సంవత్సరంలో రెండు సబ్జెక్టులు తప్పాడు. పక్క ప్లాట్‌లో ఉంటున్న శివకుమార్ కుమారుడు (12) 7వ తరగతి చదువుతున్నాడు. ముగ్గురు విద్యార్థులు మంగళవారం రాత్రి వారి ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. విద్యార్థుల కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినా వారి ఆచూకీ తెలియలేదు. ముగ్గురూ బ్యాగ్‌లతో వెళుతూ కనిపించారని స్థానికులు చెప్పారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి, ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీ కెమేరాలు పరిశీలిస్తున్నారు.

వడదెబ్బతో వలస కార్మికుడు మృతి

జి.కొండూరు(మైలవరం): మద్యం తాగి వడదెబ్బకు గురై వలస కార్మికుడు మృతి చెందిన ఘటన కవులూరు శివారు ఎస్‌సీఎల్ బ్రిక్స్ కంపెనీ వద్ద బుధవారం జరిగింది. వివరాలలోకి వెళ్తే...జార్ఖండ్ రాష్ట్రం, గొట్టా జిల్లా, మీర్జాకొ మండలం, సమధ గ్రామానికి చెందిన 11మంది ఆరు నెలల క్రితం జి.కొండూరు మండల పరిధి కవులూరు శివారులోని ఎస్‌సీఎల్ బ్రిక్స్ కంపెనీలో పనిచేసేందుకు వచ్చారు. వీరిలో జోనస్ ట్యూడ్(45) అనే వ్యక్తి గత మూడు రోజులుగా మద్యం తాగుతూ విధులకు హాజరు కావడంలేదని తోటి కార్మికులు చెబుతున్నారు. ఈ క్రమంలో కంపెనీకి సమీపంలో వీరు నివాసం ఉండే గదుల వద్ద జోనస్ ట్యూడ్ బుధవారం ఉదయం మృతి చెంది ఉన్నాడు. మద్యం మత్తులో వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు మృతుడి తమ్ముడు సంజల ట్యూడ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మరాజు తెలిపారు.

ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఖరీఫ్ ముందస్తు నాట్లపై రైతులకు అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు క్రిమిసంహారక మందులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అన్ని జిల్లా కలెక్టర్లతో జగనన్నకు చెబుదాం-1902, గడప గడపకు మన ప్రభుత్వం పనులు, ఉపాధి హామీ పనులు, లేబర్ బడ్జెట్, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణాలు, జగనన్న హౌసింగ్ ప్రోగ్రాం, వ్యవసాయం, నీటి విడుదల, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో కె.మోహన్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మట్లాడుతూ జగనన్నకు చెబుదాం 1902లో నమోదవుతున్న ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రతి రోజు లాగిన్ అయి అర్జీలు పరిశీలించుకోవాలన్నారు. సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యకు పరిష్కార మార్గం చూపాలన్నారు.

విత్తనాల నాణ్యత పరిశీలించాలి

ఖరీఫ్‌లో రైతులు ముందస్తు నారుమడులు వేసేలా ప్రోత్సహించాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విత్తనాల నాణ్యతను ఒకటికి రెండు సార్లు పరిశీలించాలని, నాణ్యత లోపించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఖరీఫ్ క్రాప్ బుకింగ్ నమోదు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. నకిలీ విత్తనాల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాస్, డ్వామా పీడీ జె.సునీత, హౌసింగ్ పీడీ రజినీ కుమారి, పంచాయతీ రాజ్ ఎస్ఈ ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పథకాల అమలులో పాత్రికేయుల పాత్ర కీలకం

కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేయటంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నారని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం మధ్యాహ్నం ఎస్పీ పి.జాషువాతో కలిసి పాత్రికేయులకు నూతన అక్రిడిటేషన్ కార్డులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సంబంధిత లబ్ధిదారులు అవగాహన చేసుకునేలా వార్తలు ప్రచురింపజేసి సద్వినియోగం చేసుకునేలా సహకరిస్తున్నారన్నారు. 2023-24 సంవత్సరాలకు సంబంధించి జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కమిటీ ఆధ్వర్యంలో కార్డులను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీహరిరావు, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి ఎం.వెంకటేశ్వరప్రసాద్, కమిటీ సభ్యులు ఎ.శేషుబాబు, పైడేశ్వరరావు, ఎం.గణేష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో ఎస్పీ జాషువా తదితరులు

అందరినీ అలరించే నారాయణ అండ్ కో

లబ్బీపేట(విజయవాడతూర్పు): కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాలతో అందరినీ అలరించిన ఆమని ముఖ్యపాత్రలో రూపొందించిన నారాయణ అండ్ కో అందరినీ అలరిస్తుందని ఆ చిత్ర దర్శకుడు చిన్నా పాపిశెట్టి అన్నారు. ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకు రానున్న నారాయణ అండ్ కో చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నటి ఆమని మాట్లాడుతూ ఆరోగ్యకరమైన హాస్యంతో కుటుంబ సమేతంగా చూసేలా నారాయణ అండ్ కో ఉంటుందన్నారు. జయకృష్ణ కథానాయకుడిగా పూజాకిరణ్, హారతి, సీనియర్ నటుడు జయప్రసాద్ కమెడియన్స్ సప్తగిరి, అలిరాజా వంటి వారు నటించారన్నారు. ఈ సినిమాకు చిన్నా పాపిశెట్టి దర్శకత్వం వహించగా, నిర్మాతలుగా పాపిశెట్టి బ్రదర్స్, సుధాకర్ కోమాకుల వ్యవహరించినట్లు తెలిపారు.



నగరంలోని ఓ హోటల్‌లో మీడియా సమావేశంలో నారాయణ అండ్ కో చిత్ర బృందం

ఎన్డీఆర్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు

గన్నవరంరూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అందరూ రక్తదానం చేయాలని కొండపావులూరు ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ జాహిద్‌ఖాన్ సందేశమిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ విజయవాడ సహకారంతో డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 60 మంది రక్తదానం చేశారు. సామాజిక ప్రయోజనాల కోసం ఎన్డీఆర్ఎఫ్ పని చేస్తుందని చెప్పారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, సిబ్బంది సేవలందించారు. చిన అవుటపల్లి 39వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు బుధవారం రక్తదానం చేశారు. బెటాలియన్ సెకండ్ కమాండెంట్ శాంతోదేవి మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్ సమాజం పట్ల గురుతర బాధ్యతలు నిర్వహిస్తుందని చెప్పారు. పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి డాక్టర్‌లు శిబిరంలో సేవలందించారు. డెప్యూటీ కమాండెంట్ ఎన్‌పీ రజిత, ప్రొఫెసర్ కళ్యాణ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ జాస్మిన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



కొండపావులూరులో రక్తదానం చేస్తున్న ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ జాహిద్‌ఖాన్

దుర్గమ్మకు విరాళాలుగా వెండి, బంగారు ఆభరణాలు



బంగారపు తాడు, మంగళ సూత్రాలను అందజేస్తున్న దాతలు



వెండి బిందెను సమర్పిస్తున్న కొత్తూరుకు చెందిన వెంకటేశ్వరరావు కుటుంబం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బుధవారం పలువురు భక్తులు వెండి, బంగారు ఆభరణాలను విరాళాలుగా సమర్పించారు. తిరువూరుకు చెందిన కె.సుబ్రహ్మణ్యశాస్త్రి కుటుంబం అమ్మవారికి అలంకరించేందుకు 32 గ్రాములతో తయారు చేసిన బంగారపు నానుతాడు, మంగళసూత్రాలను ఆలయ ఈవో భ్రమరాంబకు అందజేశారు. సుమారు రూ.1.60 లక్షల వ్యయంతో ఈ బంగారు మంగళసూత్రాలను తయారు చేయించినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు మురళీధర్‌శాస్త్రి పాల్గొన్నారు.

వెండి బిందె బహూకరణ

కొత్తూరుకు చెందిన బొర్రా వెంకటేశ్వరరావు కుటుంబం అమ్మవారి సేవల నిమిత్తం 1.332 కిలోల వెండితో తయారు చేయించి బిందెను ఆలయ ఈవో భ్రమరాంబకు సమర్పించారు.

బంగారు హారం సమర్పించిన ఆర్ఎస్ బ్రదర్స్

హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్‌కు చెందిన పి.వెంకటేశ్వర్లు అమ్మవారికి 36.5 గ్రాముల బంగారంతో తయారు చేయించిన బంగారు కాసుల హారాన్ని సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన దాత వెంకటేశ్వర్లు ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి బంగారు కాసుల హారాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మొగల్రాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రజాశక్తినగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పిన్నమనేని వారి వీధి, మధు గార్డెన్స్ ఏరియా, ప్రజాశక్తి నగర్, అంజమ్మ వీధి, రత్నమాంబ వీధి, నైస్ బార్ ఏరియా, కస్తూరిబాయిపేటలోని గాంధీ బొమ్మల సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక, భ్రమరాంబపురంలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న పెడసనగంటి దుర్గాప్రసాద్(55) ఇంటి వద్దనే ఇస్త్రీ చేస్తూ ఉంటాడు. తరచూ కుటుంబ సభ్యుతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి మూడు నాలుగు రోజులకు వస్తుండేవాడు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన సాయంత్రం 4 గంటలకు కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. తన భర్త కనిపించడం లేదని బుధవారం విమల ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి చిత్రలేఖన శిక్షణ తరగతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయాలనే ఉద్దేశంతో 'స్ఫూర్తి' క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి చిత్రలేఖన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, పెన్ డ్రాయింగ్, కార్టూన్స్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ, పేపర్ క్విల్లింగ్, క్లే మౌల్డింగ్, మండాల ఆర్ట్, మైక్రో ఆర్ట్, లీఫ్ ఆర్ట్, ఫోటోగ్రఫీ, ఫోటోషాప్, డిజిటల్ పెయింటింగ్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం జూలై 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే టెక్నికల్ గ్రేడ్ లోయర్, హయ్యర్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు గాయత్రి నగర్, కంచుకోట వారి వీధిలో గల స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ నందు గానీ లేదా 98493 55339, 93908 47433 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై కారు యజమాని దౌర్జన్యం చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి సెంటర్‌లో మంగళవారం ట్రాఫిక్ కానిస్టేబుల్ బొగ్గు వెంకట్రావు విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో పోరంకి సెంటర్‌లో మచిలీపట్నం నాన్‌స్టాప్ బస్సు, కారు ఢీ కొన్నాయి. కారు యజమాని బాషా రోడ్డు మధ్యలో కారు ఆపి, బస్సు డ్రైవర్‌తో గొడవపడసాగాడు. దీంతో బందరు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డు మధ్యలో ఉన్న కారు తీయాలని కానిస్టేబుల్ వెంకట్రావు కారు యజమాని బాషాను కోరాడు. బాషా ఆగ్రహంతో కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేశాడు. ఈ ఘటనపై కానిస్టేబుల్ వెంకట్రావు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన

జక్కంపూడి(విజయవాడరూరల్): రాష్ట్రంలో సచివాలయాల వ్యవస్థతో సుపరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి-షాబాద గ్రామంలో రూ.25లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్‌వెల్ నెస్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే వసంత బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతి, వివక్షత లేని పరిపాలన ప్రజలకు చేరువ కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయాల ద్వారా సుమారు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 600 సేవలకు పైగా అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటిముంగిటకే మెరుగైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారని తెలిపారు. నాలుగు సంవత్సరాల్లో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు గురించి ఎమ్మెల్యే వివరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 48 కోట్లతో డ్రైన్ల నిర్మాణం పనులు జరిగితే వాటిలో మైలవరం నియోజకవర్గంలో రూ.24 కోట్లు ఖర్చుతో డ్రైన్లు నిర్మించడం జరిగిందన్నారు.
జక్కంపూడి గ్రామంలో వందలాది ఎకరాలను టిడ్కో ఇళ్ల నిర్మాణాల కోసం తీసుకుని, ఒక్క కుటుంబానికి ఇళ్లు లేకుండా చేసిన ఘనత ఉమాదేనని ఎమ్మెల్యే వసంత పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో 160 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహాలను నిర్మించామన్నారు.

సీఎం సహకారంతోనే నగర అభివృద్ధి

- నగర మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్
- 13వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


13వ డివిజన్‌లో శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్లు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. 13వ డివిజన్‌లో రూ.13 లక్షలతో నిర్మించ తలపెట్టిన అంగన్‌వాడీ బిల్డింగ్ కిచెన్, స్టోర్ రూమ్, స్టెయిర్ కేస్ నిర్మాణానికి మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్‌లు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అవినాష్ నాయకత్వంలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో రూ.కోట్లాది రూపాయలతో వివిధ డివిజన్లలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు, అంగన్‌వాడీ కేంద్రం టీచర్లు సమస్యను అవినాష్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి అదనపు గదుల నిర్మాణానికి కృషి చేశారని ఆమె చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న దేవినేని అవినాష్‌ను రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

వైఎస్సార్ సీపీ ద్వారానే నగర అభివృద్ధి..

విజయవాడ నగర అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేటర్ ఉన్నప్పటికీ విజయవాడ తూర్పులో అభివృద్ధికి పైసా కూడా ఖర్చుచేయలేదని దుయ్యబట్టారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వందల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి ప్రజలు పలు సమస్యలను తీసుకువచ్చారని... వీటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాలను అందిస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు యాత్రల పేరుతో ఎన్ని నాటకాలు ఆడినప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి.. సంక్షేమం చూసి మరలా వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు కోలా ఉమా, అబ్దుల్ హన్నన్, విజయ్, పల్లీ రమేష్, ప్రసాద్, బాబురావు, సాంబశివరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను పరిశీలించిన ముంబై బృందం


విద్యార్థులతో మాట్లాడుతున్న ముంబై బృంద సభ్యులు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలు పరిశీలించటానికి ముంబయి నుంచి ప్రతినిధి బృందం బుధవారం మండలంలో పర్యటించారు. తొలుత బృంద సభ్యులు పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద జరిగిన అభివృద్ధి పనులు తిలకించారు. పాఠశాల తరగతి గదుల్లో మౌలిక వసతులు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద, అమ్మ ఒడి, అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతినిధి బృందం సభ్యుడు గౌరవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా విధానం ప్రవేశ పెట్టడం వలన విద్యార్థులకు చాలా మేలు జరుగుతుందన్నారు. అనంతరం బృందం వణుకూరులో జగనన్న కాలనీలో గృహాలు, సచివాలయం, ఆర్బీకేను పరిశీలించారు. సచివాలయం ద్వారా అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు .రైతు భరోసా కేంద్రంతో రైతులకు అందుతున్న సేవలు పరిశీలించారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ సునీతా శర్మ, ఏవో లోయ శివశంకరరావు, హెచ్‌ఎం వై.దుర్గాభవాని అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపతిరావు విద్యా సేవలను ఆదర్శంగా తీసుకోవాలి


ప్రజాపతిరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: విద్యావేత్త గుండవరపు ప్రజాపతిరావు విద్యాసేవలను ఆదర్శంగా తీసుకోవాలని శాతవాహన కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాతవాహనా కళాశాల ప్రారంభించి 52 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాల వ్యవస్థాపకుడు ప్రజాపతిరావును ఆయన గృహంలో బుధవారం ఆత్మీయంగా సత్కరించారు. నిడుమోలు రమా సత్యనారాయణ మాట్లాడుతూ.. కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆశీస్సులతో 1971 కళాశాల ప్రారంభించామన్నారు. వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యనభ్యసించి దేశ విదేశాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. విజయవాడను విద్యలవాడగా మార్పు తీసుకువచ్చింది శాతవాహన కళాశాల మాత్రమేనని తెలిపారు. అతిథులు ప్రజాపతిరావు విద్యాసేవలను అభినందించారు. ప్రిన్సిపాల్ కె.శంకరావు, అధ్యాపకుడు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ సంగీత రావు, జేవీ సత్యనారాయణ, ఎం.బ్రహ్మయ్య, ఏ.రమాదేవి పాల్గొన్నారు.

నీట్ పరీక్షలో శారద విద్యార్థులకు ర్యాంకులు


టి.భావన (2010)


వై.శ్రీహిత (2466)


ఆర్.వేళాంగిణి (3329)


బి.రోహిత్‌వర్షిత్ (8087)

మొగల్రాజపురం (విజయవాడతూర్పు): నీట్-2023 ప్రవేశ పరీక్షలో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారని శారదా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు చెప్పారు. మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న కళాశాల ఆవరణలో నీట్‌లో ర్యాంకులు పొందిన విద్యార్థులను బుధవారం అభినందించారు. టి.భావన(2010), వై.శ్రీహిత(2466),ఆర్.వేళాంగిణి(3329),బి.రోహిత్‌వర్షిత్(8087), పి.రమ్యనాగసాయి(8738) ర్యాంకులు పొందారన్నారు. తమ విద్యా సంస్థకు చెందిన 150 మంది విద్యార్థులు నీట్-2023 ప్రవేశ పరీక్ష రాయగా 75 మంది ఉత్తమ ర్యాంకులు పొందారని చెప్పారు. తక్కువ మంది విద్యార్థులతోనే జాతీయ స్థాయిలో కూడా ఇంత మంచి ర్యాంకులు పొందడం చాలా సంతోషంగా ఉందని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి అన్నారు. విద్యార్థుల కృషి, పట్టుదలతో పాటుగా మేనేజ్‌మెంట్, అధ్యాపక బృందం సహాయ సహకారాలతోనే ఇంతటి ఫలితాలను సాధిస్తున్నామని కళాశాల సలహాదారుడు ఎస్‌ఆర్‌కే.ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ రావు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అధ్యాపకులు అభినందించారు.

యోగాతో మానసిక ప్రశాంతత


ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న డాక్టర్ ఆయేషా

మధురానగర్(విజయవాడసెంట్రల్): యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని గులామొహిద్దీన్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే ఆయేషా సూచించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని గులామొహిద్దీన్‌నగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో బుధవారం ఆరోగ్య అవగాహన వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగా వల్ల మానసిక ఒత్తిడి తొలగిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయటం అలవాటు చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండలు అధికంగా ఉన్న దృష్ట్యా గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని ఎండల్లో తిరగకూడదని సూచించారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ దాసరి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖరీదైన వ్యాక్సిన్లు, రక్త పరీక్షలను ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అనంతరం యోగా చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేట వీరమ్మ సందుకు చెందిన కలిగి నాగమణికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె రేవతికి రెండేళ్ల కిందట వివాహం కాగా భర్తతో విభేదాల కారణంగా తల్లి వద్దకు వచ్చేసింది. కొన్ని నెలల కిందట వేముల రామును రెండో వివాహం చేసుకోగా, వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం పనికి వెళ్లిన రాము మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంట్లో భార్య కనిపించలేదు.
దీంతో అత్త నాగమణికి ఫోన్ చేసి అడిగాడు. అయితే తన వద్దకు కుమార్తె రాలేదని చెప్పడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

ఆటపాటలతో కూడిన విద్యతోనే బాలల వికాసం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆటపాటలతో కూడిన విద్యతోనే బాలల వికాసం కలుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. స్థానిక కొత్త రాజరాజేశ్వరి పేటలో బుధవారం జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల జీవితంలో మొదటి 6 సంవత్సరాలు అత్యంత విలువైనవన్నారు. మూడేళ్ల వరకు తల్లిఒడిని, తరువాత అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల ద్వారా పిల్లల్లో శారీరక మానసిక వ్యక్తిత్వ వికాసంపై ప్రభావం చూపుతుందన్నారు. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, స్థానిక పెద్దలు జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సేవలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే సేవలను, పుస్తకాల గురించి వివరించారు. తొలుత వీధుల్లో నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుజ్ఞానం, గాయత్రి అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



ఇబ్రహీంపట్నం: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఎన్టీటీపీఎస్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఆరోగ్యవంతులు ప్రతి నాలుగు నెలలకు ఓసారి రక్తదానం చేయడం ద్వారా నూతన రక్తకణాలు పుటుకొస్తాయన్నారు. మీరుచేసే రక్తదానం ఒకరి జీవితం కాపాడుతుందన్నారు. ప్రతి యేటా 80లక్షల యూనిట్ల రక్తం కొరత ఉందని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని డీఎంహెచ్‌ఓ సుహాసిని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో ఉషారాణి, చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్, సీనియర్ జూనియర్ ఇంజినీర్లు ఉన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యంపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఊర్మిళానగర్ చెందిన గంగిరెడ్డి లక్ష్మీప్రసన్న నగర శివారల్లోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ప్రతి రోజు ఉదయం ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తోంది. రోజులాగానే లక్ష్మీప్రసన్న తండ్రి ఈ నెల 12న తేదీ ఉదయం జోజి నగర్ చర్చి సెంటర్ దగ్గర బస్సు ఎక్కించారు. కళాశాలకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఆమె తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువులు తెలిసిన వారిని అడిగినా ఆచూకీ లభించలేదు. దీనిపై విద్యార్థిని తండ్రి గంగిరెడ్డి భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి ప్రాంతం కాలువ కట్టకు చెందిన చిన్నం అలేఖ్య తొమ్మిది సంవత్సరాల క్రితం వ్యవసాయ పనులు చేసే భార్గవ్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త భార్గవ్‌తో పాటు బావ రమేష్, తోటికోడలు ధనలక్ష్మి అదనపు కట్నం కోసం అలేఖ్యను వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంలో పొరపాట్లకు తావివ్వకండి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


శాండ్ స్టోన్ అల్యూమినియం ఛానల్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): అద్భుతంగా నిర్మాణం జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంలో ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా పనులు జరగాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్వరాజ్యమైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎలివేషన్‌లో శాండ్ స్టోన్‌తో తయారు చేసిన అల్యూమినియం ఛానల్స్‌ను పరిశీలించారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు నిర్వహించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. కారిడార్ మొత్తంలో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విగ్రహ నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకుని పలు సూచనలు చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కారిడార్ మొత్తం గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్‌స్కేప్, కాంపౌండ్‌వాల్ నిర్మాణాలను పరిశీలించిన కమిషనర్ అన్ని భాగాలను కలిపి జాగ్రత్తగా విగ్రహ నిర్మాణం చేయాలని సూచించారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో మానసిక రుగ్మత


ఎంఎస్‌కేలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాదక ద్రవ్యాల వినియోగం ఒక మానసిక రుగ్మత అని, వాటికి బానిసలై నిండు జీవితాన్ని బలి చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) భవానీపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించి యువతను, విద్యార్థులను కాపాడటం మనందరి సామాజిక బాధ్యత అన్నారు. డిస్ట్రిక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ కేఆర్‌కే ప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ భవానీపురం స్టేషన్‌లో ఆయన ఇబ్రహీంపట్నం ఎంఎస్‌కేలతో బుధవారం సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాల గురించి ఎంఎస్‌కేలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా నేరాలు పెరుగుతున్నాయని, గంజాయి, ఇతర డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియ చేయాలని లేదా టోల్ ఫ్రీ నంబర్ 14500కి ఫోన్ చేసి చెప్పాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. మత్తు పదార్థాలు ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తాయన్న విషయాన్ని విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ముఖ్యంగా సచివాలయాల పరిధిలో డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాల గురించి సమావేశాలు నిర్వహించి యువతను చైతన్యపరచే బాధ్యత ఎంఎస్‌కేలపై ఉందన్నారు. అందుకు తమ సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు.

రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి

సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల


రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సహకారంతో విజయవాడ రైల్వే ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే ఆస్పత్రి సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తదానంపై ప్రజల్లో ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటిని విస్మరించి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వలన ఆ వ్యక్తిలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రక్తదాతల సాయంతో ఆపదలో ఉన్న వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. అనంతరం శిబిరంలో రక్తదానం చేసిన 32 మంది సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్‌లు డాక్టర్ ఎల్.రవికాంత్, డాక్టర్ ఎం.జైదీప్, డీఎంవో డాక్టర్ షాహిదా, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేశ్వర్ హార్ట్‌కేర్‌లో అధునాతన గుండె వైద్యం


డాక్టర్ పళ్లెం పెద్దేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అన్ని వర్గాల ప్రజలకు అధునాతన గుండె వైద్య సేవలను పెద్దేశ్వర్ హార్ట్‌కేర్ సెంటర్‌లో అందిస్తున్నట్లు ఆస్పత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పళ్లెం పెద్దేశ్వరరావు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో సైతం అనేక అరుదైన గుండె శస్త్ర చికిత్సలు, యాంజియోప్లాస్టీలు చేస్తున్నామన్నారు. సూర్యారావుపేటలోని ఆస్పత్రిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేవలం 21 పడకలతో 1999, జూన్ 19న ఆస్పత్రి ప్రారంభించగా, 2007లో 50 పడకలకు పెంచి క్యాథ్‌ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. అనంతరం 2011లో 100 పడకలకు ఆస్పత్రి సామర్థ్యం పెంచి రెండు మాడ్యులర్ థియేటర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి కార్డియో థోరాసిక్ సర్జరీలు ప్రారంభించామన్నారు. పేద, మధ్యతరగతి వారికి ఆరోగ్యశ్రీ పథకంలో 6 వేల యాంజియోప్లాస్టీలు, 5 వేలు గుండె సర్జరీలు చేశామని చెప్పారు. అంతే కాకుండా గుండెపోటుకు గురైన 7,500 మందికి ఆరోగ్యశ్రీలో చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో అనేక అరుదైన గుండెసర్జరీలు, యాంజియోప్లాస్టీలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. టావీ ప్రొసీజర్‌తో గుండె అయోటిక్ కవాటాన్ని మార్చామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని డాక్టర్ పెద్దేశ్వరరావు పేర్కొన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పడంతో వారికి ఆటపాటలు, చదువుకోవడంతో పాటు మంచి విద్యాబుద్ధులు వచ్చేలా తీర్చిదిద్దుతామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రశాంతి పేర్కొన్నారు. కొత్తపేట ఐసీడీఎస్-1 సెక్టార్-2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌తో పాటు సిబ్బంది పాల్గొని స్థానికులకు అవగాహన కల్పించారు. మూడు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పితే వారికి పీపీ-1, పీపీ-2 చదవడం, కథల పుస్తకాల సిలబస్‌ను వివరించడంతో పాటు ఐదేళ్లు నిండిన తర్వాత వారిని నేరుగా 1వ తరగతిలో చేర్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరు తమకు అందుబాటులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి దునిషా, ఏఎన్‌ఎం ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఉదయం 9 గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కిస్తారన్నారు. ఈ లెక్కింపులో సేవాదళ్ సభ్యులు. ఆలయ సిబ్బంది పాల్గొంటారు.

- గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కార్మికులకు ప్రపంచ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్, రైల్వే వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు బుధవారం ఏర్పాటు చేశారు. శిబిరం ప్రారంభించిన వ్యాగన్‌వర్క్‌షాపు చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ రక్తదానం చేసిన ఉద్యోగులు, కార్మికులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చుక్కల జింకను మట్టుబెట్టిన గ్రామస్తులు

కేసు నమోదు చేసిన అటవీశాఖ

రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండు వేసవి, మరో వైపు నీటి కోసం అడవిని వీడి వచ్చిన చుక్కల జింకను ఆ గ్రామస్తులు నిర్దాక్షిణ్యంగా మట్టుబెట్టారు. తల, మొండెం వేరు చేసి వాటాలు వేసుకునే సమయంలో అటవీ అధికారులు రంగంలోకి దిగారు. వారిని చూసిన వేటగాళ్లు అక్కడ నుంచి పరారయ్యారు. మండలంలోని గింజర్తి గ్రామ శివారులో ఓ చుక్కల జింక పచ్చిక మేస్తూ మిరియాల నానిబాబు పొలంలోకి వచ్చింది. ఇది గమనించిన స్థానికులు దానిని తరుముతూ కత్తితో దాడి చేయడంతో తల మొండెం వేరయ్యాయి. దాడిచేసిన వారు వాటాలు వేసుకునేందుకు సిద్ధపడ్డారు. ఈ దారుణాన్ని చూసిన కొంత మంది అటవీఅధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకొన్న అటవీఅధికారులు స్థానిక పశువైద్యాధికారి తరుణ్‌తో జింకకు పోస్టుమార్టం చేయించారు. మగ జింక, మూడు సంవత్సరాల వయసు ఉంటుదని పశువైద్యాధికారి పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుల కోసం గాలిస్తున్నామని అటవీ క్షేత్రాధికారి అబ్బాయిదొర తెలిపారు.

యాసిడ్ దాడి బాధితురాలికి అండగా ప్రభుత్వం

హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ఏలూరులో యాసిడ్ దాడికి గురైన బాధిత మహిళకు, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. బుధవారం కొవ్వూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. గాయపడిన మహిళను వైద్య సేవల నిమిత్తం విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి తరలించారన్నారు. ఆమెకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. యాసిడ్ దాడి దురదృష్టకరమని, దాడికి పాల్పడిన నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ఆదేశించామన్నారు.

బీఎల్ సంతోష్‌తో సుజనా చౌదరి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్‌తో పార్టీ మాజీ ఎంపీ సుజనా చౌదరి భేటీ అయ్యారు. బుధవారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో సంతోష్‌ను కలిసిన సందర్భంగా ఏపీలోని తాజా రాజకీయ వ్యవహారాలను సుజనా చౌదరి వివరించారు. రానున్న అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై బీఎల్ సంతోష్‌తో మాజీ ఎంపీ సుజనా చౌదరి చర్చించారు.

చెత్త కుండీలో అప్పుడే పుట్టిన పసికందు.. హాస్టల్‌లో బాలిక ప్రసవం–కిటికీ నుంచి బిడ్డను విసిరేసిన వైనం వంటి వార్తలు వింటుంటే హృదయం ద్రవించి పోతుంది. మరోవైపు.. ఐవీఎఫ్ సెంటర్లలో శిశు విక్రయాలు.. పిల్లలను కిడ్నాప్ చేసి రూ.లక్షలకు అమ్మేస్తున్న ఘటనలూ చూస్తున్నాం. అవాంఛిత బిడ్డలను వదిలించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తుంటే.. సంతానం కలగని తల్లిదండ్రులు ఎందరో పిల్లల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. మారుతున్న జీవన శైలి, అనారోగ్యం, ఆలస్యంగా వివాహాలు చేసుకోవటం, కెరీర్ కోసం పిల్లలను వాయిదా వేయటం వంటి కారణాల వల్ల సంతానలేమి సమస్య బాగా పెరిగిపోయింది. ఫలితంగానే.. ప్రతి పట్టణంలో ఇప్పుడు ఫెర్టిలిటీ సెంటర్లు వెలిశాయి. అయితే, వైద్య విధానాల ద్వారానూ సంతానం కలగని తల్లిదండ్రులు దత్తత తీసుకోవచ్చు. (ఏపీ నెట్‌వర్క్)



అనాథలకు అమ్మతోడు

తీవ్రమవుతున్న సంతానలేమి సమస్యలు

దత్తత గతం కంటే ఇప్పుడు సులభం

- నిబంధనలు సరళతరం చేసిన కేంద్రం
- పిల్లలున్నా ఆర్థిక స్థోమత ఉంటే దత్తత తీసుకోవచ్చు
- ప్రత్యేక ఏజెన్సీల ఏర్పాటుతో ఆలస్యం నివారణ

దత్తత ఎంతో మేలు

గతంలో దత్తత నిబంధనలు కఠినతరంగా ఉండేవి. కేంద్రప్రభుత్వం 2022 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలులోకి తెచ్చిన నూతన మార్గదర్శకాల ప్రకారం దత్తత పొందటం ఇప్పుడు సులభం. దత్తత తీసుకోదలిచిన తల్లిదండ్రులు చట్టబద్ధంగా మాత్రమే ఆ పని చేయాల్సి ఉంటుంది. మరే ఇతర పద్ధతుల్లో పిల్లలను దత్తత తీసుకుంటే చట్టరీత్యా నేరం. అలాంటి వారు శిక్షార్హులు అవుతారు. గతంలో పిల్లలు కలగని దంపతులు మాత్రమే దత్తత తీసుకునేందుకు అర్హులు. తాజాగా ఈ నిబంధనను తొలగించి.. పిల్లలు ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత కలిగిన వారు దత్తత తీసుకునే అవకాశం ఇచ్చారు. పిల్లలు కావాలనుకున్న వారు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీకి దరఖాస్తు చేసుకుంటే.. వారు వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లోని శిశుగృహాల్లో దత్తతకు సిద్ధంగా ఉన్న పిల్లల వివరాలు తెలియజేస్తారు. ఆయా రాష్ట్రాల్లో ఏర్పాటైన స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీలు దత్తత ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు తోడ్పడతాయి. దేశవ్యాప్తంగా ఉన్న శిశు గృహాల్లో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు 2,188 మంది దత్తతకు సిద్ధంగా ఉన్నారు. మన రాష్ట్రంలోని శిశు గృహాల్లో సుమారు 120 మంది బాల బాలికలు ఉన్నారు. మరోవైపు దేశ విదేశాలకు చెందిన 31 వేల మందికి పైగా తల్లిదండ్రులు పిల్లలను దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుని ఉన్నారు. రంగు, భాష, ప్రాంతం తదితర ప్రాధాన్యతల కారణంగా పిల్లలందరినీ దత్తతకు అప్పగించటంలో జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు సైతం ఏజెన్సీలు కృషి చేస్తున్నాయి. దత్తత కోరే తల్లిదండ్రులకు అవగాహన కల్పించటంతో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లోని శిశు గృహాల్లో ఉన్న పిల్లల వివరాలను అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు. సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేస్తున్నారు.

మరిన్ని వివరాలు కావాలంటే..

దత్తతకు సంబంధించిన మరిన్ని వివరాలు అంగన్‌వాడీ కేంద్రాలు, ఐసీడీఎస్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణాధికారి కార్యాలయంలో లభిస్తాయి. అనాథ శిశువులను సంరక్షించేందుకు సైతం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రోడ్డు పక్కన, కాలువలోనూ చెత్త కుండీల్లోనూ శిశువులను గుర్తిస్తే సమాచారం తెలిపేందుకు టోల్‌ఫ్రీ ఫోన్ నంబర్లు 1098, 181, 100లను ఏర్పాటు చేసింది.

ఎలా దరఖాస్తు చేయాలంటే..

దత్తత తీసుకోదలచిన వారు పాన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వయసు ధ్రువీకరణ పత్రం, దంపతుల ఫొటో, నివాస ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, ఆరోగ్య ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. దత్తత కోసం ఏడు దశలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

- దత్తత తీసుకోవాలనుకుంటున్న తల్లిదండ్రులు వారి పాన్‌కార్డు ద్వారా www.cara.nic. in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి.
- సిద్ధం చేసుకున్న ధ్రువీకరణ పత్రాలను వెబ్‌సైట్‌లో వారి లాగిన్ ఐడీ ద్వారా 30 రోజుల లోపు అప్‌లోడ్ చేయాలి. దత్తత ఏజెన్సీకి గృహ అధ్యయన నివేదిక సమయంలో రూ.6 వేలు డీడీ తీసి ఇవ్వాల్సి ఉంటుంది.
- తర్వాత దత్తత ఏజెన్సీ గృహ అధ్యయన నివేదికను తయారు చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తుంది.
- అర్జీదారు కోరుకున్న లక్షణాలున్న పిల్లల వివరాలు రిఫర్ చేస్తూ వారి మొబైల్‌కు సమాచారం అందుతుంది. ఆ సమాచారం ప్రకారం 48 గంటలలోపు వెబ్‌సైట్‌లో లాగిన్ అయి నచ్చిన బిడ్డను రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.
- రిజర్వు చేసుకున్న బిడ్డను 20 రోజులలోపు సరిపోల్చుకుని దత్తత ఏజెన్సీ వద్దకు వెళ్లి బిడ్డ నచ్చిందని ఆమోదం తెలియజేసి రూ.40 వేలు డీడీ ద్వారా చెల్లించి బిడ్డను పొందవచ్చు.
- బిడ్డను పొందిన వారం రోజులలోపు సదరు దత్తత ఏజెన్సీ దత్తతకు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ స్థానిక కుటుంబ న్యాయస్థానం లేదా జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో సమర్పించి దత్తత ఉత్తర్వుల ప్రతిని పొందాలి.
- దత్తత తీసుకున్న బిడ్డ సంక్షేమం కోసం స్థానిక దత్తత ఏజెన్సీకి చెందిన సోషల్ వర్కర్ రెండు సంవత్సరాల పాటు ప్రతి ఆరు నెలలకు ఒకసారి గృహ సందర్శన చేసి ఫాలోఅప్ రిపోర్టును 'కారా' పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఫాలోఅప్ సందర్శనకు వచ్చిన ప్రతిసారి దత్తత ఏజెన్సీకి రూ.2 వేలు డీడీ రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది.

2022-23లో దత్తతకు ఇచ్చిన పిల్లల వివరాలు

శిశు సంరక్షణ కేంద్రం	భారతీయులకు	విదేశీయులకు
	దత్తత ఇచ్చిన పిల్లల సంఖ్య	
అనంతపురం	8	0
చిత్తూరు	4	1
తూర్పు గోదావరి	4	0
గుంటూరు	8	0
కృష్ణా	10	1
కర్నూలు	7	3
నెల్లూరు	8	0
ప్రకాశం	4	3
శ్రీకాకుళం	3	1
విశాఖపట్నం	5	0
విజయనగరం	6	1
పశ్చిమ గోదావరి	5	0
వైఎస్సార్	7	1
మొత్తం	79	11

ఫిషరీస్ వర్సిటీ కార్యకలాపాలు ప్రారంభం

- నరసాపురంలో తాత్కాలిక తరగతి గదుల భవనాన్ని ప్రారంభించిన మంత్రి సీదిరి
- 2023–24 విద్యా సంవత్సరం నుంచి కోర్సుల నిర్వహణ



పశ్చిమ గోదావరి జిల్లా లిఖితపూడిలో వర్సిటీ పరిపాలనా భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు, చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న ఫిషరీస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ కార్యకలాపాలు బుధవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. 2023–24 విద్యా సంవత్సరంలో కోర్సుల నిర్వహణకు సంబంధించి నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలోని తుఫాన్ షెల్టర్ బిల్డింగ్‌లో ఏర్పాటుచేసిన తాత్కాలిక తరగతిగదులను రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు నరసాపురం మండలం లిఖితపూడిలో 40 ఎకరాల్లో రూ.332 కోట్లతో నిర్మిస్తున్న ఫిషరీస్ యూనివర్సిటీ పరిపాలనా భవన నిర్మాణ పనులను మంత్రి అప్పలరాజు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వర్సిటీ పరిపాలనా భవనానికి ప్రభుత్వం తొలివిడతగా కేటాయించిన రూ. 100 కోట్లతో చేపడుతున్న పనుల పురోగతిని ముదునూరి మంత్రి అప్పలరాజుకు వివరించారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, హాస్టల్ భవనాలను నిర్ణీతకాలవ్యవధిలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ మత్స్య ఎగుమతుల్లో ఏపీ ఇప్పటికే దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. మత్స్య ఉత్పత్తులను మరింత పెంచడం, మత్స్యకారుల వలసలు నివారించి వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఈ ప్రయత్నంలో భాగంగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురంలో అంతర్జాతీయ ఫిషరీస్ యూనివర్సిటీ నెలకొల్పుతున్నట్లు చెప్పారు. ఇది దేశంలోనే మూడో ఫిషరీస్ వర్సిటీ అని వివరించారు. వర్సిటీ ఏర్పాటువల్ల మత్స్యరంగంలో విస్తృత పరిశోధనలు జరుగుతాయని, ఈ రంగంలో నిపుణుల కొరత కూడా తీరుతుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి చైర్‌పర్సన్ బర్రి లీల, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అండ్రాజు చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

8 ఆర్‌వోబీలకు లైన్‌క్లియర్

భూసేకరణ నిధులు విడుదల చేసిన ప్రభుత్వం



ఆర్‌వోబీలు నిర్మించనున్న ప్రాంతాలు

1. విశాఖపట్నం మార్షలింగ్ యార్డ్
2. నిడదవోలు
3. పిఠాపురం
4. పిడుగురాళ్ల
5. దెందులూరు
6. కమలాపురం
7. టంగుటూరు
8. గూడూరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైల్వేలైన్ల వద్ద లెవల్ క్రాసింగ్ సమస్య పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. అందుకోసం రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌వోబీ) నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసేందుకు చొరవ చూపించింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన 10 ఆర్‌వోబీల నిర్మాణానికి భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు రూ.106.18 కోట్లు విడుదల చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదనల మేరకు కేంద్ర రవాణా, జాతీయ రహదారులశాఖ రాష్ట్రానికి 33 ఆర్‌వోబీలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సేతుబంధన్ ప్రాజెక్టు కింద దశలవారీగా చేపట్టే ఈ ఆర్‌వోబీల నిర్మాణానికి భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులను వెచ్చించాల్సి ఉంది. మొదటిదశలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) 10 ఆర్‌వోబీల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే రెండు ఆర్‌వోబీలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.5 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. తాజాగా మిగిలిన 8 ఆర్‌వోబీల నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ టెండర్ల ప్రక్రియ పూర్తిచేయడంతో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటికి తన వాటా నిధులు రూ.106.18 కోట్లు విడుదల చేసింది. దీంతో ఆర్‌వోబీల నిర్మాణానికి మార్గం సుగమమైంది. పనులు వేగవంతం కానున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్మాణాలను పూర్తిచేయాలనే లక్ష్యంతో ఎన్‌హెచ్‌ఏఐ, రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాచరణను వేగవంతం చేశాయి.

జిల్లా వార్తలు

మైనార్టీల సంక్షేమానికి అండగా ప్రభుత్వం

వక్ఫ్‌బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా



జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంపూర్ణ అండదండలు అందిస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పాతబస్తీ కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో ఉన్న ఇందాద్‌ఘర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జిల్లా వక్ఫ్‌బోర్డు నూతన కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుతో కలిసి అంజాద్‌బాషా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీల అభ్యున్నతికి జగన్‌మోహన్‌రెడ్డి అపూర్వమైన చేయూత అందిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు స్థలాల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాట్లు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు అందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు అండగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు వివరించారు. తొలుత మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు షేక్ ఆసిఫ్, తోలేటి శ్రీకాంత్, బండి నాగేంద్రపుణ్యశీల, మనోజ్‌కొఠారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామంలో వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన యువకుడు మైఫజ్ (20) మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బిహార్ రాష్ట్రం, కతియార్ జిల్లా దెరువ పంచాయతీకి చెందిన మైఫజ్ నున్న గ్రామంలో దేవదత్త ఈకో ఫ్రెండ్లీ పేపర్ ప్లేట్ ఇండస్ట్రీలో పని చేస్తున్నాడు. మృతుడు వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. అతడిని చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఆ యువకుడు అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అపర కర్మల భవనానికి రూ.25 లక్షలు



నిధులు మంజూరు చేస్తున్నట్లు శ్రీకాంత్‌కు పత్రాన్ని అందజేస్తున్న కృష్ణయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వబ్రాహ్మణుల అభ్యర్థన మేరకు అపర కర్మల భవన నిర్మాణానికి తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. విజయవాడలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మారేష్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన బీసీ కులాల ఆత్మీయ సమావేశంలో ఆయన చేసిన ప్రకటనపై ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలో బస్టాండ్ ఎదురుగాగల సనారి విజ్ఞాన మండపం (విశ్వబ్రాహ్మణుల అపర కర్మల భవనం)ను కూల్చివేశారని గుర్తుచేశారు. తమ కోరిక మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్ వద్ద స్థలం కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ స్థలంలో అపర కర్మల భవన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేసిన ఆర్.కృష్ణయ్యకు ధన్యవాదాలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, సంఘ నాయకులు నడిపల్లి ప్రసాద్, పాలడుగు శివ, పెదప్రోలు బ్రహ్మం, జవ్వాది సుధీర్, చిట్టూరి హరీష్, రాజేష్, సున్నపు వీరభద్రాచారి ఉన్నారు.

ప్రాణం తీసిన అనైతిక బంధం

ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఇద్దరు పురుషుల మధ్య ఏర్పడిన అనైతిక బంధం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తొలుత పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా విచారిస్తే హత్య వ్యవహారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. కృష్ణాజిల్లా కోడూరుకు చెందిన టి.సాయికృష్ణ మే 18వ తేదీన తమ బంధువు సంవత్సరీకానికి యనమలకుదురు వచ్చాడు. అతనికి యనమలకుదురుకు చెందిన ప్రసాద్‌తో ఫోన్‌లో పరిచయం ఉంది. ఇద్దరి మధ్య అనైతిక బంధం ఏర్పడింది. దీంతో మే 18వ తేదీన వారిద్దరు యనమలకుదురులోని ఓ బార్‌లో మద్యం తాగారు. అనంతరం ప్రసాద్‌ను కోరిక తీర్చాలని సాయికృష్ణ అడిగాడు. ఆ సమయంలో తాను చెప్పినట్లు చేయలేదని సాయికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కర్రతో దాడిచేశాడు. తల వెనుక భాగంలో గాయం కావడంతో ప్రసాద్ గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించారు. అతడిని వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సమాచారం అందుకున్న పటమట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వెలుగు చూసిందిలా...

ఆ ఘటన జరిగి దాదాపు నెలరోజులైంది. వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో తలకు బలమైన గాయంతో ప్రసాద్ మృతి చెందినట్లు పేర్కొన్నారు. అసలు గాయం ఎలా అయ్యిందో తెలుసుకునేందుకు పోలీసులు అనేక కోణాల్లో విచారణ చేశారు. మృతుడి కాల్‌డేటాను పరిశీలించగా, సాయికృష్ణ నంబరు బయట పడింది. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. తాను చెప్పినట్లు చేయలేదనే కర్రతో తలపై కొట్టినట్లు సాయికృష్ణ అంగీకరించాడని సమాచారం. దీంతో అనుమానాస్పద మృతి కేసును హత్యకేసుగా మార్చిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

జర్నలిస్టు సంఘాల ముసుగులో కొత్త పెత్తందార్లు

- త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశం
- ఆంధ్రప్రదేశ్ సీ రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ సీ రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని జర్నలిస్టు సంఘాల నాయకులు తమ డిమాండ్ల ముసుగులో కొత్త పెత్తందార్ల అవతారం ఎత్తినట్లుగా కనిపిస్తోందని విమర్శించారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలతో కలిసి సదస్సులు నిర్వహించడం ద్వారా వారి అసలు అజెండాను బయట పెట్టుకున్నట్లుగా ఉందన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన అక్రెడిటేషన్, హెల్త్‌కార్డుల సమస్యలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తుచేశారు. వీటిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సంఘాల నాయకులు సమాచార శాఖ కమిషనర్‌ను కలిసి తెలియజేయవచ్చని సూచించారు. ప్రభుత్వం చేసే ఏ పనినైనా కొన్ని దుష్టశక్తులు ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయని పేర్కొన్నారు. జర్నలిజంలో కూడా కొందరు పెత్తందారులుగా మారి తమ జులుం ప్రదర్శించాలని చూస్తున్నారని, కొన్ని పత్రికలు, టీవీ చానళ్లు అడ్డగోలుగా వార్తలు ప్రసారం చేస్తున్నా, ప్రభుత్వంపై నీచమైన స్థాయిలో అసత్యాలతో సంపాదకీయాలు రాస్తున్నా జర్నలిస్ట్ సంఘాల నేతలు ఎందుకు ప్రశ్నించలేకపోతున్నారని ఆయన ప్రకటనలో సూటిగా ప్రశ్నించారు. కొందరు మీడియా సంస్థల యజమానులు జర్నలిజం విలువలకు పాతరేస్తూ తిరుగుతుంటే ఈ యూనియన్ల నేతలు, జర్నలిస్టుల్లో పెత్తందారులుగా తయారైన వారు కనీసం నోరెత్తలేకపోతున్నారని కొమ్మినేని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ చాలా ఎక్కువగా ఉన్నాయని అందువల్లనే కొన్ని పత్రికలు, టీవీ చానళ్లు యథేచ్ఛగా నోటికి వచ్చిన దుష్టభాషతో వార్తా కథనాలు, సంపాదకీయాలు ఇవ్వగలుగుతున్నాని పేర్కొన్నారు. జర్నలిస్ట్ సంఘాలు తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకోవడం తప్పు కాదని, అదే సమయంలో కొంత సంయమనంగా ఉండాలని, అలా కాకుండా కొన్ని రాజకీయ పక్షాల ప్రయోజనం కోసం జర్నలిస్టు సంఘాలు ప్రయత్నిస్తే, జర్నలిజానికి మరింత మచ్చ తెస్తాయని కొమ్మినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

సరికొత్త ఆవిష్కరణలకు ఇంజినీరింగ్ విద్య దోహదం



సమావేశంలో మాట్లాడుతున్నడాక్టర్ సుధాకర్‌రావ్

చేబ్రోలు: విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో సరికొత్త ఆవిష్కరణలు రూపొందించడానికి పుష్కలమైన అవకాశాలున్నాయని యూఎస్‌ఏలోని రావుస్ కన్సల్టెంట్స్ ప్రెసిడెంట్, సీఈఓ, ఐఈఈఈ లైఫ్ ఫెల్లో డాక్టర్ సుధాకర్‌రావ్ తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ అండ్ యాంటినా టెక్నాలజీస్ ఫర్ స్పేస్, ఎయిర్ అండ్ గ్రౌండ్ అప్లికేషన్స్'' అనే అంశంపై బుధవారం అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రావ్ మాట్లాడుతూ ఆవిష్కరణ ఇంజినీరింగ్ విద్యార్థులకు దినచర్యగా ఉండాలని తెలిపారు. లెర్నింగ్, అప్లై, డెవలప్, ఇన్నోవేట్, లీడ్ అనే ఐదు గుణాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సిస్టమ్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, మెకానికల్, టెస్ట్స్ అండ్ కస్టమర్ అండర్‌స్టాడింగ్ వంటి క్రిటికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. పులివెందుల జేఎన్‌టీయూఏలోని ఈసీఈ హెడ్ ప్రొఫెసర్ రమణారెడ్డి మాట్లాడుతూ ఎప్పుడూ మూసధోరణిలో పనులు చేసుకుంటూ వెళితే కొన్నాళ్లకే విద్యార్థులకు బోరు కొట్టేస్తుందని, పరిధిని దాటి నూతన ఆవిష్కరణలు, పద్ధతుల కోసం ఆలోచించాలని తెలిపారు. పనుల్ని కాస్త కొత్తగా, సృజనాత్మకంగా చేయడానికి ప్రయత్నించాలని సూచించారు. విజ్ఞాన్ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్.రఘునాథన్, డాక్టర్ నాసెర్ చహత్, ప్రొఫెసర్ చో–యెన్–డెస్మోండ్‌సిమ్, ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.సెల్గి, గుప్త పాల్గొన్నారు.

మాదిగలను వంచించిన చంద్రబాబు

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్

సాక్షి,అమరావతి: నమ్మకానికి మరో పేరైన మాదిగలను దగ్గరకు తీసినట్టు తీసి, గుండెకోతకు గురిచేసిన నయవంచకుడు చంద్రబాబు అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ దుయ్యబట్టారు. విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ వద్ద ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. తమను చంద్రబాబు వంచించిన విధాన్ని మాదిగలు ఇంకా మరువలేదని పేర్కొన్నారు. 'ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా' అని అన్నప్పుడే ఆయన నిజస్వరూపం తెలిసిందని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపించగానే తాను అధికారంలో ఉన్నప్పుడు విస్మరించిన కులాలన్నింటినీ మరలా తనకు అనుకూలంగా మార్చుకోవాలని చంద్ర బాబు చూస్తారని విమర్శించారు. ఎస్సీ ఎస్టీలకు మేలు చేసే పథకాన్ని ఒక్కటైనా అమలు చేశానని చెప్పుకోగలరా అని ప్రశ్నించారు. ఎన్నికల మ్యానిఫెస్టో విషయానికొచ్చే సరికి ఆల్ ఫ్రీ బాబు అవతారమెత్తుతారని ఎద్దేవాచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంగా చూసుకుంటూ ఇప్పటికే 99.5 శాతం హామీలను నెరవేర్చారని కొనియాడారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, మంత్రి జోగి రమేష్

పెడన: తమను రెగ్యులర్ చేస్తూ మంత్రివర్గం తీర్మానం చేయడంతో కాంట్రాక్టు ఉద్యోగులు హర్ష వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద బంటుమిల్లి ఏపీఎన్‌జీఓ సంఘం ఆధ్వర్యంలో వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మంత్రి జోగి రమేష్‌ను సత్కరించారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో చాలా ఆనందంగా ఉన్నామని మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ బంటుమిల్లి యూనిట్ అధ్యక్షుడు ఎం.ఏసుదాసు, ఎ.వి.వి.వరప్రసాద్, బి.బాబారామ్మోహనరావు, కె.వేణు, పావని, సుధాకర్, రాజారావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం



నీట్ ఫలితాల తర్వాత సందడి చేస్తున్న శ్రీచైతన్య విద్యార్థులు, సిబ్బంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయవాడ ఇంద్ర టవర్స్ (డేస్కాలర్స్) విద్యార్థులు తమ రికార్డులను తామే తిరగరాశారు. శ్రీచైతన్య (గాయత్రి), ఇంద్రటవర్స్ డే స్కాలర్స్ విద్యార్థి వరుణ్ చక్రవర్తి ఆలిండియా కేటగిరీలో మొదటి ర్యాంకు (720/720 మార్కులు) సాధించాడు. 100 లోపు ఏడు ర్యాంకులను ఇంద్ర టవర్స్ విద్యార్థులు సొంతం చేసుకున్నారు. శ్రీచైతన్య విజయవాడ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్‌లో కూడా విజయ పరంపర కొనసాగించారని ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో పది లోపు ఎనిమిది, 50 లోపు 22, 100 లోపు 34 ర్యాంకులు, ఇంజినీరింగ్ విభాగంలో పది లోపు ఒకటి, 50 లోపు 15, 100 లోపు 33 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను కళాశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. ఈ విజయంలో ముఖ్య పాత్రపోషించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, డీన్స్, ప్రిన్సిపాల్స్ అభినందనలు తెలిపారు.

సాక్షి బిజినెస్
గురువారం
15-6-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲	85	63,229
నిఫ్టీ ▲	40	18,756

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్‌	13,592	▲	19
డోజోన్స్‌	34,052	▼	160
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,602	▲	8
డాక్స్‌	16,312	▲	90
షాంఘై	3,229	▼	5
నికాయ్‌	33,502	▲	484

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	59,264	▼	592
బంగారం (99.5 స్వచ్ఛత)	59,027	▼	589
వెండి (కేజీ)	72,105	▼	1,064

ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు ప్రయాణం

వోల్వో నుంచి కొత్త ఎలక్ట్రిక్‌ ఎస్‌యూవీ | సీ40 రీచార్జ్‌ ఈవీ విడుదల | 27 నిముషాల్లో 80% చార్జింగ్‌



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న స్వీడన్‌ సంస్థ వోల్వో తాజాగా భారత మార్కెట్లో పూర్తి ఎలక్ట్రిక్‌ ఎస్‌యూవీ సీ40 రీచార్జ్‌ ఆవిష్కరించింది. ఒకసారి చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. ట్విన్‌ మోటార్స్, 408 హెచ్‌పీ పవర్‌తో 78 కిలోవాట్‌ అవర్‌ బ్యాటరీ పొందుపరిచారు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 4.8 సెకన్లలో చేరుకుంటుంది. 27 నిమిషాల్లో 80 శాతం చార్జింగ్‌ పూర్తి అవుతుంది. కారుకు కావాల్సిన విడిభాగాలను భారత్‌కు దిగుమతి చేసుకుని బెంగళూరు ప్లాంటులో అసెంబుల్‌ చేస్తారు. సెప్టెంబర్‌ నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయి. ఎలక్ట్రిక్‌ విభాగంలో భారత్‌లో సంస్థకు ఇది రెండవ మోడల్. ఇప్పటికే ఇక్కడి విపణిలో పూర్తి ఎలక్ట్రిక్‌ ఎక్స్‌సీ40 రీచార్జ్‌ కారును గతేడాది ప్రవేశపెట్టింది. అంతర్జాతీయంగా 2030 నాటికి పూర్తి ఎలక్ట్రిక్‌ కార్‌ కంపెనీగా అవతరించాలన్నది వోల్వో లక్ష్యం. భారత్‌లో 2025 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించింది.

ఈవీలదే కీలక పాత్ర..

వోల్వో 2022లో దేశవ్యాప్తంగా సుమారు 1,800 యూనిట్లను విక్రయించింది. ఇప్పటి వరకు కంపెనీ నుంచి గరిష్టంగా 2018లో 2,600 కార్లు రోడ్డెక్కాయి. ఏటా ఇక్కడి మార్కెట్లో ఒక ఎలక్ట్రిక్‌ కారును ప్రవేశపెట్టాలని సంస్థ నిర్ణయించింది. ఈ ఏడాది భారత్‌లో రికార్డు స్థాయిలో అమ్మకాలు సాధించే ప్రయత్నంలో ఎలక్ట్రిక్‌ కార్లు కీలక పాత్ర పోషిస్తాయని వోల్వో కార్‌ ఇండియా ఎండీ జ్యోతి మల్హోత్రా తెలిపారు. '2023 చాలా ఆశాజనకంగా ప్రారంభమైంది. గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే 2023లో మరింత మెరుగ్గా రాణిస్తామని నమ్ముతున్నాం. మహమ్మారి కారణంగా మార్కెట్‌ కొంచెం నెమ్మదిగా ఉంది. అలాగే సరఫరా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ సమస్య ఇప్పటికీ ఉంది. గరిష్ట స్థాయి అమ్మకాలను సాధించిన 2018 స్థాయికి ఈ ఏడాది చేరుకుంటాం. మొత్తం విక్రయాల్లో ఈవీల వాటా 27 శాతం ఉంది' అని వివరించారు. కంపెనీ భారత్‌లో ఎక్స్‌సీ90, ఎక్స్‌సీ60, ఎక్స్‌సీ40 ఎస్‌యూవీలు, ఎస్‌90 సెడాన్‌ను సైతం విక్రయిస్తోంది.

సీడీఎస్‌ఎల్‌లో బీఎస్‌ఈ వాటాల విక్రయం

రూ. 468 కోట్లకు 4.5% అమ్మకం



న్యూఢిల్లీ: సెంట్రల్‌ డిపాజిటరీస్‌ సర్వీసెస్‌ ఇండియా (సీడీఎస్‌ఎల్‌)లో స్టాక్‌ ఎక్సే్ఛంజీ బీఎస్‌ఈ మరో 4.5 శాతం వాటాలను విక్రయించింది. ఈ డీల్‌ విలువ రూ. 468 కోట్లు. షేరు ఒక్కింటికి సగటున రూ. 985.98 రేటు చొప్పున ఓపెన్‌ మార్కెట్లో 47,44,000 షేర్లను బీఎస్‌ఈ విక్రయించింది. ఎలక్ట్రానిక్‌ విధానంలో షేర్ల లావాదేవీల నిర్వహణ తదితర సర్వీసులను సీడీఎస్‌ఎల్‌ అందిస్తోంది. దేశీయంగా స్టాక్‌ ఎక్సే్ఛంజీల్లో లిస్టయిన ఏకైక డిపాజిటరీగా కొనసాగుతోంది. సీడీఎస్‌ఎల్‌ 2017లో లిస్టయ్యింది. అప్పట్లో బీఎస్‌ఈకి కంపెనీలో 50.05 శాతం వాటాలు ఉండేవి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం డిపాజిటరీల్లో స్టాక్‌ ఎక్సే్ఛంజీలకు 24 శాతానికి మించి వాటాలు ఉండకూడదు. దీంతో నిబంధనలకు అనుగుణంగా ఐపీవో కింద కొన్ని షేర్లను విక్రయించడం ద్వారా బీఎస్‌ఈ తన వాటాను తగ్గించుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆఫర్‌ ఫర్‌ సేల్‌ (ఓఎఫ్‌ఎస్‌) మార్గంలో 2.5 శాతం వాటాలను విక్రయించింది.

ఎన్‌ఎస్‌ఈలో సీడీఎస్‌ఎల్‌ షేరు బుధవారం 3% క్షీణించి రూ. 1,018 వద్ద క్లోజయ్యింది.

కంటి సమస్యలకు 'లీ' ఔషధం

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: చూపు మందగించడం, కంటికి వచ్చే అంటువ్యాధులకు పరిష్కారంగా ఫార్మా కంపెనీ లీ హెల్త్‌ డొమెయిన్‌ 'డీ–మాక్యులా' పేరుతో సహజ సిద్ధ ఔషధాన్ని అందుబాటులోకి తెచ్చింది. అశ్వగంధ, బోస్విల్లా శరాషియో, జీగ్జాంథిన్, త్రిఫల, బిటా కెరోటిన్, కుంకుమ పువ్వును దేశీయ ఆవు నెయ్యిలో మరిగించి సేకరించిన రసాయనంతో డీ–మాక్యులా సాఫ్ట్‌జెల్‌ క్యాప్సూల్‌ తయారైందని కంపెనీ డైరెక్టర్‌ ఆళ్ల లీలా రాణి తెలిపారు. కంటి మంట, పొడిబారడం, హానికర నీలి కాంతికి వ్యతిరేకంగా పోరాడడానికి, డయాబెటిక్‌ రెటినోపతి చికిత్సలో సహాయకారిగా ఉంటుందన్నారు. అమెజాన్, లీహెల్త్‌డొమెయిన్‌.కామ్‌ ద్వారా కూడా లభిస్తుంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

15-6-2023	
విశాఖ	525–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	490–00
విజయవాడ	490–00
రిటైల్‌ ధర (డజను)	72.00
14-6-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	505–00
వరంగల్‌	507–00
రిటైల్‌ ధర	5.65

నష్టాల్లోంచి లాభాల్లోకి...


- తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ
- ఫెడ్‌ వడ్డీరేట్ల ప్రకటన ముందు అప్రమత్తత
- ద్వితీయార్థం నుంచి కొనుగోళ్లు
- రాణించిన మెటల్, ఇంధన షేర్లు
- సూచీలు మూడో రోజూ ముందడుగే



ముంబై: మిడ్‌ సెషన్‌ నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఇంట్రాడే నష్టాల నుంచి కోలుకున్న సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. మెటల్, కమోడిటీ, ఇంధన షేర్లు రాణించడంతో పాటు టోకు ద్రవ్యోల్బణం ఏడున్నరేళ్ల కనిష్టానికి దిగిరావడం ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చాయి. ఉదయం సెన్సెక్స్‌ 28 పాయింట్ల నష్టంతో 63,115 వద్ద, నిఫ్టీ 28 లాభంతో 18,744 వద్ద మిశ్రమంగా మొదలయ్యాయి. తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం, అమెరికా ఫెడ్‌ రిజర్వ్‌ వడ్డీ రేట్ల వెల్లడి(బుధవారం రాత్రి)కి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 260 పాయింట్ల పరిధిలో 63,014 వద్ద కనిష్టాన్ని, 63,274 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 85 పాయింట్లు బలపడి 63,229 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80 పాయింట్ల రేంజ్‌ కదలాడింది. రోజంతా 18,690 – 18,770 శ్రేణిలో ట్రేడైంది.ఆఖరికి 40 పాయింట్లు పెరిగి 18,756 వద్ద నిలిచింది. మెటల్, ఇంధన, ఎఫ్‌ఎంసీజీ, కన్సూ్యమర్‌ డ్యూరబుల్, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, ఆటో షేర్లు లాభపడ్డాయి. విస్తృత స్థాయి మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ క్యాప్‌ ఇండెక్సులు 0.42%, 0.20శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు బ్యాంక్స్, మీడియా, ఫైనాన్స్, ఐటీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,715 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.655 కోట్ల షేర్లను విక్రయించాయి. డాలర్‌ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 82.10 వద్ద స్థిరపడింది. ఫెడ్‌ రిజర్వ్‌ ప్రకటన వెల్లడి ముందు ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లభాల్లో ట్రేడవుతున్నాయి. ''ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు కారణాలతో దేశీయ ఈక్విటీ మార్కెట్లో ఇప్పటికీ సానుకూలత సంకేతాలు నెలకొని ఉన్నాయి. ఈసీబీ, బ్యాంక్‌ ఆఫ్‌ జపాన్‌లు నేడు(గురువారం) పాలసీ విధాన వైఖరిని ప్రకటించనున్నాయి. ఫెడ్‌ రిజర్వ్‌ వడ్డీరేట్లను పెంచకుండా యథాతథ కొనసాగింపునకే మొగ్గుచూపితే సూచీలు ఆల్‌టైం హైని పరీక్షించవచ్చు'' అని మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్సియల్‌ సర్వీసెస్‌ రిటైల్‌ రీసెర్చ్‌ హెడ్‌ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

టోకు ధరలు దిగివచ్చాయ్‌..!

- మేలో ఏడున్నర ఏళ్ల కనిష్టానికి డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం
- పెరుగుదల లేకపోగా 3.48% క్షీణత
- ఆహార, తయారీ, ఇంధన ధరల తగ్గుదల కారణం



ప్రతి ద్రవ్యోల్బణం... వరుసగా రెండో నెల

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మే నెల్లో పెరుగుదల లేకపోగా 3.48 శాతం (క్షీణత) తగ్గింది. గడచిన ఏడు సంవత్సరాల్లో (2015 నవంబర్‌లో మైనస్‌ 3.7 శాతం) ఈ స్థాయిలో టోకు ధరలు నమోదుకావడం ఇదే తొలిసారి. హైబేస్‌ ఎఫెక్ట్‌తోపాటు (గత ఏడాది మే నెల్లో భారీ టోకు ద్రవ్యోల్బణం నమోదుకావడం) సూచీలో మూడు ప్రధాన విభాగాలైన– ఆహార, తయారీ, ఇంధన ధరలు పూర్తిగా అదుపులోనికి వచ్చాయి. 2022లో మే నెలలో 16.63 శాతం టోకు ద్రవ్యోల్బణం (హై బేస్‌) నమోదుకావడం ఇక్కడ గమనార్హం. రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్‌ ద్రవ్యోల్బణం మేనెల్లో 25 నెలల కనిష్టం 4.25 శాతంగా నమోదయిన సానుకూల ఫలితం నేపథ్యంలోనే టోకు ధరలకు సంబంధించి కూడా ఎకానమీకి ఊరటనిచ్చే తాజా ఫలితం వెలువడింది. వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ విడుదల చేసిన తాజా గణాంకాలను పరిశీలిస్తే...

- ఏప్రిల్‌లో ఫుడ్‌ ఆర్టికల్స్‌ ధరల 3.54 శాతం తగ్గితే (వార్షికంగా పోల్చి) తాజా సమీక్షా నెల్లో తగ్గుదల 1.51 శాతంగా ఉంది. కూరగాయల ధరలు 20.12 శాతం తగ్గాయి. ఆలూ ధరలు 18.71%, ఉల్లిధరలు 7.25% తగ్గాయి. అయితే పప్పు దినుసుల ధరలు మాత్రం 5.76 % ఎగశాయి. గోధుమలకు సంబంధించి ద్రవ్యోల్బణం కూడా 6.15%గా ఉంది.
- ఇంధనం, విద్యుత్‌ బాస్కెట్‌ ద్రవ్యోల్బణం మేలో 9.17 శాతం (మైనస్‌) తగ్గింది. ఏప్రిల్‌ నెలలో 0.93 శాతంగా ఉంది.
- తయారీ ఉత్పత్తుల ధరలు ఏప్రిల్‌లో మైనస్‌ 2.42 శాతంగా ఉంటే, మేలో మైనస్‌ 2.97 శాతంగా నమోదయ్యింది.

ద్రవ్యోల్బణం మైనస్‌ లోకి వెళ్లడాన్ని... సాంకేతికంగా ప్రతి ద్రవ్యోల్బణం అని పిలుస్తారు. ఈ ప్రాతిపదికన ప్రతి ద్రవ్యోల్బణం నమోదుకావడం వరుసగా ఇది రెండవనెల. ఏప్రిల్‌లో టోకు ద్రవ్యోల్బణం మైనస్‌ 1.51%గా నమోదయ్యింది. రానున్న నెలల్లో కూడా ఇదే ధోరణి కొనసాగితే, బ్యాంకులకు ఆర్‌బీఐ ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపో 2023లో యథాతథంగా కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు. 2022 మే తర్వాత 2.50% పెరుగుదలతో 6.5 శాతానికి చేరిన రెపో రేటును గత రెండు ద్వైమాసిక సమీక్షల సందర్భంగా ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపులోనికి రావడమే దీనికి కారణం.

భవిత

డీఆర్‌డీవో సైంటిస్ట్‌.. నెలకు లక్ష వేతనం

» సైంటిస్ట్‌-బి హోదాలో 181 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌
» బీటెక్, సైన్స్‌ పీజీ, గేట్‌ స్కోర్‌తో దరఖాస్తుకు అర్హత

దేశ రక్షణకు సంబంధించిన కీలక పరిశోధనలు సాగించే.. డీఆర్‌డీఓలో అడుగుపెట్టే అద్భుత అవకాశం! బీటెక్, ఎమ్మెస్సీ అర్హతలతో.. గేట్‌ స్కోర్‌ ఆధారంగా.. ఈ ప్రతిష్టాత్మక సంస్థలో సైంటిస్ట్‌ పోస్టు సొంతం చేసుకోవచ్చు!! ఇటీవల డీఆర్‌డీఓ 181 సైంటిస్ట్‌-బి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఇందుకోసం.. డీఆర్‌డీఓకు చెందిన రిక్రూట్‌మెంట్‌ అండ్‌ అసెస్‌మెంట్‌ సెంటర్‌.. నియామక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. డీఆర్‌డీఓ సైంటిస్ట్‌-బి పోస్ట్‌ల వివరాలు, ఎంపిక విధానం, భవిష్యత్తు కెరీర్‌ తదితర అంశాలపై విశ్లేషణ..

మొత్తం పోస్టుల సంఖ్య: 181

డిఫెన్స్‌ రీసెర్చ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఆర్గనైజేషన్‌.. డీఆర్‌డీఓ. ఈ సంస్థ.. మొత్తం 181 సైంటిస్ట్‌-బి పోస్టుల భర్తీకి నియామకాలు చేపడుతోంది. ఇందులో ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ ఇంజనీరింగ్‌-49 పోస్టులు, మెకానికల్‌ ఇంజనీరింగ్‌-44, కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌-34,ఎలక్ట్రికల్‌ ఇంజనీరింగ్‌-5, మెటీరియల్‌ ఇంజనీరింగ్‌ /మెటీరియల్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌/మెటలర్జికల్‌ ఇంజనీరింగ్‌-10, ఫిజిక్స్‌-10, కెమిస్ట్రీ-5, కెమికల్‌ ఇంజనీరింగ్‌-13, ఏరోనాటికల్‌/ఏరోస్పేస్‌ ఇంజనీరింగ్‌-7,మ్యాథమెటిక్స్‌-2, సివిల్‌ ఇంజనీరింగ్‌-2.



అర్హత

- సంబంధిత ఇంజనీరింగ్‌ బ్రాంచ్‌తో ప్రథమ శ్రేణిలో బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు గేట్‌(గ్రాడ్యుయేట్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌ ఇన్‌ ఇంజనీరింగ్‌)లో సంబంధిత పేపర్‌లో స్కోర్‌ సాధించాలి.
- మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు సంబంధించి సంబంధిత సబ్జెక్ట్‌లో ప్రథమ శ్రేణిలో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆగస్ట్‌ 31 నాటికి సర్టిఫికెట్‌ అందించాల్సి ఉంటుంది.
- **వయసు:** దరఖాస్తు చివరి తేదీ నాటికి.. జనరల్‌ కేటగిరీ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు ఉండాలి.

గేట్‌ స్కోర్‌

అభ్యర్థులు సంబంధిత బీటెక్, పీజీ కోర్సులు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు తాము దరఖాస్తు చేసుకునే విభాగానికి సంబంధించిన గేట్‌ సబ్జెక్ట్‌లో స్కోర్‌ సాధించాల్సి ఉంటుంది. గేట్‌ స్కోర్, పర్సనల్‌ ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. ఆయా విభాగాలకు సంబంధించి.. గేట్‌ స్కోర్‌ ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు పదిమందిని చొప్పున(1:10 నిష్పత్తిలో) పర్సనల్‌ ఇంటర్వ్యూకు పిలుస్తారు.

ఇంటర్వ్యూ ఇలా

ఇంటర్వ్యూలో అభ్యర్థులకు పరిశోధనల పట్ల ఉన్న ఆసక్తిని, రక్షణ రంగంలో పరిణామాలపై అవగాహనను పరిశీలిస్తారు. సంస్థకు చెందిన సీనియర్‌ శాస్త్రవేత్తల బృందం ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. కాబట్టి అభ్యర్థులు దేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఇటీవల కాలంలో జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలపై పట్టు సాధించాలి.

వెయిటేజీ విధానం

సైంటిస్ట్‌-బి పోస్ట్‌లకు సంబంధించి నియామకాలను ఖరారు చేసే క్రమంలో.. వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. గేట్‌ స్కోర్‌కు 80 శాతం, ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు. అంతిమంగా ఈ రెండింటినీ క్రోడీకరించి తుది విజేతలను ప్రకటిస్తారు.

శిక్షణ

సైంటిస్ట్‌-బి హోదాలో నియామకం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ముందుగా.. అయిదు నెలలపాటు శిక్షణనిస్తారు. పుణెలోని డిఫెన్స్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ అడ్వాన్స్‌డ్‌ టెక్నాలజీలో ఈ ట్రైనింగ్‌ ఉంటుంది. ఈ సమయంలో వీరిని ఆఫీసర్‌ ట్రైనీగా పిలుస్తారు. దీనినే ఇండక్షన్‌ ప్రోగ్రామ్‌గానూ వ్యవహరిస్తారు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. డీఆర్‌డీఓ సైంటిస్ట్‌-బిగా ఉజ్వల కెరీర్‌ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

రూ.లక్షకు పైగానే వేతనం

'సైంటిస్ట్‌-బి' హోదాతో..గ్రూప్‌-ఎ టెక్నికల్‌ స్థాయిలో ఉద్యోగంలో చేరిన అభ్యర్థులు..తమ పనితీరు, ప్రతిభ ఆధారంగా.. భవిష్యత్తులో డిఫెన్స్‌ ఆర్‌ అండ్‌ డీ సెక్రటరీ, ఛైర్మన్‌ల స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. వీరికి తొలుత సైంటిస్ట్‌-సిగా పదోన్నతి లభిస్తుంది. ఆ తర్వాత సైంటిస్ట్‌- డి, ఈ, ఎఫ్, జి స్థాయిలకు చేరుకోవచ్చు. అనంతరం సైంటిస్ట్‌-హెచ్‌ హోదాతో ఔట్‌ స్టాండింగ్‌ సైంటిస్ట్‌గా ఉన్నత స్థాయి అందుకోవచ్చు. ఈ హోదాలో చూపిన ప్రతిభ ఆధారంగా డిస్టింగ్విష్డ్‌ సైంటిస్ట్, ఆ తర్వాత డిఫెన్స్‌ ఆర్‌ అండ్‌ డీ సెక్రటరీ, ఛైర్మన్‌ స్థాయి వరకు ఎదగొచ్చు. సైంటిస్ట్‌-బి కొలువులో చేరిన వారికి ప్రారంభంలోనే రూ.56,100 -రూ.1,77, 500 వేతన శ్రేణిలో నెలకు రూ.లక్ష వేతనం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌ దరఖాస్తు లింక్‌ అందుబాటులోకి రానుంది.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆన్‌లైన్‌ దరఖాస్తు లింక్‌ అందుబాటులోకి వచ్చిన 21 రోజుల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌: https://rac.gov.in**

సశస్త్ర సీమాబల్‌లో 1656 కొలువులు

కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సశస్త్ర సీమాబల్‌ 1656 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేసింది. దీని ద్వారా సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పోస్టులు, హెడ్‌కానిస్టేబుల్‌ పోస్టులు, కానిస్టేబుల్‌ పోస్టులను భర్తీ చేయనుంది. ఫిజికల్‌ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్‌ స్టాండర్డ్‌ టెస్ట్, రాత పరీక్షలో ప్రతిభ, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్, మెడికల్‌ టెస్టుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులను దేశంలో ఎక్కడైనా లేదా దేశం వెలుపలా నియమించే అవకాశం ఉంది. ఆయా పోస్టులకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ వివరాలు..

- మొత్తం పోస్టుల సంఖ్య: 1656
- **పోస్టుల వివరాలు:** సబ్‌–ఇన్‌స్పెక్టర్‌ పోస్టులు–111 , అసిస్టెంట్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ (పారామెడికల్‌)–30, అసిస్టెంట్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ (స్టెనోగ్రాఫర్‌)–40, హెడ్‌కానిస్టేబుల్‌ –914 , కానిస్టేబుల్‌ పోస్టులు–543 తోపాటు అసిస్టెంట్‌ కమాండెంట్‌(వెటర్నరీ) 18 పోస్టులు ఉన్నాయి.

సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పోస్టులు-అర్హతలు

- **సబ్‌ ఇన్‌స్పెక్టర్‌(పయనీర్‌):** సివిల్‌ ఇంజనీరింగ్‌ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. వయసు 30 ఏళ్ల లోపు ఉండాలి.
- **సబ్‌ ఇన్‌స్పెక్టర్‌(డ్రాఫ్ట్‌మెన్‌):** మెట్రిక్యులేషన్‌/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల ఐటీఐ నేషనల్‌ ట్రేడ్స్‌మెన్‌ సర్టిఫికేట్‌ ఉండాలి. ఆటోక్యాడ్‌లో ఏడాది సర్టిఫికేట్‌ కోర్సు పూర్తిచేయాలి లేదా ఆటో క్యాడ్‌లో ఏడాది అనుభవం ఉండాలి. డ్రాఫ్ట్స్‌మ్యాన్‌షిప్‌లో ఏడాది అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **సబ్‌ ఇన్‌స్పెక్టర్‌(కమ్యూనికేషన్‌):**ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌/కంప్యూటర్‌ సైన్స్‌/ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ ఇంజనీరింగ్‌ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేయాలి. గరిష్ట వయసు 30ఏళ్లు.
- **సబ్‌ ఇన్‌స్పెక్టర్‌(స్టాఫ్‌నర్స్‌) ఫిమేల్‌:** సైన్స్‌ సబ్జెక్టుతో 10+2/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. జనరల్‌ నర్సింగ్‌లో మూడేళ్ల డిప్లొమా పూర్తిచేయాలి. సెంట్రల్‌/స్టేట్‌ కౌన్సిల్‌లో తప్పనిసరిగా రిజిస్టరై ఉండాలి. రెండేళ్ల అనుభవం తప్పనిసరి. వయసు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వయసు:** ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, ఎక్స్‌–సర్వీస్‌మెన్‌లకు 3 ఏళ్లు, డిపార్ట్‌మెంటల్‌ అభ్యర్థులకు 5 నుంచి 10 ఏళ్ల మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం

ఫిజికల్‌ ఎఫిషియెన్సీ టెస్ట్‌(పీఈటీ), ఫిజికల్‌ స్టాండర్డ్‌ టెస్ట్‌(పీఎస్‌ఈ), రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సబ్‌–ఇన్‌స్పెక్టర్‌(కమ్యూనికేషన్‌) పోస్టుకు మాత్రమే పీఈటీ నిర్వహిస్తారు. 1.6 కిలో మీటర్ల పరుగును పురుష అభ్యర్థులు 6 నిమిషాల 30 సెకన్లలో ముగించాలి. మహిళా అభ్యర్థులు 800 మీటర్ల రేసును 4 నిమిషాల్లో ముగించాలి. ఎక్స్‌–సర్వీస్‌మెన్‌ అభ్యర్థులకు పీఈటీ లేదు. వీరు పీఎస్‌టీ, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్, మెడికల్‌ ఎగ్జామినేషన్‌లకు హాజరుకావాలి.

రాత పరీక్ష ఇలా

పీఈటీ, పీఎస్‌టీ టెస్టులో అర్హత సాధించిన అభ్యర్థులను రాత పరీక్ష(కామన్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌)కు ఎంపిక చేస్తారు. దీన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. రాత పరీక్ష రెండు పార్ట్‌లుగా 150 ప్రశ్నలకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **పార్ట్‌–1:** ఈ పార్ట్‌లో జనరల్‌ నాలెడ్జ్, మ్యాథమేటిక్స్, రీజనింగ్, జనరల్‌ ఇంగ్లిష్‌ /జనరల్‌ హిందీ 50 మార్కులకు ఉంటాయి.
- **పార్ట్‌–2:** ఈ పార్ట్‌లో టెక్నికల్‌ సబ్జెక్టుకు 100 మార్కులుంటాయి.

రాత పరీక్షకు సంబంధించి జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఎక్స్‌సర్వీస్‌మెన్‌ అభ్యర్థులు 50 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 45 శాతం మార్కులు పొందాలి. రాత పరీక్షలో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణలోకి తీసుకుంటారు.

తుది ఎంపిక

ఫిజికల్‌ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్‌ స్టాండర్డ్‌ టెస్ట్, రాత పరీక్షలో మెరిట్‌ సాధించిన అభ్యర్థులకు డాక్యుమెంట్‌ వెరిఫికేషన్, మెడికల్‌ టెస్టులను నిర్వహిస్తారు. పోస్టుల సంఖ్యకు మూడు రెట్ల మంది అభ్యర్థులను డాక్యుమెంట్‌ వెరిఫికేషన్, మెడికల్‌ ఎగ్జామినేషన్‌కు పిలుస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగానే తుది ఎంపిక చేస్తారు.

ప్రిపరేషన్‌ ఇలా

తొలుత పరీక్ష విధానంపై అవగాహన పెంచుకోవాలి. దానికి అనుగుణంగా టైమ్‌ టేబుల్‌ ప్రిపేర్‌ చేసుకోవాలి. టెక్నికల్‌ సబ్జెక్టుకు 100 మార్కులు కేటాయించారు. కాబట్టి అభ్యర్థులు తాము ఐటీఐలో చదివిన టెక్నికల్‌ అంశాలపై పట్టు సాధించాలి. ప్రశ్నల సరళిని తెలుసుకునేందుకు గత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. అలాగే వీలైనన్నీ ఎక్కువ మాక్‌టెస్టులను రాయాలి. తద్వారా వేగం, టైమ్‌ మేనేజ్‌మెంట్‌ అలవడుతుంది.

హెడ్‌కానిస్టేబుల్‌ పోస్టులు

- **అర్హతలు:** పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.



- **వయసు:** హెచ్‌సీ(మెకానిక్‌) పోస్టుకు 21–27 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 18–25 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయసులో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, ఎక్స్‌–సర్వీస్‌మెన్‌లకు 3 ఏళ్లు, డిపార్ట్‌మెంట్‌ అభ్యర్థులకు 40 నుంచి 45 ఏళ్ల వరకూ మినహాయింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఫిజికల్‌ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్‌ స్టాండర్డ్‌ టెస్ట్, స్కిల్‌ టెస్ట్, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్, మెడికల్‌ ఎగ్జామినేషన్‌ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

పోలీస్‌ కానిస్టేబుల్‌

- **అర్హతలు:** డ్రైవర్‌ పోస్టుకు పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు హెవీ వెహికల్‌ డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉండాలి. వయసు 21–27 ఏళ్ల మధ్య ఉండాలి. వెటర్నరీ పోస్టుకు సైన్స్‌ ప్రధాన సబ్జెక్టుగా పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వెటర్నరీ హాస్పిటల్‌లో ఏడాది పనిచేసిన అనుభవం ఉండాలి. వయసు 18–25 ఏళ్ల మధ్య ఉండాలి.
- కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, పెయింటర్‌ పోస్టులకు పదోతరగతి/తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి. లేదా ఏడాది వ్యవధి ఉన్న ఐటీఐ సర్టిఫికేట్‌ కోర్సు పూర్తిచేయాలి. లేదా రెండేళ్ల ఐటీఐ డిప్లొమా ఉండాలి. ట్రేడ్‌ టెస్టులో తప్పనిసరిగా అర్హత సాధించాలి. వాషర్‌మ్యాన్, బార్బర్, సఫాయివాలా, టైలర్, గార్డెనర్, క్లోబర్, కుక్‌ అండ్‌ వాటర్‌ కేరియర్‌ పోస్టులకు టెన్త్‌/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. రెండేళ్ల పని అనుభవం/ఐటీఐ ఏడాది సర్టిఫికేట్‌ కోర్సు చేసి ఉండాలి. లేదా రెండేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. ట్రేడ్‌ టెస్టులో తప్పనిసరిగా అర్హత సాధించాలి. మల్టీస్కిల్డ్‌ వ్యక్తులకు ప్రాధాన్యమిస్తారు.

ఫిజికల్‌ స్టాండర్డ్‌ టెస్ట్‌

పీఈటీలో అర్హత సాధించిన అభ్యర్థులను పీఎస్‌టీకి ఎంపిక చేస్తారు. ఇందులోనూ అర్హత పొందిన వారికి కామన్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌(సీఈటీ) నిర్వహిస్తారు. వ్యవధి రెండు గంటలు. మల్టిపుల్‌ ఛాయిస్‌ ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి. జనరల్‌ నాలెడ్జ్, మ్యాథమెటిక్స్, రీజనింగ్, జనరల్‌ ఇంగ్లిష్‌ /జనరల్‌ హిందీ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేదీ:** 18.06.2023
- **వెబ్‌సైట్‌:** http://ssbrectt.gov.in

పేదలనూ పిండుకున్న ‘పసుపు రాబందులు’

వెలుగులోకి టీడీపీ కార్పొరేటర్లు, వారి అనుచరుల మోసాలు

- జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు ఇప్పిస్తామని పేదల నుంచి వసూళ్లు
- నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్లతో నమ్మించి మోసం
- రెండు వేల మందికి పైగా బాధితులు.. రూ.70 కోట్లు వసూలు చేసినట్లు అంచనా
- విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో అత్యధికంగా బాధితులు
- స్పందనలో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు



సింగ్‌నగర్ వాంబే కాలనీ రోడ్డులో జేఎన్‌ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

విజయవాడ చిట్టినగర్‌కు చెందిన నొక్కాజు మల్లేశ్వరరావు కార్పెంటర్. అతనికి జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్ఎన్‌యూఆర్ఎం) పథకంలో ఇల్లు ఇప్పిస్తానని విజయవాడ 47వ డివిజన్ టీడీపీ నాయకుడు మాకిన విజయ్‌కుమార్ నమ్మబలికాడు. ఐదేళ్ల క్రితం మల్లేశ్వరరావు నుంచి రూ.1.60 లక్షలు వసూలు చేశాడు. ఇప్పటికీ ఇల్లు ఇప్పించలేదు. విజయ్‌కుమార్ చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

విజయవాడ చిట్టినగర్‌లో బండిపై పూసలు అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చే తమ్మన మాధవికి ఇల్లు ఇప్పిస్తానని విజయ్‌కుమార్ రూ. 3.20 లక్షలు వసూలు చేశాడు. ఇల్లు ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో విసిగి వేసారిన బాధితురాలు మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల పేరిట జరిగిన భారీ మోసంలో చిన్న ఉదాహరణలు. ఇలా మోసపోయిన వారు నగరంలో 2 వేల మంది ఉన్నట్లు అంచనా. 2014 నుంచి 2019 వరకు జరిగిన ఈ దందా బాధితుల ఫిర్యాదులతో ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. దాదాపు రూ. 70 కోట్లు పేదల నుంచి వసూలు చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలతో టీడీపీ నాయకులు మోసం చేశారని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదుల్లో బాధితులు పేర్కొన్నారు.రోడ్లు, కాలువలు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన పేదలకు జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో నివాసం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నిర్ణయించాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ పథకం పనులు 2014 వరకు నిర్విరామంగా కొనసాగాయి. విజయవాడ నగరంలో ఇళ్లు కోల్పోయిన పేదల కోసం నగరంలోని జక్కంపూడి, ఆర్ఆర్‌పేట, సింగ్‌నగర్, కబేలా ప్రాంతాల్లో వంద ఎకరాల్లో 28,152 జీ ప్లస్ త్రి గృహాల నిర్మాణం జరిగింది. రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారం చేపట్టిన టీడీపీ ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది. అయితే అప్పటివరకు నిర్మించిన ఇళ్లను కేటాయించేందుకు నిర్ణయించింది. దీంతో విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు ఈ ఇళ్లను యథేచ్ఛగా అమ్మేశారు. ఆ నియోజకవర్గాలకు అప్పట్లో ఎమ్మెల్యేలుగా ఉన్న టీడీపీ నాయకులు జలీల్‌ఖాన్, బొండా ఉమామహేశ్వరరావు కనుసన్నల్లోనే ఈ బాగోతం జరిగినట్లు తెలుస్తోంది. ఉచితంగా ఇవ్వాల్సిన ఈ ఇళ్లను డివిజన్లలో టీడీపీ నాయకులు ఒక్కొక్కరూ 200 గృహాలు అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. దీంతో పలువురు కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు ఒక్కో ఇంటికి రూ. 1.50 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు వసూలు చేసి వారు రూ. కోట్లు దండుకున్నారు.

జక్కంపూడి, సింగ్‌నగర్, ఆర్ఆర్‌పేట, కబేలా ప్రాంతాల్లో జేఎన్ఎన్ఆర్‌యుఎం ఇళ్ల కేటాయింపు 2018లోనే పూర్తయింది. అయినా, టీడీపీ నాయకులు నకిలీ డాక్యుమెంట్లు, మునిసిపల్, బ్యాంకు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేశారు. ఇళ్లు లేకపోయినా ఉన్నట్లు ప్రచారం చేసి పేదల నుంచి వసూళ్లు చేశారు. పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని 41 డివిజన్లలో ఈ తరహా బాధితులు 2 వేల మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరి నుంచి రూ. 60 నుంచి రూ.70 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. చాలా మంది బాధితులు ముందుగా కొత్తపేట (టుటౌన్) పోలీసులను ఆశ్రయిస్తున్నాయి. అక్కడా విజయ్‌కుమార్ మాటే చెల్లుబాటు కావడంతో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటి వరకు మాకిన విజయ్‌కుమార్ బాధితులు 35 మంది ఇప్పటివరకు పోలీసులను ఆశ్రయించారు. ఇతనితోపాటు 41వ డివిజన్‌లోని నాగోతు రామారావు, 57వ డివిజన్‌లోని ఎడిబోతు రమణ, 58వ డివిజన్‌లోని సోమేశ్వరరావు, రామారావు, 60వ డివిజన్‌లోని భువట ఉమా, శ్రీరాములు, 63వ డివిజన్‌లోని పైడి శ్రీను పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలు

– సాక్షి ప్రతినిధి, విజయవాడ



వాళ్లంతే.. చెప్పులేసుకోరు

ఆ ఊరికి కలెక్టర్ వెళ్లినా చెప్పులు వదిలేయాల్సిందే

- ఎంత ఆకలి వేసినా బయట తిండి తినరు
- జబ్బొచ్చినా ఆస్పత్రికి వెళ్లరు
- మేమింతే అంటున్న ‘వేమన ఇండ్లు’ వాసులు

సాక్షి, తిరుపతి: ఇంట్లో సైతం పాదరక్షలు ధరించి తిరుగుతున్న ఈ రోజుల్లో.. ఆ ఊరి వాసులు ఎక్కడికి వెళ్లినా చెప్పులు ధరించరు. ఆకలేస్తే ఏదో ఒకటి తిని కడుపు నింపుకుంటున్న ప్రస్తుత తరంలో.. ఆ ఊరి వాళ్లు బయటి ప్రాంతాలకు వెళితే మంచినీళ్లు కూడా ముట్టరు. ఆచారాలు, సంప్రదాయాలకు విలువనిచ్చే ఆ గ్రామం పేరు ‘వేమన ఇండ్లు’. తిరుపతి జిల్లా పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలో ఉంది. వేమన ఇండ్లు గ్రామంలో ఉంటున్న వారంతా ‘పాలవేకరి’ కులస్తులుగా, దొరవార్లుగా చెప్పుకుంటున్నారు. వీరంతా బీసీ జాబితాలో ఉన్నారు. వీరి ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామి. గ్రామంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో రోజుకో కుటుంబం పూజలు చేస్తుంది. గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి, గంగమ్మను కూడా పూజిస్తారు.

విలువలు.. కట్టుబాట్లకు పెద్దపీట

ఈ ఊళ్లో ఉన్న అందరూ ఒకే వంశం వారు. తమ కులం వారితో మాత్రమే వీరు సంబంధాలు కలుపుకుంటున్నారు. వేమన ఇండ్లు గ్రామానికి ఎవరొచ్చినా.. ఊరి బయటే చెప్పులు విడిచి గ్రామంలోకి అడుగుపెట్టాలి. ఇంట్లోకి వెళ్లాలంటే తప్పనిసరిగా స్నానం చేయాల్సిందే. లేదంటే ఇంటి బయటే ఉండాలి. కలెక్టర్ అయినా గ్రామ ఆచార సంప్రదాయాలు పాటించాల్సిందేనని స్థానికులు తేల్చిచెబుతున్నారు. ఈ గ్రామస్తులు ఎన్ని వందల కిలోమీటర్ల దూరం వెళ్లినా చెప్పులు మాత్రం ధరించరు. శ్రీ వెంకటేశ్వరుడిపై భక్తితో పాదరక్షలు ధరించడం మానేశామని గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే వారు సైతం చెప్పులు లేకుండానే వెళ్లివస్తారు. ఒకరిద్దరు ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న వారు కూడా గ్రామ ఆచార సంప్రదాయాలను తప్పక పాటిస్తున్నారు.

బయట తిండి ముట్టరు

వేమన ఇండ్లకు చెందిన వారు ఏదైనా పనిమీద వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వస్తే.. బయట తిండి ముట్టరు. మంచినీరు కూడా తీసుకోరు. ఇంటి నుంచే క్యారియర్‌లో భోజనం, బాటిల్లో మంచినీరు తీసుకెళ్తారు. విద్యార్థులు స్కూల్లో పెట్టే మధ్యాహ్న భోజనం కూడా ముట్టరు. బయటి నుంచి ఇంటికి వచ్చినా.. స్నానం చేసి బట్టలు మార్చుకోనిదే గడప తొక్కరు. అది కూడా చన్నీళ్ల స్నానమే. చిన్నారులైనా చన్నీటితోనే స్నానం చేయిస్తారు. బంధువులు ఇంటికి వచ్చినా.. గ్రామంలో ఈ ఆచార సంప్రదాయాలు పాటించాల్సిందే.

ఆ వారం రోజులు మహిళలు ఊరి బయటే

నెలసరి మహిళల కోసం ఊరికి అవతల ప్రత్యేకంగా రెండు పక్కా గృహాలు నిర్మించారు. పీరియడ్స్ వచ్చిన మహిళలు వారం రోజులపాటు వాటిలోనే ఉండాలి. అప్పటివరకు ఇంటి యజమానే వంట వార్పు చేస్తారు. వంటచేసి భార్యకు తీసుకెళ్లి ఇచ్చి వచ్చేస్తారు.

ఆస్పత్రుల మొహం ముఖం చూడలేదు

గ్రామస్తులకు జబ్బు చేసినా.. చివరకు పాము కరచినా ఆస్పత్రికి వెళ్లరు. పాము కరిస్తే పుట్టచుట్టూ తిరిగితే నయం అవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. గర్భిణులు సైతం ఆస్పత్రిలకు వెళ్లిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలోనూ వీరెవరూ ఆసుపత్రికి వెళ్లలేదు. కోవిడ్ వ్యాక్సిన్ కూడా వేసుకోలేదని చెబుతున్నారు.

ఇప్పుడిప్పుడే పక్కా గృహాలొస్తున్నాయ్

నాలుగేళ్లుగా ఆ గ్రామస్తులకు రేషన్ సరఫరా చేస్తున్నాను. గతంలో ఈ ఊర్లో పక్కా గృహాలే లేవు. తడికలు ఏర్పాటు చేసుకుని దానిపై పట్టా కప్పుకుని జీవించేవారు. టీడీపీ హయాంలో ఒకే ఒక్క ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు ప్రభుత్వం 12 ఇల్లు మంజూరు చేసి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చింది. – బాబురెడ్డి, రేషన్ డీలర్

ఫోన్లలో పాస్‌వర్డ్‌లు జాగ్రత్త!



మొబైల్స్‌లోనే భద్రపర్చుకుంటున్న 17 శాతం మంది పౌరులు

- కుటుంబ సభ్యులు, సన్నిహితులతో వాటిని పంచుకుంటున్న వారు 30 శాతం..
- లోకల్ సర్కిల్ సర్వేలో వెల్లడి
- దేశవ్యాప్తంగా 337 జిల్లాల్లో 32 వేల మంది నుంచి వివరాల సేకరణ

సాక్షి, అమరావతి: ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. అగ్గిపెట్టె నుంచి ఆడి కారు కొనుగోలు వరకూ ప్రతి చిన్న లావాదేవీని ప్రజలు ఆన్‌లైన్ ద్వారా లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చేస్తున్నారు. దీంతో ముఖ్యమైన ఆర్థిక లావాదేవీల పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోలేక కొందరు మొబైల్ ఫోన్‌లోనే భద్రపరుచుకుంటున్నారు. 17 శాతం మంది పౌరులు బ్యాంకు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డు వంటి ముఖ్యమైన పాస్‌వర్డ్‌లను తమ మొబైల్‌లో కాంటాక్ట్ లిస్ట్/నోట్స్‌లో భద్రపర్చుకుంటున్నారు. ఈ విషయం లోకల్ సర్కిల్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఆర్థిక డేటా భద్రతపై దేశవ్యాప్తంగా 337 జిల్లాల్లో 32 వేల మందిని సర్వే చేశారు. ఈ క్రమంలో.. ఏటీఎం, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఇతర ఆర్థిక లావాదేవీల పాస్‌వర్డ్‌లను ఎక్కడ స్టోర్ చేసుకుంటారని 11,236 మందిని ప్రశ్నించారు. వీరిలో..

- తొమ్మిది శాతం మంది ఫోన్‌లోని కాంటాక్ట్ లిస్ట్‌లో, ఎనిమిది శాతం మంది ఫోన్ నోట్స్‌లో స్టోర్ చేసుకుంటున్నట్లు వెల్లడించారు.
- ఏడు శాతం మంది మొబైల్ ఫోన్‌లోని వివిధ యాప్‌లలో పాస్‌వర్డ్‌లను సేవ్ చేస్తున్నామన్నారు.
- 14 శాతం మంది మాత్రం గుర్తు ఉంచుకుంటున్నట్లు తెలిపారు.
- 18 శాతం మంది ల్యాప్‌టాప్/కంప్యూటర్‌లో, 39 శాతం మంది మొబైల్ ఫోన్‌తో సంబంధం లేకుండా వేరే మార్గాల్లో నోట్ చేసుకుంటున్నట్లు వెల్లడించారు.
- 2021లో ఇదే అంశంపై నిర్వహించిన సర్వేలో 11 శాతం మంది సురక్షితం కాని మొబైల్ ఫోన్‌లో పాస్‌వర్డ్‌ను నోట్ చేసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇలా భద్రపర్చుకునే వారి శాతం రెండేళ్లలో ఆరు శాతం మేర పెరిగింది.
- ఇక బ్యాంకింగ్, ఏటీఎం కార్డుల పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకుంటారా? అని 10,962 మందిని ప్రశ్నించగా.. 67 శాతం మంది లేదని సమాధానం ఇచ్చారు.
- 24 శాతం మంది మాత్రం కుటుంబ సభ్యులకు, ఆరు శాతం మంది స్నేహితులు, కార్యాలయ సిబ్బందితో పంచుకున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యం వద్దు..

సున్నితమైన పాస్‌వర్డ్‌లను సురక్షితం కాని మొబైల్ ఫోన్‌లో నోట్ చేసుకోవడం శ్రేయస్కరం కాదని పోలీసులు ఇప్పటికే హెచ్చరిస్తున్నారు. వివిధ రకాల యాప్‌లను ఫోన్‌లో తరచూ డౌన్‌లోడ్ చేస్తూ ఉంటాం. చాలా యాప్స్‌కు యాక్సెస్ పర్మిషన్లు గుడ్డిగా ఇచ్చేస్తాం. వాటిల్లో చాలా యాప్స్ కాంటాక్ట్ లిస్ట్, ఇమేజెస్ యాక్సెస్ చేసేందుకు పర్మిషన్లు అడుగుతాయి. వాటిని ఓకే చేసుకుంటూ వెళ్తే.. డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతుంది. ఈ క్రమంలో సున్నితమైన పాస్‌వర్డ్‌ల విషయంలో నిర్లక్ష్యం వీడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.